

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 46

బుధవారం 8-5-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మూడోదశలో 63.5% పోలింగ్

11 రాష్ట్రాలు, యూటీల్లోని 93 స్థానాలకు పూర్తయిన పోలింగ్ -6లో



నేడు వేములవాడకు మోదీ

రాజన్న ఆలయంలో పూజలు.. వేములవాడ, వరంగల్‌లలో ఎన్నికల ప్రచారం -18లో



హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మండుటెండల్లోనూ నిండా ముంచే..



జయశంకర్ భూపాలపల్లి మహాముత్తారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం

అకాల వర్షంతో రాష్ట్రవ్యాప్తంగా తడిసిన ధాన్యం

కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో కొట్టుకుపోయిన తీరు

- ఈదురుగాలులకు వందల ఎకరాల్లో రాలిపోయిన మామిడి
- విరిగిపడిన చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు, ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు
- చాలా చోట్ల కరెంటు సరఫరాకు అంతరాయం
- గాలివానకు హైదరాబాద్ ఆగమాగం.. స్తంభించిన ట్రాఫిక్‌తో ఇక్కట్లు
- చెట్లు విరిగి, గోడలు కూలి, పిడుగులతో ఆరుగురు మృతి

సాక్షి నెట్‌వర్క్: అకాల వర్షం పుట్టి ముంచింది. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యాన్ని ముంచేసింది. చెట్లపై ఉన్న మామిడి కాయలను రాల్చేసింది. ఈదురు గాలులతో విరుచుకుపడి పలువురి ప్రాణాలనూ బలిగొంది. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కురిసిన వాన బీభత్సం సృష్టించింది. వరి ధాన్యం కొట్టుకుపోయింది. ఈదురుగాలుల ధాటికి ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

వరంగల్: నీట మునిగిన ధాన్యం

వరంగల్ ఉమ్మడి జిల్లాలో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. జనగామ వ్యవసాయ మార్కెట్ వెయ్యి బస్తాల ధాన్యం తడిసిపోయింది. బచ్చన్నపేట, జనగామ రూరల్, పాలకుర్తి, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, దేవరుప్పుల తదితర మండలాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, 33కేవీ లైన్లు నేలకొరిగాయి. చిల్పూరు, జనగామ, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల మండలాల్లో వందల ఎకరాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం నల్లగుంట మీనాజీపేట, కిష్టాపూర్, మహాముత్తారం, కోనంపేటలలో ధాన్యం కొట్టుకుపోయింది. ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలంలో ధాన్యం తడిసింది. మహబూబాబాద్ జిల్లా కురవి, బయ్యారం, గంగారం, మహబూబాబాద్ రూరల్ మండలాల్లో పంటలకు నష్టం జరిగింది. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో ధాన్యం నీట కొట్టుకుపోయింది.

కరీంనగర్: వడగళ్ల వాన

మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో.. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా

మిగతా 3వ పేజీలో ▶



కామారెడ్డి రోడ్‌షోలో ప్రసంగిస్తున్న కేసీఆర్

పెట్టుబడిదారుల పార్టీకి.. పేదల కన్నీళ్లు పట్టవు

బీజేపీపై మాజీ సీఎం కేసీఆర్ ఫైర్

- మోదీ పాలనలో దేశ ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నం
- రాష్ట్రంలో ముఖ్యమంత్రే కుట్ర చేసి రైతుబంధు ఆపించాడు
- కామారెడ్డి, మెదక్ రోడ్ షోల్లో కేసీఆర్ ప్రసంగం

2లో



హనుమకొండ రోడ్‌షోలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కాకతీయుల స్ఫూర్తితో ఢిల్లీ సుల్తాన్లపై పోరు

ఈ ఎన్నికలు.. గుజరాత్, తెలంగాణ మధ్య ఫైనల్ మ్యాచ్!

- బీజేపీని డకౌట్ చేసి గుజరాత్‌ను ఓడించాలి.. మళ్లీ కేసీఆర్ అదే దగాకోరు విధానాలతో తిరుగుతుండు
- వరంగల్ ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో

ఇదండీ సంగతి



నాకు ఓటు ఎవడేస్తాడు.. నువ్వా? నీ అమ్మ మొగుడా.. లేక నీ అమ్మమ్మ మొ...

పథకాలను అడ్డుకున్నా.. గెలుపును ఆపలేరు



జూన్ 4న మళ్లీ మీ బిడ్డే వస్తాడు..

విశాఖ నుంచే పాలన.. ప్రమాణ స్వీకారం

కోరుకొండ, ఇచ్ఛాపురం, గాజువాక సభల్లో ఏపీ సీఎం వైఎస్ జగన్

- ఎన్నికలు వచ్చాయని నొక్కిన బటన్లు కావివి.. అన్నీ కొనసాగుతున్న పథకాలే
- ఐదేళ్లుగా ఏటా బటన్లు నొక్కుతూ పేదలకు మంచి చేస్తున్నాం.. జగన్ అంటే పథకాలు... బాబు అంటే మోసాలు, కుట్రలు
- ముందే కేలండర్ ప్రకటించి మరీ పథకాలతో లబ్ధి చేకూరుస్తున్నాం

8లో

ఓటు అనే ఆయుధంతో ఢిల్లీ పీఠం కదలాలి

వీళ్లు ఎన్ని కుట్రలు చేసినా.. దేవుడు అంతా గమనిస్తున్నాడు. మీ బిడ్డకు ప్రజల దీవెనలున్నాయి. అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, రైతన్నల చేతుల్లో ఓటు అనే బలమైన ఆయుధం ఉంది. ఆ ఓటు అనే ఆయుధంతో వీళ్లను కొట్టే దెబ్బకు ఢిల్లీ పీఠం కూడా కదులుతుందని గట్టిగా చెబుతున్నా. - ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

4 నెలల్లోనే రేవంత్ అబద్ధాలకోరు అని తేలింది



మతిభ్రమించినట్టు మాట్లాడుతూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు
సీఎం అయినా భాష మారలేదు.. దబాయింపులు మారలేదు..
మీట్‌ది ప్రెస్‌లో ఈటల రాజేందర్

7లో

కాంగ్రెస్ పార్టీకి ఎక్స్‌పైరీ డేట్ వచ్చేసింది



నరేంద్రమోదీ.. రాహుల్‌గాంధీ మధ్య జరుగుతున్న ఎన్నికలివి
బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్

7లో

కేంద్రంలో బీజేపీ వస్తే భవిష్యత్తు ఉండదు



ఎప్పుడు రిజర్వేషన్లను రద్దు చేద్దామా అని ఆ పార్టీ ఉర్రూతలూగుతోంది

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హెచ్చరిక

- మరోసారి అధికారంలోకి వస్తే బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కష్టమే
- పొరపాటున కమలం పార్టీకి ఓటేస్తే మన గొంతు మనం కోసుకున్నట్టే.. రిజర్వేషన్లపై వాస్తవాలు చెబితే ముఖ్యమంత్రిపై కేసులు పెడతారా? అంటూ ఫైర్

7లో

రైతు భరోసాకు ఈసీ బ్రేక్

పోలింగ్ తర్వాత పంపిణీకి ఆదేశం

సీఎం కోడ్ ఉల్లంఘించారని వెల్లడి

7లో

మేడిగడ్డను పరిశీలించిన విచారణ కమిషన్

- బ్యారేజీ వివరాలు, నష్టంపై ఆరా.. సర్కారుకు నివేదిక ఇస్తామన్న కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రఘోష్
- ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికలను స్టడీ చేయాల్సి ఉందని వెల్లడి

5లో





రోడ్‌షోకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్. చిత్రంలో మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి, హరీశ్‌రావు

మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్‌షోకు భారీగా హాజరైన ప్రజలు

పెట్టుబడిదారుల పార్టీకి.. పేదల కన్నీళ్లు పట్టవు

మోదీ పాలనలో దేశ ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నం • బీజేపీపై మాజీ సీఎం కేసీఆర్ ఫైర్

సాక్షి, కామారెడ్డి/ సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: 'మోదీ పదేళ్ల పాలనలో దేశ ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నమైపోయింది. రూపాయి విలువ భారీగా పడిపోయి అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట దెబ్బతిన్నది. బీజేపీ దోపిడీదారులు, పెట్టుబడిదారులకే కొమ్ముకాసే పార్టీ. దాని ఎజెండాలో పేదల కష్టాలు, కన్నీళ్లు ఉండవు..'అని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో కేసీఆర్ రోడ్ షో నిర్వహించారు. జయప్రకాశ్ నారాయణ్ చౌరస్తా వద్ద కార్నర్ మీటింగులో ప్రసంగించారు. ఆ తర్వాత మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్‌షోలో కూడా మాట్లాడారు.

అచ్ఛే దిన్ ఏమోగానీ సచ్చే దిన్ వచ్చినయ్

'ప్రధాని నరేంద్ర మోదీ వట్టి గ్యాస్ మాటలు చెబుతాడు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్'అని చెప్పి సత్తెనాశనం చేశాడు. ఎగుమతులు బందయి, దిగుమతులు పెరిగాయి. దేశ ఆర్థిక పరిస్థితి దిగజారింది. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, బేటీ పడావో..బేటీ బచావో, జన్‌ధన్ యోజన ఇవేవీ దేశానికి ఉపయోగపడలేదు. 150 వాగ్దానాలు చేసింద్రు. అవేవీ ప్రజలను ఆదుకోలేదు. అచ్ఛే దిన్ ఏమోగానీ సచ్చేదిన్ వచ్చినయ్. పెద్ద పెద్ద మాటలు చెప్పి మోసం చేసింద్రు. అంతటా రూ.15 లక్షలు ఇస్తామన్నారు? కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే గెలిచినందుకు ఇక్కడ రూ.30 లక్షలు ఇచ్చింద్రా? (లేదంటూ సభికులు కేకలు పెట్టారు) రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన మోదీ ఎక్కడా రైతులకు మేలు చేయలేదు. తల్లిని చంపి బిడ్డను బతికించింద్రంటూ మోదీ ప్రతిసారీ తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కాడు. పేదలకు ఏమీ చేయని బీజేపీకి ఓటేయడమే దండుగ. ఆ పార్టీకి 400 సీట్లు రానేరావు. మళ్లీ మోదీ ప్రధాని అయితే మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు రూ.400 దాటిపోతాయి..' అని కేసీఆర్ అన్నారు.

ఐదు నెలల్లో ఎన్నో ఘోరాలు

'ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అసమర్థులు, పరిపాలన సాగించలేని తెలివితక్కువ వాళ్ల చేతుల్లోకి వెళ్లి ఐదు నెలల్లోనే ఆగమైంది. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చారు. కల్యాణలక్ష్మి కింద రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేశారు. రూ.2 లక్షల వరకు రుణం మాఫీ చేస్తనంటూ పెద్దపెద్ద మాటలు మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎక్కడికి పోతే అక్కడి దేవుళ్ల మీద ఒట్లు పెట్టుకుంటున్నాడు. ఈ నెల 9 లోపు రైతుబంధు వేస్తా అన్న ముఖ్యమంత్రి తనే కుట్ర చేసి ఆపించాడు. ఐదెకరాలకు ఇస్త అంటడు. ఆరెకరాలు, ఏడెకరాల రైతులకు ఎందుకు ఇవ్వడు? తొమ్మిదేళ్ల రెప్పపాటు కూడా పోకుండా కరెంటు ఇచ్చాం. కేసీఆర్ దిగిపోగనే కరెంటుకు ఏమైంది? మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ వచ్చిన నీళ్లు ఇప్పుడెందుకు రావడం లేదు? వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి ఎందుకు ఇవ్వడం లేదు? ఫీజు రీయింబర్స్‌మెంటు చేయడం లేదు, 125 గురుకులాల్లో విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. ఐదు నెలల్లో ఎన్నో ఘోరాలు జరిగిపోయాయి..'అని మాజీ సీఎం ఆందోళన వ్యక్తం చేశారు.

అలాగైతే తెలంగాణ ప్రాజెక్టులు ఏం కావాలి?

'రేవంత్‌రెడ్డి ఒట్లు పెట్టుకోవడం, కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాడు. అసమర్థులు, తెలివితక్కువ వాళ్లు రాజ్యమేలితే ఇలాగే ఉంటుంది. కృష్ణా నదిని కేఆర్‌ఎంబీకి అప్పగించిన కాంగ్రెస్ సర్కారు.. గోదావరి నదిని తమిళనాడుకు అప్పగిస్తోంది. ఉన్న ఒక్క గోదావరి నదీ జలాలు తమిళనాడుకు వెళితే తెలంగాణ ప్రాజెక్టులు ఏం కావాలి? మేం కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తే వాటిని తీసేస్తామని కాంగ్రెస్ అంటోంది. ఉద్యమాల్లో రాటుదేలిన, చైతన్యవంతమైన కామారెడ్డి, మెదక్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలి. పార్లమెంటు ఎన్నికల్లో 12, 13 స్థానాల్లో మనం గెలిస్తే రాష్ట్రం మెడలు వంచి హామీలు అమలు చేయించుకుందాం. కేంద్రంలో బీజేపీ పరిస్థితి బాగాలేదు. వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే. 12, 13 స్థానాలు గెలిస్తే మనమే కీలకంగా మారతాం. కామారెడ్డితో పాటు ఇతర జిల్లాలు పోకుండా ఉండాలంటే బీఆర్‌ఎస్ గెలవాలి. మన నదీ జలాలు మనకు రావాలన్నా, తెలంగాణ ఆత్మగౌరవం కాపాడుకోవాలన్నా మన అభ్యర్థులను గెలిపించాలి..'అని బీఆర్‌ఎస్ అధినేత విజ్ఞప్తి చేశారు. ఈ సభల్లో మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజుల సురేందర్, హన్మంత్ షిండే, మెదక్, జహీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థులు వెంకట్రామ్ రెడ్డి, గాలి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



చిన్నారులకు పకోడీలు తినిపించిన కేసీఆర్

ఇందల్వాయి (నిజామాబాద్ రూరల్): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్సు యాత్ర నిర్వహిస్తున్న మాజీ సీఎం కేసీఆర్ మంగళవారం చిన్న పిల్లలు, రైతులతో కాస్త సరదాగా గడిపారు. సాయంత్రం నిజామాబాద్ నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళుతూ 44వ నంబరు జాతీయ రహదారిపై ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద ఆగారు. అక్కడి హోటల్‌లో ఉల్లిగడ్డ పకోడి తిని టీ తాగారు. అక్కడ ఉన్న చిన్నారులకు పకోడీలు తినిపించారు. తనను కలిసేందుకు వచ్చిన రైతులకు ఇచ్చారు. మరోవైపు హోటల్ వద్ద ఆగిన ప్రయాణికులు, చిన్నారులు కేసీఆర్‌తో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. వారందరితో కేసీఆర్ సరదాగా సంభాషించారు. హోటల్ యజమాని వెంకట రమణయ్యతోనూ ముచ్చటించారు.

'పిరమైన' ప్రధాని గారూ..

ఈ ప్రశ్నలకు జవాబివ్వండి!



సాక్షి , హైదరాబాద్: రాష్ట్రానికి వచ్చే ముందు తెలంగాణ సమాజం పక్షాన తాను అడుగుతున్న కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ప్రధాని నరేంద్ర మోదీని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు డిమాండ్ చేశారు. ప్రధానిగా పదేళ్ల కాలంలో ఏం చేశారో ప్రజలకు వివరించి ఓట్లు అడగాలే తప్ప, పవిత్రమైన తెలంగాణ నేలపై విషం చిమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా మంగళవారం మోదీకి కేటీఆర్ లేఖ రాశారు. తొలుత 'పిరమైన '(ఖరీదైన) ప్రధాని నరేంద్ర మోదీ గారూ... అని ఆయన సంబోధించారు. ప్రధానిగా గతంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ, వాటిని నెరవేర్చకపోవడానికి కారణాలు చెప్పి ఇక్కడికి రావాలని సూచించారు. తెలంగాణకిచ్చిన ప్రధాన హామీలను సైతం ఎందుకు మరిచారో చెప్పాలని కోరారు. ఈ మేరకు పలు ప్రశ్నలు సంధించారు.

'ఎక్స్' వేదికగా రాసిన లేఖలో కేటీఆర్ డిమాండ్

- ఒక్క సాగునీటి ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదు?
- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి ఎందుకు పాతరేశారు?
- బయ్యారం స్టీలు ఫ్యాక్టరీని ఎందుకు బొందపెట్టారు?
- రైతులు, చేనేతలకు అన్యాయం చేశారన్న బీఆర్‌ఎస్ నేత
- రెచ్చగొట్టే మాటలకు ఓట్లు పడవని స్పష్టీకరణ

ఐటీఐఆర్‌ను ఎందుకు ఆగం చేశారు?

- ఒక్క తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుకు కూడా ఎందుకు జాతీయ హోదా ఇవ్వలేదు?
- యువతకు ఉపాధినిచ్చే కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి ఎందుకు పాతరేశారు?
- ఏజెన్సీ బిడ్డలకు బతుకుదెరువునిచ్చే బయ్యారం స్టీలు ఫ్యాక్టరీని ఎందుకు బొంద పెట్టారు?
- తెలంగాణ నవతరానికి కొండంత భరోసానిచ్చే ఐటీఐఆర్ ప్రాజెక్టును ఎందుకు ఆగం చేశారు?
- తెలంగాణకు ఒక్క నవోదయ, ఒక్క మెడికల్ కాలేజీ, ఒక్క నర్సింగ్ కళాశాల, ఒక్క ఐఐటీ, ఒక్క ట్రిపుల్ ఐటీ, ఒక్క ఐఐఎం, ఒక్క ఐసర్, ఒక్క ఎన్ఐడీ అయినా ఎందుకు ఇవ్వలేదు?
- సాగునీటి ప్రాజెక్టులను మీ గుప్పిట్లో పెట్టుకుని మా రైతులపై ఎందుకు పెత్తనం చేస్తున్నారు?
- లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండినా, 200 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నా, కాంగ్రెస్ సర్కారు పాపానికి నేతన్నలు బలైపోతున్నా, తెలంగాణ వైపు ఎందుకు కన్నెత్తి చూడలేదు?
- చేనేత రంగంపై జీఎస్టీ వేసి మగ్గానికి ఎందుకు మరణ శాసనం రాశారు?
- తెలంగాణకు కష్టపడి తెచ్చుకున్న పరిశ్రమలను బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఎందుకు తన్నుకుపోతున్నారు?
- మండిపోతున్న నిత్యావసరాల ధరలను ఎందుకు అదుపు చేయలేకపోయారు?
- ముడి చమురు ధరలు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు ఎందుకు తగ్గలేదు?
- మీరిచ్చిన 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?
- సబ్ కా సాత్, అచ్ఛే దిన్ లాంటి నినాదాలు.. ఎందుకు విధానాలుగా మారలేదు?
- మీ పాలనలో పదేళ్లు గడిచినా ఇంకా ఉచిత రేషన్ పథకం కింద 80 కోట్ల పేదలు ఎలా ఉన్నారు?
- మీ పార్టీలో (బీజేపీలో) అవినీతిపరులకు ఆశ్రయమిచ్చి, రాజకీయ ప్రత్యర్థులపై దర్యాప్తు సంస్థలను ఎందుకు ప్రయోగిస్తున్నారు? అని కేటీఆర్ నిలదీశారు.

విజన్ కావాలి.. డివిజన్ కాదు

'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగంపై ప్రజల సాక్షిగా ప్రమాణం చేసి..అదే రాజ్యాంగాన్ని అందరి కళ్లముందే కాలరాయవద్దు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా వారి దృష్టిని మరల్చే ప్రయత్నాలు చేయవద్దు. దేశం కోసం ఏదైనా 'విజన్' ఉంటే చెప్పాలే తప్ప సమాజంలో 'డివిజన్' మాత్రం సృష్టించవద్దు. తెలంగాణలో రెచ్చగొట్టే రాజకీయాలకు ఓట్లు పడవు. ఈ గడ్డ ప్రజా చైతన్యానికి అడ్డా..' అని కేటీఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు.





మంగళవారం నల్లకుంటలో మాట్లాడుతున్న కేటీఆర్.. రోడ్ షోకు హాజరైన జనం.

బీఆర్‌ఎస్‌కు 12 ఎంపీ సీట్లు వస్తే

రాష్ట్ర రాజకీయాలను శాసిస్తుంది

బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నల్లకుంట(హైదరాబాద్): ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 10 నుంచి 12 స్థానాలు గెలిస్తే తిరిగి ఆరునెలల్లో రాష్ట్ర రాజకీయాలను శాసిస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలంగాణకు ఒక్క రూపాయి నిధులు కూడా తీసుకురాలేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి టి.పద్మారావుకు మద్దతుగా నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లో రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షోకు హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణకు మోసం చేశారని, అలాగే 2023 శాసనసభ ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ కూడా తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కరెంటు, నీటి కష్టాలు మొదలయ్యాయని చెప్పారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే సిలిండర్ ధర రూ.5000 అవుతుందని, పెట్రోల్ డీజిల్ ధర రూ.400లకు పెరుగుతుందన్నారు. బీజేపీ హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేయడానికి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. తెలంగాణకు కాపాడేది గులాబీ పార్టీ అని, పద్మారావుగౌడ్‌ను పార్లమెంట్‌కు పంపితే తెలంగాణగొంతు పార్లమెంట్‌లో వినిపిస్తారని, ఆయన్ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంబర్‌పేట నియోజకవర్గానికి చేసింది ఏమీలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్లు దూసరి లావణ్యా శ్రీనివాస్‌గౌడ్, పద్మా వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకతీయుల స్ఫూర్తితో

ఢిల్లీ సుల్తాన్‌లపై పోరు

- ఈ ఎన్నికలు.. గుజరాత్, తెలంగాణ మధ్య ఫైనల్ మ్యాచ్!
- బీజేపీని డకౌట్ చేసి గుజరాత్‌ను ఓడించాలి
- బీజేపీ, బీఆర్‌ఎస్ చీకటి ఒప్పందాలను తిప్పికొట్టాలి
- మళ్లీ కేసీఆర్ అదే దగాకోరు విధానాలతో తిరుగుతుండు
- వరంగల్ రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లలో సీఎం, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



రోడ్ షోలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కొండా సురేఖ, మురళి, కావ్య, సీతక్క

సాక్షి ప్రతినిధి, వరంగల్: నాటి ఓరుగల్లు కాకతీయుల పాలకుల స్ఫూర్తితో ఢిల్లీ సుల్తాన్‌లకు ఏమాత్రం తీసిపోని బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో తిప్పికొట్టి ఉద్యమస్ఫూర్తి చాటుదామని ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలు తెలంగాణ వర్సెస్ గుజరాత్ మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్ లాంటిదని అభివర్ణించిన సీఎం బీజేపీని డకౌట్ చేసి గుజరాత్‌ను ఓడించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి గ్రేటర్ వరంగల్‌లో ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపుకోసం రేవంత్ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించారు. హన్మకొండ చౌరస్తా, వరంగల్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో ఆయన ప్రసంగించారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పదేళ్లు పాలించి విధ్వంసం చేశాయని ధ్వజమెత్తారు. ఆ రెండు పార్టీలు ఒక్కటేనని, అవగాహనతోనే ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని విమర్శించారు.

మోదీ నిన్ను ప్రశ్నిస్తున్నా.. వరంగల్‌కు ఎలా వస్తావు..

'ఓట్ల కోసం వస్తున్న ప్రధాని నరేంద్రమోదీని ప్రశ్నిస్తున్నా.. జవాబు చెప్పినంకనే వరంగల్‌లో అడుగు పెట్టాలని కూడా డిమాండ్ చేస్తున్నా. కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షను తీర్చేందుకు సోనియాగాంధీ నేతృత్వంలో అప్పటి పీఎం మన్మోహన్‌సింగ్ ఆధ్వర్యంలో లోక్‌సభ, రాజ్యసభల్లో విభజన చట్టం చేసి ప్రత్యేక రాష్ట్రం వచ్చింది. తెలంగాణ ప్రాంతానికి సముచిత న్యాయం చేసేందుకు ఖమ్మం జిల్లాలోని బయ్యారం ఉక్కు, వరంగల్ జిల్లాలోని కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఇచ్చేందుకు ఒప్పందం చేస్తే ఇక్కడి ప్రజల ప్రయోజనాలను విస్మరించిన నువ్వు వరంగల్‌కు ఎలా వస్తావ్'అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ చీకటి ఒప్పందం

'వరంగల్ సాక్షిగా బీజేపీ, బీఆర్‌ఎస్ చీకటి ఒప్పందం చేసుకొని బీఆర్‌ఎస్ నాయకుడిని బీజేపీలోకి పంపించాయి. పాపం ఓ అమాయకుడిని బీఆర్‌ఎస్ పక్షాన బరిలో నిలిపాయి. ఇందుకు ఉదాహరణ.. బీఆర్‌ఎస్ నాయకులు బాహాటంగా నిష్పక్షపాతంగా ప్రచారంలో పాల్గొనడం లేదు. మీ కష్టాన్ని పణంగా పెట్టి మిమ్మల్ని వ్యాపార వస్తువుగా మార్చుకొని బీజేపీతో కేసీఆర్ ఒప్పందం చేసుకున్నారు ఇందుకు నగదు పంచుకొని నగదు నారాయణ రాజకీయం చేస్తుండు'అని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

బండకేసి కొట్టినా కేసీఆర్ బుద్ధి మారలే..

మాజీ సీఎం కేసీఆర్ బుద్ధి ఇంకా మారలేదనీ..వంకర ఆలోచనలు మానలేదని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి తెలంగాణను విధ్వంసం చేసినందుకు డిసెంబర్ ఎన్నికల్లో ప్రజలు బండకేసి కొట్టినా కేసీఆర్ తీరుమారలేదని విమర్శించారు. బస్సు యాత్రలో మంచి మాటలు మాట్లాడి .. చేసిన అన్యాయానికి క్షమాపణలు చెప్పి మారతాడనుకుంటే.. మళ్లీ దగాకోరు విధానాలతో తిరుగుతుండ్రని నిందించారు. ఇక తల కిందికి పెట్టి తపస్సు చేసినా మీరు గెలువరనీ, కేటీఆర్ కారును జుమరాత్ బజారుకు తరలించండ్రనీ సూచించారు.

నేను అల్లాటప్పాగా రాలేదు...

'సీఎం కుర్చీ నుంచి దిగిపోవడానికి నేను అల్లాటప్పాగా రాలేదు. నిరంకుశ ప్రభుత్వంపై పదేళ్లు పోరాడి సీఎం కుర్చీలో కూర్చున్నా. పదేళ్లుగా అధికారంలో ఉన్న మోదీ దిగిపోవాలని కేసీఆర్ ఎందుకు అనడం లేదు. కుమార్తె బెయిల్ కోసం ఎంపీ సీట్లను ఆయన మోదీకి తాకట్టుపెట్టారా'అని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. వరంగల్ బిడ్డ కడియం కావ్యను లక్ష మెజారిటీతో గెలిపించే దిశగా బూత్ లెవల్‌లో మారుమూల గ్రామాల్లో ఇంటింటా తిరిగి పార్టీ గెలుపు కోసం పాటుపడాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు.



గాలి వానతో చెల్లాచెదురుగా పడిన కుర్చీలు, టెంట్లు

వర్షం కారణంగా కరీంనగర్‌లో సీఎం సభ వాయిదా

అకాల వర్షం కారణంగా మంగళవారం సాయంత్రం కరీంనగర్‌లో జరగాల్సిన సీఎం ఎ.రేవంత్‌రెడ్డి బహిరంగ సభ వాయిదా పడింది. కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా స్థానిక ఎస్సారార్ కళాశాలలో ఏర్పాటు చేసిన జనజాతర సభ కోసం సీఎం రావాల్సి ఉంది. అయితే మంగళవారం మధ్యాహ్నం నుంచే ఒక్కసారిగా గాలిదుమారంతో టెంట్లు ఎగిరి, భారీవర్షానికి సభాస్థలిలో నీరు నిలిచిపోవడంతో సభను వాయిదా వేశారు.

కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

- ఈడీ కేసులో 14 వరకు.. సీబీఐ కేసులో 20వ తేదీ వరకు పొడిగించిన ప్రత్యేక కోర్టు
- బెయిల్ కోసం నేడు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించనున్న కవిత!

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని ప్రత్యేక కోర్టు మరోసారి పొడిగించింది. ఈడీ కేసులో ఈ నెల 14వ తేదీ వరకు.. సీబీఐ కేసులో ఈ నెల 20వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసుల్లో ఇంతకు ముందు విధించిన జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో.. అధికారులు కవితను రౌజ్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున కస్టడీ పొడిగించాలని ఈడీ తరఫు న్యాయవాది నవీన్‌కుమార్ మట్టా కోరారు. కుంభకోణంలో కవిత పాత్రపై ఒకట్రెండు రోజుల్లో చార్జిషీటు దాఖలు చేస్తామని కోర్టుకు వివరించారు. మరోవైపు సీబీఐ కేసులో న్యాయవాది పంకజ్ గుప్తా వాదనలు వినిపిస్తూ.. కవితతో సంబంధాలు ఉన్న మరికొందరిని విచారించాల్సి ఉందని, దర్యాప్తు సజావుగా సాగాలంటే జ్యుడీషియల్ కస్టడీ పొడిగించాలని కోరారు. ఇక ఈడీ కేసులో కవిత తరఫు న్యాయవాది నితీశ్‌రాణా వాదనలు వినిపిస్తూ.. కుటుంబ సభ్యులు కవితతో 15 నిమిషాలు మాట్లాడటానికి అనుమతించాలని కోరారు. కోర్టు లాకప్‌లో పిటిషనర్ భర్త తీసుకొచ్చిన ఆహారాన్ని అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. జైలుకు పంపుతున్న ఇంటి భోజనాన్ని కూడా జైలు సూపరింటెండెంట్ ఒక్కరే తనిఖీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అయితే న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. కవితకు ఇంటి భోజనం నిలిపివేశాక కూడా మళ్లీ ఎందుకు అడుగుతున్నారని, దీనిపై జైలు సూపరింటెండెంట్ వివరణ ఇవ్వాలని ఆదేశించారు. తర్వాత కవిత జ్యుడీషియల్ కస్టడీలను పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కవితకు చదువుకోవడానికి పది పుస్తకాలను అనుమతించాలని జైలు అధికారులకు సూచించారు. ఈడీ, సీబీఐ కేసులలో ప్రత్యేక కోర్టుకు కవితకు బెయిల్ నిరాకరించిన నేపథ్యంలో.. ఆమె న్యాయవా దులు బుధవారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించినట్టు తెలిసింది.

నా అరెస్టు అన్యాయం: కవిత



అధికారులు ప్రత్యేక కోర్టు ప్రాంగణంలోకి కవితను తీసుకువచ్చినప్పుడు.. 'జైతెలంగాణ.. జై భారత్' అంటూ నినాదాలు చేశారు. కోర్టు హాల్ నుంచి బయటకు వస్తున్న సమయంలో.. ప్రజ్వల్ రేవణ్ణ వంటి వాళ్లను దేశం దాటించి, తనలాంటి వారిని అరెస్టు చేయడం అన్యాయమని కవిత వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.


సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యం


కేశవ్ మెమోరియల్ కాలేజీలో బీజేపీ నేత బండారు విజయలక్ష్మి ఓ కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా అకస్మాత్తుగా వర్షం కురవడంతో ఆనందోత్సాహాలతో యువత నృత్యం చేశారు.


కరీంనగర్ జిల్లా బొమ్మకల్ కొనుగోలు కేంద్రంలో నిలిచిన వరదనీళ్లలో ధాన్యం కుప్పలు

మండుటెండల్లో నిండా ముంచే..

▶ మొదటి పేజీ తరువాయి

కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసిపోయింది. పలు గ్రామాల్లో ఇళ్లపై కప్పు రేకులు ఎగిరిపోయాయి. వడగళ్ల వానతో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని పలు మండలాల్లో మామిడికాయలు రాలిపోయాయి. జమ్మికుంటలో మొక్కజొన్న పంట దెబ్బతిన్నది.

ఆదిలాబాద్: వాన తిప్పలు

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఈదురుగాలులతో కురిసిన వర్షంతో రైతులు తిప్పలు పడ్డారు. పలుచోట్ల ధాన్యం తడిసిపోయింది. సిరికొండ, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, తలమడుగు మండలాల్లో వడగళ్ల వాన కురిసింది. నర్సాపూర్(జీ), నిర్మల్, లక్ష్మణచాంద మండలాల్లో తీవ్రంగా ఈదురుగాలులు వీయడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కూలయి. ఆసిఫాబాద్ మండలంలో కోతకు వచ్చిన వరిపంట నేలకొరిగింది.

నల్లగొండ: దెబ్బతిన్న మామిడి

నల్లగొండ ఉమ్మడి జిల్లా పరిధిలో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వానలు పడ్డాయి. వందల ఎకరాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, బీబీనగర్, పోచంపల్లి, మోత్కూరు మండలాల్లో చాలాసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. యాదాద్రి కొండపై ఈదురుగాలులు, వానతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చలువ పందిళ్లు నేలకూలాయి. క్యూకాంప్లెక్స్ పైకప్పు రేకులు ఎగిరి సమీపంలో ఉన్న వాహనాలపై పడ్డాయి.

నిజామాబాద్: వణికించిన ఈదురుగాలులు

బలమైన ఈదురుగాలులు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను వణికించాయి. నాలుగైదు గంటల పాటు గాలివాన బీభత్సం సృష్టించింది. చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెట్లు విరిగిపడ్డాయి. పలుచోట్ల ధాన్యం తడిసిపోయింది.


పెద్దపల్లి జిల్లా మారేడు గొండలో కురిసిన వడగళ్లు


యాదాద్రి: నింగిలో వెండి మెరుపులు.. నేలపై స్వర్ణకాంతులు..

రంగారెడ్డి: నీట మునిగిన కాలనీలు

రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలుల వాన వణికించింది. పలుచోట్ల వడగళ్లు కురిశాయి. మామిడి నేల రాలింది. చేవెళ్ల, మొయినాబాద్, యాచారం మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. షాద్‌నగర్ పట్టణంలోని లోతట్టు కాలనీలు నీటమునిగాయి.

మెదక్ జిల్లా: ముంచెత్తిన వాన

మెదక్ ఉమ్మడి జిల్లాను అకాల వర్షం ముంచెత్తింది. సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో 3 వేల బస్తాలకు పైగా ధాన్యం మొత్తం తడిసింది. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలో భారీగా ధాన్యం తడిసింది. పటాన్‌చెరు నియోజకవర్గంలో పలుచోట్ల చెట్లు విరిగిపడి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిన్నారం, హత్నూర మండలాల్లో వడగళ్లు పడ్డాయి. ధాన్యం తడిసిపోయింది. జిల్లాలో రెండు ఇళ్లు, ఓ హోటల్ పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలంలో ధాన్యం నీట మునిగింది.

హైదరాబాద్ ఆగమాగం

ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం హైదరాబాద్ నగరాన్ని ఆగమాగం చేసింది. మియాపూర్‌లో ఏకంగా 13.3 సెంటీమీటర్లు, కూకట్‌పల్లిలో 10.7 సెంటీమీటర్లు భారీ వర్షపాతం నమోదైంది. మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో పార్కింగ్ చేసిన లారీలు, కంటైనర్ లారీలు మట్టి దిగబడి ఓ వైపు ఒరిగి పోయాయి. చాలా ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు, హోర్డింగ్స్ కూలిపోయాయి. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అత్తాపూర్‌లో ఇళ్ల రేకులు ఎగిరిపోయి సమీపంలోని సబ్‌స్టేషన్‌లో పడటంతో భారీగా మంటలు చెలరేగాయి. ప్రధాన రహదారులపై వరద నీరు చేరడంతో తీవ్రంగా ట్రాఫిక్ జామ్ అయింది.

తక్షణమే సహాయక చర్యలు చేపట్టండి: సీఎం

సాక్షి, హైదరాబాద్ : భారీవర్షం, ఈదురుగాలులతో హైదరాబాద్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయంకావడం, ట్రాఫిక్ సమస్యలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించారు. వరంగల్ పర్యటనలో ఉన్న సీఎం మంగళవారం అక్కడినుంచే జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, సిటీ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాసరెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ రిజ్వీ, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడారు. భారీవర్షాలు, ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో, జలమయమైన కాలనీల్లో ప్రజలకు అవసరమైన చేయూత అందించాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను సాధ్యమైనంత తొందరగా క్లియర్ చేసి వాహనదారులు త్వరగా ఇళ్లకు చేరుకునేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది చేపట్టే సహాయకచర్యల్లో భాగస్వాములు కావాలని, సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సీఎం కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు.

'వాన' దెబ్బకు ఆరుగురు బలి

రాష్ట్రవ్యాప్తంగా ఈదురుగాలులు, వర్షం ధాటికి చెట్ల కొమ్మలు విరిగిపడి, గోడలు కూలి, పిడుగులు పడి ఆరుగురు మరణించారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. వరంగల్ జిల్లా సంగెం మండలం ఇల్లందలో చెట్టు కొమ్మలు విరిగిపడి బీటెక్ విద్యార్థి ఆబర్ల దయాకర్ (22) మృతిచెందాడు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం రాయిలాపూర్ (నాగ్సాన్‌పల్లి) శివారులోని మామిడితోటలోని కోళ్ల ఫారం గోడ కూలడంతో ఇద్దరు కూలీలు అక్కడిక్కడే మరణించారు. పిడుగుపాటుకు గురై సంగారెడ్డి జిల్లా అందోల్ మండల ఎర్రారంలో గోవిందు పాపయ్య (52), సిద్దిపేట జిల్లాలో కుకునూరుపల్లికి చెందిన మల్లేశం (33)మృతి చెందారు.

హైదరాబాద్ బాచుపల్లిలో గోడ కూలి..

భారీ వర్షం కారణంగా హైదరాబాద్‌లోని బాచుపల్లి రేణుక ఎల్లమ్మ కాలనీలోని నిర్మాణంలో ఉన్న ఓ భవనం రిటైనింగ్ వాల్ కూలిపోయింది. ఆ పక్కనే ఉన్న రేకుల ఇళ్లపై గోడ, మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. దీంతో వాటిలో నివాసం ఉంటున్న ఏడుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. శిథిలాల కింద కొందరు కూరుకుపోయి ఉంటారని భావిస్తున్నారు. వేగంగా సహాయక చర్యలు చేపడుతున్నారు. కూలీలు ఇచ్చిన వివరాల మేరకు 8 మంది వరకు శిథిలాల కింద కూరుకుపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రికల్లా శిథిలాల కింద ఒకరి మృతదేహాన్ని గుర్తించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.


జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఆరపల్లిలో నేలవాలిన మొక్కజొన్న


కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం యాస్వాడ గ్రామంలో నేలవాలిన వరి


జలమయమైన సచివాలయం రహదారి


రాజన్న సిరిసిల్ల జిల్లా బొల్లారంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం, చెట్లు

మరో రెండు రోజులు వానలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. తూర్పు విదర్భ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా దక్షిణ అంతర్గత కర్ణాటక, దక్షిణ తమిళ నాడు వరకు ఏర్పడిన ఉపరితల ద్రోణి రాష్ట్రంపై ప్రభావాన్ని చూపుతోందని తెలిపింది. దీని ప్రభా వంతో వానలు కొనసాగుతాయని వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రధానంగా జయశంకర్ భూపాల పల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబా బాద్, ములుగు, నల్లగొండ, సూర్యా పేట, వరంగల్, హన్మకొండ, యాదాద్రి భువన గిరి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లోని పలుచోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఎక్కువ ప్రాంతాల్లో ఓ మోస్తరు వానలు పడతాయని వెల్లడించింది.

సాధారణ స్థాయికి ఉష్ణోగ్రతలు

మంగళవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు కాస్త దిగి వచ్చాయి. అత్యధికంగా కామారెడ్డి జిల్లా బిచ్కుందలో 44.7 డిగ్రీలు, నిర్మల్ జిల్లా నర్సాపూర్‌లో 44.3 డిగ్రీలుగా నమోదైంది. ఇక వచ్చే రెండు రోజులు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలివీ

కేంద్రం	గరిష్టం
ఆదిలాబాద్	43.8
నిజామాబాద్	43.6
మెదక్	41.6
ఖమ్మం	41.2
హైదరాబాద్	40.4
రామగుండం	40.2
హకీంపేట్	40.2
దుండిగల్	40.0
మహబూబ్‌నగర్	39.6
నల్లగొండ	39.5
భద్రాచలం	38.5
హన్మకొండ	38.5

వడదెబ్బకు ఆరుగురు మృతి

సాక్షి నెట్‌వర్క్: ఎండదెబ్బకు మంగళవారం రాష్ట్రంలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం రాంనగర్‌లో బార్బర్‌గా పని చేస్తున్న జిడుగు సత్యం (52), హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌కు చెందిన రైతు గంటల వెంకటయ్య (75), రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గణేశ్ నగర్‌కు చెందిన నేత కార్మికుడు బేతి కిష్టయ్య(70), యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూ ర్ పట్టణం పోస్టాఫీస్ ఏరియాకు చెందిన వృద్ధు రాలు రావుల మణెమ్మ(95), సూర్యాపేట జిల్లా మునగాల గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మి కుడు తొండల సత్యం(53) వడదెబ్బకు గురై మృత్యువాత పడ్డారు. కాగా, ఉప్పల్‌లో భిక్షగాడిగా భావిస్తున్న వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా, 108 సిబ్బంది వచ్చి మృతి చెందాడని నిర్ధారించారు. వడదెబ్బతో మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు.

ఏపీలో ఏడుగురి ప్రాణాలు తీసిన పిడుగులు

సాక్షి నెట్‌వర్క్: తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం బల్లిపాడు గ్రామానికి చెందిన కవల నాగేశ్వరరావు (55) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. లంక భూముల్లో మేకలు కాయడానికి వెళ్లగా పిడుగు పడి మృత్యువాతపడ్డాడు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం యడవల్లి గ్రామంలో పిడుగుపడి పర్సా రామారావు (44) మృతి చెందాడు. పొలంలో పశువులు మేపుతున్న పర్సా రామారావు వద్ద పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రెండు పశువులు కూడా పిడుగు ప్రభావానికి గురై మృతి చెందాయి. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం జొన్నవారిగూడెం ఎర్రకాలువ ప్రాంతంలో పిడుగుపాటుకు గురై కరిపోతుల నాగేశ్వరరావు (72) మృతి చెందాడు. మొక్కజొన్న కోతలకు వెళ్లిన తల్లీకూతురు పిడుగుపాటుకు గురై మరణించిన ఘటన పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఊటుకూరులో చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఊటుకూరు ఎస్సీ కాలనీకి చెందిన బొందెల నాగేంద్రమ్మ (53), కూతురు నాగరాణి(33)తో పిడుగుపాటుకు గురై మొక్కజొన్న చేనులో మృత్యువాతపడ్డారు. మూగజీవాలను మేపడానికి ములకలూరు ప్రాంతానికి వెళ్లిన ఆవుల కోటేశ్వరరావు (42), అతని మేనల్లుడు జమ్ముల గోపి(35) పిడుగుపాటుకు గురై మరణించారు. మృతులిద్దరూ పల్నాడు జిల్లా జిల్లా ముప్పాళ్ల మండలం కుందురువారిపాలెంకు చెందినవారు. కాగా.. పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షంలోని వట్టూరివారి వీధిలో మంగళవారం వీచిన ఈదురుగాలులకు కొబ్బరి చెట్టు కూలి నిమ్మల శ్రీనివాస్ (49) అనే వ్యవసాయ కూలీ మృత్యువాతపడ్డాడు.



మీకు సంపూర్ణమైన తృప్తిని కలిగించే స్థితి లేదా స్థాయి ఏదైనా ఉందేమో పరిశీలించండి. వాటి నిజస్వభావం తెలిస్తే అటువంటి స్థితి ఏదీ లేదని తెలుస్తుంది. విజ్ఞతతో విషయాల్ని తెలుసుకొని జీవించటం మన బాధ్యత.

– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 8 మే 2024

గుట్టలుగా... అవినీతి కట్టలు

ఆరు కౌంటింగ్ మిషన్లు... పదుల కొద్దీ సిబ్బంది... 12 గంటల పైగా లెక్కింపు... 32 కోట్లకు పైగా విలువైన నగదు... దాదాపు అన్నీ అయిదొందల నోట్లు. జార్ఖండ్ రాజధాని రాంచీలోని గాడీఖానా చౌక్‌లోని ఆ చిన్న రెండు బెడ్‌రూమ్‌ల ఫ్లాట్‌లో అంత పెద్ద మొత్తం, పెద్ద పెద్ద సంచీల కొద్దీ నోట్ల కట్టలు ఉంటాయని ఎవరూ ఊహించరు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలో పేరుకుపోయిన అవినీతికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం నాటి సోదాల్లో ఎదురైన దృశ్యాలే కళ్ళుచెదిరే సాక్ష్యాలు. సదరు శాఖ మంత్రి గారి వ్యక్తిగత కార్యదర్శి ఇంట, ఆ కార్యదర్శికి పనివాడి ఫ్లాట్‌లో, ఇతరుల వద్ద సోదాల్లో మొత్తం కలిపి రూ. 35 కోట్ల పైనే బయటపడేసరికి అంతా అవాక్కయ్యారు. అంతలేసి ధనం లెక్కాపత్రం లేకుండా ఎవరింట్లోనైనా ఉందంటే, అది అక్రమధనం కాక మరేమిటి? 'ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్' (పీఎంఎల్‌ఏ) కింద వారిద్దరినీ అరెస్ట్ చేశారు. ఇక, మంగళవారం రాంచీలో మరో 5 చోట్ల సోదాలు జరిపితే, ఓ కాంట్రాక్టర్ వద్ద 1.5 కోట్లు దొరికాయి. పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్... ఇలా ప్రాంతాలు, ప్రభుత్వాలు ఏవైనా సోదా చేస్తే చాలు... నల్లధనం విశ్వరూపం గుట్టల కొద్దీ కట్టల రూపంలో సాక్షాత్కరిస్తున్న తీరు ఆందోళనకరం.

జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖలో పై నుంచి కింద దాకా సమస్తం అవినీతిమయమేనని ఈడీ మాట. తీగ లాగితే డొంకంతా కదలడానికి తాజా కేసు ఉదాహరణ. గత ఏడాది ఫిబ్రవరిలో ఆ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలో చీఫ్ ఇంజనీర్ వీరేంద్రరామ్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. కేవలం పదివేల రూపాయల లంచం తీసుకున్నందుకు జరిగిన ఆ అరెస్టు కథ చివరకు అనూహ్యంగా ఇంత పెద్ద కరెన్సీ గుట్టు విప్పింది. ప్రభుత్వ అధికార యంత్రాంగంలో చిన్నస్థాయిలోనే ఉన్నప్పటికీ, అవినీతి పరులైన ఉద్యోగులు నిఘా సంస్థల కంటబడకుండా తమ అక్రమార్జనను ఎలా తరలిస్తున్నదీ వీరేంద్రరామ్ విచారణలో తెలిసింది. సంక్లిష్టమైన అవినీతి వ్యవస్థలో తాను, తన లాంటి అధికారుల కోటరీ ఎలా భాగమైనదీ, టెండర్ల ప్రక్రియ సందర్భంగా లంచం సొమ్మును వివిధ మార్గాల్లో తరలించే పద్ధతీ ఆయన బయటపెట్టారు. ఆ వివరాలకు తగ్గట్లే... గ్రామీణాభివృద్ధి శాఖలో విస్తృతంగా అవినీతి సాగుతోందని గ్రహించిన ఈడీ తగిన చర్య చేపట్టాల్సిందిగా గత ఏడాది మేలోనే రాష్ట్ర సర్కారుకు గోప్యంగా లేఖ రాసింది. దానికి రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పెద్దగా స్పందించలేదు. పైగా, నిఘా నీడలోని అవినీతి అధికారుల చేతిలోనే ఆ లేఖ పడడం విడ్డూరం.

తిరుగులేని సాక్ష్యాధారాలు లభించడంతో గ్రామీణాభివృద్ధి మంత్రి ఆలంగిర్ ఆలమ్ వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్‌లాల్ సహా పలువురు కీలక అనుమానితులపై ఈ సోమవారం ఈడీ దాడులు జరిపింది. కాంట్రాక్టులు ఇస్తూ అవినీతి ముఠాలో కీలకంగా వ్యవహరిస్తూ, లాల్ కోట్లు కూడబెట్టారట. లాల్ పనివాడి ఇంట్లో ఏకంగా రూ. 32 కోట్ల పైగా డబ్బు గుట్టలుగా దొరకడంతో వ్యవహారం సంచలనమైంది. ఇదికాక, మరో వ్యక్తి ఇంట్లో మరో 3 కోట్లు దొరికిందంటే, అక్కడి ప్రభుత్వ శాఖలో ఏ స్థాయిలో అక్రమాలు, అవినీతి రాజ్యమేలుతున్నాయో అర్థమవుతోంది. ఈడీ దాడుల్లో లభించిన దస్తావేజులను బట్టి ముందుగా ఊహించిట్టే ఇందులో మంత్రి గారి హస్తం ఉండనే ఉందని రుజువవుతోంది. ఆయన మెడకు ఉచ్చు బిగుస్తోంది. జార్ఖండ్‌లోని పాకూర్ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన డెబ్బై ఏళ్ళ ఈ సీనియర్ కాంగ్రెస్ నేతను ఈడీ ప్రశ్నించడమే ఇక బాకీ. పనివాడినీ, అతని ఇంటిని అవినీతి సొమ్ముకు గిడ్డంగిగా మార్చిన వ్యక్తిగత కార్యదర్శినీ అరెస్ట్ చేసినా అమాత్యవర్యులు అదరక, బెదరక అమాయకత్వం ప్రకటిస్తుండడం విడ్డూరం.

జార్ఖండ్‌లోని చంపాయ్ సోరెన్ ప్రభుత్వంపై పడ్డ ఈ అవినీతి మచ్చ ఎన్నికల ప్రచారంలో బీజేపీకి బాగా అంది వస్తోంది. కాంగ్రెస్‌కు పెద్దదిక్కయిన గాంధీ కుటుంబానికి సన్నిహితులైన వారి ఇళ్ళల్లోనే గతంలోనూ, మళ్ళీ ఇప్పుడూ... ఇంత భారీగా అక్రమ ధనం లభించడాన్ని వివిధ రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో మోదీ ప్రస్తావిస్తున్నారు. అవినీతిని ఆపడానికి తాను ప్రయత్నిస్తుంటే, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తమను విమర్శిస్తున్నాయని ఆయన వాదన. కాగా, ఇదంతా ప్రత్యర్థులే లక్ష్యంగా మోదీ సర్కార్ సాగిస్తున్న దర్యాప్తు సంస్థల దుర్వినియోగమని ప్రతిపక్ష కూటమి ఆరోపణ. గత డిసెంబర్‌లో జార్ఖండ్ కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూకు చెందిన ఒడిశా మద్యం డిస్టిలరీల్లో ఆదాయపు పన్ను శాఖ సోదాలు జరిపితే, కనివిని ఎరుగని రీతిలో రూ. 350 కోట్ల పైగా మొత్తం దొరికిన సంగతి తెలిసిందే. పరస్పర ఆరోపణలెలా ఉన్నా, ఈ ఘటనలన్నీ ప్రమాదకరమైన పరిణామాన్ని సూచిస్తున్నాయి. అక్రమధనంపై దీర్ఘకాలంగా దేశవ్యాప్త ఉద్యమం జరుగుతూనే ఉంది. దర్యాప్తు సంస్థలు చురుగ్గానే ఉన్నాయి. అయినా సమస్య తీరకపోగా, కొత్తవి బయటపడడం పెను సవాలు.

అవినీతిని అంతం చేసి, అక్రమధనాన్ని అందరికీ పంచిపెడతామంటూ ప్రగల్భాలు పలికిన నేతలు గత పదేళ్ళుగా గద్దె మీదే ఉన్నారు. అవినీతి, కుటుంబ పాలనపై పోరాటమని చెబుతూనే వస్తున్నారు. ఫలితం శూన్యం. పెద్దనోట్ల రద్దు లాంటివి ఎంత విఫలయత్నాలో అర్థమవుతూనే ఉంది. ఈడీ, ఐటీ, సీబీఐ కేసుల్లో నిందితులైన నేతలు సైతం జెండా మార్చి, కాషాయం కప్పుకుంటే పరమ పునీతులైపోతున్న పరిస్థితులూ చూస్తున్నాం. ఏలికల చేతుల్లో ఏజెన్సీలు, పీఎంఎల్‌ఏ లాంటి అసమంజస కఠిన చట్టాలున్నా సమస్య తీరకపోవడానికి కారణమేమిటో ఆలోచించాలి. ఇవాళ వ్యాపారం, రాజకీయాలు, సమాజం ఏ స్థితికి చేరాయో గ్రహించాలి. నేతలు, అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై, ఒకరి కోసం ఒకరు నడిచే తీరు దేశానికి క్షేమం కాదు. ఎన్నికల వేళ ఈ అక్రమధనం పెనుసమస్య. దాని పర్యవసానాలు ఎన్నికలపైనే కాదు, ఆ తర్వాతా ఉంటాయని విస్మరించరాదు.

రిజర్వేషన్లకు ఎవరు భరోసా?

అభిప్రాయం



జి. శ్రీరామమూర్తి

సకల శ్రామిక, సేవక వృత్తులు చేస్తూ సమాజ రథాన్ని నడిపిస్తున్న కింది కులాల ప్రజలకు చేయి అందించి ముందుకు తీసుకురావలసిన కర్తవ్యాన్ని గుర్తించిన రాజ్యాంగ కర్తలు సానుకూల వివక్షకు అవకాశం కల్పించారు. విద్య, ఉద్యోగాల్లో కొంత శాతాన్ని ప్రత్యేక పరిగణన ద్వారా వారికి కేటాయించాలని నిర్ణయించారు. రిజర్వేషన్లు కల్పించి ఏడు దశాబ్దాలు దాటినా అణగారిన వర్గాల బతుకులు చాలీ చాలని గుడిసెల్లోనే కొనసాగుతున్నాయి. అందుకే జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని వారు కోరుతున్నారు. ఇందుకు కుల ప్రాతిపదికన జనగణన జరగాలని డిమాండ్ చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇప్పుడు ఈ అంశమే అన్ని వర్గాల ప్రజల్లో పెద్ద చర్చనీయాంశమైంది.

రిజర్వేషన్ల మీద జాతీయ స్థాయిలో ఇంతటి ప్రస్తావన చోటు చేసుకోవడం ఒక మంచి పరిణామం. ఇది ప్రస్తావన మాత్రంగానే సాగుతున్న వ్యవహారం కాబట్టి దీనిని చర్చ అనడం లేదు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో (లోక్ సభ ఎన్నికలు –2024) బీజేపీకి పూర్తిస్థాయి మెజారిటీ వస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తుందనీ, రిజర్వేషన్లను రద్దు చేస్తుందనీ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారానికి కమలనాథులు తీవ్ర కలవరపాటుకు గురౌతున్నారు. ఆర్ఎస్ఎస్ చేత కూడా ఖండన ప్రకటన లిప్పిస్తున్నారు. రాజ్యాంగాన్ని మార్చే ఉద్దేశం కానీ, రిజర్వేషన్లను రద్దు చేసే ఆలోచన కానీ ఏ కోశానా లేవని చెప్పుకుంటున్నారు. రిజర్వేషన్లు జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించినవి కాబట్టి బీజేపీ ఇంతగా ఇది అయిపోతోందని అర్థమవుతోంది.

సామాజికంగా అణగారిన వర్గాలకు... అంటే సామాజికంగా, విద్యా పరంగా వెనుకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్లు ఇవ్వాలని రాజ్యాంగంలో స్పష్టంగా ఉంది. అందుకు విరుద్ధంగా ఆర్థిక వెనుకబాటుతనాన్ని రాజ్యాంగంలో చేర్పించి ఆ వర్గానికి ఏకంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన చరిత్ర బీజేపీ పాలకులది. ఇందుకోసం అగ్ర వర్ణాలనుంచి ఒత్తిడి వర్గాలను రంగంలో దింపిన ఘనత బీజేపీది. దేశంలో శతాబ్దాలుగా కఠోరంగా అమల్లో గల కుల వ్యవస్థ, బ్రాహ్మణీయ వివక్ష వల్ల చదువుకీ, ఆస్తికీ, ఆత్మగౌరవానికీ బహు దూరంగా బతుకుతూ... అదే సమయంలో సకల శ్రామిక, సేవక వృత్తులు చేస్తూ సమాజ రథాన్ని నడిపిస్తున్న వేలాది కింది కులాల ప్రజలను చేయి అందించి ముందుకు తీసుకురావలసిన కర్తవ్యాన్ని గుర్తించి రాజ్యాంగ కర్తలు సానుకూల వివక్షకు అవకాశం కల్పించారు. విద్య, ఉద్యోగాల్లో కొంత శాతాన్ని ప్రత్యేక పరిగణన ద్వారా వారికి కేటాయించాలని నిర్ణయించారు. రాజ్యాంగ అధికరణలు 15(4), 46 ఇందుకే చోటు చేసుకున్నాయి. ప్రమోషన్లలో, భర్తీ కాకుండా మిగిలిపోయిన బ్యాక్ లాగ్ ఉద్యోగాలలో కూడా ఈ రిజర్వేషన్లు వర్తింపజేయడానికి వేర్వేరు రాజ్యాంగ సవరణల ద్వారా అవకాశం కల్పించారు.

బాబా సాహెబ్ అంబేడ్కర్ అందరికీ సమానంగా ఓటు హక్కును కల్పించడంతో దేశంలో సమతా భావన బలపడడం ప్రారంభించింది. అయినా ఇప్పటికీ వెలి గ్లాసులు, వెలి బావులు వంటివి కొనసాగుతున్నాయి. అగ్రవర్ణాలకు కేటాయించిన మంచినీటి కుండలోని నీరు తాగేడనే నెపం మీద పాఠశాలలో దళిత బాలుడిని కొట్టి చంపిన మాదిరి దారుణ ఉదంతాలు జరుగుతున్నాయి.

రిజర్వేషన్లు కల్పించి ఏడు దశాబ్దాలు దాటినా అణగారిన వర్గాల – ఎస్సీ, ఎస్టీ, బీసీల బతుకులు చాలీ చాలని గుడిసెల్లోనే కొనసాగుతున్నాయి. నిరుద్యోగం, అధిక ధరలు వారి బతుకులను మరింతగా అంచులకు ఈడ్చివేశాయి. అందుకే జనాభాలో తామెందరో... విద్య, ఉద్యోగాల్లో అంత శాతం వాటా తమకు రావాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. కులగణన నినాదం బలం పుంజుకున్నది. కాంగ్రెస్ పార్టీ దీనిని ప్రధాన వాగ్దానంగా చేసుకుంది. ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా దామాషాను బట్టి రిజర్వేషన్లు వర్తిస్తుండగా దేశ జనసంఖ్యలో సగానికి పైగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లను 27 శాతానికే కుదించారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీం కోర్టు గీచిన హద్దు గీత, క్రీమీ లేయర్ నిబంధన బీసీల పాలిట శాపాలయ్యాయి. ఆర్థిక వెనుకబాటుతనం పేరిట అగ్రవర్ణ పేదలకు రాజ్యాంగ సవరణ ఆయుధంతో 10 శాతం కోటా కల్పించిన మోదీ ప్రభుత్వం రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని, క్రీమీ లేయర్‌ను తొలగించడానికి రాజ్యాంగ సవరణ ఎందుకు చేయలేదు? కులగణను బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తోంది? బీసీల దయనీయస్థితి అంకెల్లో అచ్చు గుద్దినట్టు బయటపడి వారిని వాడుకుంటూనే తాను వారిని ఎంతగా వంచిస్తున్నదో బహిర్గతమవుతుందనే భయంతోనే కదా!



బీజేపీ చరిత్రంతా రిజర్వేషన్ల వ్యతిరేక చరిత్రే. దశాబ్దాల క్రితం మండల్ నివేదిక అమలుకు తలపెట్టినప్పుడు చెలరేగిన రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం, మందిర్ ఆందోళన పరివార్ శక్తుల ప్రమేయంతో చెలరేగినవే కదా! సమ్మిళిత లక్షణంతో సెక్యులర్ సదాశయంతో వారి వారి అణగారినతనం ఆధారంగా హిందూయేతర మతస్థులలోని వారికీ రిజర్వేషన్ల కల్పనకు రాజ్యాంగం వీలు కల్పించింది. 2005లో యూపీఏ ప్రభుత్వం నెలకొల్పిన జస్టిస్ రాజిందర్ సచార్ కమిటీ దేశంలో ముస్లింలు దయనీయ స్థితిలో ఉన్నారనీ, వారికి విశేష స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనీ సిఫారసు చేసింది. ఇప్పుడు ముస్లింలకు అరకొరగా ఉన్న రిజర్వేషన్లను కూడా రద్దు చేస్తామని ప్రధాని మోదీ తన ఎన్నికల ప్రచార సభల్లో కఠోర స్వరంతో ప్రకటిస్తున్నారు. రాజ్యాంగ ధర్మాన్ని కాల రాస్తున్నారు. ఎక్కడికక్కడ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ దానికి హాని తలపెట్టబోమని అభయ హస్తం చాస్తున్నారు. ముస్లింల రిజర్వేషన్లను తెగనరుకుతానంటున్న బీజేపీ, ఆ తర్వాత వారికి దగ్గరగా ఉన్న ఎస్సీ, ఎస్టీల కోటాకు టాటా చెప్పాబోదనే హామీ ఎక్కడిది?

ఈ ఎన్నికల్లో తమ పార్టీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమికి లోక్‌సభలో 400 సీట్లు వస్తే రిజర్వేషన్లను తొలగిస్తామనీ, రాజ్యాంగాన్ని మారుస్తామనీ రాజస్థాన్ మంత్రి కిరోరీ లాల్ మీనా ప్రకటించినట్టు చూపించిన ఒక వీడియో గత నెలలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. బీజేపీ తన అభిమతాన్ని అధికారికంగా కాకుండా అనధికారిక మార్గాలలో వ్యక్తం చేస్తూ ఉంటుందనే అభిప్రాయం ఉంది. రిజర్వేషన్ల జోలికి వెళ్ళబోమనీ, అది తప్పుడు ప్రచారమనీ ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదే పదే చేస్తున్న ప్రకటనలను, ఇస్తున్న హామీలను నమ్మలేం. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ కూడా రంగ ప్రవేశం చేసి రిజర్వేషన్ల రద్దు జరగబోదని స్పష్టంగా ప్రకటించారు. అయితే గతంలో ఆయనొకసారి రిజర్వేషన్లను సమీక్షించాలని అన్నారు. 2015లో బిహార్ ఎన్నికలకు కొద్ది వారాల ముందు మాట్లాడుతూ రిజర్వేషన్ విధానంపై సామాజిక సమీక్ష జరగాలని ప్రకటించారు. దాని మీద వివాదం చెలరేగడంతో ఇతర పేద వర్గాలకు కూడా మేలు చేసే ఉద్దేశంతోనే ఆయన అలా అన్నారని వివరణ వచ్చింది. ఆచరణలో బీజేపీ పదేళ్ల పాలనలో రిజర్వేషన్లు కనుమరుగయ్యేలా ప్రైవేటైజేషన్ ముమ్మరించింది. సామాజికంగా, విద్యా విషయకంగా వెనుకబడిన బీసీలకు విధానపరంగా అది ఉపయోగపడింది శూన్యమే. బడుగులను కేవలం పేదలుగా, పైనుంచి నెలకు 5 కిలోల బియ్యం 'ముష్టి' వేస్తే అదే మహా ప్రసాదమని కళ్ళకు అద్దుకొనే వారుగా మాత్రమే బీజేపీ పరిగణిస్తూ ఉంది.

హిందూ కుల వ్యవస్థ దశాబ్దాలుగా అణగదొక్కగా చదువు, ఆత్మగౌరవం పిసరంతైనా అంటని బానిస బతుకులు బతికినవారికి పరిహారంగా రిజర్వేషన్లను కల్పించడాన్ని తాము నెత్తిన పెట్టుకునే సనాతన నీతికి అవమానమని వారు భావిస్తున్నారు. ఉదాహరణకు మహిళలపై గతంలో మోహన్ భాగవత్ వెలిబుచ్చిన అభిప్రాయాలను గమనించవచ్చు. 'పెళ్లి ఒక కాంట్రాక్టు అని ఈ ఒప్పందం ప్రకారం నువ్వు నా ఇంటి బాధ్యతలు నెరవేరిస్తే నీ అవసరాలాన్నిటినీ నేను తీరుస్తాను, నిన్ను భద్రంగా కాపాడుతాను అని భర్త భార్యకు చెబుతాడు, భార్య ఈ ప్రకారం నడుచుకున్నంత కాలం భర్త ఆమె బాధ్యత వహిస్తాడు, ఆమె ఈ కాంట్రాక్టును ఉల్లంఘిస్తే ఆమెను అతడు వదిలేయవచ్చు' అని ఆయన అన్నారు. గ్రామీణ భారతంలో రేప్‌లు తక్కువనీ, పట్టణాల్లో, నగరాల్లోనే ఎక్కువని కూడా అన్నారు. మహిళ అస్వతంత్రురాలుగా, పురుషుడి చేతుల్లో ఉండాలని ఆయన ప్రవచించారు. ఇటువంటి భావాలు గలవారి ఆధిపత్యంలో దేశం సెక్యులర్ రాజ్యాంగానికీ, రిజర్వేషన్లకూ స్వస్తి చెప్పి మనుస్మృతిని అమల్లోకి తెస్తుందనే భయాలు కలగడం సహజాతి సహజం.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కోల్పోయే స్థానాలు



మొదటి రెండు దశల్లో ఎన్డీయే తాను ఐదేళ్ల క్రితం గెలిచిన 111 సీట్లలో 20 కోల్పోయి ఉంటుంది. మూడో దశలో 94 స్థానాల్లో తనకున్న 80లో మరో 20 దాకా కోల్పోవచ్చు. కనబడని ఆధిక్యాన్ని నిలుపుకోవాలంటే, బీజేపీ దాని మిత్రపక్షాలు అద్భుతమైన సామర్థ్యాన్ని చూపవలసి ఉంటుంది.

– యోగేంద్ర యాదవ్, ఎన్నికల విశ్లేషకుడు

అర్థం కావట్లేదా?



అమెరికా జెండాను దహనం చేసే విద్యార్థులు మీ దగ్గర ఉండొచ్చు, వాళ్లు 'అమెరికాకు మరణం' అని స్లోగన్లు ఇస్తుండవచ్చు, పశ్చిమ దేశాల మీద తమ ద్వేషాన్ని బహిరంగంగానే బిగ్గరగా ప్రకటిస్తుండవచ్చు, అయినా జనం దీన్ని ఇంకా గాజా గురించే అనుకుంటున్నారు.

– కాన్‌స్టంటిన్ కిసిన్, సెటైరిస్ట్


మన మిఠాయిలు లేవా?



ఎందుకు భారతీయులు తమ పుట్టినరోజులను ప్రిజర్వేటివ్స్, కృత్రిమ ఫ్లేవర్లు, రంగులు ఉన్న కేకులతో జరుపుకొంటున్నారు? ఎందుకు మనం ఇంట్లో చేసిన ఖీర్, లడ్డూలు, ఇంకా సంప్రదాయ మిఠాయిలతో జరుపుకోం? సంప్రదాయ మిఠాయిలను 'తిరోగమనం'గా చూస్తూ, పాశ్చాత్య వంటకాలను నాగరికతగా భావిస్తున్నాం. మనం ఎప్పుడూ మానసిక బానిసలుగానే ఉంటున్నాం.

– సావిత్రీ ముముక్షు, డిజైనర్

ఇదో విపరీతం!



ఇండియా అడ్వర్టైజింగ్ చట్టాల విపరీతం చూడండి. ఒక ఐపీఎల్ సీజన్‌లో కింగ్‌ఫిషర్, టుబోర్గ్ వరుసగా తమ ప్రకటనలను ఇచ్చాయి. కానీ తన ప్రకటనలో 'బీరు' అనే మాటను వాడింది కేవలం పార్క్ ఎవెన్యూ బీర్ షాంపూ మాత్రమే.

– జాయ్ భట్టాచార్య, క్విజ్జర్

లూజరా? విన్నరా?



పొగతాగని వాళ్లు లూజర్లు అంటూ ఒక అమ్మాయి పోస్టు పెట్టడం చూశాను. ట్రిపుల్ బైపాస్ సర్జరీకి నేను పంపిన అత్యంత పిన్న వయస్కురాలు ఒక 23 ఏళ్ల స్మోకర్ అమ్మాయి. ఆమె మాటల్లో చెప్పాలంటే... లూజర్‌గా ఉన్నాసరే, ఆరోగ్యంగా జీవించండి.

– దీపక్ కృష్ణమూర్తి, కార్డియాలజిస్ట్

'ఆకస్' ప్రపంచ శాంతికి భంగకరం

సందర్భం



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

ఆకస్ (ఆస్ట్రేలియా, యునైటెడ్ కింగ్‌డమ్, యూఎస్) త్రైపాక్షిక భద్రతా కూటమిఇండో– పసిఫిక్ ప్రాంత సైనిక సాంకేతిక భాగస్వామ్యం కోసం 2021 సెప్టెంబర్ 15న ఏర్పడింది. ఈ ఒప్పందం ప్రకారం ఆస్ట్రేలియా అణుశక్తి జలాంతర్గాములను పొందడంలో అమెరికా, యూకేలు సాయపడాలి. సభ్య దేశాల సైనిక సామర్థ్యాల అభివృద్ధికి ఆకస్ పనిచేస్తుంది. ఇది ఘర్షణ, ఉద్రిక్తతలను పెంచుతుంది. శాంతికి విఘాతం కలిగిస్తుంది.

ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రభావాన్ని అరికట్టడం ఆకస్ లక్ష్యమని అమెరికా అధ్యక్ష భవనం నివేదిక అంటోంది. ఆకస్ ఐరోపా యూనియన్‌కు మేలుకొలుపనీ, ఐరోపా దేశాలు ఐక్యంగా ఉండాలనీ జర్మనీ హెచ్చరించింది. అధికార కేంద్రీకరణ, ఆయుధ పోటీకి దారితీస్తుందని ఇండోనేషియా చెప్పింది. ఆసియాలో సైనిక ఒత్తిళ్లను పెంచుతుందని మలేషియా పేర్కొనగా, మా అభిప్రాయాన్ని అడిగి ఉండాల్సిందని న్యూజిలాండ్ అన్నాయి. ఉత్తర కొరియా, రష్యాలు అణ్వాయుధ యుగంలో ఆకస్ హానికర మన్నాయి. ఇది ఫ్రెంచ్– ఆస్ట్రేలియా జలాంతర్గామి ఒప్పందాన్ని అంతం చేసింది. ఫ్రాన్స్ దీన్ని వెన్నుపోటుగా పేర్కొంది. 2021 సెప్టెంబర్ 17న ఆస్ట్రేలియా, అమెరికాల నుండి తన రాయబారులను విరమించుకుంది.

ఆకస్‌ను విస్తరించాలని దాని సభ్యదేశాలు ఆలోచిస్తున్నాయి. ఆకస్‌లో చేరాలని జపాన్, కెనడా ప్రయత్నిస్తున్నాయి. చారిత్రక, ఆచరణ కారణాల దృష్ట్యా, జపాన్ సైనిక, భద్రతా చర్యలను పొరుగు దేశాలు, అంతర్జాతీయ సమాజం నిశితంగా గమనిస్తున్నాయి. ఆకస్ విస్తరణ ఆసియా–పసిఫిక్ ప్రాంత శాంతి భద్రతలను దెబ్బతీస్తుందని చైనా రక్షణ శాఖ ప్రతినిధి ఉకియాన్ బీజింగ్‌లో ఏప్రిల్ 25న తెలిపారు.

అమెరికా–ఆస్ట్రేలియా–జపాన్–ఇండియాలతో ఏర్పడిన చతుర్భుజ భద్రతా సమూహం 'క్వాడ్', 13 దేశాలతో కలిసి 2022 మే 23న అమెరికా స్థాపించిన 'ఇండో–పసిఫిక్ ఆర్థిక చట్రం' ఇండో– పసిఫిక్ ప్రాంతాల్లో చైనా నిరోధానికి అమెరికా ఏర్పరచినవే. ఒక సభ్య దేశం కోసం మరొక సభ్య దేశం యుద్ధం చేయాలన్న షరతున్న నాటో సభ్యత్వం కోసం ఉక్రెయిన్‌ను నాటోలోకి లాగుతూ... అమెరికా, పశ్చిమ దేశాలు రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి కారణమయ్యాయి.

ఆస్ట్రేలియన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ ప్రకారం... అమెరికా డిప్యూటీ సెక్రటరీ ఆఫ్ స్టేట్ కర్ట్ క్యాంప్‌బెల్... ఆకస్ కింద పొందిన ఆస్ట్రేలియన్ అణు జలాంతర్గాములను అవసరమైతే తైవాన్ ద్వీపంపై ఏదైనా సైనిక వివాదంలో చైనాకు వ్యతిరేకంగా మోహరించవచ్చని సూచించారు. అంటే చైనా అనుమానాలు నిజమేనని స్పష్టమవుతోంది.

దేశాల మధ్య ఒప్పందాలు నిస్సైనికీకరణకు, శాంతి భద్రతలకు, యుద్ధ నివారణకు, దేశాల సార్వభౌమత్వ, సమైక్యత–సమగ్రతల రక్షణకు పనిచేయాలి. అంతే కాని దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యానికీ, వేర్పాటువాద చర్యల ప్రోత్సాహానికీ, అంతర్జాతీయ సత్సంబంధాల విచ్ఛిత్తికీ ఉపయోగపడరాదు.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి । 94902 04545

జగన్ ఒక నిజం... ఒక భావోద్వేగం

వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రవేశం చేసినప్పటి నుంచీ పది సంవత్సరాలు ఆటుపోట్లతో నడిచింది. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అకాల మరణం తరువాత రాజకీయంగా కాకలు తీరిన, కుట్రలు కుతంత్రాలు తెలిసిన నాయకులను ఎదిరించి ఒంటరిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. అప్పుడే ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్‌కు బీజం పడింది. తరువాతి కాలంలో సోనియా గాంధీ కుట్రలకు బలైపోయి పదహారు నెలలు జైలు జీవితం గడిపారు.

2017 జూలైలో తూర్పు గోదావరి జిల్లా, వైరా మండలం చాపరాయి గ్రామంలో పదహారు మంది ఆదివాసీలు విషజ్వరాలతో వైద్య సదుపాయం అందక మరణించిన విషయం తెలిసిందే. అప్పుడు జగన్ పది కిలోమీటర్లు అటవీ ప్రాంతంలో పోలీసు రక్షణ కూడా లేకుండా నడక దారిన వెళ్లి ఆ విషయాన్ని వెలుగులోకి తెచ్చి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టారు. పేదల పక్షాన శాసనసభలో గళం వినిపించారు. ఇక జగన్ రాజకీయ జీవితంలో మరువలేని ప్రధాన ఘట్టం ప్రజా సంకల్ప యాత్ర పేరుతో 3,648 కిలోమీటర్లు ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు నడిచిన పాదయాత్ర. ఈ పాదయాత్రలో జగన్ ప్రజలతో మమేకమై వారి కష్టాలు చూసి చలించి 'నేను చూశాను, నేను విన్నాను, నేను ఉన్నాను' అంటూ ప్రజలకు భవిష్యత్తుపై నమ్మకం కలిగించారు. ఆంధ్ర రాష్ట్రంలో ఒక బలమైన నిజాయితీ గల ప్రజానాయకుడిగా ఎదిగారు. 2019లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో 175 స్థానాల్లో 151 గెలిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా అశేష జనవాహిని మధ్య ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న యాభై ఎనిమిది నెలల పాలనా కాలంలో కరోనాతో 24 నెలలు ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకోవడంలోనే గడిచింది. మిగిలిన దాదాపు మూడు సంవత్సరాల కాలంలో తన మేనిఫెస్టోలోని పథకాల ద్వారా ప్రజల ఆర్థిక అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఈ పథకాల ద్వారా మహిళా సాధికారతకు అడుగులు పడ్డాయి. వై.ఎస్.ఆర్. చేయూత, ఆసరా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాలతో పేద ప్రజల బతుకులలో వెలుగులు ప్రసరించాయి. వడ్డీ లేని రుణాలు ఇప్పించడం వలన గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక పుష్టి కలిగింది. ఈ పథకాల అమలులో కులం, ప్రాంతం, మతం, వర్గం వివక్ష పాటించకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా తీసుకున్నారు.

ముప్పై ఒక్క లక్షల మంది నిరుపేద మహిళలకు జగన్ ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేసింది. అందులో ఇరవై ఎనిమిది వేల ఎనిమిది వందల కోట్లతో పదహారు లక్షల ఇల్లు... రోడ్లు, డ్రైనేజీ, నీటి వసతి, వీధి దీపాలు వంటి పూర్తి మౌలిక సదుపాయాలతో ఏర్పాటయ్యాయి. ఒక్కో ఇంటి విలువ స్థలంతో కలిపి పది లక్షలనుండి పదుహైదు లక్షల వరకు చేరి, పేదవారికి సొంత ఇంటి కల నెరవేరింది.



జగన్ సుపరిపాలనలో మరో ముందడుగు 2019 ఆగస్ట్ 15 నుంచి ప్రారంభమైన వలంటీర్ వ్యవస్థ. ఇక 2019 అక్టోబర్ 2న ప్రారంభించిన గ్రామ వార్డు సచివాలయాలు ఒక సువర్ణ అధ్యాయం. వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే పెన్షన్, బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతోంది. సచివాలయాల ద్వారా ప్రజలకు రెవెన్యూ రికార్డులు, జనన మరణ ధ్రువీకరణ పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, భూముల సర్వే సేవలు, ఆరోగ్యసేవలు ఏమాత్రం వ్యయ ప్రయాసలు లేకుండా, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా వేగవంతంగా లభిస్తున్నాయి. గ్రామ స్థాయిలో తెచ్చిన రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా రైతులకు కావలసిన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్ర సామగ్రి సేవలు మార్కెట్ కంటే తక్కువ ధరలకు అందుతున్నాయి.

వైద్య రంగంలో జగన్ ప్రభుత్వం తెచ్చిన గొప్ప మార్పు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు పైసా ఖర్చు లేకుండా అందించడం. నాడు నేడు పథకం కింద ప్రభుత్వ హాస్పిటల్స్‌ను ఆధునీకరించారు. మహానేత రాజశేఖర రెడ్డి ప్రారంభించిన ఆరోగ్య శ్రీ సేవల పరిమితిని రూ. ఇరవై ఐదు లక్షలకు పెంచారు. చికిత్స సేవలు 1,059 నుంచి 3,250 వరకు పెంచారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ప్రజలకు గడప గడపకు వైద్య సేవలు అందుతున్నాయి. ఇవి కాక శ్రీకాకుళం జిల్లాలో దశాబ్దాలుగా ఉద్దానం ప్రాంతంలో ఉన్న కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా వంశ ధార నది నుంచి 100 కిలో మీటర్లు పైప్‌లైన్ ద్వారా 807 గ్రామాలలోని ఏడు లక్షల మంది ప్రజలకు రక్షిత మంచి నీరు అందించడం జరుగుతోంది. పలాసలో జగన్ తన పాదయాత్రలో చెప్పిన మాట ప్రకారం 200 పడకల సూపర్ స్పెషాలిటీ మరియు కిడ్ని పరిశోధన హాస్పిటల్ నిర్మించడంతో అక్కడి ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందుతున్నాయి.

పేద పిల్లల అభివృద్ధికి విద్య అత్యవసరం అని జగన్ విశ్వసించారు. ఈ దిశగా జగన్ ప్రభుత్వం సమూల మార్పులు చేసింది. నాడు నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేసింది. విద్యార్థులకు గోరుముద్ద పేరున పౌష్టికాహారం లభిస్తోంది. పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా ఉన్న ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి వచ్చింది. వీటి వలన పేద విద్యార్థుల చేరిక శాతం పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులు ఐక్యరాజ్యసమితిలోని అధికారులతో స్థిరమైన ఆర్థికాభివృద్ధిపై చర్చలో పాల్గొనడం సామాన్యమైన విషయం కాదు.

పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిచ్చే సులభతర విధానంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో ఏపీకి రూ.32,800 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రాగా, ప్రస్తుత ప్రభుత్వంలో రూ.1.03 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. చిత్తూరు జిల్లా కోటర్ల పల్లె గ్రామం దగ్గర స్మార్ట్ డీవీ ప్రాజెక్ట్, అనకాపల్లి అచ్యుతాపురం దగ్గర టైర్ల తయారీ కంపెనీ, తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురం దగ్గర బిర్లా క్యాస్టిక్ సోడా యూనిట్, వైఎస్ఆర్ జిల్లా బద్వేల్ దగ్గర సెంచ్యురీ ప్యానల్స్ లాంటి పరిశ్రమలు వచ్చాయి. ఇంకా, అరబిందో, దివీస్ సంస్థల విస్తరణలతో కాకినాడ ఫార్మా యూనిట్‌గా ఎదుగుతోంది. విశాఖపట్నంలో ఇన్ఫోసిస్, విప్రో, భారత్ ఎలక్ట్రానిక్స్ తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. ఆంధ్ర రాష్ట్రానికి 972 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉన్నా కొత్తగా పోర్టులు గానీ, ఫిషింగ్ హార్బర్‌లు గానీ ఇదివరకు రాలేదు. ప్రస్తుతం జువ్వలదిన్నె, నిజాంపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్‌లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. వీటి వలన మత్స్యకార కుటుంబాల వారు చేపల వేటకు గుజరాత్ తీర ప్రాంతానికి వలసలు పోనవసరం లేదు.

ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో పేద ప్రజలకోసం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నారు. తన ప్రభుత్వం వలన తమ కుటుంబాలకు మంచి జరిగితేనే తనకు తోడుగా నిలవమని అడుగుతున్నారు. జగన్ ఒక సంఘ సంస్కర్తగా, ప్రజారంజక పాలకుడిగా పేరు పొందిన మాట వాస్తవం. ప్రజలతో జగన్ బంధం భావోద్వేగాలతో ముడిపడి ఉంది. అందుకే సిద్ధం యాత్రలో లక్షలాది మంది పిల్లలు, యువతీ యువకులు, వృద్ధులు, మహిళలు ఎర్రటి ఎండల్లో కూడా జగన్ కోసం నిరీక్షిస్తున్నారు. ఆయన కనబడితే కేరింతలు కొడుతూ జై జగన్ అని నినాదాలు చేస్తున్నారు. ఇవి జగన్ విజయానికి సంకేతాలు.

– అమూరు రాఘవరెడ్డి । జె.డి.ఎస్.డబ్ల్యూ. (రిటైర్డ్),
– జి.సాంబశివారెడ్డి । రిటైర్డ్ ప్రిన్సిపల్, యోగి వేమన యూనివర్సిటీ, కడప

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** అమావాస్య ఉ.8.55 వరకు, తదుపరి వైశాఖ శు.పాడ్యమి, **నక్షత్రం:** భరణి ప.2.02 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.1.34 నుండి 3.05 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.29 నుండి 12.20 వరకు, **అమృత ఘడియలు:** ఉ.9.28 నుండి 10.44 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.17.

క్లుప్తంగా...

నిలిచిన విద్యుత్.. ఆలస్యంగా ఎంసెట్

- అదనపు సమయమిచ్చిన అధికారులు
- విషయం తెలియక రోడ్డుపై తల్లిదండ్రుల రాస్తారోకో



రాజీవ్ రహదారిపై నిరసన చేపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

తిమ్మాపూర్: ఎంసెట్ కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగిన ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో చోటు చేసుకుంది. తిమ్మాపూర్‌లోని వాగేశ్వరి కళాశాలలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఎంసెట్ (అగ్రికల్చర్) పరీక్ష ప్రారంభమైంది. సాయంత్రం 4 గంటల సమయంలో ఒక్కసారిగా భారీ వర్షంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే కేంద్రం నిర్వాహకులు, అధికారులు జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. అప్పటికే గంట ఆలస్యమైంది. దీంతో పరీక్ష నిలిచిపోయింది. ఆ గంట సమయానికి అదనంగా మరో అరగంట సమయం ఇచ్చి విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. అయితే పిల్లల కోసం బయట వేచి ఉన్న తల్లిదండ్రులకు లోపల ఏం జరిగిందనే విషయం తెలియక పరీక్షా కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. విద్యార్థులు కాస్త ఆలస్యంగా బయటకు వస్తారని కేంద్రం సిబ్బంది చెప్పినా వినిపించుకోకుండా రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేశారు. తీరా విద్యార్థులు బయటకు వచ్చాక తమకు ఎలాంటి ఇబ్బందీ కాలేదని, ఆలస్యమైన సమయాన్ని తిరిగి అధికారులు ఇచ్చారని తల్లిదండ్రులకు వివరించారు. దీంతో రాస్తారోకోను విరమించారు. అయితే ఈ ఆందోళనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అకారణంగా రాస్తారోకో చేసిన తల్లిదండ్రులపై కేసు పెట్టాలని కొందరు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళా మోర్చాలో పలువురి నియామకం



సాక్షి, హైదరాబాద్: బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్య వర్గ సభ్యులుగా పలువురు నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నియమితులైన వారిలో.. బి.మాధవి, టి.సుజాత, రేణుక ముదిరాజ్, పద్మ దేవరకొండ, పి.అలి వేలు, కె.రాజరాజేశ్వరి, సీహెచ్ ఇందిర, రజిని రెడ్డి, పి.పద్మ, కె.స్వర్ణలత, జి.మనీల శాంతి, జి.మంజులా రెడ్డి, జె.అంజలి ఉన్నారు. ఈ వివరాలను మంగళవారం మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

'శ్రవణ్ సస్పెన్షన్‌ను ఖండిస్తున్నాం'



సాక్షి,హైదరాబాద్: కోరుట్ల ఆసుపత్రిలో డాక్టర్ శ్రవణ్‌ను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీటీజీడీఏ ప్రధాన కార్యదర్శి కిరణ్ మాదల తెలిపారు. విధి నిర్వహణలో జరిగిన దానికి విచారణ చేయకుండా, వ్యక్తిగత వివరణ తీసుకోకుండానే వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ సస్పెండ్ చేశారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోకపోతే అన్ని వైద్య సంఘాలతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. ఇలాంటి చర్యలతో మారుమూల ప్రాంతాల్లో పనిచేయడానికి వైద్యులు ముందుకురారని కిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ కంటే ఏపీలో ఫీజులు తక్కువ

- పేదలకు భారంగా మారిన ఫీజులను తగ్గించాలి: ఐఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు నాగరాజు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పేద విద్యార్థులకు భారంగా మారిన ఫీజులను తగ్గించి వారిని ఆదుకోవాలని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ (ఐఎస్‌యూ) జాతీయ అధ్యక్షుడు పావని నాగరాజు కోరారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఇంజనీరింగ్ ఫీజు కనిష్టంగా రూ.35 వేలు, గరిష్టంగా రూ.70 వేలుగా ఉంటే, తెలంగాణలో కనిష్టంగా రూ.45 వేలు, గరిష్టంగా రూ.లక్షన్నర ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో పీజీ, బీఈడీ, లా, ఇంజనీరింగ్.. వంటి ఉన్నత చదువుల కోసం పేదలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా మనకంటే తక్కువ ఫీజులున్న విషయాన్ని గుర్తించాలని కోరారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో భారీగా ఫీజులు పెంచిందని, ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించి ఫీజులు తగ్గించాలని కోరారు.

ఈఏపీ సెట్ షురూ

తొలిరోజు ప్రశాంతం
- తగ్గిన హాజరు..90 శాతమే పరీక్షకు
- కెమిస్ట్రీ మోడరేట్
- బాటనీ, జువాలజీ ఈజీగానే ఉందన్న విద్యార్థులు
- నేడు అగ్రి, ఫార్మసీ సెట్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ (టీఎస్‌ఈఏపీ సెట్) మంగళవారం మొదలైంది. తొలి రోజు జరిగిన పరీక్షకు 90.41 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 7, 8 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించిన సెట్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 9 నుంచి 11 వరకూ ఇంజనీరింగ్ సెట్ ఉంటుంది. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి మొత్తం 1.43 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. కంప్యూటర్ బేస్డ్‌గా జరిగిన ఈ పరీక్షను ఉదయం, సాయంత్రం నిర్వహించారు. ఈ రెండు పూటలకు కలిపి 33,500 మంది హాజరవ్వాల్సి ఉంది. అయితే, 30,280 (90.41%) మంది హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా తొలిరోజు పరీక్ష జరిగిందని ఈఏపీ సెట్ కో-కన్వీనర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. ఒక్క నిమిషం నిబంధన విధించినప్పటికీ విద్యార్థులకు ఇబ్బంది కలగలేదని వెల్లడించారు. వేసవి తీవ్రను దృష్టిలో ఉంచుకుని పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించామని, అన్ని చోట్ల సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించిన సెట్ బుధవారం కూడా జరుగుతుంది.



ఫిజిక్స్ కాస్త టఫ్

ఈఏపీ సెట్‌లో ఫిజిక్స్ విభాగం నుంచి కఠిన ప్రశ్నలు వచ్చినట్టు విద్యార్థులు తెలిపారు. సిలబస్ నుంచే ఇచ్చినప్పటికీ సమాధానాలు డొంక తిరుగుడుగా ఉన్నాయని హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి నీలేష్ తెలిపారు. కఠినమైన ఫిజిక్స్ చాప్టర్స్ నుంచి వచ్చిన ప్రశ్నలకు సమాధానం రాయడానికి ఎక్కువ సమయం పట్టిందని, కొన్ని లెక్కలు వేయడం వల్ల ఇతర సబ్జెక్టులకు సమయం సరిపోలేదని వరంగల్‌కు చెందిన ప్రజ్ఞ చెప్పారు. కెమిస్ట్రీ పేపర్ మధ్యస్థంగా ఉన్నట్టు ఎక్కువ మంది విద్యార్థులు తెలిపారు. ఆర్గానిక్, ఇనార్గన్ చాప్టర్ల నుంచి కొంత ఇబ్బంది పెట్టే ప్రశ్నలు వచ్చినా, ఇతర చాప్టర్లు తేలికగానే ఉన్నాయన్నారు. కాగా, మూలకాల విశ్లేషణపై పట్టున్న విద్యార్థులకు కెమిస్ట్రీ తేలికగానే ఉంటుందని రసాయన శాస్త్ర నిపుణులు వినోద్ త్రిపాఠీ తెలిపారు. అయితే, ఆప్షన్స్‌లో సమాధానాలు ఒకదానితో ఒకటి పోలినట్టే ఉండటం వల్ల విద్యార్థులు సరైన ఆన్సర్ ఇవ్వడానికి కష్టపడాల్సి వచ్చిందని మరో రసాయన శాస్త్ర అధ్యాపకుడు బీరేందర్ వర్మ అభిప్రాయపడ్డారు. బాటనీ, జువాలజీ సబ్జెక్టుల నుంచి ప్రిపేర్ అయిన ప్రశ్నలే వచ్చినట్టు మెజారిటీ విద్యార్థులు తెలిపారు. మొత్తం మీద జువాలజీ, బాటనీ సబ్జెక్టుల్లో ఎక్కువ స్కోర్ చేసే వీలుందని అధ్యాపకులు చెబుతున్నారు. గత ఐదేళ్ల ఎంసెట్ పేపర్లు ప్రిపరేషన్‌కు తీసుకుని ఉంటే ఎక్కువ మార్కులు సాధించే వీలుందని బాటనీ లెక్చరర్ శ్రుతి తెలిపారు.

మేడిగడ్డకు ఇంకా గండమే!

- బ్యారేజీకి మరింత ముప్పును తోసిపుచ్చలేమన్న నిపుణుల కమిటీ
- తాత్కాలిక చర్యలను సిఫార్సు చేస్తూ మధ్యంతర నివేదిక
- నివారణ చర్యలు తీసుకున్నా తాత్కాలికమేనని వెల్లడి
- మూడు బ్యారేజీల గేట్లన్నీ ఎత్తి ఉంచాల్సిందేనని సూచన


సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాక్ వద్ద ప్రస్తుతం చేపట్టే ఎలాంటి చర్యలైనా తాత్కాలికమేనని.. మరింత దెబ్బతినకుండా ఉండటాకేనని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ పేర్కొంది. 7వ బ్లాక్ మరింత ప్రమాదానికి లోనయ్యే అవకాశాలను తోసిపుచ్చలేమని పేర్కొంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై నీటి ఒత్తిడి పడకుండా.. వర్షాకాలం ప్రారంభానికి ముందే అన్ని గేట్లను పూర్తిగా పైకి ఎత్తి ఉంచాలని.. బ్యారేజీల దిగువన కొట్టుకుపోయిన సీసీ బ్లాకులు, అప్రాన్లను పునరుద్ధరించాలని సూచించింది. మేడిగడ్డలో మొరాయించిన గేట్లను అవసరమైతే తొలగించాలని స్పష్టం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల్లోని లోపాలపై అధ్యయనం చేసి, పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేయడానికి 'నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ)' అయ్యర్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ కమిటీ పరిశీలన జరిపి.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు అత్యవసరంగా చేపట్టాల్సిన తాత్కాలిక మరమ్మతులు, తదుపరి అధ్యయనాలను సిఫారసు చేస్తూ మధ్యంతర నివేదిక సమర్పించింది. ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్ ఈ నెల 1న రాష్ట్ర నీటిపారుదల శాఖకు ఈ నివేదికను పంపించారు.

కుంగిపోయిన 7వ బ్లాక్‌కు సంబంధించి చేసిన సూచనలివీ..

- పియర్లు, ర్యాఫ్ట్ ఫ్లోర్‌కు ఏర్పడిన పగుళ్లలో వచ్చే మార్పులను టెల్-టేల్స్ వంటి తగిన సాంకేతిక పరిజ్ఞానంతో నిరంతరం సమీక్షిస్తూ ఉండాలి.
- 16 నుంచి 20వ నంబర్ వరకు పియర్లు స్వల్పంగా ఒరిగిపోవడం/ పగుళ్లు ఏర్పడటం జరిగింది. ఆ పగుళ్లు మరింత చీలకుండా తగిన రీతిలో బ్రేసింగ్ చేయాలి. అవసరమైతే బాక్స్ గ్రిడ్డర్, లాటిస్ గ్రిడ్డర్/ట్రస్ వంటిని వాడవచ్చు.
- బ్యారేజీ పునాదిలోని ప్రెషర్ రిలీజ్ వాల్వ్స్ దెబ్బతిన్నాయి. మరమ్మతులైనా చేయాలి, కొత్తవైనా ఏర్పాటు చేయాలి.
- బ్లాక్-7లోని అన్ని పియర్లపై ఆప్టికల్ టార్గెట్ పరికరాలను ఏర్పాటు చేసి, మార్పులను సమీక్షిస్తూ ఉండాలి.
- ఎగువ, దిగువ సెకెంట్ పైల్స్, ఎగువ, దిగువ పారామెట్రిక్ జాయింట్ల పరిస్థితిని సమగ్రంగా మదించాలి.
- దెబ్బతిన్న ప్లింత్ శ్లాబును తొలగించి నదీ గర్భాన్ని సరిచేయాలి. బ్యారేజీ కింద ఇసుక కొట్టుకుపోకుండా చూసే ఇన్వర్టెడ్ ఫిల్టర్లను తగిన ప్రాంతంలో ఏర్పాటు చేయాలి.
- 7వ బ్లాక్‌కు దిగువన నదీ గర్భంలో షీట్‌పైల్స్‌ను 9 మీటర్ల లోతు వరకు ఏర్పాటు చేయాలి. ర్యాఫ్ట్ చివరి కొన, ప్లింత్ శ్లాబు, షీట్‌పైల్ ఉపరితల భాగం మధ్యలో సిమెంట్, ఇసుక మిశ్రమంతో సీల్ వేసినట్టు జాయింట్లు వేయాలి.
- ర్యాఫ్ట్‌కు సాధ్యమైనంత తక్కువ సంఖ్యలో రంధ్రాలు చేసి... దాని దిగువన ఏర్పడిన ఖాళీల్లోకి ఇసుక, సిమెంట్, నీటి మిశ్రమాన్ని పంపి పూడ్చివేయాలి.

మేడిగడ్డను పరిశీలించిన విచారణ కమిషన్!

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ (లక్ష్మి) కుంగిపోయిన అంశంపై ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ మంగళవారం.. మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించారు. ఆయన రాష్ట్ర ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్‌తో కలసి మంగళవారం మధ్యాహ్నం 1.40 గంటలకు బ్యారేజీకి వద్దకు చేరుకున్నారు. బ్యారేజీ 7వ బ్లాక్‌లో కుంగిన 20వ నంబర్ పియర్.. దానికి అటూఇటూ ఉన్న 19, 21 పియర్లను.. వాటి కింది భాగంలో వచ్చిన పగుళ్లను పరిశీలించారు. వంతెనపై కాలినడకన వెళ్లి చూశారు. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న పరిస్థితులు, పియర్ల కుంగుబాటు, ఇతర అంశాలపై ఇరిగేషన్ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. తర్వాత ఎల్అండ్‌టీ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. భోజనం చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై విచారణ కోసం వచ్చినట్టు తెలిపారు. ఇరిగేషన్ నిపుణులతో కలసి మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించామని, ఇందుకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ బృందం ఇచ్చిన నివేదికలను స్టడీ చేయాల్సి ఉందన్నారు. తాను ఇంజనీర్‌ను కాదని, టెక్నికల్ టీం వాటిని పరిశీలిస్తుందని వివరించారు.



మేడిగడ్డ బ్యారేజీపై నుంచి కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్

నేను పార్టీ మారడం లేదు



- రేవంత్‌ను గతంలో మర్యాద పూర్వకంగానే కలిశా
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను ఖండిస్తున్నానని, భవిష్యత్‌లోనూ కేసీఆర్‌తోనే ఉంటానని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలు నాగేందర్‌గౌడ్, పురుషోత్తంలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గతంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశానని, పార్టీ మారడంలేదని తేల్చి చెప్పారు. సామాజిక న్యాయం పాటించడంలో బీఆర్ఎస్ ఎప్పుడు ముందు వరసలో ఉంటుందన్నారు. ఆరు లోక్‌సభ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ తరఫున బీసీ అభ్యర్థులు బరిలో ఉన్నారని, బీసీలకు ఎక్కువ సంఖ్యలో సీట్లు కేటాయించిన బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. చేవెళ్లలో బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ బలహీన వర్గానికి చెందినవారని, ఆ స్థానంలో బీఆర్ఎస్ మాత్రమే బీసీలకు టికెట్ ఇచ్చిందని చెప్పారు. బీసీలను కించపరుస్తూ కాంగ్రెస్ నేత మోహన్‌రెడ్డి వీడియో పెట్టారని, దీన్ని బీసీలు సవాల్‌గా తీసుకుని సత్తా చాటాలని కోరారు.

'రాజ్యాంగం రద్దు'పై పీఎం స్పష్టతనివ్వాలి

- రిజర్వేషన్లు ఎత్తివేస్తే దేశం అగ్ని గుండమే
- 'రాజ్యాంగ రక్షణ-రిజర్వేషన్ల పరిరక్షణ' సదస్సులో వక్తలు



అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న దాసు సురేశ్, రాపోలు ఆనంద భాస్కర్, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

సనత్‌నగర్: రాజ్యాంగాన్ని రద్దు చేస్తారన్న చర్చను ప్రతిపక్షాలు నేడు జాతీయ వ్యాప్తంగా కొనసాగిస్తున్న నేపథ్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఆందోళన చెందుతున్నారని, దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపైన, ప్రధాని మోదీపైన ఉందని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. 'రాజ్యాంగ రక్షణ-రిజర్వేషన్ల పరిరక్షణ' అంశంపై మంగళవారం బేగంపేటలోని ఓ హోటల్‌లో అఖిలపక్ష సమావేశం జరిగింది. బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, రాజ్యాంగ నిపుణులు జస్టిస్ చంద్రకుమార్, ప్రముఖ రాజనీతి విశ్లేషకులు ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఎమ్మెల్యేలు శ్రీరాములు, ఇరావత్రి అనిల్, సమాజ్‌వాదీ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బాల మల్లేశ్, ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, సామాజిక వేత్త వీజీఆర్ నారగొని, ప్రొఫెసర్ గాలి వినోద్, బీసీ రాజ్యాధికార సమితి మహిళా అధ్యక్షురాలు బోనం ఊర్మిళ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రిజర్వేషన్లు ఎత్తేస్తే దేశం అగ్నిగుండం అవుతుందన్నారు. అట్టడుగు వర్గాల అవకాశాల్ని హరిస్తే చూస్తూ ఊరుకోమనీ, తమ మనుగడ ప్రశ్నార్థకమైతే ఆయా వర్గాల ప్రజలే మానవ బాంబులమవుతారని హెచ్చరించారు. అట్టడుగు వర్గాలకు రాజ్యాంగ ఫలాలు అందకముందే రిజర్వేషన్లు ఎత్తేస్తే ఎలా..? అని ప్రశ్నించారు. ఇప్పటికే అస్తవ్యస్తంగా కొనసాగుతున్న రిజర్వేషన్ వ్యవస్థ వల్ల దేశంలోని బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని ఆవేదన వ్యకం చేశారు.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరి దుర్మరణం



బోల్తా పడిన ట్రాక్టర్ కింద యువకుల మృతదేహాలు

మల్లాపూర్: ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌తోపాటు మరో యువకుడు దుర్మరణం పాలైన సంఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట శివారులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం...ముత్యంపేటకు చెందిన తెలు నరేశ్ వద్ద అదే గ్రామానికి చెందిన గొండ రాజేశ్(24) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాజేశ్‌ను మామిడితోటలోకి మట్టి తీసుకురావాలని పంపించాడు. దీంతో ఆయన స్నేహితుడు, హుస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన షేక్ హైమద్ (18)ను వెంట తీసుకెళ్లాడు. ఎస్సారెస్పీ డీ-29 కాలువ దాటి వెళుతుండగా, ట్రాక్టర్ అదుపుతప్పి కెనాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న ఇద్దరు కిందపడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముత్యంపేట, హుస్సేన్‌నగర్ గ్రామస్తులు పెద్దసంఖ్యలో అక్కడి చేరుకున్నారు. మృతదేహాలను చూసి కుటుంబసభ్యులు, బంధువులు విలపించారు. మెట్‌పల్లి సీఐ నవీన్, మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. క్రేన్ సహాయంతో ట్రాక్టర్‌తోపాటు మృతదేహాలను బయటకు తీశారు. రాజేశ్‌కు తల్లి మెస్రం సావిత్రి ఉంది. షేక్ హైమద్‌కు తల్లిదండ్రులు, ఓ సోదరుడు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. హైమద్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బెయిల్ ఇస్తే ఫైళ్లపై సంతకాలు చేయొద్దు

ముఖ్యమంత్రిగా అధికారిక విధులు నిర్వర్తించవద్దు

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో తన పార్టీ అభ్యర్థుల విజయం కోసం ప్రచారం చేయాలని భావించిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆశ నెరవేరలేదు. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టై ప్రస్తుతం తిహార్ జైలులో ఉన్న కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ లభించలేదు. తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది. తొలుత కేజ్రీవాల్ తరఫున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ సింఘ్వీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు వినిపించారు. ఎన్నికల ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ కోరడం సరైంది కాదని మెహతా వాదించారు. ''ఇలాంటి వాటికి కూడా బెయిల్ ఇస్తే రాజకీయ నాయకులను ప్రత్యేక తరగతిగా పరిగణించినట్లు అవుతుంది. ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయి. రేపు ఓ రైతు తనకు పంట కోతలున్నాయంటూ మధ్యంతర బెయిల్ కోరవచ్చు. అందుకే రాజకీయ నాయకులకు మినహాయింపులు ఉండొద్దు. నిందితుడు సీఎం అయినంత మాత్రాన ఈ కేసును ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదు. కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వొద్దు'' అని సుప్రీంకోర్టును కోరారు. ధర్మాసనం స్పందిస్తూ ఒక పార్టీ అధినేతగా లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేయాల్సిన అవసరం కేజ్రీవాల్‌కు ఉందని అభిప్రాయం వ్యక్తం చేసింది. ''ఇది నిజంగా అసాధారణ పరిస్థితి. కేజ్రీవాల్ ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి. తరచూ నేరాలు చేసే వ్యక్తి కాదు. ఐదేళ్లకోసారి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేసే అవసరం ఆయనకు ఉంది. ఈ కేసులో ఒకవేళ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తే ముఖ్యమంత్రిగా అధికారిక విధులు నిర్వర్తించేందుకు మేము అనుమతించం. అలా చేయడం విరుద్ధ ప్రయోజనాలకు దారి తీస్తుంది. అందుకే బెయిల్‌పై విడుదలైతే అధికారిక ఫైళ్లపై సంతకాలు చేయొద్దు'' అని స్పష్టం చేసింది. అభిషేక్ సింఘ్వీ స్పందిస్తూ కేజ్రీవాల్ బెయిల్‌పై బయటకు వెళ్లినా ఎలాంటి ఫైళ్లపై, పత్రాలపై సంతకాలు చేయబోరని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై తీర్పును వాయిదా వేసింది. బుధవారం లేదా గురువారం లేదా శుక్రవారం.. ఎప్పుడైనా సరే దీనిపై తమ నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడించింది. మరోవైపు మనీ లాండరింగ్ కేసులో



తనను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌పై కూడా ధర్మాసనం విచారణ జరిపింది. దర్యాప్తులో జరుగుతున్న జాప్యంపై అసహనం వ్యక్తం చేసింది. ధర్మాసనం ఆదేశాల మేరకు, కేజ్రీవాల్ అరెస్టుకు ముందునాటి ఫైళ్లను అధికారులు కోర్టుకు సమర్పించారు.

మూడో దశలో 63.53% పోలింగ్

స్వల్ప ఘర్షణలు మినహా ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్

11 రాష్ట్రాలు, యూటీల్లోని 93 స్థానాలకు పూర్తయిన పోలింగ్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల మూడో దశలో 93 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో మంగళవారం రాత్రి 10 గంటల వరకు 63.53 శాతం పోలింగ్ నమోదైంది. పశ్చిమబెంగాల్‌లో జరిగిన స్వల్ప ఘర్షణలు, చెదురుముదురు ఘటనలు మినహా అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నిర్ణీత పోలింగ్ సమయం సాయంత్రం ఆరులోపు క్యూ లైన్లలో నిల్చున్న వారినీ ఓటేసేందుకు అనుమతించారు. దాంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశముందని కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించింది. అస్సాంలో అత్యధికంగా 79.79 శాతం, ఉత్తరప్రదేశ్‌లో అత్యల్పంగా 57.34 శాతం పోలింగ్ నమోదైంది. ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో కాస్తంత మెరుగ్గా 57.62 శాతం పోలింగ్ నమోదవడం గమనార్హం. పశ్చిమబెంగాల్‌లో పోలింగ్‌బూత్ వద్ద ఘర్షణలు, ఓటర్లను మభ్యపెట్టడం, బూత్ ఏజెంట్లపై దాడులపై టీఎంసీ, బీజేపీ, కాంగ్రెస్–సీపీఐ(ఎం)లు విడివిడిగా ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నాయి. ముర్షీదాబాద్, జాంగీపూర్ స్థానాల నుంచి ఈసీకి ఉదయం 9లోపే 180కిపైగా ఫిర్యాదులందాయి. కొన్ని చోట్ల టీఎంసీ, సీపీఎం కార్యకర్తలు ఘర్షణకు దిగారు. గుజరాత్‌లోని బనస్కాంతా నియోజకవర్గంలో బీజేపీ కార్యకర్తలు సీఆర్‌పీఎఫ్ జవాన్లలా వచ్చి పోలింగ్‌బూత్ వద్ద ఓటర్లను మభ్యపెట్టారన్న ఉదంతంలో కలెక్టర్ దర్యాప్తునకు ఆదేశించారు.

గుజరాత్‌లో ఓటేసిన ప్రధాని మోదీ

సొంత రాష్ట్రం గుజరాత్‌లో ప్రధాని మోదీ ఓటేశారు. గాంధీనగర్ నియోజకవర్గంలోని అహ్మదాబాద్ నగరంలో ఉన్న నిషాన్ పబ్లిక్ స్కూల్‌లో ప్రధాని మోదీ ఓటేశారు. గాంధీనగర్ బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి అమిత్ షా పోలింగ్ బూత్ వద్ద మోదీకి స్వాగతం పలికారు. ఇదే పోలింగ్‌బూత్‌లో ఓటు ఉండటంతో మోదీ అన్నయ్య సోమాభాయ్ మోదీ సైతం అక్కడికొచ్చారు. దీంతో ఆయన ఆశీర్వాదం తీసుకునే మోదీ ఓటేశారు. ఉదయాన్నే ఓటేసేందుకు వచ్చిన ప్రధానిని కలిసేందుకు ఓటర్లు ఎగబడ్డారు. అమిత్ షా సైతం ఇదే అహ్మదాబాద్‌లో మరో చోట ఓటేశారు. ' అన్ని నియోజకవర్గాల్లో వయోబేధంలేకుండా ఓటర్లంతా ఎన్‌డీఏ, అభివృద్ధి అజెండాపై నమ్మకం ఉంచారు. ఇండియా కూటమి వేగంగా నీరుగారిపోతోంది. ఓటుబ్యాంక్ రాజకీయాలకు స్వస్తిపలికి ఆర్థికాభివృద్ధికి జై కొట్టిన ఓటర్లకు కృతజ్ఞతలు' అని ఓటేశాక మోదీ 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు.



గువాహటిలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఓటర్లు

రాష్ట్రం	పోలింగ్ శాతం
గుజరాత్	57.62
కర్ణాటక	70.03
మహారాష్ట్ర	61.44
ఉత్తరప్రదేశ్	57.34
మధ్యప్రదేశ్	66.05
ఛత్తీస్‌గఢ్	70.05
బిహార్	58.16
అస్సాం	79.79
బెంగాల్	73.96
గోవా	75.13
దాద్రానగర్, హవేలీ, దయ్యూడామన్	68.89

282 స్థానాల్లో పోలింగ్ పూర్తి

అమిత్ షా(గాంధీనగర్), జ్యోతిరాదిత్య సింధియా(గుణ), మన్‌సుఖ్‌మాండవీయ(పోర్‌బందర్), పురుషోత్తం రూపాలా(రాజ్‌కోట్), ప్రహ్లాద్ జోషి(ధార్వాడ్), ఎస్పీ సింగ్ బఘేల్(ఆగ్రా) పోటీచేస్తున్న స్థానాల్లోనూ మంగళవారం పోలింగ్ పూర్తయింది. గుజరాత్‌లోని సూరత్‌ను బీజేపీ ఏకగ్రీవంగా గెల్చుకోవడంతో మిగతా 25 స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరిగింది. కర్ణాటకలో 14, మహారాష్ట్రలో 11, ఉత్తరప్రదేశ్‌లో 10, ఛత్తీస్‌గఢ్‌లో 7, బిహార్‌లో 5, అస్సాం, పశ్చిమ బెంగాల్‌లో చెరో 4, గోవాలో 2, దాద్రానగర్ హవేలీ, డయ్యూ డామన్‌లో రెండు స్థానాలకు పోలింగ్ జరిగింది. మంగళవారం పోలింగ్ జరిగిన గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని మెజారిటీ స్థానాలను 2019లో బీజేపీ కైవసం చేసుకుంది. మూడో దశ పోలింగ్ ముగియడంతో మొత్తం 543 స్థానాలకుగాను ఇప్పటిదాకా 282 స్థానాలకు పోలింగ్ పూర్తయింది. తొలి దశలో 66.14 శాతం, రెండో దశలో 66.71 శాతం పోలింగ్ నమోదైంది.

మెజారిటీ కోల్పోయిన హరియాణా బీజేపీ సర్కార్

చండీగఢ్: హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం అసెంబ్లీలో మెజారిటీ కోల్పోయింది. ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు మంగళవారం చేసిన ప్రకటన నాయబ్ సింగ్ సైనీ ప్రభుత్వాన్ని మైనారిటీలో పడేసింది. సోమ్‌బీర్ సంగ్వాన్, రణ్‌ధీర్ సింగ్, ధరంపాల్‌లు మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు గవర్నర్‌కు లేఖ రాశారు. కాంగ్రెస్ పక్షంలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. సైనీ ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఇలా ఉండగా, 90 మంది సభ్యుల అసెంబ్లీ ప్రస్తుత బలం 88. ఇందులో బీజేపీకి 40, కాంగ్రెస్‌కు 30, జేజేపీకి 10 మంది సభ్యులున్నారు. బీజేపీ ప్రభుత్వానికి వేరే ఇద్దరు స్వతంత్రులు తాజాగా మద్దతు పలకడంతో మరో ముగ్గురు సభ్యులు తక్కువయ్యారు. హరియాణా అసెంబ్లీకి వచ్చే అక్టోబర్‌లో ఎన్నికలు జరగాల్సి ఉంది.

కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 20వ తేదీ వరకూ పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా ఉత్తర్వులు జారీ చేశారు. కేజ్రీవాల్ కస్టడీ ముగియడంతో అధికారులు మంగళవారం ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. ఇదే కేసులో అరెస్టయిన మరో నిందితుడు చన్‌ప్రీత్ సింగ్ జ్యుడీషియల్ కస్టడీని సైతం న్యాయమూర్తి ఈ నెల 20 దాకా పొడిగించారు.

నేతల ఓటు మురిపెం

ముద్దు చేస్తూ..



అహ్మదాబాద్‌లోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద చిన్నారిని ఎత్తుకున్న ప్రధాని మోదీ

మేమిద్దరం



అహ్మదాబాద్‌లోని ఓ పోలింగ్ బూత్ వెలుపల భార్య సొనాల్‌తో అమిత్ షా

మేము సైతం



కర్ణాటకలోని కలబురగిలో ఖర్గే, రాధాభాయి దంపతులు

కుటుంబ సమేతం



యూపీలోని ఈటావాలో భార్య డింపుల్, కూతురు అదితితో అఖిలేశ్ యాదవ్

మేమూ వేశాం



భోపాల్‌లో దిగ్విజయ్ సింగ్, భార్య అమృతా సింగ్

పుతిన్ ఐదోసారి ప్రమాణం

మాస్కో: రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ ఐదోసారి ప్రమాణం చేశారు. మంగళవారం క్రెమ్లిన్ ప్రాసాదంలో 2,500 మంది ముఖ్య అతిథుల సమక్షంలో పుతిన్ రష్యా రాజ్యాంగంపై ప్రమాణం చేశారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ..అన్ని అడ్డంకులను అధిగమిస్తూ ఐక్యంగా ఉంటూ లక్ష్యాలను అధిగమించి, విజయాలను అందుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమానికి అమెరికా నటుడు స్టీవెన్ సీగల్ వంటి పలువురు సెలబ్రిటీలు హాజరయ్యారు. అయితే, అమెరికా, యూకే, జర్మనీ దౌత్యవేత్తలు గైర్హాజరయ్యారు. అంతకుముందు పుతిన్ 30 గన్ సెల్యూట్ స్వీకరించారు. క్రెమ్లిన్ కేథడ్రల్ స్క్వేర్ వద్ద ప్రెసిడెన్షియల్ రెజిమెంట్ పరేడ్‌ను తిలకించారు. దగ్గర్లోని అనన్షియేషన్ కేథడ్రల్‌లో రష్యన్ ఆర్థోడాక్స్ పాటియార్క్ కిరిల్ ఆశీస్సులు అందుకున్నారు. ఆరేళ్ల పదవీ కాలానికి గాను 2030 వరకు ఆయన అధ్యక్ష పదవిలో కొనసాగుతారు.

టీచర్ల నియామకం రద్దుపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 25,753 టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాన్ని రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై మంగళవారం సుప్రీంకోర్టు స్టే విధించింది. స్కూల్ సర్వీస్ కమిషన్ చేపట్టిన నియామకాల్లో అవకతవకలు జరిగాయని, అనర్హులకు ఉద్యోగాలు దక్కాయని హైకోర్టు అభిప్రాయపడింది. దీనిపై బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం హైకోర్టు ఆదేశాలపై స్టే విధిస్తూనే ఈ వ్యవహారంలో సీబీఐ తమ దర్యాప్తును కొనసాగించవచ్చని పేర్కొంది. అవసరమైతే రాష్ట్ర మంత్రులపై కూడా విచారణ చేపట్టవచ్చని, అయితే అనుమానితులను అరెస్టు చేయడం లాంటి చర్యలకు దిగొద్దని సీబీఐకి తెలిపింది. సుప్రీం స్టేను పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వాగతించారు.

సునీత అంతరిక్షయానం వాయిదా

కేప్ కెనావెరల్(అమెరికా): భారతీయ మూలాలున్న అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతరిక్షయానం సాంకేతికసమస్యలతో చిట్టచివర్లో వాయిదాపడింది. అమెరికాలో ఫ్లోరిడా రాష్ట్రంలోని కేప్ కెనావెరల్‌లోని కెన్నడీ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి బోయింగ్‌కు చెందిన స్టార్‌లైన్ క్యాప్సూల్‌లో ఆమె అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లాల్సి ఉంది. బోయింగ్‌కు ఇది తొలి మానవసహిత అంతరిక్ష ప్రయోగంకావడం విశేషం. ఈ క్యాప్సూల్‌ను యునైటెడ్ లాంఛ్ అలయన్స్ సంస్థకు చెందిన అట్లాస్ వీ రాకెట్ మోసుకెళ్లనుంది. అయితే భారత స్థానికకాలమానం ప్రకారం మంగళవారం ఉదయం రాకెట్‌కు కౌంటింగ్ మొదలెట్టగా సరిగ్గా రెండు గంటల ముందు రాకెట్ అప్పర్‌స్టేజ్ ఆక్సిజన్ ప్రెషర్ రిలీఫ్ వాల్వ్‌లో సమస్య ఉత్పన్నమైంది. దీంతో కౌంట్‌డౌన్‌ను ఆపేశారు. అప్పటికే క్యాప్సూల్‌లోకి వెళ్లిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లను మళ్లీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.


రఫా క్రాసింగ్‌పై ఇజ్రాయెల్ పట్టు

కైరో: కాల్పుల విరమణకు సరేనంటూ హమాస్ ముందుకొచ్చినా ఇజ్రాయెల్ మాత్రం తన దాడులను ఆపట్లేదు. మంగళవారం ఈజిప్టుతో సరిహద్దు పంచుకుంటున్న గాజాలోని రఫా బోర్డర్ క్రాసింగ్‌ను ఇజ్రాయెల్ సైన్యం తన అధీనంలోకి తెచ్చుకుంది. ఇప్పుడు అక్కడ ఇజ్రాయెల్ యుద్ధట్యాంకులు మోహరించాయి. ఉత్తర గాజాపై భీకర గగనతల, భూతల దాడుల దెబ్బకు పాలస్తీనియన్లు మొదట దక్షిణ గాజాకు పారిపోయారు. ఆ తర్వాత చాలా మంది రఫా బోర్డర్‌క్రాసింగ్ ద్వారా ఈజిప్టుకు వలసపోయారు. రఫా బోర్డర్ క్రాసింగ్ ద్వారానే అంతర్జాతీయ సాయం కింద ఔషధాలు, ఆహారం పాలస్తీనియన్లకు చేరేవి. ఇప్పుడు ఇది ఇజ్రాయెల్ వశంకావడంతో అంతర్జాతీయ సాయానికి అడ్డంకులు ఏర్పడినట్లేనని విశ్లేషణలు వినవస్తున్నాయి. రఫా బోర్డర్ క్రాసింగ్‌ను తమ ఆధీనంలోకి తీసుకోవడం హమాస్ మిలటరీ శక్తిని, ఆర్థిక సామర్థ్యాన్ని దెబ్బతీయడానికి ముఖ్యమైన అడుగని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ అన్నారు. బందీలను విడిచిపెట్టకపోతే రఫాపై సైనిక చర్య తప్పదని ఇజ్రాయెల్ రక్షణమంత్రి అన్నారు.

22 మంది బిలియనీర్లయ్యారు

మోదీ పదేళ్ల పాలనపై రాహుల్ ధ్వజం ● తాము కోట్లాది మందిని లక్షాధికారులను చేస్తామని హామీ

చాయ్‌బాసా/గుమ్లా: నరేంద్ర మోదీ తన పదేళ్లపాలనలో 22 మందిని బిలియనీర్లను చేస్తే విపక్షాల 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కోట్లాదిమందిని లక్షాధికారులుగా మారుస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జార్ఖండ్‌లోని చాయ్‌బాసా, గుమ్లాల్లో చేపట్టిన ర్యాలీల్లో రాహుల్ ప్రసంగించారు. '' రాజ్యాంగ పరిరక్షణ పోరాటంలో తమ ప్రాణాలను త్యాగం చేసేందుకైనా విపక్షాల 'ఇండియా' కూటమి నేతలు సిద్ధంగా ఉన్నారు. అదానీ, అంబానీ వంటి వారి కోసం పనిచేసే మోదీ గిరిజనుల అటవీభూములను 14–15 మంది పారిశ్రామికవేత్తలకు ఇవ్వాలనుకుంటున్నారు. పదేళ్లలో ఆయన 22 మందిని కుబేరులుగా మార్చారు. గిరిజనులను చిన్నాచితకా పనులు చేసుకునే వారిగా బీజేపీ పరిగణించింది. మీ వాళ్లు వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులుగా ఎదగాలని బీజేపీ ఏనాడూ కోరుకోలేదు. అడవుల్ని పారిశ్రామికవేత్తలను ఇవ్వడమే బీజేపీ పనిగా పెట్టుకుంది. దేశంలో గిరిజనుల జనాభా దాదాపు 8 శాతం. కానీ కేంద్రంలో అత్యున్నతమైన పదవుల్లో ఉన్న 90 మంది సీనియర్ ఐఏఎస్‌లలో కేవలం ఒక్కరే గిరిజన వ్యక్తి. ఇప్పుడు ఆయనను కూడా అప్రధాన్య పదవికి పరిమితం చేశారు'' అని రాహుల్ అన్నారు.



అప్రెంటిస్‌షిప్.. నెలకు రూ.8,500

''మేం అధికారంలోకి వస్తే గ్రాడ్యుయేషన్, డిప్లొమా ఉన్న నిరుద్యోగులకు అప్రెంటిస్‌షిప్ ద్వారా అవకాశాలు కల్పించి నెలకు రూ.8,500 వేతనం అందజేస్తాం. పేద మహిళలకు నెలకు రూ.8,500 చొప్పున మొత్తంగా ఏటా రూ.1 లక్ష అందిస్తాం. ప్రభుత్వరంగ సంస్థల్లో కాంట్రాక్ట్ ఉద్యోగ వ్యవస్థను రద్దుచేస్తాం. ఆశా, అంగన్‌వాడీలకు అందే కేంద్రవాటాను రెట్టింపు చేస్తాం'' అని అన్నారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, గిరిజన నేత హేమంత్ సోరెన్‌ను అన్యాయంగా అరెస్ట్‌చేశారని ప్రస్తావించగానే కార్యకర్తలు 'జైలు తాళాలు బద్దలుకొట్టుకుని సోరెన్ బయటికొస్తారు' అని నినాదాలు చేశారు.

జీఎస్‌టీ చట్టాన్ని సవరిస్తాం

''సైన్యంలో అమలవుతున్న వివాదాస్పద అగ్నివీర్ పథకాన్ని సైన్యం తీసుకురాలేదు. ప్రధాని మోదీ సొంత నిర్ణయమిది. సైన్యంలో అమరులైన వారందరికీ సమాన గౌరవం దక్కాలి. గౌరవమర్యాదలకుతోడు పెన్షన్ అందేలా చూస్తాం. వివాదాస్పద అగ్నివీర్ పథకాన్ని రద్దుచేస్తాం. పేదలకు భారంగా మారిన జీఎస్‌టీ విధానంలో మార్పులు తెస్తాం. ఐదు పన్ను శ్లాబులకు బదులు ఒక్కటే కనిష్ట శ్లాబును ప్రవేశపెడతాం. దీంతో పేదల నెత్తిన పన్నుభారం తగ్గుతుంది. వస్తుసేవలపన్ను చట్టంలో తగు సవరణలు తెస్తాం. జార్ఖండ్‌లో ఆదివాసీలు, గిరిజనులు పాటించే మతవిశ్వాసాలను అనుగుణంగా విడిగా సర్నా స్మృతిని తీసుకొస్తాం'' అని అన్నారు.

మేనల్లుడు ఆకాశ్‌పై మాయావతి వేటు

- పార్టీలో తన వారసుడు కాడని ప్రకటన
- పార్టీ జాతీయ సమన్వయకర్త పదవి నుంచి ఉద్వాసన

లక్నో: తన వారసుడు ఇతనేనంటూ ప్రకటించిన ఐదు నెలలకే బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి మనసు మార్చుకున్నారు. మేనల్లుడు ఆకాశ్ ఇకపై పార్టీలో తన వారసుడు కాబోడని మంగళవారం ప్రకటించారు. పార్టీ జాతీయ సమన్వయకర్త పదవి నుంచి తప్పించారు. ఆకాశ్ రాజకీయాల్లో పరిపూర్ణత సాధించే వరకు అతడిని పక్కన పెడుతున్నానని, పార్టీ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మాయావతి ట్వీట్‌చేశారు. ఆకాశ్ తండ్రి ఆనంద్ కుమార్ బీఎస్పీలోనే క్రియాశీలక నేతగా ఉన్నారు. ఆనంద్ ఇకమీదటా పార్టీలోనే ఉంటారని మాయావతి స్పష్టంచేశారు. మూడో దశ పోలింగ్ పూర్తయిన రోజే బీఎస్పీ చీఫ్ నుంచి అనూహ్య నిర్ణయం వెలువడటం గమనార్హం. '' పార్టీ ప్రయోజనాలు, ప్రజాఉద్యమమే లక్ష్యంగా ఇలాంటి త్యాగాలు చేయడంలో బీఎస్పీ నాయకత్వం ఏనాడూ వెనుకంజ వేయలేదు. ఇకమీదటా అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తాం' అని మాయావతి అన్నారు. సీతాపూర్‌లో ఎన్నికల ర్యాలీలో వివాదాస్పద వ్యాఖ్యలతో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని ఆకాశ్‌పై గత నెల 28న జిల్లా యంత్రాంగం సూమోటోగా కేసు నమోదు చేసింది.

ఓటు జిహాద్ కావాలా? రామరాజ్యం కావాలా?

నిర్ణయించుకోవాల్సింది ప్రజలే ● మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రచార సభల్లో మోదీ

భోపాల్/బీడ్: చరిత్రలో భారత్ కీలకమైన టర్నింగ్ పాయింట్‌కు చేరుకుందని, ఇలాంటి సమయంలో దేశానికి ఓటు జిహాద్ కావాలో, రామరాజ్యం కావాలో ప్రజలే తేల్చుకోవాలని ప్రధాని మోదీ అన్నారు. మోదీకి వ్యతిరేకంగా ఓటు జిహాద్ చేయాలంటూ కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు పిలుపునిస్తున్నాయని, ఇది నిజంగా ప్రమాదకరమైన ఉద్దేశమని చెప్పారు. మంగళవారం మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ప్రసంగించారు. విపక్షాల తీరుపై మండిపడ్డారు. మోదీ ప్రసంగం ఆయన మాటల్లోనే..

యువరాజు కుట్ర బట్టబయలు

''భారత్‌పై జిహాద్ చేయాలని పాకిస్తాన్ ఉగ్రవాదులు పిలుపునిస్తుంటారు. మన దేశంలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మోదీపై ఓటు జిహాద్ చేయాలని అంటున్నాయి. ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని ఓ మతస్థులను కోరుతున్నాయి. కాంగ్రెస్ ఏ స్థాయికి దిగజారిపోయిందో అర్థం చేసుకోండి. 1985 నాటి షా బానో కేసులో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ చేసినట్లుగా అయోధ్య రామాలయం విషయంలో సుప్రీంకోర్టు తీర్పును తలకిందులు చేయడానికి కాంగ్రెస్ యువరాజు(రాహుల్ గాంధీ) పన్నిన కుట్రను ఆ పార్టీ నాయకుడొకరు బయటపెట్టారు. పాకిస్తాన్ పట్ల కాంగ్రెస్ ప్రేమ తారస్థాయికి చేరుతోంది. మన సైన్యంపై విద్వేషం ప్రదర్శిస్తున్నారు. సిగ్గులేకుండా పాకిస్తాన్‌ను వెనకేసుకొస్తున్నారు. 'కాంగ్రెస్ కా హాత్.. పాకిస్తాన్ కే సాత్' అంటున్నారు. పాక్‌ను ప్రేమిస్తే ఓటు బ్యాంక్ పటిష్టం అవుతుందని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు''

ఇతర మతాల గురించి మాట్లాడే దమ్ముందా?

''అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్టను విపక్ష నాయకులు హేళన చేశారు. శ్రీరాముడిని, ఆయన భక్తులను కించపర్చారు. ఇతర మతాల ఆరాధనలు, పద్ధతుల గురించి మాట్లాడే దమ్ము ఆ నాయకులకు లేదు. బుజ్జగింపు రాజకీయాల కోసం రాముడిని, రామభక్తులను అవమానిస్తున్న పార్టీలతో మనకు ఒరిగేదేమిటి? కాంగ్రెస్ పార్టీ ఆర్టికల్ 370ని మళ్లీ తీసుకురావొద్దంటే, అయోధ్య రామమందిరానికి తాళాలు వేయొద్దంటే ఈ ఎన్నికల్లో మాకు 400 సీట్లు ఇవ్వండి అని ప్రజలను కోరుతున్నా. ఓటు బ్యాంక్ కోసం ఓబీసీ కోటాను కాంగ్రెస్ లాక్కోవద్దంటే మాకు 400 సీట్లు అప్పగించండి'' అని విజ్ఞప్తి చేశారు.

ముస్లింలకు రిజర్వేషన్లుండాలి కానీ: లాలు

పట్నా: ఎన్నికల వేళ ముస్లింలకు రిజర్వేషన్ల కోటాపై ఆర్‌జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముస్లింలకు మత ప్రాతిపదికన కాకుండా సామాజికంగా వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్లను కల్పించాలని చెప్పారు. మంగళవారం ఉదయం ఆయన ఈ మేరకు చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. ఈ విమర్శలపై పీటీఐతో ముఖాముఖిలో లాలు ప్రసాద్ బదులిచ్చారు. ముస్లింలకూ రిజర్వేషన్లు రావాలి కదా అంటూ..'రాజకీయాల్లో నరేంద్ర మోదీ కంటే సీనియర్‌ను. నాకు తెలిసిన చాలా విషయాలు ఆయనకు తెలియవు. నా హయాంలోనే బిహార్‌లో మండల్ కమిషన్ సిఫారసులు అమలయ్యాయి. వందలాదిగా ఉన్న సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు అందుబాటులోకి వచ్చాయి. కానీ, అవి మత ప్రాతిపదికన మాత్రం కాదు. మత ఆధారిత రిజర్వేషన్ల గురించి ప్రస్తావన రాజ్యాంగంలో లేదు. అందుకే ముస్లింలకు వెనుకబాటుతనం ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి'అని వివరించారు.

శిరోమణి అకాలీదళ్‌కు అభ్యర్థి ఝలక్

చండీగఢ్: శిరోమణి అకాలీ దళ్(సుఖ్‌బీర్ సింగ్ బాదల్ వర్గం)కు ఆ పార్టీ చండీగఢ్ అభ్యర్థి గట్టి షాక్ ఇచ్చారు. పార్టీ అధ్యక్షుడు ఉదాసీనంగా ఉంటున్నారని ఆరోపిస్తూ పోటీ నుంచి, పార్టీ నుంచి వైదొలిగారు. చండీగఢ్ లోక్‌సభ నియోజకవర్గంలో ఆ పార్టీ హర్దీప్ సింగ్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. హర్దీప్ ప్రస్తుతం చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిలర్‌గా ఉన్నారు. 'నియోజకవర్గంలో ప్రచారం చేసుకుంటాం. మాకు అండగా నిలబడాలని అధ్యక్షుడిని కోరాం. కానీ, ఆయన ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఎలాంటి మద్దతూ ఇవ్వడం లేదు'అని సింగ్ ఆరోపించారు. హర్దీప్‌తోపాటు కొందరు నేతలు కూడా పార్టీకి రాజీనామా చేశారు. చండీగఢ్ స్థానానికి బీజేపీ సంజయ్ టాండన్‌ను, కాంగ్రెస్ మనీశ్ తివారీని బరిలో దించాయి. మొదటిసారిగా ఇక్కడ అభ్యర్థిని పోటీకి నిలిపిన శిరోమణి అకాలీదళ్‌కు చేదు అనుభవం ఎదురైంది.

మోడల్ కోడ్ మోదీ కోడ్‌గా మారింది: మమత

పురులియా: బీజేపీ హయాంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎన్నికల నిబంధనావళి) కాస్తా మోదీ కోడ్ ఆఫ్ కండక్ట్‌గా మారిపోయిందని టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో బీజేపీ నేతల విద్వేష ప్రసంగాలపై వస్తున్న ఫిర్యాదులను ఎన్నికల కమిషన్ పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. పశ్చిమబెంగాల్‌లోని పురులియాలో మంగళవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో మమత మాట్లాడారు. తాము మాత్రమే హిందువులమని భావిస్తున్న ప్రధాని మోదీ, బీజేపీ అగ్ర నేతలు ఇతర వర్గాల ప్రజల గురించి ఆలోచించడం లేదన్నారు. హిందువుల్లో దిగువ కులాల వారిని, మైనారిటీలు, ఇతర అణగారిన వర్గాలపై వీరు విద్వేష పూరిత ప్రసంగాలు చేస్తున్నా ఈసీ మౌనంగా ఉంటోందని విమర్శించారు. ఎన్నికల నిబంధనావళి అపహాస్యమైపోయిందన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు ఇకపై మోదీ కోడ్ ఆఫ్ కండక్ట్‌గా నామకరణం చేయాలని ఎద్దేవా చేశారు. మోదీ మాదిరిగా అబద్ధాలు చెప్పే ప్రధానిని తానింత వరకు చూడలేదని ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్, బీజేపీలు రైతుల నోట్లో మట్టి కొట్టాయి

మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: బీజేపీ, బీఆర్‌ఎస్‌ల దుష్ట పన్నాగాలకు రైతులు బలవుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. అసలే వర్షాలు లేక రైతులు బాధలో ఉంటే స్వార్థ రాజకీయాల కోసం ఆ పార్టీలు రైతు నోటి కాడి బుక్కను లాక్కోవడం ఏంటని మంగళవారం ఓ ప్రకటనలో ఆయన ప్రశ్నించారు. ఖజానాలో రూపాయి లేకుండా ఆగం చేసి బీఆర్‌ఎస్ వెళ్లిపోతే రైతుల కోసం రూపాయి రూపాయి కూడబెట్టి రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కుటిల రాజకీయాలు చేసి దీన్ని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. తమ అకౌంట్లలో డబ్బులు పడుతున్నాయని రైతులు సంతోషించే లోపే ఆ నిధులు రాకుండా కుట్రలు చేయడం బాధాకరమన్నారు. తన గుప్పిట్లో ఉన్న ఈసీని అడ్డుపెట్టుకుని ఖాతాల్లో పడ్డ రైతు భరోసా నిధులను కూడా బీజేపీ నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2018 ఎన్నికల సమయంలో ఎన్నికలు జరిగే రోజునే కేసీఆర్ రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో వేశారని, అప్పుడు ఆపలేని ఈసీ ఇప్పుడు ఎందుకు ఆపిందని ప్రశ్నించారు.

కరెంటు కావాల్సినంత ఉంది

- ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు
- గోబెల్స్‌కు తాతల్లాగా ప్రతిపక్షాల దుష్ప్రచారం
- డిప్యూటీ సీఎం భట్టి ప్రకటన

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో కరెంటు కావాల్సినంత ఉందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఉష్ణోగ్రతల్లో ఎంత మార్పు వచ్చినప్పటికీ విద్యుత్ శాఖ ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న కారణంగా అన్ని కేటగిరీల్లోని వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని అందుకే విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోందని వెల్లడించారు. అసలు విద్యుత్ సరఫరాలో లోపాలుంటే రికార్డు స్థాయి వినియోగం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

అభినందించకుండా దుష్ప్రచారం

'ఈ ఏడాది మే1 నుంచి ఆరో తేదీ వరకు విద్యుత్ వినియోగాన్ని గత ఏడాదితో పోలిస్తే 52.9 శాతం పెరిగింది. 2023, మేనెలలో 7,062 మెగావాట్లు సరాసరి డిమాండ్ ఉంటే ఈ ఏడాది 10,799 మెగావాట్లకు పెరిగింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 47.6 శాతం పెరుగుదల నమోదైంది. గత ప్రభుత్వ హయాంలో 2022–23 మధ్య విద్యుత్ వినియోగ డిమాండ్ ఒక్క శాతం మించలేదు. అయినా ఎక్కడా నిమిషం పాటు అంతరాయం లేకుండా విద్యుత్ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఈ కృషిని అభినందించాల్సిన ప్రతిపక్షాలు కరెంటు కోతలున్నట్టు గోబెల్స్ తాతల రీతిలో ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులు కరెంటు కోసం రోడ్లమీదికి వచ్చి ధర్నాలు చేసిన రోజులు మర్చిపోయారా? ట్రాన్స్‌కో–జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు మీడియా ముఖంగా కేసీఆర్ తీరును ఎండగట్టిన విషయం మర్చిపోయారా? విద్యుత్ సరఫరాపై కేసీఆర్ చేస్తున్న దుష్ప్రచారం హేయమైంది. సూర్యాపేటలో తన జనరేటర్ లోపం వల్ల కరెంటు పోతే దాన్ని విద్యుత్ శాఖ మీద వేశాడు. మహబూబ్‌నగర్‌లో అసలు అంతరాయమే లేకపోయినా దుష్ప్రచారం చేశాడు. కేసీఆర్‌తో పాటు ఆ పార్టీ నేతలు సోషల్ మీడియాలో ఇలాంటి ప్రచారాలే చేస్తున్నారు. విజ్ఞత కల ప్రజలు ఈ మార్పులను నిశితంగా గమనిస్తున్నారు. దుష్ప్రచారాలను వారు నమ్మరు. అసత్య ప్రచారం చేస్తే ప్రజలు మీకు, మీ పార్టీకి తగిన బుద్ధి చెప్తారు.'అని ఉప ముఖ్యమంత్రి భట్టి ఆ ప్రకటనలో వెల్లడించారు.

రైతు భరోసాకు ఈసీ బ్రేక్

- పోలింగ్ తర్వాత పంపిణీకి ఆదేశం
- సీఎం కోడ్ ఉల్లంఘించారని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో రైతు భరోసా పథకం కింద నిధుల పంపిణీకి కేంద్ర ఎన్నికల సంఘం బ్రేక్ వేసింది. మే 13న ఎన్నికలు ముగిసి న తర్వాతే పంపిణీ చేయాలని ఆదేశించింది. ని ధుల విడుదలపై ఆంక్షలు విధించింది. రైతు భరో సా విషయంలో రాష్ట్రానికి చెందిన ఎస్.వేణుకుమార్ సోమవారం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యా దు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు భరోసా పథకం చెల్లింపులపై చేసిన వ్యాఖ్యలను ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదును పరిశీలించిన ఈసీ, ముఖ్యమంత్రి ఎన్నికల కోడ్ ఉల్లఘించారని పేర్కొంది. రైతు భరోసా నిధుల విడుదలపై ఆంక్షలు విధిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు సమ్మతిని తెలుపుతూ నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

పోలింగ్ పూర్తయిన తర్వాతే..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుబంధు నిధులు విడుదలకు సంబంధించి ఎన్నికల కమిషన్ విధించిన షరతులను ఉత్తర్వుల్లో ప్రస్తావించింది. అప్పటి ఆర్థిక మంత్రి హరీశ్ రావు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన నేపథ్యంలో.. అంతకుముందు రైతు బంధు పంపిణీకి ఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకున్న (నవంబరు 27, 2023న) విషయం గుర్తు చేసింది. ఎస్.వేణుకుమార్ ఫిర్యాదు, తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ నివేదిక పరిశీలించిన తర్వాత.. నిధుల విడుదలకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడటం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడం గానే భావించినట్లు ఈసీ వివరించింది. రాష్ట్రంలో పోలింగ్ పూర్తయిన తర్వాత 2023 రబీ సీజన్ నిధులు విడుదల చేయాలని ఆదేశిస్తున్నట్లు తెలిపింది.

ఈసీ ఆదేశాలతోనే రైతు భరోసా ఆగింది: భట్టివిక్రమార్క

చౌటుప్పల్, మునుగోడు: రాష్ట్రంలోని రైతులందరికీ పూర్తిస్థాయిలో రూ.7,624 కోట్ల రైతు భరోసా సాయాన్ని అందించాలని నిర్ణయించామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. అందులో భాగంగా ఇప్పటికే ఐదు ఎకరాల వరకు రైతుల ఖాతాల్లో నిధులు జమ చేశామని తెలిపారు. ఐదెకరాలకు పైగా భూమి ఉన్న రైతులకు సైతం సాయం అందించాలని భావించినప్పటికీ కొంతమంది ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని, దాంతో ఈసీ ఆదేశాలతో నిధులు జమచేసే ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో మంగళవారం రాత్రి కార్నర్ మీటింగ్ వర్షం కారణంగా రద్దయ్యింది. దాంతో స్థానికంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కేంద్రంలో బీజేపీ వస్తే భవిష్యత్తు ఉండదు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హెచ్చరిక



గాంధీభవన్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో సామా రామ్మోహన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్‌: కేంద్రంలో బీజేపీ మరోమారు అధికారంలోకి వస్తే దేశంలోని బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు భవిష్యత్తు ఉండదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హెచ్చరించారు. 400 సీట్లు ఎప్పుడు వస్తాయా? రాజ్యాంగాన్ని ఎప్పుడు మార్చి రిజర్వేషన్లను రద్దు చేద్దామా అని ఆ పార్టీ ఉర్రూతలూగుతోందని చెప్పారు. పొరపాటున బీజేపీకి ఓటేస్తే మన గొంతు మనం కోసుకున్నట్టేనని వ్యాఖ్యానించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ నేతలు బండ్ల గణేశ్, సామా రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు.

90% మందికి హక్కులు దక్కకుండా బీజేపీ కుట్ర

'బీజేపీ అధికారంలోకి వస్తే దళితులు, గిరిజనులు, బీసీలకు రాజ్యాంగం ద్వారా దక్కాల్సిన హక్కులు, వారి వాటా దక్కకుండాపోయే ప్రమాదముంది. తరతరాలుగా అణగదొక్కబడుతున్న దళితులు, గిరిజనులకు రిజర్వేషన్లు ఆషామాషీగా రాలేదని బీజేపీ నేతలు గుర్తుంచుకోవాలి. ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఎస్సీ, ఎస్టీలకు అవకాశాల్లో మార్పు రావడానికి రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లే కారణం. ఈ రిజర్వేషన్ల ద్వారా ఆయా వర్గాలకు రావాల్సింది ఇంకా చాలా ఉంది. ఓవైపు దేశవ్యాప్తంగా కులగణన చేసి జనాభా దామాషా ప్రతిపాదికన ఎవరి వాటా వారికి ఇవ్వాలనేది రాహుల్ గాంధీ ఆలోచన. కులగణన ఊసెత్తకుండా ఇప్పటికే ఉన్న ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను తొలగించాలన్నది బీజేపీ ఆలోచన. దేశంలోని 90 శాతం మంది ప్రజలకు రావాల్సిన హక్కులు వారికి రాకుండా బీజేపీ కుట్ర చేస్తోంది. అందుకే పదే పదే 400 సీట్లు కావాలని అడుగుతోంది..'అని భట్టి చెప్పారు.

పెను ప్రమాదంలో ప్రజాస్వామ్యం

'బీజేపీ ఆలోచనలతో ప్రజాస్వామ్యం పెను ప్రమాదంలో పడింది. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని సమాజంపై రుద్దే కుట్ర జరుగుతోంది. ఇలాంటి వాస్తవాలను చెబుతుంటే తప్పుడు కేసులు పెడుతున్నారు. ఏకంగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిపై కేసులు పెట్టి విచారణకు ఢిల్లీ రావాలని పిలిపిస్తున్నారు. కేసులు పెట్టి బెదిరిస్తున్నారా? ప్రజల మనసులను గెలుచుకుని ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలే తప్ప కేసులు పెట్టి కాదు. బీజేపీకి ఈ రాష్ట్రంలో స్థానం లేకుండా చేయాల్సిన బాధ్యత రాష్ట్రంలోని బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై ఉంది. రానున్న ఎన్నికల్లో తెలంగాణలోని ఆయా వర్గాలు కాంగ్రెస్ అభ్యర్థుల్ని గెలిపించాలి. దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాంగబద్ధమైన వాటాను, వారి హక్కులను కాపాడుకోవాలంటే కాంగ్రెస్‌ను నిలబెట్టుకోవాలి..'అని డిప్యూటీ సీఎం అన్నారు.

ప్రభుత్వాన్ని కూల్చడం ఎవరి తరం కాదు

'ఎన్నికల కోడ్ రాకముందు మేము అధికారంలోకి వచ్చి మూడు నెలలే అవుతోంది. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ తెలంగాణను ఛిన్నాభిన్నం చేస్తే దాన్ని సరిదిద్దుతూ ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. పదేళ్ల కాలంలో చెప్పిన హామీలను అమలు చేయని కేసీఆర్ ఇప్పుడు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు..'అని భట్టి విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఉండబోదని బీఆర్‌ఎస్ నేతలు అంటున్నారు కదా అని ప్రశ్నించగా.. ప్రభుతాన్ని కూల్చడం ఎవరి తరం కాదని భట్టి చెప్పారు. సంపూర్ణంగా ఐదేళ్ల పాటు పాలిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్లలో ప్రజా సంపదను ఎలా లూటీ చేయాలో బీఆర్‌ఎస్ చూపెడితే, ఆ సంపదను ప్రజలకు ఎలా పంచాలో తాము చూపెడతామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడతాం

మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్ కార్పొరేషన్‌: త్వరలోనే తడిసిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...వర్షం పడితే ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు చేపడతామని, రైతులు ఆందోళన చెందవద్దని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక వడగండ్ల వానతో జరిగిన నష్టానికి పరిహారం విడుదల చేశామని, అయితే రైతు భరోసాను బీజేపీ,బీఆర్‌ఎస్ అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. అందరికీ రైతు భరోసా విడుదల చేయాలని తమ ప్రభుత్వం భావిస్తుందని, ఒక్కరోజే రూ.900 కోట్లను రైతుల ఖాతాలో వేశామని చెప్పారు. రైతుల పట్ల బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఉన్న కపట ప్రేమకు ఇది నిదర్శనమని, ఈ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్

అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఇందుకోసం తగిన ఆదేశాలు ఇచ్చినట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతుల నుంచి రూపాయి కూడా వసూలు చేయడానికి వీలు లేదని, అద్దెలు ఏమైనా ఉంటే ఐకేపీ కేంద్రాల సొసైటీ కమిషనర్ ద్వారా చెల్లించాలని సిద్దిపేట జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు రైతులు బుద్ధి చెప్పాలి

సాక్షి, హైదరాబాద్‌: రైతుల పక్షపాతి అయిన తమ ప్రభుత్వం రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేస్తుంటే బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఓర్చుకోలేకపోతున్నాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. అందరికీ రైతు భరోసా డబ్బులివ్వాలని తమ ప్రభుత్వం భావిస్తుంటే కావాలని ప్రతిపక్షాలు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. రైతుభరోసా నిధుల పంపిణీ ప్రక్రియను ఎన్నికలు ముగిసేంతవరకు నిలిపివేయాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలపై మంత్రి పొన్నం మంగళవారం ఒక ప్రకటనలో స్పందించారు. రైతు భరోసాను నిలిపివేయాలని ప్రతిపక్షాలు ఫిర్యాదు చేసినందునే ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని, దీంతో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సోమవారం ఒక్క రోజే రైతుల ఖాతాల్లో రూ.900 కోట్లు జమ చేశామని తెలిపారు.

తప్పుడు హామీల కాంగ్రెస్‌ను నమ్మొద్దు

బస్తర్ మహారాజు, కాకతీయుల వంశ వారసుడు కమల్‌చంద్ర భంజ్‌దేవ్



వైరా: తప్పుడు హామీలతో కాలం వెళ్లదీసే కాంగ్రెస్‌ను నమ్మొద్దని బస్తర్ మహారాజు, కాకతీయ వంశ వారసుడు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ కోరారు. ఛత్తీస్‌గఢ్‌లోనూ కాంగ్రెస్ తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేసిందని, ఆ పార్టీని నమ్మితే కష్టమని చెప్పారు. ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తరఫున మంగళవారం వైరాలో జరిగిన ప్రచార ర్యాలీతో పాటు ఖమ్మం, దమ్మపేటలో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమల్‌చంద్ర మాట్లాడుతూ దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ మహిళల కోసం మరుగుదొడ్లు సైతం కట్టించలేకపోయిందని ఆరోపించారు. కానీ మోదీ ప్రధానమంత్రి అయ్యాక ఇంటింటికీ మరుగుదొడ్లు కట్టించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడారని తెలిపారు. ఎన్నో పార్టీలతో సాధ్యపడని మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చారని చెప్పారు. దేశం కోసం ఆలోచించేది మోదీ మాత్రమేనని.. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ రోజుకో మాట మాట్లాడతారని ఎద్దేవా చేశారు. ఖమ్మం బీజేపీ అభ్యర్థిగా విద్యావంతుడు, సేవా భావం కలిగిన వినోద్‌రావు పోటీలో ఉన్నందున గెలిపించాలని కమల్‌చంద్ర సూచించారు.



బీజేపీలో చేరిన నాయకులతో బండి సంజయ్

కాంగ్రెస్ పార్టీకి ఎక్స్‌పైరీ డేట్ వచ్చేసింది

- నరేంద్రమోదీ.. రాహుల్‌గాంధీ మధ్య జరుగుతున్న ఎన్నికలివి
- బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్

కరీంనగర్ టౌన్‌: 'వంద రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని మోసం చేసిన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే కాంగ్రెస్ నేతలారా.. నా ఆస్తిపాస్తులు, మీరు నాపై చేస్తున్న అవినీతి ఆరోపణలపై సీబీఐ విచారణ కోరేందుకు నేను సిద్ధం. మరి మీ ఆస్తిపాస్తులు, అవినీతి, బినామీ ఆస్తులపై సీబీఐ విచారణకు సిద్ధమా? దమ్ముంటే నా సవాల్‌ను స్వీకరించాలి'అంటూ బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ సహా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలకు సవాల్ విసిరారు. మంగళవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బండి సమక్షంలో పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడారు. దేశంలో ఎన్నికలు నరేంద్రమోదీ, రాహుల్‌గాంధీకి మధ్య జరుగుతున్నాయని, ఎవరి నాయకత్వం కావాలో ఆలోచించుకోవాలని సూచించారు. పదేళ్ల ఎన్డీఏ పాలన, అంతకుముందు పదేళ్ల యూపీఏ పాలనపై బేరీజు వేసి ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ పెద్ద డ్రామాఆర్టిస్ట్, అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని విమర్శించారు. తనను, తన కుటుంబాన్ని అరెస్ట్ చేయకుండా ఉండేందుకు సీబీఐని రాష్ట్రంలోకి అడుగుపెట్టకుండా ఉత్తర్వులు ఇచ్చిన కేసీఆర్.. సిగ్గులేకుండా తాను సుద్దపూసనని, మోదీ అరెస్ట్ చేసేందుకు కుట్ర చేస్తున్నారని అంటున్నారని విమర్శించారు. కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ అని, పదేళ్ల యూపీఏ పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి, 2జీ, బొగ్గు, విమానాలు, కామన్‌వెల్త్ గేమ్, ఆదర్శ స్కాంలు.. ఐపీఎల్, గడ్డి కుంభకోణం, సహారా, ఈఎస్ఐ, హవాలా చివరకు చెప్పుల స్కాం (ఫేక్ లెదర్ సొసైటీ ఏర్పాటు)లో వేల కోట్ల రుణం తీసుకొని ఎగ్గొట్టిన వ్యాపారులను సంకలో వేసుకొని తిరిగిన నీచ చరిత్ర కాంగ్రెస్‌దేనన్నారు. కానీ మోదీ మచ్చలేని స్వచ్ఛమైన పాలన అందిస్తున్నారని వివరించారు. అందుకే 140 కోట్ల మందికి గ్యారంటీ మోదీ మాత్రమేనని ప్రజలు నమ్ముతున్నారని స్పష్టం చేశారు. అవినీతి, కుంభకోణాలు, వారసత్వ పాలనతో దేశాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్‌కు ఎక్స్‌పైరీ డేట్ వచ్చేసిందన్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు మోదీ వేములవాడ రాజన్నను దర్శించుకుంటారని, తర్వాత 9 గంటలకు వేములవాడ బాలానగర్ కోర్టు వద్దనున్న మైదానంలో భారీ బహిరంగసభలో పాల్గొంటారని, సభను విజయవంతం చేయాలని కోరారు.



కుప్పకూలిన సభావేదిక వద్ద మాట్లాడుతున్న రాజస్తాన్ సీఎం భజన్‌లాల్ శర్మ

మోదీతోనే దేశ వికాసం

- రాజస్తాన్ సీఎం భజన్‌లాల్‌శర్మ
- ఈదురు గాలులతో కుప్పకూలిన సభా వేదిక

సాక్షి, పెద్దపల్లి: దేశ వికాసం ప్రధాని మోదీతోనే సాధ్యమని రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ అన్నారు. పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు మద్దతుగా ప్రచారం చేసేందుకు భజన్‌లాల్‌శర్మ మంగళవారం మంథనికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీ, పటేల్, వివేకానంద, అంబేడ్కర్ లాంటి మహనీయుల ఆలోచనలు అమలు చేస్తూ, దేశాభివృద్ధి కోసం ప్రధాని కృషి చేస్తున్నారన్నారు. అవినీతి కాంగ్రెస్ పార్టీ మాయమాటలతో ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గ్రామం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే దేశంలో మూడోసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రాజస్థాన్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉందని, తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కారు రాబోతోందని జోస్యం చెప్పారు.

కుప్పకూలిన సభాప్రాంగణం

బీజేపీ ఎంపీ అభ్యర్థికి మద్దతుగా పట్టణంలో జనగర్జన సభ చేపట్టారు. రాజస్థాన్ సీఎం ఉదయం 11గంటలకు సభకు హాజరుకావాల్సి ఉన్నా, మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయన రాలేదు. అయితే అప్పటికే వాతావరణం చల్లబడి ఒక్కసారిగా ఈదురుగాలుల బీభత్సం సృష్టించాయి. దీంతో సభావేదిక, ప్రాంగణంలోని టెంట్లు నేలకూలాయి. బెదిరిపోయిన ప్రజలు బయటకు పరుగులు తీశారు. ఆలస్యంగా వచ్చిన భజన్‌లాల్‌శర్మ.. కూలిన సభావేదిక వద్దే ప్రచార రథంపైనుంచి ప్రసంగించారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలకు విజప్తి చేశారు.

ఇక ఇంటింటికీ వెళ్లి కలుద్దాం

- ఓటర్లను వారి ఇళ్లల్లో కలిసి మాట్లాడదాం... పోలింగ్‌బూత్ స్థాయిలో కార్యాచరణ చేపడదాం
- ఈ నాలుగు రోజుల్లో ఒక్క నిమిషం కూడా వృథా కావొద్దు
- ప్రచార ఉధృతిపై బీజేపీ నేతల సమీక్ష
- ఎన్నికల మేనేజ్‌మెంట్, మీడియా కమిటీ భేటీలకు హాజరైన పార్టీ జాతీయ నేత బీఎల్ సంతోశ్, రాజస్తాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, డా.కె.లక్ష్మణ్



పోల్‌మేనేజ్ మెంట్ భేటీలో బీఎల్ సంతోశ్‌తో కలిసి మాట్లాడుతున్న కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో చివరి నాలుగు రోజుల్లో నిర్వహించే ఎన్నికల ప్రచారం, దీంతో ముడిపడిన అంశాలపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టింది. శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రచార గడువు ముగియనుండటంతో.. అప్పట్లోగా చేపట్టే ప్రచారం, ఇప్పటివరకు నిర్వహించిన ప్రచార సరళి, ప్రధాన ప్రత్యర్థులైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను ఎలా ఎదుర్కోవాలి, ఎప్పటికప్పుడు వ్యూహాలు మార్చుతూ ప్రస్తావించాల్సిన అంశాలు, సామాజిక మాధ్యమాల్లో పనిగట్టుకుని దుష్ప్రచారం జరిగితే ఎలా ఖండించాలి అన్న వాటిపై కీలక నేతలు సమీక్షించారు. శనివారం లోగా పోలింగ్‌బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణతో పాటు ఇంటింటి ప్రచారానికి ప్రాధాన్యతనిచ్చి ఓటర్లను వారి ఇళ్లల్లో కలుసుకునేలా కార్యక్రమాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ నాలుగు రోజుల్లో ఒక్క నిమిషం కూడా వృథా కాకుండా విస్తృత ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ, మీడియా కమిటీలతో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోశ్, ఎలక్షన్ కమిటీ చైర్మన్ డా.కె.లక్ష్మణ్, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ తివారీ పాల్గొన్నారు. మీడియా, సోషల్ మీడియా కమిటీల భేటీలో... వీరితో పాటు రాజస్తాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, తమిళనాడు పార్టీ అధ్యక్షుడు అన్నామలై, పార్టీ నేతలు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, డా.కాసం వెంకటేశ్వర్లు యాదవ్, ప్రేంసింగ్ రాథోడ్, డా.ఎస్.ప్రకాశ్ రెడ్డి, పోరెడ్డి కిశోర్ రెడ్డి, రచనా రెడ్డి, పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

అలాంటి దుష్ప్రచారం మళ్లీ జరగొద్దు..

ఐదు నెలల పాలనలో కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలు, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీల అమలు నెరవేర్చకపోవడం వంటి వాటిని ఎండగట్టడంతో పాటు... రిజర్వేషన్ల రద్దు, ఇతర అంశాలపై కొన్నిరోజులుగా బీజేపీపై చేస్తున్న దుష్ప్రచారాన్ని మరింత సమర్థవంతంగా తిప్పికొట్టాలని పార్టీ నాయకులకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్ సూచించారు. తెలంగాణలోని కొన్ని మీడియా సంస్థలు (సాక్షి కాదు) బీజేపీ పట్ల ద్వంద్వ విధానాలు అవలంబిస్తున్నాయని, పార్టీకి నష్టం కలిగించే దిశలో ఇతర పార్టీల ప్రచారానికి ఊతమిస్తున్నాయని సంతోష్ వ్యాఖ్యానించినట్టు తెలుస్తోంది. ఒక పత్రికలో పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి దుష్యంత్ కుమార్ చౌహాన్ రిజర్వేషన్లపై చేసిన వ్యాఖ్యలను పూర్తిగా వక్రీకరించి, తప్పుడు ప్రచారానికి దోహదపడేలా వార్త ప్రచురించారని ఆయన ప్రస్తావించినట్టు తెలిసింది. చివరి నాలుగు రోజులూ ఇలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్లు పార్టీ వర్గాల సమాచారం.

4 నెలల్లోనే రేవంత్ అబద్ధాలకోరు అని తేలింది

మతిభ్రమించినట్టు మాట్లాడుతూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు

- సీఎం అయినా భాష మారలేదు..దబాయింపులు మారలేదు
- వీడియో మార్ఫింగ్‌లతో రేవంత్‌రెడ్డి అందరినీ మించిపోయారు
- అన్ని వర్గాల మద్దతు.. మంచి మెజారిటీతో గెలుస్తా..
- ముస్లింలకు కాదు..మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం
- మీట్‌ది ప్రెస్‌లో మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్‌: మాజీ సీఎం కేసీఆర్ వైఫల్యం చెందడానికి పదేళ్ల సమయం పడితే.. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు నెలలు గడవక ముందే ప్రజల నమ్మకాన్ని కోల్పోయారని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. 'ఈకొద్ది కాలంలోనే ఆయన అబద్ధాల కోరు అని తేలింది. ఇచ్చిన హామీలు అమలు చేసే వ్యక్తో కాదో నాలుగు నెలల్లో తెలిసిపోయింది. సీఎం అయినా భాష మారలేదు..దబాయింపులు మారలేదు. రేవంత్‌రెడ్డి మతిభ్రమించినట్టు మాట్లాడుతూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. అబద్ధాల ప్రచారం, వీడియో మార్ఫింగ్‌లతో రేవంత్‌రెడ్డి అందరినీ మించిపోయారు. సంస్కారహీనంగా మాట్లాడుతున్నారు. మానవబాంబై పేలుతా.. పేగులు మెడలో వేసుకుంటా అని ఒక ముఖ్యమంత్రి మాట్లాడవచ్చా.. ఉన్మాదులు, సైకోలు అలా మాట్లాడతారు. నీ భాష మార్చుకో..సీఎం స్థాయిని, నీ స్థాయిని తగ్గించుకోకు. చిల్లరమాటలు మానుకోవాలి'అని రేవంత్‌రెడ్డికి ఈటల హితవు పలికారు. మంగళవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన మీట్ ది ప్రెస్‌లో ఈటల రాజేందర్ మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసినందుకు కేసీఆర్ మూల్యం చెల్లించుకున్నారని, మళ్లీ దాన్ని దెబ్బతీస్తే రేవంత్‌కు కూడా పుట్టగతులుండవు. సీఎం మాటలకు విశ్వసనీయత లేదు. కమిటీల పేరుతో కాళేశ్వరం అవినీతిపై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. గతప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్‌ట్యాపింగ్‌లపై ఎలాంటి విచారణ లేదు. నేటికీ ట్యాపింగ్‌లు కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ హయాంలో బిల్లుల కోసం ఉద్యోగులు, చిన్న కాంట్రాక్టర్లు మొదలు అందరూ 7 నుంచి 10 శాతం వరకు కమీషన్ చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. 20 ఏళ్లకు పైబడిన నా రాజకీయ జీవితంలో ఇంతటి 'పొల్యూటెడ్ పాలిటిక్స్' ను చూడలేదు. పాలించే జాతి మాదే, పాలించే కెపాసిటీ మాకే ఉంది అని అహంకారంతో రేవంత్ మాట్లాడుతున్నారు. అంత జాత్యహంకారం, కులరాజకీయం పని కి రాదు.

రద్దు చేయాలనుకుంటే అవన్నీ ఎందుకు చేస్తారు ?

బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ మార్ఫింగ్ వీడియోలు చేసి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు. ఈ ఫేక్ వీడియోలలో రేవంత్ ప్రమేయముందని ప్రచారం జరుగుతోంది. ప్రధాని మోదీ ఇతర రిజర్వేషన్లు రద్దు చేయాలనుకుంటే దళితులు, పేదలకు న్యాయం జరగాలని ఏబీసీడీ రిజర్వేషన్ల వర్గీకరణ దిశగా చర్యలు, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు, మహిళలకు చట్టసభలో రిజర్వేషన్లు, వంటివి ఎందుకు చేస్తారు. ముస్లింలకు కాదు మత రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం. బీసీలుగా, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ముస్లింలు రిజర్వేషన్లు పొందుతున్నారని, మళ్లీ మతప్రాతిపదికన ఎందుకని బీజేపీ వ్యతిరేకిస్తోంది.

మల్కాజ్‌గిరిలో ఏ సర్వే సంస్థలకు అందని ఫలితాలు

'మల్కాజ్‌గిరిలో ఏ సర్వే సంస్థలకు అందని ఫలితాలు రాబోతున్నాయి. అన్నివర్గాల మద్దతుతో మంచి మెజారిటీతో గెలుస్తా'అని ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. తాను మల్కాజ్‌గిరి ప్రజలను తక్కువ చేసి మాట్లాడినట్టు ఓ మార్ఫింగ్ వీడియో సోషల్‌మీడియాలో ప్రచారం చేయడంపై ఈసీకి ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. ఢిల్లీలో ప్రధాని మోదీ, మల్కాజ్‌గిరిలో ఈటల రాజేందర్ ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. తాను గెలిస్తే మల్కాజ్‌గిరికి గుర్తింపుతోపాటు, రోడ్డు వ్యవస్థ, మెట్రోరైలు, ఐటీ. ఇండస్ట్రియల్ కారిడార్లు, మంచి విద్య, వైద్యం వస్తాయని ఇక్కడ ప్రజలు భావిస్తున్నారన్నారు. ఇక తనపై పోటీచేస్తున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల గురించి ఇక్కడి ప్రజలకు పెద్దగా తెలియదని చెప్పారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు, ప్రధానకార్యదర్శి ఆర్.రవికాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు వనజ తదితరులు పాల్గొన్నారు.


ఉదయం 11.45 గంటలకు: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండలో ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


మధ్యాహ్నం 3 గంటలకు.. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జరిగిన సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం


సాయంత్రం 6 గంటలకు: విశాఖ జిల్లా గాజువాకలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల బహిరంగ సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

పథకాలను అడ్డుకున్నా గెలుపును ఆపలేరు

కోరుకొండ, ఇచ్ఛాపురం, గాజువాక ఎన్నికల సభల్లో సీఎం వైఎస్ జగన్

జూన్ 4న మళ్లీ మీ బిడ్డే వస్తాడు.. విశాఖ నుంచే పాలన.. ప్రమాణ స్వీకారం

సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం /సాక్షి, విశాఖపట్నం: 'దేవుడి దీవెనలు, మీ ఆశీస్సులున్నంత వరకూ మీ బిడ్డ విజయాన్ని ఏ ఒక్కరూ ఆపలేరు. జూన్ 4న మనందరి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుంది. మనం నొక్కిన బటన్లు అన్నీ వారం రోజుల్లోనే క్లియర్ చేస్తాం. ఢిల్లీతో కలిసి మీ బిడ్డ ప్రభుత్వాన్ని దెబ్బ తీసే కుట్రలు చేస్తున్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, మూడుసార్లు సీఎంగా చేశానంటాడు. అన్నేళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు పేరు చెబితే పేదలకు ఒక్క స్కీమ్ అయినా గుర్తుకొస్తుందా? జగన్ అంటే పథకాలు.. చంద్రబాబు అంటే మోసాలు, కుట్రలు, కుతంత్రాలే గుర్తుకొస్తాయి' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు మోసాలు, కుతంత్రాలకు ఓటు అనే వజ్రాయుధంతో మరోసారి గట్టిగా బుద్ధి చెప్పాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, విశాఖ జిల్లా గాజువాకలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో సీఎం జగన్ ప్రసంగించారు.

ఇంతలా దిగజారిపోయారు..

కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ జగన్ నొక్కిన బటన్ల సొమ్ము నా అక్కచెల్లెమ్మలకు అందకుండా ఢిల్లీ వాళ్లతో కలిసి అడ్డుకునే కార్యక్రమం చేస్తున్నారు. సాక్షాత్తూ మీ జగన్ ఓ ముఖ్యమంత్రిగా కోర్టుకు వెళ్లి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ కేసులు వేసే పరిస్థితిలోకి ప్రజాస్వామ్యం దిగజారిపోయిందంటే వీళ్లను ఏమనాలి? మీ జగన్ బటన్ నొక్కిన పథకాలన్నీ ఎన్నికలు వస్తున్నాయని కొత్తగా తెచ్చినవి గత ఐదేళ్లుగా ఏటా క్రమం తప్పకుండా ఇస్తున్న పథకాలకే మీ జగన్ బటన్ నొక్కాడు. ఈ స్కీములు ఇవాళ ఏదో కొత్తగా తెచ్చినవి కాదు. ఇవన్నీ ఆన్ గోయింగ్ స్కీమ్స్. బడ్జెట్ కేటాయింపులున్నవే. అసెంబ్లీలో బడ్జెట్ ద్వారా ఆమోదం కూడా తెలిపినవే. 58 నెలలుగా ఇస్తున్న పథకాలకు అడ్డుపడుతూ జగన్‌ను కట్టడి చేసేందుకు ఢిల్లీతో కలసి కుట్రలు పన్నుతున్నారు. మీ బిడ్డ బటన్లు నొక్కిన సొమ్మును అక్కచెల్లెమ్మల కుటుంబాలకు అందకుండా అడ్డు తగిలే దౌర్భాగ్య పరిస్థితుల్లోకి వీళ్లు దిగజారిపోయారు. గత ఐదేళ్లుగా క్యాలెండర్‌లో చెప్పిన విధంగా క్రమం తప్పకుండా ఇస్తూ పోతున్న మీ జగన్‌ను ఇబ్బంది పెట్టడానికి కుట్రలు పన్నుతున్నారు. చివరిలో అడ్డుపడితే నా అక్కచెల్లెమ్మల కుటుంబాలు ఊరుకుంటాయా? పెన్షన్ సొమ్ము ఇన్నేళ్ల పాటు మీ బిడ్డ ఇంటికే పంపించిన తర్వాత చివరి రెండు నెలలు ఆ డబ్బులు ఇంటికి రాకపోతే ఏం జరిగిందో ఆ అవ్వాతాతలు గ్రహించలేరనుకున్నారా? ఓటు అనే అస్త్రంతో చంద్రబాబుకు గట్టిగా బుద్ధి చెప్పాలని కోరుతున్నా. జూన్ 4న అధికారంలోకి వచ్చిన వెంటనే ఓ వారం రోజుల్లోనే ఈ బటన్లు అన్నీ మీ బిడ్డ క్లియర్ చేస్తాడు.

బాబు ఒక్క బటనూ నొక్కలేదు..

మనపై ఇన్ని కుట్రలు చేస్తున్న చంద్రబాబు దగ్గర డబ్బులు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే ఆయన మీ జగన్ మాదిరిగా ఎన్నడూ బటన్లు నొక్కలేదు. ఏ రోజూ ఏ ఒక్క అక్కచెల్లెమ్మకూ డబ్బులు, పథకాలు ఇవ్వలేదు. మీ బిడ్డ జగన్ ఈ 59 నెలల కాలంలో 130 సార్లు బటన్లు నొక్కి ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి పంపాడు. చంద్రబాబు దగ్గర ప్రజలను దోచేసిన సొమ్ము చాలా ఉంది. ఆ దోచేసిన సొమ్ముతో లోబర్చుకునేందుకు ఎన్నికల రోజు రూ.2 వేలు, రూ.3 వేలు, కొన్ని చోట్ల రూ.4 వేలు, రూ.5 వేలు కూడా ఇస్తాడు. చంద్రబాబు ఎన్నికల రోజు ఇచ్చే ఆ డబ్బంతా మనదే. మన దగ్గర దోచేసిన డబ్బే అది. కాబట్టి ఆయన ఇస్తే ఏ ఒక్కరూ వద్దు అనొద్దు. కానీ ఓటు వేసేటప్పుడు మాత్రం ఒక్కటే గుర్తు పెట్టుకోండి. మీకు, మీ కుటుంబానికి ఎవరి వల్ల మంచి జరిగిందో ఒక్కసారి గుర్తు చేసుకోండి.

ఈ అభివృద్ధి, పథకాలను కొనసాగిద్దాం..

మరో ఆరు రోజుల్లో కురుక్షేత్ర మహా సంగ్రామం జరగబోతోంది. ఇవి కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి మాత్రమే కావు. ఈ ఎన్నికలు రాబోయే ఐదేళ్లలో మీ ఇంటింటి అభివృద్ధి, పథకాల కొనసాగింపును నిర్ణయించేవి. జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ కొనసాగింపు, ఇంటింటి అభివృద్ధి. పొరపాటున చంద్రబాబుకు ఓటేస్తే పథకాలన్నీ ముగింపు, మళ్లీ మోసపోవడమే. చంద్రబాబును నమ్మడం అంటే కొండచిలువ నోట్లో తల పెట్టడమే. చంద్రబాబును నమ్మడం అంటే చంద్రముఖిని నిద్ర లేపటమే. రాష్ట్రంలో గతంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే ఉంటే మీ బిడ్డ వచ్చాక ఏకంగా మరో 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాడు. మేనిఫెస్టో హామీల్లో 99 శాతం అమలు చేసి చిత్తశుద్ధి చాటుకున్నాం. గడప గడపకూ మేనిఫెస్టోతో వెళ్లి మరోసారి ఆశీర్వదించాలని కోరాం.

ప్రధాని పదవికి విలువలు లేకుండా చేశారు

బీజేపీ చేస్తున్న అవినీతి దేశంలో ఏ పార్టీ చెయ్యలేదు



- తోడు దొంగల కూటమి ఏ స్క్రిప్టు ఇస్తే అది చదివేయడమేనా?.. మోదీ స్థానిక సమస్యలను పట్టించుకోలేదు.. స్టీల్‌ప్లాంట్‌పై మాట్లాడలేదు
- పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నారని మీ నోటితోనే అన్నారుగా!.. పోలవరంలో అవినీతి జరిగిందని భావిస్తే విచారణ జరిపించుకోవచ్చు
- రాష్ట్రంలో పేదల కడుపు కొడుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ
- అమలులో ఉన్న పథకాలనూ నిలిపివేయిస్తున్నారు
- ఈసీ వాస్తవాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలి
- 2019లో పసుపు–కుంకుమకు మేం అడ్డుపడ్డామా?
- మంత్రి బొత్స సత్యనారాయణ

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బాబొస్తే ఇంగ్లిష్ మీడియం రద్దే..!

మేనిఫెస్టోలో పేర్కొన్న 'కేజీ టు పీజీ విద్య రివ్యూ' అందుకే..

- గతంలో చై–నా స్కూళ్ల కోసం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసిన ఘనత చంద్రబాబుదే
- తక్కువ మంది విద్యార్థులున్నారని 6 వేల సర్కారు స్కూళ్లకు ఆయన జమానాలోనే మంగళం
- ప్రభుత్వ ఉపాధ్యాయులకు నైపుణ్యం లేదని హేళన
- అసలు పేదల విద్య ప్రభుత్వ బాధ్యత కాదని ప్రకటించిందీ ఆయనే
- ఇప్పుడు పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం బోధనను దూరం చేయాలని కుట్ర

థర్డ్ డిగ్రీ, సాక్షులను కొట్టడం మీ డ్యూటీనా

కస్టోడియల్ విచారణ విధుల్లో భాగమా?

- చెప్పిన విధంగా వాంగ్మూలం ఇవ్వాలని ఎలా ఒత్తిడి చేస్తారు?
- దర్యాప్తు అధికారి ఇలాగేనా వ్యవహరించాల్సింది?
- వివేకా హత్య కేసులో సీబీఐ అధికారి రామ్‌సింగ్ తీరును ఎండగట్టిన హైకోర్టు
- సునీత, రాజశేఖర్‌రెడ్డి, రామ్‌సింగ్‌ల పిటిషన్లపై ముగిసిన వాదనలు
- తీర్పు వాయిదా వేసిన న్యాయస్థానం



సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో దర్యాప్తు అధికారిగా వ్యవహరించిన సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ తీరును హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. తాను చెప్పిన విధంగానే వాంగ్మూలం ఇవ్వాలని ఫిర్యాదుదారుడిపై రామ్‌సింగ్ ఎలా ఒత్తిడి చేస్తారని ప్రశ్నించింది. దర్యాప్తు అధికారి వ్యవహరించాల్సిన తీరు ఇదేనా అంటూ నిలదీసింది. సాక్షులను కొట్టడం, థర్డ్ డిగ్రీ ఉపయోగించడం వంటివి చేయవచ్చా అంటూ సీబీఐ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)ని ప్రశ్నించింది. ఇలాంటి కస్టోడియల్ విచారణ చేయడం విధి నిర్వహణలో భాగమా అంటూ నిలదీసింది. పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, సీబీఐ అధికారి రామ్‌సింగ్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై వాదనలు విన్న హైకోర్టు విచారణను ముగించింది. తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వివేకా హత్య విషయంలో తాము చెప్పినట్లు వినకుంటే అంతు చూస్తామంటూ బెదిరించడమే కాకుండా తనను శారీరకంగా, మానసికంగా వేధించారంటూ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి గతంలో పులివెందుల కోర్టులో ప్రైవేటు పిటిషన్ దాఖలు చేశారు. పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు పులివెందుల పోలీసులు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి సునీత, సీబీఐ అధికారి రామ్‌సింగ్‌లపై కేసు నమోదు చేశారు. పులివెందుల కోర్టులో చార్జిషీట్ కూడా దాఖలు చేశారు. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ సునీత, రాజశేఖరరెడ్డి, రామ్‌సింగ్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన శ్రీనివాసరెడ్డి, పులివెందుల కోర్టులో విచారణకు సంబంధించి తదుపరి చర్యలన్నీ నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలు మంగళవారం మరోసారి విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా సునీత, రాజశేఖరరెడ్డి తరఫు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ, మేజిస్ట్రేట్ యాంత్రికంగా ఉత్తర్వులిచ్చారన్నారు. పోలీసుల నుంచి నివేదిక కోరకుండా నేరుగా కేసు నమోదుకు ఆదేశాలివ్వడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. కేసు నమోదుకు జారీ చేసిన ఉత్తర్వుల్లో కారణాలను వెల్లడించలేదన్నారు.

సుప్రీంకోర్టు దర్యాప్తు నుంచి రాంసింగ్‌ను తప్పించింది

అనంతరం ఫిర్యాదుదారు కృష్ణారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ప్రద్యుమ్న కుమార్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రాంసింగ్‌పై తీవ్రమైన ఆరోపణలున్నాయన్నారు. అందుకే సుప్రీంకోర్టు ఆయన్ని వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు నుంచి తొలగించిందన్నారు. మేజిస్ట్రేట్ ఉత్తర్వులు సరైనవేనని తెలిపారు. కారణాలను తెలియచేయాల్సిన అవసరం లేదన్నారు. ముందస్తు అనుమతి అవసరం లేదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు తీర్పులను ప్రస్తావించారు.

రామ్‌సింగ్ ఏం చేసినా విధి నిర్వహణలో భాగంగానే చేశారు

సీబీఐ తరఫున ప్రత్యేక పీపీ అనిల్ తన్వర్ వాదనలు వినిపిస్తూ.. పులివెందుల కోర్టు పరిధి దాటి ఉత్తర్వులిచ్చిందని అన్నారు. ఫిర్యాదుదారుడి నుంచి ప్రమాణపూర్వక వాంగ్మూలాన్ని నమోదు చేయకుండానే కేసు నమోదుకు ఆదేశాలిచ్చారని తెలిపారు. రాంసింగ్ ఏం చేసినా విధి నిర్వహణలో భాగంగానే చేశారన్నారు. ఆ విధంగానే తన ముందు హాజరు కావాలని ఫిర్యాదుదారుడిని రామ్‌సింగ్ ఆదేశించారన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. సాక్షులను కొట్టడం, థర్డ్ డిగ్రీ ప్రయోగించడం వంటివి కూడా విధి నిర్వహణలో భాగమేనా అంటూ నిలదీశారు.

నిబంధనల మేరకే మేజిస్ట్రేట్ వ్యవహరించారు

పోలీసుల తరఫున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) యర్రంరెడ్డి నాగిరెడ్డి, అదనపు పీపీ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి, స్పెషల్ అసిస్టెంట్ పీపీ సూరా వెంకట సాయినాథ్ వాదనలు వినిపించారు. ప్రైవేటు ఫిర్యాదుపై విచారణకు ఆదేశించే విషయంలో మేజిస్ట్రేట్ ఎలాంటి కారణాలను తెలియచేయాల్సిన అవసరం లేదన్నారు. నిబంధనలకు అనుగుణంగానే మేజిస్ట్రేట్ వ్యవహరించారని వివరించారు. మేజిస్ట్రేట్ కేసును విచారణకు స్వీకరించలేదని, దర్యాప్తునకు మాత్రమే ఆదేశించి తుది నివేదిక కోరారని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ కూడా దాఖలు చేశారన్నారు. అయితే కోర్టు ఈ చార్జిషీట్‌ను సాంకేతిక కారణాలతో రిటర్న్ చేసిందన్నారు. సీబీఐ అధికారి ప్రాసిక్యూషన్‌కు ముందస్తు అనుమతి అవసరం లేదన్నారు. ఏ దశలోనైనా అనుమతి తీసుకోవచ్చని తెలిపారు. అందుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరించారు.

నర్రెడ్డి సునీత, రాజశేఖర్‌రెడ్డి చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలు

- రక్తపు వాంతులని నేను చెప్పలేదు
- వివేకా లేఖ దాచిపెట్టమని చెప్పింది రాజశేఖరే
- అవినాశ్, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పేర్లు చెప్పాలని సీబీఐ అధికారి రామ్‌సింగ్ తీవ్రంగా కొట్టాడు
- సునీత, రాజశేఖర్ నన్ను హైదరాబాద్‌కు పిలిపించుకుని బెదిరించారు
- నా కుమారుడి వివాహాన్ని రద్దు చేయించారు
- వైఎస్ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి



పులివెందుల: నర్రెడ్డి సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి చాలా నీచంగా మాట్లాడుతున్నారని వైఎస్ వివేకానందరెడ్డి వద్ద పీఏగా పనిచేసిన కృష్ణారెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. నర్రెడ్డి దంపతులు ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పినవనీ అబద్ధాలేనని తెలిపారు. కడుపుకు అన్నం తినేవాళ్లెవరూ ఇలా మాట్లాడరన్నారు. భార్యాభర్త రోజుకో అబద్ధపు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారన్నారు. నర్రెడ్డి బ్రదర్స్ నాటకాలాడుతున్నారని చెప్పారు. వైఎస్ వివేకా రక్తపు వాంతులతో చనిపోయాడని తాను నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డితో చెప్పలేదన్నారు. రూము మొత్తం రక్తపు మరకలున్నాయని, తలపైన గాయం ఉందని, బాడీ మొత్తం రక్తంలో ఉందని, సైడు వాకిలి, బెడ్ రూము వాకిలి తెరచి ఉన్నాయని, ఏసీ ఆన్‌లో ఉందని చెప్పానని తెలిపారు. రక్తపు వాంతులని ఎర్ర గంగిరెడ్డి అనగా, ఇంత రక్తం ఉంటే వాంతులంటావేమిటని తాను ఆయనతో వాదించానన్నారు. అలాంటిది రాజశేఖర్‌రెడ్డికి రక్తపు వాంతులని ఎలా చెబుతానని అన్నారు. అలాగే తాను వైఎస్ వివేకా లెటర్‌ను దాచిపెట్టడానికి ప్రయత్నం చేశానన్నారని, అదీ అబద్ధమేనని తెలిపారు. లెటర్ గురించి తాను రాజశేఖర్‌రెడ్డికి ఫోన్‌లో చెప్పగా ఆయనే దాచమన్నారని చెప్పారు. పోలీసులతో సమస్య కదా అని తాను అంటే ఆ విషయం ఆయనే చూసుకుంటానని చెప్పారన్నారు.

అవినాశ్‌రెడ్డి తనను మేనేజ్ చేశారనడం నిజం కాదన్నారు. నర్రెడ్డి దంపతులే తనను మేనేజ్ చేయాలని చూసి విఫలమయ్యారని చెప్పారు. లెటర్ దాచిపెట్టమని చెప్పిన వారిని కేసులో పెడతారని, కానీ వీరు అప్పట్లో ప్రభుత్వంలో ఉన్న టీడీపీ నాయకులతో కలిసి పోలీసులను మేనేజ్ చేసి తనను, మరో అమాయకుడైన ప్రకాష్‌ను కేసులో ఇరికించారన్నారు. తనది చిన్న ప్రాణం కాబట్టి ఇరికించారని, వారి కారణంగా తాను ఉద్యోగానికి 9 నెలలు సస్పెన్షన్‌కు గురయ్యానని, ప్రమోషన్, పాస్‌పోర్ట్ రెన్యువల్ ఆగిపోయాయన్నారు. తాను ఇప్పుడు 20 శాతం విషయాలే చెబుతున్నానని, మరలా మిగిలిన విషయాలు చెబుతానన్నారు.

తాను వైఎస్ వివేకా దగ్గర 37 సంవత్సరాలు ఏ జీతం తీసుకోకుండా పని చేశానని తెలిపారు. వివేకాను తాను చూసుకున్నట్లు వారి ఇంట్లో వారు కూడా చూసుకోలేదన్నారు. వివేకా తన ముందరే ఎన్నోసార్లు వారిని ఛీ కొట్టారని తెలిపారు. నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి, శివప్రకాష్‌రెడ్డి వారి బావ వివేకా ద్వారా కోట్ల ఆస్తులు సంపాదించుకున్నారని, అయినా వారిలో ఆశ చావలేదన్నారు. వివేకా రెండో వివాహం కారణంగా వారికి ఆయనతో తీవ్ర మనస్పర్థలు వచ్చాయన్నారు. వివేకా రెండో భార్య షమీమ్ కుమారుడికి ఆస్తులు పోకుండా రాజకీయంగా వివేకా ద్వారా ఎదగాలని విఫలమై ఈ రోజు వేరేవారిపై నిందలు వేస్తున్నారన్నారు. గతంలో డ్రైవర్‌గా దస్తగిరిని తొలగిస్తేనే పులివెందుల వస్తానని వివేకాకు రాజశేఖర్ గట్టిగా చెప్పడంతో ఆయన తొలగించారన్నారు. ఇప్పుడు అదే దస్తగిరిని ముందర పెట్టుకుని వీరు నాటకాలు ఆడుతున్నారని అన్నారు.

రామ్‌సింగ్ చెప్పినట్లు వినాలని సునీత బెదిరించారు

ఓసారి సునీత దంపతులు తనను హైదరాబాద్‌కు పిలిపించుకొని, రామ్‌సింగ్ చెప్పినట్లు వికపోతే కేసులో ఇరుక్కుంటావని బెదిరించారన్నారు. తాను అబద్ధం చెప్పనని కరాఖండిగా చెప్పానన్నారు. ఆ సమయంలో కృష్ణారెడ్డి మన మాట వినకపోతే నువ్వు కేసులో ఇరుక్కుంటావని రాజశేఖర్‌తో సునీత అన్నారని చెప్పారు. దీనికి అర్థమేమిటో మీడియా సోదరులే ఆలోచించుకోవాలని అన్నారు. ఎప్పటికైనా ఈ కేసులో రాజశేఖర్ జైలుకు వెళ్లక తప్పదన్నారు.

వారి ముగ్గురు పేర్లు చెప్పాలని రామ్‌సింగ్ కొట్టాడు

ఢిల్లీలో సీబీఐ అధికారి రామ్‌సింగ్ నెలరోజుల పాటు తనను తీవ్ర చిత్రహింసలకు గురిచేశాడన్నారు. హత్యలో వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి హస్తం ఉన్నట్లు సాక్ష్యం చెప్పాలని తీవ్రంగా కొట్టేవాడన్నారు. ఎంతకీ తాను ఒప్పుకోకపోవడంతో వదిలేశారన్నారు. ఆతర్వాత ఒకరోజు రామ్‌సింగ్ వాట్సప్ కాల్ చేసి తన కుమారుడిని తీసుకొని కడపకు రమ్మని చెప్పాడన్నారు. తామిద్దరం మరుసటిరోజు రామ్‌సింగ్ వద్దకు వెళ్లగా, వివేకా హత్యలో అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డిల హస్తం ఉన్నట్లు చెప్పాలంటూ తన కుమారుడి ఎదుటే కట్టెతో కొట్టాడన్నారు. దస్తగిరి, రంగన్న చెప్పినట్లు విన్నారని, వారిని సేవ్ చేశామని, నువ్వు వినకపోతే కేసులో ఇరికిస్తామని చెప్పాడన్నారు. తన బెయిల్ రద్దు చేసి మళ్లీ జైలుకు పంపిస్తామని బెదిరించాడన్నారు. తాను అబద్ధం చెప్పనని గట్టిగా చెప్పడంతో పంపించేశాడన్నారు. కృష్ణారెడ్డి మాట వినలేదని సునీత దంపతులకు రామ్‌సింగ్ చెప్పగా.. తన కుమారుడితో వివాహం కుదుర్చుకున్న గుంటూరుకు చెందిన మా వియ్యంకుడికి సునీత ఫోన్ చేసి కృష్ణారెడ్డిని ఏ క్షణమైనా అరెస్టు చేయిస్తామని, ఆస్తులు స్వాధీనం చేసుకుంటామని, వివాహం రద్దు చేసుకోవాలని బెదిరించారని, దీంతో వారు భయపడి వివాహం రద్దు చేసుకున్నారని తెలిపారు.

నాకేదైనా జరిగితే వారిదే బాధ్యత

తనకు ఇప్పటికీ కొంతమంది నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, వారి పేర్లు త్వరలో బయటపెడతానన్నారు. తన ప్రాణానికి ముప్పు ఉందని, తనకు ఏదైనా జరిగితే సునీత, రాజశేఖర్, శివప్రకాష్‌రెడ్డిలే బాధ్యులవుతారని చెప్పారు. ఈ విషయమై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశానని, వారు స్పందించకపోవడంతో కోర్టు ద్వారా పోరాటం చేస్తున్నానన్నారు. కేవలం రాజకీయ ఎదుగుదల కోసం సునీత దంపతులు అవినాశ్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని కృష్ణారెడ్డి తెలిపారు.

అప్పుడూ.. ఇప్పుడూ అంతే

పేదల పొట్ట కొట్టడమే లక్ష్యంగా వికృతరూపం దాల్చిన బాబు పెత్తందారీ పోకడ



- వారికి లబ్ధి జరిగేది ఏదైనా అడ్డుకోవడమే ఆయన లక్ష్యం
- అప్పట్లో ఇళ్ల స్థలాల పంపిణీ, ఇంగ్లీషు మీడియం చదువులు అడ్డుకునేందుకు ఎల్లోగ్యాంగ్ చేయని ప్రయత్నంలేదు.. ఇప్పుడు ఎన్నికల కోడ్‌ను అడ్డంపెట్టుకుని ఎప్పటినుంచో కొనసాగుతున్న డీబీటీలకూ అడ్డంకులు
- తొలి నుంచీ పేదలకు మేలు జరగకుండా కోర్టులకు వెళ్లి మరీ అడ్డుకున్న బాబు బ్యాచ్
- తాజాగా.. కోడ్ పేరుతో పేద విద్యార్థులు, రైతులు, చేయూత మహిళల పొట్టకొట్టిన 'పచ్చ'ముఠా.. ఐదేళ్లుగా కొనసాగుతున్న పథకాలపైనా కుట్రలు
- వీటికి కోడ్ వర్తించకపోయినా ఏపీపట్ల ఈసీ వివక్ష

ల్యాండ్ టైట్లింగ్ చట్టం నిజాలివిగో..

శాశ్వత భూ హక్కులు కల్పించడమే అసలు లక్ష్యం..

- గెజిట్ మాత్రమే జారీ అయింది.. నోటిఫికేషన్ రాలేదు.. కోర్టుల అధికారాలు తగ్గించలేదు
- ప్రజల స్థిరాస్తికి పూర్తి భద్రత ఉంటుంది

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాక్షి హైదరాబాద్

బుధవారం । 8 । మే । 2024

నగరంలో ఉష్ణోగ్రతలు మధ్యాహ్నం వరకు ఇలా.. | డిగ్రీల సెల్సియస్

గోషామహల్	42.9	ఐఎస్‌సదన్	41.9
జీడిమెట్ల	42.9	మలక్‌పేట	41.9
మియాపూర్	42.7	రామంతాపూర్	41.7
జియాగూడ	42.5	బండ్లగూడ	41.7
పాటిగడ్డ	42.5	రాజేంద్రనగర్	41.7
ఖైరతాబాద్	42.5	గౌలిగూడ	41.4
మూసాపేట	42.2	విజయనగర్ కాలనీ	41.4
షేక్‌పేట	42.2	చాంద్రాయణగుట్ట	41.3
నాచారం	42.1	మచ్చబొల్లారం	41.2
ఆదర్శనగర్	42.0	చిలకలగూడ	41.2
అల్వాపురి	42.0	నేరేడ్‌మేట్	41.2



రాత్రి 9 గంటల వరకు వర్షపాతం సెం.మీలలో ఇలా..

మియాపూర్ 13.3	కూకట్‌పల్లి 11.2
చందానగర్ 10.7	సికింద్రాబాద్ 10.4
లింగంపల్లి 9.9	గచ్చిబౌలి 9.5
యూసుఫ్‌గూడ 9.4	ఆర్‌సీ పురం 8.8
బాలాజీనగర్ 8.2	ఖైరతాబాద్ 7.7
మూసాపేట 7.7	ఎంసీహెచ్‌ఆర్డీ 7.5
బాలానగర్ 7.1	ఫతేనగర్ 6.9
బోరబండ 6.8	ఆదర్శనగర్ 6.6
గాజులరామారం 6.4	బంజారాహిల్స్ 5.6


ఈఎస్‌ఐ ఆస్పత్రి వద్ద జలమయమైన ప్రధాన రహదారి


మధ్యాహ్నం ఇలా..


రాత్రి ఇలా..

మండుటెండల్లో.. చిందేసిన చినుకు!

పొద్దంతా 'సూర్య' ప్రతాపం..సాయంత్రం దంచికొట్టిన వాన | అకాల వర్షంతో సిటీజనులకు ఓ వైపు ఉపశమనం..మరోవైపు అవస్థలు | అక్కడక్కడా కూలిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు

పలుచోట్ల విద్యుత్‌కు అంతరాయం | ప్రధాన కూడళ్లలో భారీగా ట్రాఫిక్ జామ్‌లు | అత్యధికంగా మియాపూర్‌లో 13.3 సెం.మీ వర్షపాతం | బాచుపల్లిలో గోడ కూలి ఒకరు మృతి, పలువురికి గాయాలు


ఖైరతాబాద్ జంక్షన్‌లో..

సాక్షి, సిటీబ్యూరో: మహా న'గరం' చల్లబడింది. మధ్యాహ్నం వరకు భానుడి భగభగలతో 42.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైన ఉష్ణోగ్రత సాయంత్రం నాలుగు గంటలకు 20 డిగ్రీలకు పడిపోయింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి చల్లదనంతో వేసవి తాపం నుంచి ఊరట కలిగింది. మరోవైపు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. దాదాపు గంటసేపు వర్షం కురవడంతో రహదారులు జలమయం కాగా, డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. తీవ్రమైన ఈదురు గాలులకు పలు ప్రాంతాల్లో వృక్షాలు, హోర్డింగ్స్ నేల కూలగా, ఫ్లెక్సీలు, చిన్న దుకాణాలపై కప్పిన కవర్లు ఎగిరిపడ్డాయి. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడటంతో వాహనాలు ధ్వంసమయ్యాయి. ప్రధాన రహదారులపై భారీగా వరద నీరు వచ్చి చేరడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం పనులు ముగించుకొని ఆఫీసుల నుంచి ఇంటిబాట పట్టిన వాహనదారులు నరకయాతన పడ్డారు. గంటల కొద్దీ ఎక్కడి వాహనాలు అక్కడే స్తంభించి పోయాయి. బాచుపల్లిలో భారీ వర్షానికి ఓ నిర్మాణ భవనం రిటైనింగ్ గోడ కూలి ఒకరు మృతిచెందగా..పది మంది కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఐదుగురు శిథిలాల కింద ఉన్నట్లు సమాచారం. అర్ధరాత్రి వరకు ఇక్కడ సహాయక చర్యలు కొనసాగగా 11.30 ప్రాంతంలో ఒక మృతదేహం లభించింది. మిగతావారి ఆచూకీ లభించాల్సి ఉంది.

మియాపూర్‌లో అత్యధికం

నగరంలోని మియాపూర్‌లో 13.3, కూకట్‌పల్లిలో 11.2 సెం.మీ వర్షపాతం నమోదైంది. మారేడుపల్లి, చిలకలగూడ, బోయిన్‌పల్లి, ఆల్వాల్, ప్యారడైజ్, ప్యాట్నీ, ఎల్బీనగర్, కాప్రా, సుచిత్ర, మలక్‌పేట, ఎర్రగడ్డ, అమీర్‌పేట, ముషీరాబాద్, చిక్కడపల్లి, బాలానగర్, ఫతేనగర్, సనత్‌నగర్, జీడిమెట్ల, చింతల్, షాపూర్, కుత్బుల్లాపూర్, మియాపూర్, చందానగర్, గచ్చిబౌలి, మాదాపూర్, కోఠి, అబిడ్స్, గోషామహల్, ఎంజే మార్కెట్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మియాపూర్‌లో వడగండ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఎల్బీనగర్ నుండి మన్సూరాబాద్‌కు


విద్యుత్ సౌధ వద్ద యువతుల ఉరుకులు పరుగులు

వెళ్లే రోడ్డులో భారీ చెట్టు కూలిపోయింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

భారీ ఈదురు గాలులతో విద్యుత్ వైర్లు తెగి సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సుమారు 480 విద్యుత్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బండ్లగూడ అత్తాపూర్‌లోని సబ్‌స్టేషన్‌లో ఇళ్ల రేకులు ఎగిరి వచ్చి భారీగా మంటలు చేలరేగాయి. సిటీలో విద్యుత్ డిమాండ్ నాలుగు వేల మెగావాట్ల నుంచి 1000 మెగావాట్లకు పడిపోయింది.

వర్షంపై అధికారుల అలర్ట్

నగరంలో కురిసిన వర్షానికి చాలా ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో జీహెచ్‌ఎంసీ అప్రమత్తమైంది. వర్షం పరిస్థితులపై కమిషనర్ రోనాల్డ్‌రాస్ అధికారులతో సమీక్షించారు. రోడ్లపై నిలిచిపోయిన నీటిని, చెట్ల కొమ్మల్ని వెంటనే తొలగించాల్సిందిగా ఆదేశించారు. కంట్రోల్‌రూమ్‌కు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి చర్యలు చేపట్టాలన్నారు. దాదాపు 75 ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయినట్లు అధికారులు గుర్తించారు. రాత్రి 7 గంటల వరకు జీహెచ్‌ఎంసీ కాల్‌సెంటర్‌కు దాదాపు 50 ఫిర్యాదులందాయి. రంగంలోకి దిగిన డీఆర్‌ఎఫ్ సిబ్బంది రోడ్లపై నిలిచిన నీటిని తొలగించే చర్యలు చేపట్టారు. ప్రజలు వర్షం సమస్యలుంటే కాల్‌సెంటర్స్‌కు ఫోన్ చేయాల్సిందిగా కమిషనర్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి సూచించారు. ఫోన్ నెంబర్లు 040-2111 1111, 9000113667. కమిషనర్ కమిషనర్ రోనాల్డ్ రోస్ మంగళవారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. నెక్టార్ గార్డెన్ వద్ద నీరు నిలిచిన ప్రాంతాన్ని సందర్శించి వెంటనే వరదనీరు తొలగించాలని అధికారులను ఆదేశించారు. హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిషోర్, ఈవీడిఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి సైతం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.

కిక్కిరిసిన మెట్రో రైళ్లు

మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో నగరంలో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. సిటీ బస్సులు రోడ్లపైన నిలిచిపోయాయి. దీంతో సాయంత్రం విధులు ముగించుకొని ఇళ్లకు బయలుదేరిన నగరవాసులు మెట్రో రైళ్లను ఆశ్రయించారు. రాయదుర్గం, హైటెక్‌సిటీ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఒక్కసారిగా మెట్రోలను ఆశ్రయించడంతో రద్దీ అనూహ్యంగా పెరిగింది. దీంతో రాయదుర్గం-నాగోల్, మియాపూర్-ఎల్‌బీనగర్ కారిడార్‌లలో ప్రయాణికుల రద్దీ కారణంగా పలు రైళ్లు ఆలస్యంగా నడిచినట్లు ప్రయాణికులు తెలిపారు. అకస్మాత్తుగా పెరిగిన డిమాండ్‌ను అధికారులు అంచనా వేయలేకపోయారు.

ఐటీ కారిడార్‌లో గ్రిడ్‌లాక్

గచ్చిబౌలి: భారీ వర్షం..గ్రిడ్‌లాక్‌తో మంగళవారం ఐటీ కారిడార్ అతలాకుతలమైంది. ఓ వైపు వరద నీటితో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్, మరోవైపు కరెంట్ లేకపోవడంతో అంధకారం అలుముకుని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మాదాపూర్‌లోని సీఓడీ జంక్షన్, సిటీ వైన్స్, పర్వత్‌నగర్, శిల్పారామం, నెక్టార్ గార్డెన్, కొత్తగూడ జంక్షన్, బొటానికల్ గార్డెన్, ట్రిపుల్ ఐటీ, అంజయ్యనగర్, పిస్తా హౌజ్, డీఎల్‌ఎఫ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వరద నీరు భారీగా రోడ్డుపైకి చేరింది. దీంతో దాదాపు నాలుగైదు గంటలపాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కూకట్‌పల్లి రోడ్డు, హైటెక్‌సిటీ నుంచి కొత్తగూడ, గచ్చిబౌలి నుంచి మియాపూర్ ఆల్విన్ కాలనీరోడ్డు, బొటానికల్ గార్డెన్ రోడ్డు, మెహిదీపట్నం వైపు జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గచ్చిబౌలి, కొండాపూర్, చందానగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఐపీఎల్ మ్యాచ్‌కు వాన గండం!

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఇప్పటి వరకు 56 మ్యాచ్‌లు ముగిశాయి. కానీ ఒక్క మ్యాచ్ కూడా వర్షం వల్ల రద్దు కాలేదు. అయితే నేడు ఉప్పల్ స్టేడియంలో జరగాల్సిన సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌కు వాన గండం పొంచి ఉంది. మంగళవారం నగరంలో కుండపోత వర్షం కురిసింది. ఉప్పల్ స్టేడియం సిబ్బంది మైదానంలోని మధ్య భాగాన్ని కవర్లతో కప్పి ఉంచారు.




బాచుపల్లిలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద గోడ కూలిన ఘటనలో గాయపడిన బాధితులకు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సలు


అమీర్‌పేటలో..



ట్యాంక్‌బండ్‌పై..


అమీర్‌పేట మైత్రివనం చౌరస్తాలో..


ఖైరతాబాద్ రైల్వేస్టేషన్ రోడ్డులో..


విద్యుత్ సౌధ వద్ద..


అమీర్‌పేటలో బైక్ పడిపోయిన దృశ్యం


ఎల్‌బీనగర్ కామినేని జంక్షన్‌లో..


గచ్చిబౌలి కొత్తగూడ జంక్షన్‌లో..


ఎన్టీఆర్ మార్గ్‌లో..


ఎల్‌బీనగర్-మన్సూరాబాద్ రోడ్డులో కూలిన చెట్టు

వడగళ్ల వాన

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి పరిధిలోని చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్ తదితర ప్రాంతాల్లో వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. కాలనీల్లో వరద నీరు పోటెత్తింది. కొన్నిచోట్ల చిన్నచిన్న రాళ్లు పడడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు.



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద రాకపోకలు బంద్



శేరిలింగంపల్లి: ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మంగళవారం సాయంత్రం లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు చేరింది. దీంతో ఇక్కడ నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. గచ్చిబౌలి పరిసర ప్రాంతాల నుంచి వచ్చే సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ట్రాఫిక్‌ను నల్లగండ్ల రైలు ఓవర్ బ్రిడ్జి మీదుగా మళ్లించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

బహదూర్‌పురా: బహదూర్‌పురా ప్రధాన రోడ్డులో విద్యుత్ స్తంభానికి కరెంటు రావడంతో..అటుగా నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డాడు. మంగళవారం రాత్రి భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ఓ వ్యక్తి రోడ్డు పక్కనుంచి వెళ్తుండగా విద్యుత్ స్తంభం తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ కారణంగా ఆ రూట్లో రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు.



కుంగిన లారీలు, కంటైనర్లు

మూసాపేట: భారీ వర్షానికి మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులో పార్కింగ్ చేసిన భారీ లారీలు, కంటైనర్ వాహనాలు భూమిలోకి కుంగిపోయి ఓ వైపు ఒరిగాయి. ఈ రోడ్డులో సుమారు 8 వాహనాలు పార్క్ చేసి ఉండగా..నెల రోజుల క్రితం ఈ ప్రాంతంలో మంచి నీటి పైపు లైన్ పనులు జరిగాయి. ఇందులో భాగంగా అండర్‌గ్రౌండ్‌లో భారీ పైపులు వేసి మట్టికప్పారు. కానీ రోడ్డుకు మరమ్మతులు చేయలేదు. దీంతో వర్షానికి మట్టి కుంగి భారీ వాహనాలు ఇరుక్కుపోయాయి.



మేం సిద్ధం

- ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓటు వేసేందుకు ఏర్పాట్లు
- దేశభక్తి ఉన్నవారు ఓట్లేయండి
- అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్‌కాస్టింగ్
- వికలాంగులకు ఉచిత రాకపోకల సదుపాయం
- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్



స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 13న లోక్‌సభ, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని, ప్రజలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓట్లు వేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. నగరంలో పోలింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై మంగళవారం సీపీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ జిల్లాలో 45 శాతం పోలింగ్ మాత్రమే జరిగిందని చెబుతూ, ఈసారి పెరుగుతుందని భావిస్తున్నామన్నారు. అయిదేళ్లకోసారి లభించే అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని, దేశభక్తి, దేశంపై ప్రేమ ఉన్న వారు దేశం కోసం ఓటు వేయాలన్నారు. జిల్లాలోని 3,986 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ స్క్రీనింగ్ ఆడియోతో సహ ఉంటుందని, రాజకీయ పార్టీలు కోరితే ఫీడ్ అందజేస్తామని తెలిపారు. ఇంటింటికీ ఓటరుస్లిప్పుల పంపిణీ 81 శాతం పూర్తయిందని, 95 శాతం వరకు జరిగే వీలుందన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 47 కేసులు నమోదయ్యాయన్నారు. జిల్లాలో 16,776 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటర్లుండగా, ఇప్పటివరకు 9,266 మంది ఓట్లు వేశారన్నారు. మిగతావారికి 10వ తేదీ వరకు అవకాశం కల్పిస్తామన్నారు. వికలాంగులు 'సాక్షం' యాప్‌లో పేరు నమోదు చేసుకుంటే ఇంటినుంచి పోలింగ్ కేంద్రం వరకు ఉచితంగా రాకపోకల సదుపాయం కల్పిస్తామన్నారు. ఇప్పటి వరకు 288 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. హోమ్ ఓటర్లు 571మందికి గాను ఇప్పటి వరకు 532 మంది ఓట్లు వేశారన్నారు. విధులకు హాజరు కాని సిబ్బందిలో వందమందికి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు.

దరఖాస్తు చేయని హౌసింగ్ సొసైటీలు

హౌసింగ్ సొసైటీలు కోరితే పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ఎన్నికల సంఘం అనుమతి ఉన్నప్పటికీ, జిల్లాలో తమకు పోలింగ్ కేంద్రం కావాలంటూ ఏ ఒక్క సొసైటీ కూడా లిఖితపూర్వకంగా కోరలేదన్నారు. పోలింగ్ రోజున వాణిజ్య దుకాణాలు, హోటళ్లు బంద్ పాటించాలన్నారు.

ఇంకా ఏమన్నారంటే..

- ఎండలు తీవ్రంగా ఉన్నందున బాధితులకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో వైద్యసాయమందేలా ఏర్పాట్లు. ఇంటింటికీ ఓటరు స్లిప్‌లతోపాటు పోలింగ్‌కు సంబంధించి సమాచార పుస్తకాలు, స్టిక్కర్ల పంపిణీ.
- క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లుగా నియమితులైన 1,250 మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఎన్నికల సిబ్బంది అందరికీ అవసరమైన శిక్షణలు పూర్తి.
- గత అసెంబ్లీ ఎన్నికల మాదిరే పోలింగ్ కేంద్రం వద్ద ఎంతమంది క్యూలోఉన్నారో తెలుసుకునేలా పోల్‌క్యూ రూట్ యాప్ అందుబాటులో ఉంటుంది. గూగుల్ మ్యాప్‌తో పోలింగ్ కేంద్రం దారి కూడా తెలుసుకోవచ్చు.
- హైదరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో ఒక్కో అభ్యర్థిపై ఉల్లంఘనల కేసులు నమోదు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తప్పనిసరిగా మహిళా సిబ్బంది ఉండేలా ఏర్పాటు. వేలిపై పురుషులు ఇంక్‌మార్క్ వేస్తే ఇబ్బంది పడే వారుంటే.. మహిళా సిబ్బందితోనే ఇంక్ వేయించే ఏర్పాటు.
- ప్రచార గడువు ముగిశాక కూడా పత్రికలు, సోషల్ మీడియాలో 'సైలెన్స్ ప్రచారం' చేసుకోవచ్చు. వాటికి ముందస్తు అనుమతి అవసరం. ఏఎస్‌డీ(ఆబ్సెంట్,షిఫ్టెడ్,డెత్)ఓటర్లుగా ఇప్పటి వరకు 18వేల మందిని గుర్తించాం. ఈ సంఖ్య ఇంకా పెరగనుంది.
- సమావేశంలో హైదరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అనుదీప్ దురిశెట్టి, హేమంత్ కేశవ్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ తేదీ తెలిపే ఓటరు స్టిక్కరు, 'ఐ ఓట్ ఫర్ షూర్' తదితర స్టిక్కర్లను ప్రదర్శించారు.

సమస్యాత్మక కేంద్రాల వద్ద గట్టి భద్రత..

డీఆర్‌సీలు, స్ట్రాంగ్‌రూమ్స్, కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శాంతిభద్రతల పరంగా 383 సమస్యాత్మక కేంద్రాలు సహా మొత్తం 1,046 పోలింగ్ కేంద్రాల వద్ద తగిన భద్రత ఏర్పాట్లు చేస్తామన్నారు. 14వేల మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారన్నారు. ఎన్నికల ప్రచారంతో పాటు వైన్ షాపులు పోలింగ్‌కు 48 గంటల ముందే మూసివేయాల్సి ఉంటుందని తెలిపారు.

అభివృద్ధే ఎజెండా

మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

- నాకు ప్రత్యర్థులు ఎవరూ లేరు
- రేవంత్‌రెడ్డి అయిదేళ్లు ఏమీ చేయలేదు
- మోదీ ప్రధాని కావాలని దేశం కోరుకుంటోంది
- జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తాం
- ఫ్లై ఓవర్ బ్రిడ్జీలు, ఆర్‌ఓబీలు ఏర్పాటు చేయిస్తాం
- ఇండస్ట్రియల్ కారిడార్ అవసరం ఎంతో ఉంది

INTERVIEW

'ఈ ఎన్నికల్లో నాకు సమీప ప్రత్యర్థులు ఎవరూ లేరు. గేటెడ్ కమ్యూనిటీ నుంచి బస్తీ వరకు ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. ప్రత్యర్థులు ఎన్ని మార్ఫింగ్ వీడియోలు విడుదల చేసినా.. అవాస్తవాలు ప్రచారం చేసినా ఓటర్లు నమ్మే పరిస్థితిలో లేరు. నేనేంటో గత 24 ఏళ్లుగా రాష్ట్ర ప్రజలు చూస్తున్నారు. దేశంలో మోదీ పాలన రావాలని.. బీజేపీని గెలిపించాలని ఓటర్లు బలంగా కోరుకుంటున్నారు' అని పేర్కొన్నారు మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్. 'ఎన్నికల ప్రచారంలో భాగంగా అన్ని బస్తీలు చుట్టేశాను. అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నాను. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు, చెరువులు, ఇతర ప్రభుత్వ స్థలాల కబ్జాలు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారిస్తా'నంటున్నారు ఆయన. 'సాక్షి'తో ఈటల రాజేందర్ ఇంటర్వ్యూ వివరాలు ఇవీ..

– సాక్షి, సిటీ బ్యూరో



మేనిఫెస్టోను ప్రజల ముందుంచాం..

మేం అధికారంలోకి వస్తే స్థానికంగా ఏం చేస్తామనేది ప్రత్యేకంగా మేనిఫెస్టో తయారు చేసి ప్రజల ముందుంచాం. ఐటీ పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనపై మాకు స్పష్టమైన ఎజెండా ఉంది. నగరం విస్తరిస్తుండడంతో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతర్గత రహదారులు, ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, ఆర్.ఓ.బీలు ఏర్పాటు చేయిస్తాం. ఇండస్ట్రియల్ కారిడార్ అవసరం ఉంది. మురుగుకూపంగా మారిపోయిన జవహర్‌నగర్‌ను సరికొత్తగ తీర్చిదిద్దుతాం.

మార్ఫింగ్ వీడియోలను ప్రజలు నమ్మరు

అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో నేను అనని మాటలను అన్నట్లు వీడియోలను క్రియేట్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. వాటిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. ప్రజలకు లోకల్ నాన్‌లోకల్‌తో సంబంధం లేదు. వాళ్లను కష్టంలో ఆదుకునే నాయకుడు కావాలని కోరుకుంటున్నారు.

మతపరమైన రిజర్వేషన్ల రద్దుతో నష్టం లేదు..

మత ప్రాతిపదికన రిజర్వేషన్లు వద్దని మాత్రమే బీజేపీ అంటోంది. సుమారు 50 శాతం మంది ముస్లింలు బీసీ–ఈ లో ఉన్నారు. ఆపై ఈబీసీ కోటా 10 శాతంలో రిజర్వేషన్ వర్తిస్తుంది. ఇంకా నష్టం జరిగేది ఎవరికి? మేము ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకమని ప్రత్యర్థి పార్టీలు ప్రచారం చేస్తున్నాయి. అదంతా రాజకీయ లబ్ధి కోసం తప్ప ముస్లింలపై ప్రేమతో కానే కాదు.

మల్కాజిగిరికి రేవంత్ ఏమీ చేయలేదు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక అని ప్రచారం చేసుకుంటే మల్కాజిగిరి ప్రజలు ఆదరించారు. గెలిచిన తర్వాత ఈ నియోజకవర్గానికి ఆయన చేసిన అభివృద్ధి ఏమీ లేదు. చేసింది చెప్పుకోలేక తప్పుడు వాగ్దానాలతో మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారు. కేసీఆర్‌పై వ్యతిరేకత రావడానికి చాలా సమయం పట్టింది. రేవంత్‌రెడ్డిని కేవలం 4 నెలల్లోనే ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలి

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారుల విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు ఏవి చేయాలన్న అడ్డంకిగా మారుతోంది. వీలయితే ఇక్కడి నుంచి కంటోన్మెంట్‌ను పూర్తిగా ఎత్తేయడం లేదా జీహెచ్ఎంసీలో విలీనం చేయాల్సిన అవసరం ఉంది.

దేశ రక్షణ, అభివృద్ధి కోరుకుంటున్నారు.

ప్రజలు దేశ రక్షణ, అభివృద్ధిని కోరుకుంటున్నారు. అది మోదీతోనే సాధ్యమని గట్టిగా నమ్ముతున్నారు. మల్కాగిజిరిలో నేను గెలవడం, దేశంలో మోదీ మూడోసారి ప్రధాని కావడం తథ్యం.

ఐపీఎల్ మ్యాచ్‌కు ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 8వ తేదీన ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో జరగనున్న ఐపీఎల్–20 క్రికెట్ మ్యాచ్ కోసం నగరంలోని వివిధప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈసీఐఎల్, ఎల్‌బీ నగర్, కొండాపూర్, జీడిమెట్ల, వనస్థలిపురం, ఇబ్రహీంపట్నం,మియాపూర్, లక్డీకాపూల్, కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డ్, జూబ్లీ బస్‌స్టేషన్, హకీంపేట్, మేడ్చల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, మెహిదీపట్నం, బీహెచ్ఈఎల్ తదితర ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియంకు ప్రత్యేక బస్సులను నడుపనున్నారు. అలాగే ప్రయాణికుల రద్దీ మేరకు వివిధ మార్గాల్లో అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లను నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రాయదుర్గం నుంచి నాగోల్ వరకు మియాపూర్ నుంచి ఎల్‌బీనగర్, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ మధ్య ప్రయాణికుల డిమాండ్ మేరకు మెట్రో సేవలు అందుబాటులో ఉంటాయి.

సికింద్రాబాద్‌కు కిషన్‌రెడ్డి చేసిందేమీ లేదు

- దానం నాగేందర్‌కు రాజకీయ నిలకడ లేదు
- బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు, ఎమ్మెల్యే తలసాని



ఎన్నికల ప్రచారంలో పద్మారావు, తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ ఎంపీగా నియోజకవర్గాన్ని పట్టించుకోని బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని, రాజకీయ నిలకడలేని కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌లను ప్రజలు ఓడించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి టి. పద్మారావు గౌడ్‌లు కోరారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్, న్యూబోయిగూడ, ఐడీహెచ్ కాలనీ, గొల్లకొమురయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొని మాట్లాడారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంతో పాటు నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జీలు, నాలా విస్తరణ, డబుల్ బెడ్రూం ఇళ్లు, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేసిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. ఈ ప్రాంతం నుంచి ఎంపీగా, కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహించి సికింద్రాబాద్‌కు చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అలవికాని హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల నగర ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు. నగరంలో కరెంట్ కోతలు, నీటి సరఫరా, ఇతరత్రా సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు.

దానం నాగేందర్‌ను గెలిపిస్తే కేంద్ర మంత్రి అవుతారు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



రోడ్ షోలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దానం నాగేందర్

అబిడ్స్: సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపిస్తే కేంద్రమంత్రి అవుతారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్ షోల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. అయిదేళ్లుగా ఎంపీగా ఉన్న కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ ప్రజలకు ఏ ఒక్కరోజు అందుబాటులో లేరన్నారు. ఎన్నికలు ఉన్నా, లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండే దానం నాగేందర్‌ను గెలిపిస్తే సికింద్రాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఆరు గ్యారంటీలను తాము ఇచ్చిన హామీ ప్రకారం.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు తప్పుడు ప్రచారాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చి.. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుంటే బీజేపీ, బీఆర్ఎస్‌లు తట్టుకోలేక పోతున్నాయన్నారు. దానం నాగేందర్ మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే ప్రజలకు అండగా ఉండి సేవలందిస్తానన్నారు. ఒక్కరోజు కూడా ప్రజల వద్దకు రాని కిషన్‌రెడ్డిని ఓడించాలని కోరారు. కార్యక్రమంలో నాంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఫిరోజ్‌ఖాన్, నాయకులు కొండల్, వినోద్‌కుమార్, శ్రీశైలం యాదవ్, సత్యనారాయణ్, ఫరీద్, కంచెర్ల చంద్రశేఖర్‌రెడ్డి, మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల గొంతుకలను గెలిపించుకోవాలి

గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న గౌడ సామాజిక వర్గానికి చెందిన బహుజన గొంతుకలు బూర నర్సయ్య గౌడ్, పద్మారావు గౌడ్‌లను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గౌడ జన హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్న గౌడ కులస్తులకు అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యమివ్వకపోవడం బాధాకరమన్నారు. బీసీల్లో అత్యధిక జనాభా కలిగి ఉండి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న వీరిని గెలిపించుకోవాలని కోరారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వారసత్వాన్ని పార్లమెంట్‌లో నిలబెట్టాలని కోరారు. అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం ఇరువురు పని చేశారని గుర్తు చేశారు. వలస పాలకుల ఆధిపత్యాన్ని ఎదురించి డాక్టర్ల జేఏసీ చైర్మన్‌గా పని చేసిన బూర నర్సయ్యగౌడ్, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా సేవలు అందించిన పద్మారావుగౌడ్‌లను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిరంతరం ప్రజల పక్షాన, ప్రజల మధ్య ఉండి వారి హక్కుల కోసం పోరాడుతున్న వీరిని పార్లమెంట్‌కు పంపాలని కోరారు.

ఓటు హక్కు వినియోగంపై విస్తృత చైతన్యం

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటింగ్ శాతం పెంచాలని అటు అధికారులు, ఇటు వివిధ సంస్థలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాయి. ముఖ్యంగా నగరాల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉండటం, దీనికి హైదరాబాద్ మహానగరం కూడా మినహాయింపు కాకపోవం విదితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు, ఎన్నికల కమిషన్‌తో పాటు ఎన్‌జీఓలు, ప్రముఖ వ్యక్తులు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రచారం, స్వీప్ కార్యక్రమాల పేరుతో 5కే రన్, సమావేశాలు నిర్వహిస్తున్నారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల వలంటీర్లతో 'యూత్ ఫర్ ఓట్' కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

యూత్‌లో ఓటింగ్‌పై ఆసక్తి పెంచేందుకు తాము కృషి చేస్తున్నామని యంగిస్తాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అరుణ్ డేనియల్ తెలిపారు. ఇందుకోసం తాము మ్యూజిక్ బ్యాండ్స్, స్టేజ్ షోలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

ఉగ్రదాడులకు మోదీ చెక్ పెట్టారు

కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్: దేశంలో 2014కు ముందు పెద్ద ఎత్తున ఉగ్రదాడులు జరిగేవని మోదీ ప్రధాని అయిన తర్వాత ఒక్క దాడికి కూడా తావు లేకుండా చేశారని కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో సీనియర్ నేత పాదూరి కరుణ ఏర్పాటు చేసిన కాలనీ వాసుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మన కరెన్సీని ఇతర దేశాల్లో ముద్రించి ఐఎస్ఐ ద్వారా ఇండియాలో కూడా చలామణి చేశారని, ఐఎస్ఐని దెబ్బతీయడంలో పెద్ద నోట్ల రద్దు కూడా ఒక భాగమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి ఏమీ దొరకక ఏదో ఒకటి ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పది లక్షల కోట్ల రూపాయల అభివృద్ధి రేవంత్‌కు గాడిద గుడ్డులా కనిపిస్తోందని దుయ్యబట్టారు. తెలంగాణలో ఈ ఎన్నికల్లో బీజేపీ రెండంకెల సంఖ్యను అందుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నారెడ్కో కౌన్సిల్ ప్రెసిడెంట్ పాదూరి రవి కాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలనీ రిక్రియేషన్ సెంటర్ అధ్యక్షుడు వైవై.రెడ్డి, రాజ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలనీ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షురాలు ప్రవీణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా ఫేక్ వీడియో కేసు సీఎంవో వరకు వస్తుంది

బీజేపీ యువమోర్చా జాతీయ అధ్యక్షుడు తేజస్వి సూర్య



కార్యక్రమంలో పాల్గొన్న తేజస్వి సూర్య, చిత్రంలో బండారు విజయలక్ష్మి తదితరులు

హిమాయత్ నగర్: అమిత్ షా ఫేక్ వీడియో కేసు సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం వరకు వస్తుంది. ఈ కేసులో ఇప్పటికే పలువురు అరెస్ట్ అయ్యారు, రాసిపెట్టుకోండి, ఇంకా లోతుగా ఈ కేసు దర్యాప్తు జరుగుతుంది'అని బీజేపీ యువమోర్చా జాతీయ అధ్యక్షుడు తేజస్వి సూర్య సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం బీజేపీ అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మికి చెందిన వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లెట్స్ ఓట్ క్యాంపెయిన్ పేరుతో నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ కళాశాల మైదానంలో మ్యూజికల్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తేజస్వి సూర్య మాట్లాడుతూ.. ఈ ఎన్నికలలో తెలంగాణలో 15 సీట్లలో బీజేపీ విజయం సాధిస్తుందని, దక్షిణ భారతంలో కొత్త రికార్డ్ సృష్టిస్తుందన్నారు.


అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి

జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: సమస్యలున్న ప్రాంతాల్లో అధికారులు ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించాలని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో తాగునీటి సరఫరా, ట్యాంకర్ మేనేజ్ మెంట్ స్ట్రాటజీ, ఎంసీసీ ఫిర్యాదులు, చలివేంద్రాల నిర్వహణపై వివరాలను తెలుసుకున్నారు. ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా ట్రిప్పుల సంఖ్య పెంచాలని, ఎంసీసీ ఫిర్యాదులపై దృష్టి సారించాలని సూచించారు. వాట్సాప్, ఫేస్ బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఫిర్యాదులపై ఆరా తీశారు. కలుషిత నీటి ఫిర్యాదులు వస్తే.. తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. చలివేంద్రాల సంఖ్య పెంచాలన్నారు. అవసరమైన చోట్ల వాటిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నిర్దేశిత సమయంలో ప్రజలకు వాటి ద్వారా తాగు నీరు అందించాలన్నారు. క్వాలిటీ వింగ్ అధికారులు నీటి నాణ్యతలో రాజీ పడకూడదన్నారు. తగిన మోతాదులో క్లోరిన్ శాతం ఉండేలా చూడాలని సూచించారు. వర్షాకాల ప్రణాళిక కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్మికులు, సిబ్బందికి ఇచ్చే రక్షణ పరికరాలు సరిపడా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. పని జరిగే ప్రాంతంలో రక్షణ చర్యలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు. ఎస్పీటీ వాహనాల ద్వారా పర్యవేక్షించాలని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. సమీక్షలో డైరెక్టర్ ఆపరేషన్స్– 1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్– 2 స్వామి, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ జీవితం స్ఫూర్తిదాయకం

ఉప్పల శ్రీనివాస్ గుప్తా



నాగోలు: డొక్కా సీతమ్మ జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. మంగళవారం నాగోల్‌లోని కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో ప్రముఖ సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో 19వ దశకపు నిత్యాన్న దాత డొక్కా సీతమ్మ 116వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. డొక్కా సీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాఢభూషి శ్రీధర్, రచయిత్రి, ప్రవచన కర్త డా.అనంత లక్ష్మి, ఆకృతి సుధాకర్, మదర్ థెరిసా ఫౌండేషన్ అధ్యక్షుడు చేపూరు శంకర్, వేద కల్యాణి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

హిమాయత్‌నగర్: జీహెచ్‌ఎంసీలో అమలు చేస్తున్న పథకాలను అధ్యయనం చేసేందుకు వచ్చిన ట్రైనీ ఐఏఎస్‌లకు వాటి అమలుపై కమిషనర్ రోనాల్డ్ రాస్ వివరించారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం హాల్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఈఎన్‌సీ జియాఉద్దీన్, సి.ఈ.దేవానంద్, అడిషనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, గీత రాధిక, సునంద, ట్రైనీ ఐఏఎస్‌లు ఉమాశంకర్, అమిత్, కిరణ్మయి, శారద శుక్ల,యువరాజ్, మాయక్, వికాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ప్రదానం

సాక్షి, సిటీబ్యూరో: మైత్రాన్ ఫౌండేషన్, నగరానికి చెందిన ఎన్జీవో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ యూడబ్ల్యూహెచ్ భాగస్వామ్యంతో ప్రతిభావంతులైన నగర విద్యార్థులకు యూనివర్సిటీ రీసెర్చ్ అలయన్స్ మైత్రాన్(యుఆర్‌ఏఎం) స్కాలర్‌షిప్స్ ప్రదానం జరిగింది. నిర్దిష్ట సబ్జెక్టులలో బీటెక్ 3వ సెమిస్టర్, ఎంటెక్ మొదటి సంవత్సరం చదివే మొత్తం 60 మంది విద్యార్థులకు తలా రూ.80 వేల విలువైన స్కాలర్‌షిప్స్ అందించామని, దేశవ్యాప్తంగా 494 ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి వచ్చిన 2,677 దరఖాస్తుల నుంచి ఐఐటీ హైదరాబాద్ సహా పలు ప్రముఖ విద్యాసంస్థలకు చెందినవారిని ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. వీరిలో 16 మంది విద్యార్థినులు, 10 మంది వికలాంగులు కూడా ఉన్నారన్నారు.

కొత్త ఆలోచనలతోనే అద్భుతాలు

శ్రీనగర్‌కాలనీ: కొంగొత్త ఆలోచనలతోనే అద్భుతాలు సృష్టించవచ్చని ప్రముఖ గ్రాఫిక్ డిజైనర్ కైలాష్ నాయక్ అన్నారు. సోమవారం నాగార్జునహిల్స్‌లోని హ్యామ్‌స్టెక్ ఫ్యాషన్ కాలేజీలో గ్రాఫికో పేరిట యాన్యువల్ డిజూన్ విజువల్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. విద్యార్థులు ప్రతిభకు పదునుపెట్టి సరికొత్త ఆలోచనలతో విభిన్న డిజైన్లను ప్రదర్శించారు. హ్యామ్‌స్టెక్ స్టాఫ్ డిజైనర్స్ సప్న విజయ్, సామ్‌సన్ తెన్నెల, అజితరెడ్డి పాల్గొన్నారు.

లలాస్ హెర్బల్ వార్షికోత్సవం



లలాస్ హెర్బల్ వార్షిక వేడుకల్లో మమతా త్రివేది తదితరులు

బంజారాహిల్స్: ప్రముఖ హెర్బల్ సంస్థ లలాస్ హెర్బల్ వార్షికోత్సవాల్లో మిసెస్ ఆసియా ఇంటర్నేషనల్ వరల్డ్ విన్నర్, మిసెస్ ఇండియా తెలంగాణ డైరెక్టర్ మమతా త్రివేది సందడి చేశారు. ఈ సందర్భంగా షోరూంలోని హెర్బల్ ఉత్పత్తులను ప్రదర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాణ్యమైన ఉత్పత్తులకు కేరాఫ్‌గా లాలాస్ హెర్బల్ నిలుస్తుందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్‌గుప్తా, లాలస్ మాట్లాడుతూ నాలుగు తరాల ద్వారా సహజమైన, ఆరోగ్య సంరక్షణ, సౌందర్య ఉత్పత్తులను ప్రవేశపెడుతూ వస్తున్నామని పేర్కొన్నారు.

పార్కుల్లో కాంగ్రెస్ ప్రచారం

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ అభివృద్ధిని ఆకాంక్షించే సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని గ్రేటర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ దూడల రవిగౌడ్ అన్నారు. మంగళవారం ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్‌కాలనీ, కళ్యాణ్‌నగర్ పార్క్‌లలో వాకర్స్‌కు కాంగ్రెస్ పార్టీ పథకాలను వివరించి అమూల్యమైన ఓటువేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు మోసిన్, రమేష్‌నాయక్, ఎల్లమేశ్వర్, శశి, సలామ్, ఖాజా పాల్గొన్నారు.

మగ్గపెట్టిన మామిడి విషంతో సమానం

కన్జ్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి

పంజగుట్ట: మోతాదుకు మించి రసాయనాలను ఉపయోగించి మామిడి పండ్లను మగ్గపెడుతున్నారని, ఇవి విషంతో సమానమని కన్జ్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సంస్థకు వచ్చిన ఫిర్యాదు మేరకు బాటసింగారం పండ్ల మార్కెట్‌ను సందర్శించామని, ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు పాటించకుండా నిషేధిత రసాయనాలు వినియోగిస్తూ కృత్రిమ పద్ధతిలో వ్యాపారులు పండ్లను మగ్గపెడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై ప్రశ్నిస్తే తమపైనే వ్యాపారులు దాడులకు దిగుతున్నారని, వారు ఇంతకు తెగిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గుడపర్తి శివకుమార్, రమేష్, సంజయ్, రాజు పాల్గొన్నారు.

డ్రగ్స్ కొరియర్ పేరిట వృద్ధుడికి బెదిరింపు

రూ.91 లక్షలు వసూలు చేసిన కేటుగాళ్లు

హిమాయత్‌నగర్: బ్యాంకాక్ నుంచి థాయ్‌లాండ్‌కు డ్రగ్స్ కొరియర్ చేస్తున్నారంటూ ఓ వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు బెదిరించి భారీ నగదు కాజేశారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన 74 ఏళ్ల వ్యక్తికి ఫెడెక్స్ కొరియర్ నుంచి కాల్ వచ్చింది. అతని ఆధార్‌కార్డు నంబర్ ద్వారా పంపించిన పార్శిల్‌లో 140 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌తో పాటు ఐదు పాస్‌పోర్టులు, బ్యాంకు క్రెడిట్ కార్డులు, 4 కిలోల దుస్తులు, ల్యాప్‌టాప్ ఉన్నాయని చెప్పారు. ఈ విషయంపై ముంబై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారని భయపెట్టారు. అనంతరం బాధితుడికి స్కైప్ ద్వారా సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి.. 'మీరు డ్రగ్స్ సరఫరా, మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నారు'అని బెదిరించారు. నకిలీ సీబీఐ లేఖ చూపించి బ్యాంక్ అకౌంట్ల వివరాలు చెప్పాలని, వాటిని వెరిఫై చేస్తామని చెప్పి, ఖాతాలలో ఉన్న రూ.91,64,800 కాజేశారు. దీంతో వృద్ధుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

బై చాన్స్ కోసం..!

ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక వస్తే.. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ బలనిరూపణ యత్నాలు

పట్టుకోసం మూడు పార్టీల ప్రణాళికలు

అగ్ర నేతలంతా ఖైరతాబాద్‌లోనే..



ఫిలింనగర్‌లో రోడ్ షో నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి (ఫైల్)



కాంగ్రెస్ అభ్యర్థి దానంతో రోడ్ షోలో సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)



బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుకు మద్దతుగా గోవర్ధన్‌రెడ్డి ప్రచారం (ఫైల్)

బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో బలాన్ని పెంచుకునేందుకు మూడు ప్రధాన పార్టీలు ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఆ పార్టీల అగ్రనేతల ప్రచారాలతో గత రెండు వారాలుగా కాలనీలు, బస్తీల్లో సందడి నెలకొంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గత ఏడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి 22 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నాగేందర్‌కు 67,348 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డికి 45,358 ఓట్లు, బీజేపీ అభ్యర్థి 38,094 ఓట్లు వచ్చాయి. అయితే గెలిచిన నెల రోజులకే దానం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ వెంటనే సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయనకు అధిష్టానం అవకాశం కల్పించింది. దీంతో ఖైరతాబాద్ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. ఒకవేళ దానం గెలిస్తే ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక అనివార్యమవుతుంది. ఉప ఎన్నికలో గెలవాలంటే ఇప్పుడు ఖైరతాబాద్‌లో మెజార్టీపై ఈ మూడు పార్టీలు దృష్టి పెట్టి ఆ మేరకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎలాగైనా ఈ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి ఆయనకు మెజార్టీ రాకుండా చూడాలని స్థానిక శ్రేణులను బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గట్టిగా ఆదేశించారు. దీంతో ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ ఇన్‌ఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ఆ పార్టీ లోక్‌సభ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. కేటీఆర్ ఖైరతాబాద్‌పై దృష్టి సారించారు. ఎలాగైనా దానంకు ఇక్కడ మెజార్టీ రాకుండా చూడాలని స్కెచ్ వేశారు.

ఎవరి స్కెచ్‌లు వారివి..

మరోవైపు నాగేందర్ పూర్తిగా ఖైరతాబాద్‌పై దృష్టి పెట్టి ఇక్కడ కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ తీసుకువచ్చేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. సీఎం రేవంత్ సైతం ఇప్పటికే సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో నాలుగుసార్లు రోడ్ షోలు నిర్వహించారు. ఖైరతాబాద్ అసెంబ్లీలోనూ పర్యటించి నాగేందర్‌ను గెలిపిస్తే కేంద్రంలో మంత్రి పదవి ఇప్పిస్తామని స్పష్టం చేశారు. ఇంకోవైపు బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపు కోసం చింతల రామచంద్రారెడ్డి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఆయన గెలుపునకు ఖైరతాబాద్ నుంచి బీజేపీ ఎక్కువ మెజార్టీ సాధిస్తే వచ్చే ఎన్నికల్లో తనకు మంచి పట్టు ఉంటుందని ఆయన భావిస్తున్నారు. ఇందులో భాగంగానే 2014 పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి 57 వేలకుపైగా ఓట్లు సాధించిన బీజేపీ ఈ ఎన్నికల్లో కూడా భారీ మెజార్టీపై దృష్టిపెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ముగ్గురూ ఖైరతాబాద్‌లోనే ఎక్కువగా పర్యటిస్తున్నారు. ఖైరతాబాద్ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటే వచ్చే ఎన్నికల్లో కూడా ఇక్కడ పాగా వేయవచ్చని భావిస్తున్నారు. మొత్తానికి సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఖైరతాబాద్ హాట్‌కేక్‌గా మారింది. అందరూ ఈ నియోజకవర్గంపైనే దృష్టి పెట్టి ఇక్కడ మెజార్టీ సాధించి పట్టు సాధించాలని తహతహలాడుతున్నారు.

జనార్దన్‌రెడ్డిని కలిసిన కొండా

మద్దతు ఇవ్వాలని కోరిన విశ్వేశ్వర్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: బీజేపీ సీనియర్ నేత బి.జనార్దన్ రెడ్డితో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గత ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన జనార్దన్‌రెడ్డి కొన్నాళ్లుగా ఆరోగ్య రీత్యా విరామం తీసుకుంటున్నారు. ఆయన సేవలను పార్టీకి వినియోగించుకోవాలని భావించిన కొండా లోకసభ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. దీనికి జనార్దన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. కొండా వెంట మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నేతలు నవీన్ రెడ్డి, మల్లారెడ్డి ఉన్నారు.

అల్లూరి సేవలు చిరస్మరణీయం

లిబర్టీ: మహనీయుల త్యాగాల వల్లే స్వాతంత్ర్యం సిద్ధించిందని లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరి వెంకటరాజేశ్వరరావు అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి నిర్వహించిన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అణచివేత, దోపిడీకి గురవుతున్న ప్రజలను సంఘటితం చేసి బ్రిటీష్ సామ్రాజ్యవాద పాలనకు వ్యతిరేకంగా సీతారామరాజు పోరాటం చేశారని కొనియాడారు. నేతలు పి.వి.శ్రీనివాస్‌రావు, సంకీర్త పాల్గొన్నారు.

బీజేపీ భావజాలం ప్రమాదకరం

హైకోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

హిమాయత్‌నగర్: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం దేశానికి ప్రమాదకరమని, అందుకే ఈ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని హైకోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఓట్ నీడ్ గ్యారెంటీ ఆర్గనైజేషన్(వీఎన్‌జీఓ) ఆధ్వర్యంలో 'బీజేపీ మతోన్మాద శక్తులను ఓడించాలి'అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్రలు చేస్తుందని, రిజర్వేషన్లను సైతం తొలగించేలా ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని తెలిపారు. ఒక మతాన్ని వ్యతిరేకించాలని భగవద్గీతలో కానీ, వేదాలలో కానీ లేదని, నేడు బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయాలు చేస్తుందని ఆయన విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, దాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు అంతర్గతంగా కలిసే ఉన్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో వీఎన్‌జీఓ వ్యవస్థాపక అధ్యక్షురాలు సోగరా బేగం, లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మన్నారం నాగరాజు, స్నేహ రెడ్డి, ఇస్లాముద్దీన్, జానకిరాములు, వెంకటేష్, సంతోష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీని తలపిస్తున్న మోదీ పాలన

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

పంజగుట్ట: ప్రధాని నరేంద్రమోదీ మాటలు, ఆయన పాలన చూస్తుంటే ఎమర్జెన్సీ తలపిస్తోందని పలువురు వక్తలు, కుల, ప్రజాసంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌డీఏ 400 సీట్లు సాధిస్తే రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం, హక్కులు, రిజర్వేషన్లు'అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ స్థాపకుల చరిత్ర చూసినా, వారి పుస్తకాలను చదివినా రాజ్యాంగం, రిజర్వేషన్లకు వ్యతిరేకమనే విషయం అర్థమవుతుందన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం, రిజర్వేషన్లను కాపాడుకునేందుకు పెద్ద ఉద్యమం చెయ్యాల్సి వస్తుందన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అగ్రకులాల ప్రధానులు ఓబీసీలకు ఉద్యోగాల్లో, విద్యలో రిజర్వేషన్లు కల్పిస్తే ఓబీసీకి చెందిన మోదీ అగ్రకులాల వారికి జనాభా కన్నా ఎక్కువ రిజర్వేషన్లు కల్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ సంపాదకులు రామచంద్ర మూర్తి మాట్లాడుతూ యువతకు మోదీపై వ్యామోహం బాగా పెరుగుతోందని, అది ఎంతో ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ప్రొఫెసర్ కాశీం, బీసీ కుల సంఘాల నాయకుడు చిన్న శ్రీశైలం యాదవ్, సంపాదకులు రెహమాన్, జర్నలిస్టు జయసారధి రెడ్డి, కాంగ్రెస్ నేత సంగిశెట్టి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కొలంబోలో అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీలు



లక్డీకాపూల్: అంతర్జాతీయ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన లింగంనేని మారుతి శంకర్ గోల్డ్, సిల్వర్ మెడల్లను కైవసం చేసుకున్నారు. శ్రీలంకలోని కొలంబో వేదికగా ఈ నెల 4న స్విమ్మింగ్ పోటీలు ఉత్కంఠభరితంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు ఆసక్తికరంగా సాగిన ఈ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో పాల్గొన్న నగరానికి చెందిన సెవెన్ సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ అధినేత మారుతి శంకర్ ఫ్రీ స్టైల్, బటర్‌ఫ్లై విభాగాల్లో రెండు గోల్డ్ మెడల్లను సాధించారు. బ్రెస్ట్‌స్ట్రోక్ విభాగంలో సైతం రెండు సిల్వర్ మెడల్లను సొంతం చేసుకున్నారు. ముగింపు వేడుకల్లో భాగంగా విజేతగా నిలిచిన మారుతి శంకర్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

మాదిగలకు మందకృష్ణ మోసం

దళిత సంఘాల నేతల ఆరోపణ

హిమాయత్‌నగర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగ జాతిని మోసం చేస్తూ, ఇప్పుడు తన స్వార్థం కోసం మతతత్వ బీజేపీకి మద్దతు ఇస్తున్నారని పలువురు దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. మంద కృష్ణ చెబితే మాదిగలు వినే పరిస్థితి లేదని, అవసరమైతే ఆయన్ని మాదిగజాతి నుంచి బహిష్కరిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ హెచ్.ఆర్.మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆరెపల్లి రాజేందర్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వర్గీకరణను ఎందుకు చేయలేదో కృష్ణమాదిగ సమాధానం చెప్పాలన్నారు. కేంద్రంలో సెక్యులర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని, అందుకే మాదిగ జాతి ఇండియా కూటమిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఫోరం జాతీయ ఉపాధ్యక్షుడు సి.వి.ప్రసాద్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏర్పుల శ్రీహరి పాల్గొన్నారు.

రవాన కష్టాలు

బంజారాహిల్స్: భానుడి ప్రతాపానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న నగరవాసికి మంగళవారం సాయంత్రం ఉపశమనం లభించింది. గంటన్నరపాటు ఏకధాటిగా ఈదురుగాలులతో కూడిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఖైరతాబాద్, సోమాజిగూడ, బంజారాహిల్స్ , పంజగుట్ట, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, కృష్ణానగర్‌లలోని ప్రధాన రహదారులు, బస్తీలు, కాలనీలు నీటమునిగాయి. జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు శ్రమించి వాటర్‌లాగింగ్ పాయింట్లను క్లియర్ చేశారు. పంజగుట్ట ఫ్లై ఓవర్‌పై పెద్ద ఎత్తున వరద నిలిచిపోవడంతో బేగంపేట, బంజారాహిల్స్ వైపు నుంచి వచ్చే వాహనాలు స్తంభించాయి.

పంజగుట్ట ఫ్లై ఓవర్‌పై భారీగా ట్రాఫిక్ జామ్, నిలిచిన వరద నీరు



పంజగుట్ట మోడల్ హౌజ్ వద్ద..






అమీర్‌పేట్ చర్మాస్ జంక్షన్‌లో...

సోమాజిగూడ రోడ్డులో..







రాజ్‌భవన్ రోడ్డులో..

పాతబస్తీలో పతంగేనా?

నాలుగున్నర దశాబ్దాలుగా మజ్లిస్ ఏకఛత్రాధిపత్యం

- ప్రత్యర్థులకు అందనంత దూరంలో మెజారిటీ
- మైనారిటీ ఓట్లు చీలకుండా పోటీ నుంచి తప్పుకున్న ఎంబీటీ
- ప్రచారంలో దూసుకెళుతున్న బీజేపీ
- హైదరాబాద్ లోక్‌సభ పోరు ద్విముఖం



హైదరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌లో ప్రధాన రాజకీయపక్షాల మేనిఫెస్టోలు, ప్రలోభాలు, అభ్యర్థిత్వం, ప్రచార అంశాలేవీ పనిచేయవు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉండే పార్టీలు, ప్రధాన ప్రతిపక్ష పార్టీల బలాలు, బలగాల కంటే బలమైన ముస్లిం, హిందుత్వ ఎజెండాలు ఇక్కడి రాజకీయాలను శాసించి ఎన్నికల ఫలితాలను నిర్దేశిస్తాయి. ఈ సెగ్మెంట్‌లో మెజారిటీ ఓటర్లు ముస్లిం సామాజికవర్గానికి చెందినవారే. దీంతో నాలుగున్నర దశాబ్దాలుగా మజ్లిస్ పార్టీ తిరుగులేని విజయాలను సాధిస్తూ వస్తోంది. రాష్ట్రంలో అధికారంలో ఉండే పార్టీలు కూడా మొక్కుబడిగా స్నేహపూర్వక పోటీకి పరిమితమవుతాయి. బీజేపీ హిందుత్వ ఎజెండాతో మూడు దశాబ్దాలుగా పాతబస్తీపై పాగావేసేందుకు శక్తియుక్తులు ఒడ్డుతున్నా, రెండోస్థానంతో సరిపెట్టుకోవాల్సివస్తోంది. ఎప్పటి మాదిరిగా ఈసారి కూడా ముస్లిం-హిందుత్వ వాదం మధ్య పోరు నెలకొన్నా.. సామాజిక మాధ్యమాలు ప్రతి చిన్నఅంశాన్ని భూతద్దంలో చూపిస్తుండటంతో హైదరాబాద్ లోక్‌సభపై అందరి దృష్టి పడింది. అయితే ఈసారి బీజేపీ అభ్యర్థి దూకుడు సైతం పాలపొంగే అని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. - సాక్షి, హైదరాబాద్

హిందూ ఓటర్లను ఆకర్షిస్తూ..

దేశంలోనే ముస్లిం సామాజికవర్గ పక్షాన గళంవిప్పే ఆల్ ఇండియా-మజ్లిస్-ఏ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) అధినేత, సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఐదోసారి ఎన్నికల బరిలో దిగారు. ఇప్పటి వరకు వార్ వన్‌సైడ్‌గా సాగగా, ఈసారి మాత్రం గట్టిపోటీ నెలకొంది. ప్రచారంలో ఎలాంటి హంగూఆర్భాటాలు లేకుండా 'మా పనితీరు.. మా గుర్తింపు' అంటూ ఉదయం పాదయాత్రతో డోర్ టూ డోర్ ప్రచారం, సాయంత్రం సభల ద్వారా ఓటర్లను ఆకర్షించే అసదుద్దీన్ ఒవైసీ ఈసారి సామాజిక మాధ్యమాలతోపాటు బ్యానర్లు, కటౌట్లు, వాల్‌పోస్టర్లతో ప్రచారం నిర్వహిస్తున్నారు. హిందూ సామాజిక వర్గ ఓటర్లను ఆకర్షించేందుకు తొలిసారిగా నల్లగొండ గద్దర్ గళంతో 'భగ..భగ మండే నిప్పుల దండై....ఏఐఎంఐఎం పార్టీ జెండా గుండెకు అండై''వీడియో, ఆడియోలను విడుదల చేశారు. పూజారుల మద్దతు సైతం కూడగట్టుకుంటున్నారు. కమలం దూకుడును కళ్లెం వేసేందుకు ఏకంగా ప్రచార సభల్లో 'ముస్లింలను టార్గెట్ చేస్తున్న బీజేపీకి ఓటు హక్కుతో జవాబు చెప్పాలని'ప్రధానాంశంగా ప్రస్తావిస్తూ పోలింగ్ శాతం పెంపునకు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. ఎంబీటీ ఈసారి ముస్లిం సామాజికవర్గ ఓట్లు చీలి బీజేపీకి లబ్ధి చేకూరకుండా ఉండేందుకు ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించింది. హైదరాబాద్ మజ్లిస్ పార్టీకి కంచుకోట. టీడీపీ ఆవిర్భావంతోనే మజ్లిస్ శకం ప్రారంభమైంది. హైదరాబాద్ ఎంపీ సెగ్మెంట్‌లో తొలిసారిగా 1984లో మజ్లిస్ బోణీ కొట్టింది. అప్పటి నుంచి సుల్తాన్‌సలావుద్దీన్ ఒవైసీ వరుసగా ఆరుసార్లు ఎంపీగా ఎన్నికవ్వగా, ఆయన తదనంతరం అసదుద్దీన్‌ఒవైసీ ఎన్నికల బరిలోకి దిగి వరుసగా విజయాలు సాధిస్తూ వస్తున్నారు.



అనుకూల అంశాలు
- అత్యధికంగా ముస్లిం సామాజికవర్గ ఓటర్లు
- అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండటం
- బలమైన ముస్లిం సామాజిక ఎజెండా
- హిందూ సామాజిక వర్గంలో సైతం గట్టి పట్టు
- నాలుగు దశాబ్దాలుగా గట్టి పట్టు, బలమైన కేడర్
- లోక్‌సభ పరిధిలోని ఏడింటిలో ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రాతినిధ్యం
- ముస్లిం సామాజికవర్గ ఓట్లు చీలకుండా ఎంబీటీ పోటీ నుంచి వైదొలగడం

ప్రతికూల అంశాలు
- బీజేపీ అభ్యర్థి మాధవీలత ప్రచారంలో దూకుడు
- పాతబస్తీ వెనుకబాటుతనం
- తక్కువగా నమోదయ్యే పోలింగ్ శాతం



అనుకూల అంశాలు
- బలమైన హిందుత్వ ఎజెండా
- ప్రచారంలో దూకుడు ప్రదర్శించడం
- పాతబస్తీలో సామాజిక, సేవా కార్యక్రమాలు
- ఆర్థిక బలం, అంగబలం, అధిష్టానం అండదండలు
- మజ్లిస్ పార్టీపై వ్యతిరేకత.. ముస్లిం ఓట్లు చీలడం
- ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మా

ప్రతికూల అంశాలు
- మెజారిటీ ఓటర్లు ముస్లిం సామాజికవర్గం వారు కావడం
- ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు గాను కేవలం ఒక సెగ్మెంట్‌లోనే ప్రాతినిధ్యం
- స్థానిక ఎమ్మెల్యే రాజాసింగ్ మద్దతు లేకపోవడం, ప్రచారానికి రాకపోవడం
- బలమైన పార్టీ కేడర్ లేకపోవడం
- స్థానిక పార్టీ శ్రేణుల నుంచి సహాయ నిరాకరణ

మాధవీలత దూకుడు

హైదరాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థిత్వం ఖరారుతో రాజకీయ ఆరంగ్రేటం చేసిన కొంపల్లి మాధవీలత బలమైన హిందుత్వ ఎజెండాతో ప్రచారంలో దూకుడు ప్రదర్శిస్తున్నారు. హిందూ భావజాలం పుణికిపుచ్చుకొని సామాజిక, సేవా కార్యక్రమాలకు పరిమితమై బయట పెద్దగా పరిచయం లేని మాధవీలతకు బీజేపీ సీటు దక్కడంతో అనూహ్యంగా తెరపైకి వచ్చారు. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే మాధవీలత తన అభ్యర్థిత్వం ఖరారుతోనే తన ప్రత్యర్థి సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీపై మాటలతూటాలు పేల్చి జాతీయమీడియా దృష్టిలో పడ్డారు. ఒక నేషనల్ టీవీ చానల్ నిర్వహించిన 'ఆప్‌కి అదాలత్'కార్యక్రమంలో పాల్గొన్న మాధవీలత మాట్లాడే తీరుకు ప్రధాని మోదీ కితాబు ఇవ్వడంతో దేశ రాజకీయాలను ఆకర్షించారు. కేంద్ర ప్రభుత్వం ఆమెకు వై ప్లస్ కేటగిరి భద్రత కల్పించింది. పాతబస్తీలో శ్రీరామనవమి ఊరేగింపులో బాణం ఎక్కుపెట్టి వదిలినట్టు హావభావాలతో బలమైన హిందుత్వ వాదాన్ని ప్రదర్శించి ఆ సామాజికవర్గ ఓటర్లను ఆకర్షించారు. సిట్టింగ్ ఎంపీ టార్గెట్‌గా పాతబస్తీ వెనుకబాటు, ఇతరాత్ర అంశాలపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ ప్రచారంలో దూకుడు ప్రదర్శిస్తూ మజ్లిస్ వ్యతిరేక ఓటర్లను ఆకర్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మూడు దశాబ్దాలుగా బీజేపీ పాతబస్తీలో పాగా వేసేందుకు ఎన్నికల్లో హేమాహేమీలను రంగంలోకి దింపి శతవిధాలా ప్రయత్నిస్తూనే ఉంది. బీజేపీ పక్షాన బరిలో దిగిన బద్దం బాల్‌రెడ్డి, ముప్పారపు వెంకయ్యనాయుడు, సుభాష్ చందర్‌జీలు కొంతమేరకు గట్టి పోటీ ఇచ్చినా, విజయాన్ని అందుకోలేకపోయారు. గత రెండు పర్యాయాలుగా వరుసగా పోటీ చేసిన భాగ్యనగర్ ఉత్సవ కమిటీ బాధ్యుడు భగవంతరావు కూడా రెండో స్థానానికి పరిమితమయ్యారు.

ఫ్రెండ్లీగానే... కాంగ్రెస్, బీఆర్ఎస్

అధికార కాంగ్రెస్,ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు ఎన్నికల బరిలోదిగినా...మజ్లిస్ ఉన్న దోస్తానాతోఫ్రెండ్లీగానే పోటీ పడుతున్నారు. మజ్లిస్‌తో పదేళ్ల తర్వాత చిగురించిన స్నేహబంధం దెబ్బతినకుండా ఉండేందుకు అధికార కాంగ్రెస్ వ్యూహాత్మకంగా హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సమీర్ వలీ ఉల్లా ను బరిలో దింపింది. బీఆర్ఎస్ పార్టీ కూడా మజ్లిస్‌తో గల మిత్రత్వాన్ని దష్టిలో పెట్టుకొని గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను పోటీలో పెట్టింది. అధిష్టానాల తీరుతో విజయ అవకాశాలపై కనీస ఆశలు లేక ఇరువురు అభ్యర్థులు సైతం మొక్కుబడిగా ప్రచారం కొనసాగిస్తున్నారు. లోకసభ నియోజకవర్గం ఏర్పాటు అనంతరం ఆదిలోనే కాంగ్రెస్ పార్టీ విజయ పరంపర కొనసాగించినా... మజ్లిస్ శకం ప్రారంభం అనంతరం డిపాజిట్ దక్కడం కష్టంగా తయారైంది. బీఆర్ఎస్ పార్టీ కూడా పాతికేళ్లలో కనీసం డిపాజిట్ దక్కలేదు. మొక్కుబడిగా పోటీ చేస్తూ వస్తోంది.

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటర్ల వివరాలు

సెగ్మెంట్	పురుషులు	మహిళలు
మలక్‌పేట	1,59,250	1,56,369
కార్వాన్	1,85,420	1,77,588
గోషామహల్	1,43,179	1,31,463
చార్మినార్	1,19,217	1,09,251
చాంద్రాయణగుట్ట	1,72,944	1,74,635
యాకుత్‌పురా	1,79,682	1,76,266
బహదూర్‌పురా	1,61,240	1,59,954
మొత్తం	11,20,932	10,85,526

హైదరాబాద్ స్కాన్

2019లో జరిగిన ఎంపీ ఎన్నికల్లో ఆయా పార్టీలకు వచ్చిన ఓట్లు ఇలా...

- అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం) - ఓట్లు 5,17,100 (63.95%)
- భగవంతరావు (బీజేపీ) - ఓట్లు 2,35,285 (26.8%)
- పుస్తే శ్రీకాంత్ (టీఆర్ఎస్) - ఓట్లు 63,239 (7.2%)
- ఫిరోజ్‌ఖాన్ (కాంగ్రెస్) - ఓట్లు 49,944 (5.69%)

రాముడిలాంటి రఘురాముడు

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి.. నటుడు వెంకటేశ్ ఎన్నికల ప్రచారం



ర్యాలీలో మాట్లాడుతున్న నటుడు వెంకటేశ్. చిత్రంలో మంత్రి పొంగులేటి, అభ్యర్థి రఘురాంరెడ్డి

ఖమ్మం వన్‌టౌన్: భద్రాద్రి రాముడి మాదిరిగా సేవాభావమున్న ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సినీనటుడు దగ్గుబాటి వెంకటేశ్ కోరారు. రఘురాంరెడ్డి వియ్యంకుడైన వెంకటేశ్ ఖమ్మంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన రోడ్డు షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌ల్లో వెంకటేశ్ మాట్లాడుతూ ఓటు వేయడాన్ని అందరూ బాధ్యతగా భావించాలని కోరారు. కాగా, వెంకటేశ్‌ను చూసేందుకు జనం రహదారి పొడవునా బారులు తీరగా.. ఆయన అభివాదం చేస్తూ సాగిపోయారు. ప్రచారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రేణుకాచౌదరి, అభ్యర్థి రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

గాంధీలు కాదు.. జహంగీర్లు

రాహుల్‌పై బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి విమర్శ



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అర్వింద్

సుభాష్‌నగర్: ఫెరోజ్ జహంగీర్ మనవడైన రాహుల్‌కు గాంధీ పేరు ఎక్కడి నుంచి వచ్చిందని, ఆయన పేరు రాహుల్ జహంగీర్‌గా ఉండాలని, వారు గాంధీలు కాదని బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్ ధర్మపురి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నిజామాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫెరోజ్ జహంగీర్ భార్య మాజీ ప్రధాని ఇందిరా అని, ఆమె మనవడే రాహుల్ అని, వారు జహంగీర్లు అయితే గాంధీ పేరు పెట్టుకుని ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రధాని ఇందిరాగాంధీ రాజ్యాంగంలో సెక్యులర్ పదాన్ని చేర్చారని, దేశాన్ని రెండుగా విభజించిన తర్వాత కూడా ఎందుకు చేర్చాల్సి వచ్చిందని ప్రశ్నించారు. అలీఘడ్, జామియా మిలియా యూనివర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను ప్రత్యేక అమలు చట్టం ద్వారా తొలగించి ముస్లిం యూనివర్సిటీలుగా మార్చారని ఆరోపించిన అర్వింద్ తద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులు ఆయా యూనివర్సిటీల్లో చదివే అవకాశాన్ని కోల్పోయారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఉస్మానియా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలనూ ముస్లిం యూనివర్సిటీలుగా మార్చరని గ్యారంటీ ఏందని ప్రశ్నించారు.

పదేళ్లలో మోదీ చేసిందేమీ లేదు

మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి



జనగామలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

జనగామ: కేంద్రంలో పదేళ్ల మోదీ పాలనలో దేశంలో జరిగిన అభివృద్ధి శూన్యమని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి పేర్కొన్నారు. జాగో తెలంగాణ పేరుతో చేపట్టిన ఓటరు చైతన్య బస్సుయాత్ర మంగళవారం జనగామ జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పదేళ్ల నుంచి బీజేపీ చేసిన అవినీతి పాలన గురించి వివరించి ఓటర్లను చైతన్యం చేసేందుకే ఈ యాత్ర ప్రారంభించామన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ సర్కారు దేశ యువతకు ఎన్ని ఉద్యోగాలిచ్చారని ప్రశ్నించారు. ప్రధాని మోదీ తన ప్రసంగంలో పాకిస్తాన్, చైనా అంటూ మాట్లాడటమే తప్ప తన హయాంలో చేసిన అభివృద్ధి మాత్రం చెప్పుకోలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. బస్సు యాత్రలో 10 మంది ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు జమాతే ఉల్మా మద్దతు

ముస్లింలంతా కాంగ్రెస్ పార్టీకే ఓటేయాలి: జేయూ తెలంగాణ అధ్యక్షుడు కలీమొద్దీన్

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు జమాతే ఉల్మా సంస్థ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ తెలంగాణ అధ్యక్షుడు ఖాజా కలీమొద్దీన్ మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే రాష్ట్రంలోని ముస్లింలు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంలో తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారని, దేశ ప్రజల సంక్షేమానికి రాహుల్‌గాంధీ భారత్‌జోడో న్యాయ్ యాత్ర చేపట్టారని చెప్పారు. మళ్లీ దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తారని, రిజర్వేషన్లు తీసివేస్తారన్నారు. దేశంలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలంటే రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని, అందుకే తెలంగాణలోని ముస్లింలంతా కాంగ్రెస్‌కు ఓట్లేయాలని కలీముద్దీన్ కోరారు.

యునైటెడ్ ముస్లిం ఫోరం మద్దతు

ఎంపీ ఎన్నికల్లో మజ్లిస్, కాంగ్రెస్ పార్టీలకు యునైటెడ్ ముస్లిం ఫోరం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. హైదరాబాద్‌లో మజ్లిస్‌కు, మిగిలిన 16 పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చింది. మంగళవారం హైదరాబాద్ నాంపల్లిలో ఫోరం అధ్యక్షుడు మౌలానా ముఫ్తీ సయ్యద్ సాదిక్ మొహియుద్దీన్ ఫాహిమ్ అధ్యక్షతన ఏకగ్రీవ తీర్మానం చేశారు.

ఈటలపై మార్ఫింగ్ వీడియో..

సీఈఓకు బీజేపీ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మార్ఫింగ్ వీడియోతో సోషల్ మీడియా, టీవీ చానెళ్లలో జరుగుతున్న ప్రచారం వెనుక కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి ఉన్నారని సీఈఓ వికాస్‌రాజ్‌కు బీజేపీ ఫిర్యాదు చేసింది. మల్కాజిగిరి ఓటర్లు డబ్బు, మద్యానికి లొంగిపోతారని ఈటల రాజేందర్ అన్నట్టు మార్ఫింగ్ చేసిన వీడియో ఓ టీవీ చానల్‌తో పాటు పట్నం రితీశ్‌రెడ్డి ట్విటర్ ఫ్యాన్‌పేజీలోనూ ప్రసారమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల తేదీ సమీపిస్తుండడంతో ఈటల ప్రతిష్టను దెబ్బతీసి రాజకీయ ప్రయోజనం పొందేందుకు మార్ఫింగ్ వీడియోతో ప్రచారం చేస్తున్నందున, విచారణ జరిపి.. దీని వెనక ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం సీఈవోకు బీజేపీ మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, పార్టీ నేతలు కొల్లి మాధవి, గోకుల రామారావు వినతిపత్రం సమర్పించారు.

చాట్ తయారు చేసిన మాలోతు కవిత



భద్రాచలంలో చాట్ తయారు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కవిత

భద్రాచలం టౌన్: మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత మంగళవారం భద్రాచలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్లోని పానీపూరీ బండిలో చాట్ చేస్తూ అందరినీ ఉత్సాహపరిచారు. అనంతరం మాట్లాడుతూ...కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 4 నెలల కాలంలోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు పూర్తిగా అమలైన ప్రాంతాల్లో తాము ఓట్లు అడగమని, అమలు కాని ప్రాంతాల్లో కాంగ్రెస్ ఓట్లు అడగొద్దని సవాల్ విసిరారు. భద్రాద్రి ప్రాంతాభివృద్ధికి తనకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రావులపల్లి రామ్‌ప్రసాద్, మానె రామకృష్ణ, సత్యాలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఖైదీగా శ్రీరాముడు

- మీట్ ది ప్రెస్‌లో సీపీఐ కార్యదర్శి కూనంనేని వ్యాఖ్య
- పేద హిందువులకు మోదీ ఏం చేశారని ప్రశ్న
- దేశంలోనే అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి మోదీ అని విమర్శ



సాక్షి, హైదరాబాద్: శ్రీ రాముడు బీజేపీ ఖైదీగా ఉన్నాడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను ఎవరు విముక్తి చేస్తారా అని ఆ రాముడు ఎదురుచూస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టీయూడబ్ల్యూజే) మంగళవారం కూనంనేని సాంబశివరావుతో మీట్ ది ప్రెస్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ అధ్యక్షత వహించగా, సీనియర్ జర్నలిస్టు మల్లయ్య మోడరేటర్‌గా వ్యవహరించారు.కూనంనేని మాట్లాడుతూ పేద హిందువులకు మోదీ ఏం చేశారని నిలదీశారు. మతం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని, రాజ్యాంగాన్ని మార్చబోనని చెబుతున్న బీజేపీ, ముస్లిం రిజర్వేషన్లను ఎలా రద్దు చేస్తుందని ప్రశ్నించారు. మత విద్వేషాలను రెచ్చగొడుతున్న వారిని ముందు జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు. నీతిమంతుల పార్టీగా చెప్పుకునే బీజేపీకి ఎన్నికల్లో పెద్ద మొత్తంలో ఖర్చుపెడుతున్న డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. ప్రధాని మోదీ దేశంలోనే అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని, అధికారం కోసం ఆయన ఏమైనా చేస్తా రని కూనంనేని విమర్శించారు. ఇక దేశంలోనే అత్యంత అవినీతి పార్టీ బీజేపీయేనని, అందుకే ఆ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుస్తుందని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధిక స్థానాల్లో గెలుస్తుందని, బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని ఆయన అంచనా వేశారు. కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని, ఉద్యమకారుల గొంతు నొక్కారని, ఢిల్లీలో మోదీ కూడా అలాగే వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

మా మద్దతు లేకుండా కాంగ్రెస్ గెలవదు...

లోక్ సభ ఎన్నికల్లో ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ, భువనగిరి, కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్ నియోజకవర్గాల్లో కమ్యూనిస్టు పార్టీ మద్దతు లేకుండా కాంగ్రెస్ గెలిచే పరిస్థితి లేదని కూనంనేని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గౌరవప్రదమైన స్థానాలు తమకిస్తేనే పొత్తు ఉంటుందని, లేదంటే పోటీ ఉంటుందని స్పష్టం చేశారు.

4 ఎంపీ స్థానాలకు కాంగ్రెస్ కో-ఇన్‌చార్జులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని నాలుగు లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ కో-ఇన్‌చార్జులను నియమించింది. ఇప్పటికే పలువురు మంత్రులు, ఇతర ముఖ్య నేతలు పార్లమెంటు స్థానాల వారీ ఇన్‌చార్జులుగా ఉండగా, వారికి అదనంగా నాలుగు చోట్ల కో-ఇన్‌చార్జులను నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆదేశాలకు అనుగుణంగా ఎ.పి.జితేందర్‌రెడ్డి (మహబూబ్‌నగర్), టి.జగ్గారెడ్డి (మెదక్), కె.మదన్‌మోహన్‌రావు (జహీరాబాద్), టి.రామ్మోహన్‌రెడ్డి (చేవెళ్ల)లను కో-ఇన్‌చార్జులుగా నియమిస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటేస్తే ఎవరు ప్రధాని అవుతారో తెలియదు

మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై



మాట్లాడుతున్న తమిళి సై

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓట్లు వేస్తే తమ తరఫున ప్రధాని ఎవరు అవుతారనేది కూడా ఆ పార్టీలకు తెలియదని తెలంగాణ మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రధానంగా బీజేపీ-కాంగ్రెస్‌ల మధ్యే పోటీ ఉండబోతున్నదని, కొన్ని సీట్లలో మాత్రం బీఆర్ఎస్ పోటీ పడుతుందన్నారు. రాష్ట్రం నుంచి ఎక్కువ మంది బీజేపీ ఎంపీలు గెలవడంతోపాటు ఎక్కువ మంది కేంద్రంలో మంత్రులు అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. 'దక్షిణాదికి తెలంగాణ ముఖద్వారమని ప్రధాని మోదీ చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి ఆయన కట్టుబడి ఉన్నారు.ఐదేళ్లలో తెలంగాణకు 22సార్లు వచ్చారు' అని చెప్పారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో తమిళిసై మీడియాతో మాట్లాడుతూ 'రాష్ట్రంలో బీఆర్ఎస్ వైఫల్యం చెందింది. తెలంగాణకోసం ఆ పార్టీ పని చేయలేదు. గత రెండేళ్లలో కేసీఆర్ నాతో మాట్లాడలేదు. రాజ్యాంగ సంస్థలను గౌరవించలేదు' అని అన్నారు. మహిళ సాధికారత కోసం మోదీ పనిచేస్తున్నారని, చట్టసభల్లో రిజర్వేషన్ల కల్పన, ఇతర నిర్ణయాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెబుతున్నారే తప్ప అందుకు నిధులు ఎలా సమకూరుస్తారో తెలియదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలిచ్చిందని మండిపడ్డారు. తాను రాష్ట్ర గవర్నర్‌గా ఉన్నప్పుడు తెలంగాణ ప్రజలు మద్దతుగా నిలిచారని, ఇప్పుడు కూడా వారి మద్దతు కొనసాగడం సంతోషదాయకమన్నారు. రిజర్వేషన్లపై ఆర్ఎస్ఎస్ చీఫ్, ప్రధాని మోదీ స్పష్టత ఇచ్చినా పదేపదే అదే అంశాన్ని ప్రస్తావించడాన్ని ఆమె తప్పుబట్టారు. 2001లో అప్పటి ప్రధాని వాజపేయి రిజర్వేషన్లు ఉండాలని చెబితే, కుల ప్రాతిపదికన రిజర్వేషన్లను రాజీవ్ గాంధీ వ్యతిరేకించారని తమిళిసై గుర్తు చేశారు.

మీకు తెలుసా?!

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పార్టీల సంఖ్య 1951-52 తొలి ఎన్నికలతో పోలిస్తే ఏకంగా 12 రెట్లు పెరిగింది. తొలి ఎన్నికల్లో 53 పార్టీలు పాల్గొంటే 2019 నాటికి వాటి సంఖ్య 673కు పెరిగింది. అభ్యర్థుల సంఖ్య కూడా 1951లో 1,874 నుంచి 2019కల్లా 8,054కు పెరిగింది.

58 స్థానాల్లో రెడ్ అలెర్ట్!

నాలుగో దశలో బరిలో ఉన్న 21 శాతం అభ్యర్థులపై క్రిమినల్ కేసులు

ప్రకృతి విపత్తుల సమయంలో అలెర్ట్‌లు జారీ చేయడం చూశాం. ఎక్కువ మందికి తెలియదు గానీ, ఎన్నికలప్పుడూ అలెర్ట్‌లు జారీ అవుతుంటాయి. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో 96 నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో ఏకంగా 58 స్థానాల్లో రెడ్ అలెర్ట్ జారీ చేశారు! ఒక స్థానంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ముగ్గురు, అంతకంటే ఎక్కువ మందిపై క్రిమినల్ కేసులుంటే ఇలా చేస్తారు. ఓటర్లను అప్రమత్తం చేయడమే దీని ఉద్దేశం. నాలుగో దశలో మొత్తం 1,717 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 1,710 మంది అఫిడవిట్లను అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫామ్స్ (ఏడీఆర్) విశ్లేషించింది. ప్రతి ఐదుగురిలో ఒకరిపై, 360 మందిపై క్రిమినల్ కేసులున్నట్టు వెల్లడించింది. వీరిలో 274 మందిపై తీవ్ర నేరారోపణలున్నాయి. 11 మందిపై హత్య, 50 మందిపై అత్యాచారం, మహిళలపై వేధింపులు, 44 మందిపై విద్వేషపూరిత ప్రసంగాల కేసులున్నాయి. బీజేపీ నుంచి 40 మంది (57 శాతం), కాంగ్రెస్ నుంచి 35 మంది (57 శాతం), మజ్లిస్ నుంచి ముగ్గురు (100 శాతం), ఆర్జేడీ నుంచి ఇద్దరు (50 శాతం), శివసేన (ఉద్ధవ్) నుంచి ఇద్దరు (50 శాతం), ఎస్పీ నుంచి ఏడుగురు (37 శాతం), బీజేడీ నుంచి ఇద్దరు (50శాతం), శివసేన నుంచి ఇద్దరు (67 శాతం), బీఆర్ఎస్ నుంచి 10 మంది (59 శాతం), టీడీపీ నుంచి 9 మంది (53 శాతం), టీఎంసీ నుంచి ముగ్గురిపై (38 శాతం) క్రిమినల్ కేసులున్నాయి.

28 శాతం మంది కోటీశ్వరులు

నాలుగో విడతలో బరిలో ఉన్న కోటీశ్వరుల్లో తొలి మూడు స్థానాల్లోనూ తెలుగువారే ఉన్నారు! చంద్రశేఖర్ పెమ్మసాని (టీడీపీ) రూ.5,705 కోట్లతో దేశంలోనే అత్యంత సంపన్నుడిగా నిలిచారు. తర్వాతి స్థానాల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బీజేపీ) రూ.4,568 కోట్లు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (టీడీపీ) రూ.716 కోట్లతో ఉన్నారు. 476 మంది (28 శాతం)కి రూ.కోటి, అంతకంటే ఎక్కువ ఆస్తి ఉంది. బీజేపీలో 65 మంది (93 శాతం), కాంగ్రెస్‌లో 56 మంది (92 శాతం) కోటీశ్వరులే. టీడీపీ, జేడీ(యూ), శివసేన (ఉద్ధవ్), బీజేడీ, ఆర్జేడీ, శివసేన అభ్యర్థులంతా కోటీశ్వరులే. 24 మంది తమకెలాంటి ఆస్తులూ లేవని ప్రకటించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఉన్నత విద్యావంతులు సగం మంది

944 మంది (55%) డిగ్రీ, అంతకంటే ఎక్కువ చదివారు. 66 మంది డిప్లొమా చేశారు. 644 మంది (38 శాతం) ఆరో తరగతి నుంచి ఇంటర్ లోపు చదువుతో ఆపేశారు. 26 మందికి అక్షర జ్ఞానం లేదు.

మహిళలకు 10%

నాలుగో విడతలో మహిళలకు 10 శాతం సీట్లు దక్కాయి. 170 మంది మహిళలు పోటీ చేస్తున్నారు. 642 మంది (38 శాతం) 15–40 ఏళ్ల మధ్య వయస్కులు. 842 మంది 41–60 ఏళ్ల లోపువారు.

మహా మహులకూ తప్పని... ఓటమి

అంబేడ్కర్ నుంచి అరుణ్‌జైట్లీ దాకా...

రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ప్రజలు ఎప్పుడు ఎలాంటి తీర్పు ఇస్తారో, ఏ అనామకున్ని అందలమెక్కిస్తారో, ఏ దిగ్గజాన్ని తిరస్కరిస్తారో అనూహ్యం. తిరుగులేదనుకున్న మహామహ నేతలు ఓటమిపాలైన ఉదంతాలు మన దేశ ఎన్నికల చరిత్రలో ఎన్నో! అలాంటి పది మంది దిగ్గజ నేతల అనూహ్య ఓటమి చరిత్రను ఓసారి చూద్దాం...

- సాక్షి, నేషనల్ డెస్క్

బాబా సాహెబ్ అంబేడ్కర్




రాజ్యాంగ నిర్మాతగా యావద్దేశానికీ ప్రాతఃస్మరణీయుడు. అంతటి మహానాయకుడు కూడా ఎన్నికల్లో ఓడతారని ఊహించగలమా?! కానీ 1951–52లో జరిగిన దేశ తొలి సార్వత్రిక ఎన్నికల్లో అంబేడ్కర్ ఓటమి చవిచూడాల్సి వచ్చింది! నార్త్ బాంబే లోక్‌సభ నుంచి పోటీచేసి ఓడిపోవడమే కాదు, ఏకంగా నాలుగో స్థానంలో నిలిచారాయన! ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విఠల్ బాలకృష్ణ గాంధీ గెలుపొందారు.

ఇందిరాగాంధీ




దేశ రాజకీయాల్లో అజేయ శక్తిగా వెలిగిపోయిన నాయకురాలు. తొలి, ఏకైక మహిళా ప్రధాని. దశాబ్దానికి పైగా తిరుగులేని అధికారం చలాయించిన ఇందిర 1977 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజా వ్యతిరేకతలో కొట్టుకుపోయారు. ఎమర్జెన్సీ నిర్ణయం ఆమె ఏకైక ఎన్నికల ఓటమికి బాటలు వేసింది. రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానంలో సోషలిస్టు పార్టీ ప్రముఖుడు, రాం మనోహర్ లోహియా సన్నిహితుడు రాజ్‌నారాయణ్ చేతిలో ఇందిర ఓటమి చవిచూశారు. ఆయన 1971 లోక్‌సభ ఎన్నికల్లో కూడా సంయుక్త సోషలిస్ట్ పార్టీ అభ్యర్థిగా ఇందిరపై పోటీ చేసి ఓడిపోయారు. కానీ ఇందిర అవినీతికి పాల్పడ్డారని, ఆమె ఎన్నిక చెల్లదని కోర్టుకెక్కారు. ఇది అంతిమంగా ఎమర్జెన్సీ విధింపుకు దారితీయడం విశేషం! రాజ్‌నారాయణ్ వాదనతో అలహాబాద్ హైకోర్టు ఏకీభవించింది. రాయ్‌బరేలీ నుంచి ఇందిర ఎన్నిక చెల్లదని ప్రకటించింది. అంతేగాక ఆరేళ్ల పాటు లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయకుండా నిషేధం విధించింది. దాంతో చిర్రెత్తుకొచ్చిన ఇందిర 1975లో దేశమంతటా ఎమర్జెన్సీ విధించారు. 1977లో ఎమర్జెన్సీ ఎత్తేసి లోక్‌సభ ఎన్నికలకు వెళ్లి రాజ్‌నారాయణ్ చేతిలో 50 వేల పైగా ఓట్ల తేడాతో ఓడారు. ఇది భారత ఎన్నికల చరిత్రలోనే సంచలనాత్మక ఫలితంగా నిలిచిపోయింది.

మినూ మసాని



మినోచర్ రుస్తోమ్ మసాని. స్వాతంత్ర్య సమరయోధుడు. స్వతంత్ర పార్టీ అగ్ర నేత. మూడుసార్లు పార్లమెంటు సభ్యుడు, ఇండియన్ లిబరల్ గ్రూప్ థింక్ ట్యాంక్ వ్యవస్థాపకుల్లో ఒకరు. సంపాదకుడు, సామాజిక కార్యకర్త. ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి. అసమానతలకు వ్యతిరేకంగా బలమైన గొంతుక వినిపించిన మసాని 1971 లోక్‌సభ ఎన్నికల్లో రాజ్‌కోట్ నుంచి ఓటమి చవిచూడాల్సి వచ్చింది. కాంగ్రెస్ నాయకుడు ఘన్‌శ్యామ్ బాయ్ ఓజా చేతిలో 60,000 ఓట్లకు పైగా తేడాతో ఓడిపోయారు.

అటల్ బిహారీ వాజ్‌పేయ్



రాజకీయ దురంధరుడు. భారత రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడు. అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్న ఆయనకూ ఎన్నికల ఓటమి తప్పలేదు. 1984 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన కీలక కాంగ్రేసేతర నేతల్లో వాజ్‌పేయి ఒకరు. గ్వాలియర్‌లో కాంగ్రెస్ నేత మాధవరావు సింధియా రెండు లక్షల పైచిలుకు ఓట్ల మెజారిటీతో ఆయనపై విజయం సాధించారు.

దేవెగౌడ




అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుడు. ప్రధానిగా దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. అనంతరం కర్నాటక రాజకీయాల్లో కింగ్ మేకర్ అయ్యారు. ఆయనకు కూడా లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పలేదు. 2004లో కర్నాటకలోని కనకపుర నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నేత తేజస్వినీ గౌడ రమేశ్ చేతిలో లక్ష పైచిలుకు ఓట్ల తేడాతో ఓడిపోయారు.

బిజోయ్ కృష్ణ హండిక్



గొప్ప విద్యావేత్త. కాంగ్రెస్ నుంచి ఆరుసార్లు ఎంపీగా గెలుపొందిన తిరుగులేని అస్సామీ నేత. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. జోర్హాట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కేపీ తాసా ఆయనపై లక్ష ఓట్ల పైచిలుకు మెజారిటీతో గెలుపొందారు.

అరుణ్ జైట్లీ




పార్టీలకతీతంగా అందరూ మెచ్చిన నేత. ప్రధాని నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహితుడు. కేంద్ర ఆర్థిక మంత్రిగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తొలిసారి మోదీ హవా కొనసాగిన 2014 లోక్‌సభ ఎన్నికల్లో అరుణ్ జైట్లీ మాత్రం ఓటమి చవిచూశారు. అమృత్‌సర్ లోక్‌సభ స్థానం నుంచి పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరిందర్ సింగ్ లక్ష ఓట్ల పైచిలుకు మెజారిటీతో జైట్లీపై గెలుపొందారు.

సీకే జాఫర్ షరీఫ్




భారత రైల్వేల్లో స్వర్ణ యుగానికి నాంది పలికిన దార్శనికుడు. కాంగ్రెస్ సీనియర్ నేతల్లో ఒకరు. 2004లో తొలిసారి లోక్‌సభ ఎన్నికల ఎన్నికల బరిలో దిగిన హెచ్‌టీ సాంగ్లియానా చేతిలో ఓటమి చవిచూశారు. అప్పటిదాకా డీజీపీగా ఉన్న సాంగ్లియానా బీజేపీ ఆహ్వానం మేరకు పదవీ విరమణ చేసి పార్టీలో చేరారు. పాత బెంగళూరు ఉత్తర లోక్‌సభ స్థానం నుంచి బరిలో దిగి షరీఫ్‌పై విజయం సాధించారు.

సోమనాథ్ ఛటర్జీ



సీపీఎం దిగ్గజం. పదిసార్లు లోక్‌సభ సభ్యునిగా గెలిచిన ఎదురులేని నేత. 1971లో తొలిసారి సీపీఎం తరఫున పశ్చిమబెంగాల్లోని బుర్ద్వాన్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1984లో మాత్రం జాదవ్‌పూర్ లోక్‌సభ స్థానంలో యువ సంచలనం మమతా బెనర్జీ చేతిలో ఓటమి చవిచూశారు. ఆ తర్వాత మాత్రం 1989 నుండి 2004 వరకు సోమనాథ్ విజయ పరంపర సాగింది. సీపీఎం కంచుకోటగా భావించే బోల్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి 2004లో పదోసారి గెలిచి 14వ లోక్‌సభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పీవీ నరసింహారావు



పాములపర్తి వేంకట నరసింహారావు. ప్రధాని పదవిని అధిష్ఠించిన తొలి దక్షిణాది వ్యక్తి. ఒకే ఒక్క తెలుగువాడు. బహుముఖ ప్రజ్ఞాశాలి. కుదేలైన దేశ ఆర్థిక వ్యవస్థను విప్లవాత్మక సంస్కరణలతో పట్టాలెక్కించి ఆధునిక బాట పట్టించిన దార్శనికుడు. అంతటి నాయకునికి కూడా ప్రధాని కాకమునుపు ఓటమి తప్పలేదు. 1984 ఎన్నికల్లో బీజేపీ దేశవ్యాప్తంగా గెలిచిన రెండు లోక్‌సభ స్థానాల్లో తెలంగాణలోని హన్మకొండ ఒకటి. బీజేపీ అభ్యర్థి చందుపట్ల జంగారెడ్డి అక్కడ పీవీపై విజయం సాధించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌పై సానుభూతి వెల్లువెత్తినా ఆ పార్టీ తరఫున పోటీ చేసిన పీవీ మాత్రం ఓటమి చవిచూడటం విశేషం.

బీజేపీకి గట్టి పోటీ

ఉత్తరప్రదేశ్‌లో ఆసక్తికరంగా నాలుగో విడత పోరు

కీలక రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో నాలుగో విడత పోలింగ్‌పై అంతటా ఆసక్తి నెలకొంది. మొత్తం 80 లోక్‌సభ సీట్లకు గాను తొలి మూడు విడతల్లో 26 చోట్ల ఎన్నికలు పూర్తవగా నాలుగో విడతలో 13 స్థానాలకు పోలింగ్ జరగనుంది. పార్టీలన్నీ జోరుగా ప్రచారంలో తలమునకలయ్యాయి. ఆర్ఎల్డీ, అప్నాదళ్, బీజేపీ కూటమి ఒకవైపు; కాంగ్రెస్, ఎస్పీలతో కూడిన ఇండియా కూటమి మరోవైపు మోహరించాయి. బీఎస్పీ ఒంటరి పోరాటం చేస్తోంది. గత రెండు ఎన్నికల్లోనూ రాష్ట్రంలో ఆధిపత్యం చెలాయించిన బీజేపీకి ఈసారి విపక్షాలు గట్టిపోటీ ఇస్తున్నాయి. 13వ తేదీన పోలింగ్ జరగనున్న 13 సీట్లూ గత ఎన్నికల్లో బీజేపీ నెగ్గినవే. వాటిలో కీలక నియోజకవర్గాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్

కన్నౌజ్.. అఖిలేశ్‌కు బస్తీమే సవాల్



• అఖిలేశ్

సమాజ్‌వాదీ పార్టీకి కంచుకోట వంటి ఈ స్థానం గత ఎన్నికల్లో బీజేపీ పరమైంది. ‘నేతాజీ’ ములాయం సింగ్ యాదవ్, కుమారుడు అఖిలేశ్, కోడలు డింపుల్ ముగ్గురూ గెలిచిన నియోజకవర్గమిది. 1998 నుంచీ 2014 వరకు ఎస్పీ గుప్పిట్లోనే ఉంది. అలాంటి చోట 2019లో డింపుల్‌పై బీజేపీ నేత సుబ్రత్ పాఠక్ 12,353 ఓట్ల స్వల్ప మెజారిటీతో నెగ్గారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. ఎస్పీకి ప్రతిష్ఠాత్మకమైన ఈ స్థానాన్ని ఎలాగైనా చేజిక్కించుకునేందుకు పార్టీ చీఫ్ అఖిలేశ్ స్వయంగా రంగంలోకి దిగడంతో ఇది దేశంలోనే హాట్ సీట్‌గా మారింది. తొలుత అఖిలేశ్ మేనల్లుడు తేజ్‌ప్రతాప్ యాదవ్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. కార్యకర్తల్లో అసంతృప్తి కారణంగా అఖిలేశే బరిలో దిగారు. ఆయన ఇక్కడ మూడుసార్లు నెగ్గారు. 2012లో నియోజకవర్గాన్ని భార్య డింపుల్‌కు అప్పగించి సీఎం అయ్యారు. కాంగ్రెస్‌తో పొత్తు ఎస్పీకి కలిసొచ్చే అంశం. బీఎస్పీ నుంచి ఇమ్రాన్ బిన్ జాఫర్ బరిలో ఉన్నారు.

ఖేరి... తేనికి ఎదురుగాలి!



• అజయ్ మిశ్రా తేని

ఇక్కడ గత రెండు ఎన్నికల్లోనూ బీజేపీ నేత, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా తేని గెలిచారు. ఈసారి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్నా పరిస్థితులు ఆయనకు అంత సానుకూలంగా కన్పించడం లేదు. ఇండియా కూటమి తరఫున ఎస్పీ అభ్యర్థి ఉత్కర్ష్ వర్మ గట్టి పోటీ ఇస్తున్నారు. బీఎస్పీ నుంచి అన్షయ్ కల్రా బరిలో నిలిచారు.

ఉన్నావ్... మహారాజ్ హ్యాట్రిక్ గురి



• అనూ టాండన్

వివాదాస్పదుడైన సిట్టింగ్ ఎంపీ సాక్షి మహారాజ్‌కే బీజేపీ మళ్లీ టికెటిచ్చింది. పీహెచ్‌డీ చేసినా సాధువులా కాషాయం ధరించే ఆయనకు దేశవ్యాప్తంగా ఆశ్రమాలు, విద్యా సంస్థలున్నాయి. ఎస్పీ నుంచి గత రెండు ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చిన అరుణ్ శంకర్ శుక్లా బదులు అనూ టాండన్ బరిలో ఉన్నారు. ఆమె గత రెండు ఎన్నికల్లో ఓడాక 2020లో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి ఎస్పీ గూటికి చేరారు. బీఎస్పీ నుంచి అశోక్ కుమార్ పాండే రేసులో ఉన్నారు.

సీతాపూర్... ఎస్పీ పట్టు



• నకుల్ దూబే

ఒకప్పుడు బీఎస్పీకి గట్టి పట్టున్న ఈ స్థానంలో కమలనాథులు పాగా వేశారు. దాదాపు 22 ఏళ్ల పాటు బీఎస్పీలో కీలక నేతగా ఉన్న రాజేశ్ వర్మ 2013లో కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. 2014లో బీజేపీ అభ్యర్థిగా బీఎస్పీని మట్టికరిపించారు. 2019లో కూడా విజయం ఆయన్నే వరించింది. ఈసారీ వర్మనే బీజేపీ బరిలో నిలిపింది. మాయావతి ప్రభుత్వంలో మంత్రిగా చేసి 2019లో వర్మ చేతిలో పరాజయం పాలైన బీఎస్పీ నేత నకుల్ దూబే ఈసారి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నారు. బీఎస్పీ నుంచి మహేంద్ర సింగ్ యాదవ్ బరిలో నిలిచారు.

షాజహాన్‌పూర్... స్వతంత్రుని సవాల్



• రాజేశ్ కశ్యప్

గత రెండు ఎన్నికల్లో ఇక్కడ బీజేపీయే నెగ్గింది. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ, ప్రముఖ దళిత నేత అరుణ్ కుమార్ సాగర్ బరిలో ఉన్నారు. ఎస్పీ తొలుత రాజేశ్ కశ్యప్‌కు టికెటిచ్చినా తర్వాత జ్యోత్స్న గోండ్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. దాంతో కశ్యప్ ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి గట్టి సవాలు విసురుతున్నారు. బీఎస్పీ దొద్రామ్ వర్మను పోటీలో నిలిపింది.

కాన్పూర్... బరిలో మాజీ జర్నలిస్ట్



• అలోక్ మిశ్రా

కాన్పూర్లో 12 శాతం ఎస్సీ ఓటర్లుంటారు. బ్రాహ్మణులు, వైశ్యులు, ముస్లింలతో పాటు పంజాబీ ఓటర్ల సంఖ్యా ఎక్కువే. ఈ పారిశ్రామిక నియోజకవర్గంలో గత రెండు ఎన్నికలుగా కాషాయ జెండానే ఎగురుతోంది. సిట్టింగ్ ఎంపీ సత్యదేవ్‌ను పక్కనపెట్టి మాజీ జర్నలిస్టు రమేశ్ అవస్థీకి బీజేపీ టికెటిచ్చింది. ఎస్పీ దన్నుతో కాంగ్రెస్ పార్టీ అలోక్ మిశ్రాను నిలబెట్టింది. బీఎస్పీ కుల్దీప్ బదౌరియాను బరిలోకి దించింది.

పరిచయం

• పంకజా ముండే

ఫైర్‌బ్రాండ్ లీడర్



పంకజా ముండే. మహారాష్ట్ర మాజీ మంత్రి. బీజేపీ ఫైర్‌బ్రాండ్ లీడర్లలో ఒకరు. పవర్‌ఫుల్ పొలిటీషియన్‌గా పేరు తెచ్చుకున్నారు. బీజేపీ నేత దివంగత గోపీనాథ్ ముండే పెద్ద కూతురు. చెల్లెలు ప్రీతంతో కలిసి ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. బీజేపీలో ఓబీసీ నాయకురాలిగా గుర్తింపు పొందారు. ఈసారి బీడ్ లోక్‌సభ స్థానం నుంచి బరిలో ఉన్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్

వివాదాల మంత్రిగా..

పంకజ 1979 జూలై 26న జన్మించారు. ఆ మరుసటేడాదే తండ్రి గోపీనాథ్ పర్లీ ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత వరుసగా ఐదుసార్లు విజయ ఢంకా మోగించారు. అలా పంకజ బాల్యం నుంచే తండ్రి రాజకీయాలను చూస్తూ పెరిగారు. విద్యార్థిగా, యువజన నాయకురాలిగా బీజేపీలో చురుగ్గా పనిచేశారు. 2009లో తండ్రి బీడ్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. దాంతో పర్లీ నుంచి ఎమ్మెల్యేగా గెలవడం ద్వారా పంకజ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఇది కుటుంబంలో చీలికకూ కారణమైంది. గోపీనాథ్ రాజకీయ వారసుడినని భావించిన సోదరుడి కొడుకు ధనంజయ్ ముండే తిరుగుబాటు చేసి ఎన్సీపీలో చేరారు. తర్వాత 2014లోనూ పర్లీ నుంచి మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచారు పంకజ. ఫడ్నవీస్ ప్రభుత్వంలో మహిళా, శిశు సంక్షేమ మంత్రిగా చేశారు. ఆ సమయంలో పలు వివాదాలకూ కేంద్రమయ్యారు. 2017లో పవర్‌ఫుల్ పొలిటీషియన్ అవార్డు అందుకున్నారు. 2019లో ధనంజయ్ ముండే చేతిలో ఓడిపోయారు. ఒక దశలో బీజేపీని వీడతారని వార్తలొచ్చినా వాటిని కొట్టిపారేశారు.

ఈసారి చెల్లిని కాదని...

2014లో గోపీనాథ్ మరణంతో బీడ్ లోక్‌సభ స్థానం ఖాళీ అయ్యింది. పంకజ ఎమ్మెల్యేగా ఉండటంతో చెల్లి డాక్టర్ ప్రీతం ముండేను బీడ్ ఉప ఎన్నిక బరిలో దింపారు. లోక్‌సభ ఎన్నికల చరిత్రలోనే రికార్డు స్థాయిలో ఆమె ఏకంగా 6,96,321 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2019లోనూ ప్రీతం 1.68 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈసారి ఆమెను పక్కన పెట్టి పంకజకు బీజేపీ బీడ్ టికెటిచ్చింది.

‘గోపీనాథ్ గడ్’ ప్రతిష్ఠాన్ సేవ..

పంకజ ముంబైలోని జై హింద్ కాలేజీలో హెచ్ఎస్సీ, రుయా కళాశాలలో ఎంబీఏ చేశారు. ఐటీ నిపుణుడు అమిత్ పాల్వేను పెళ్లాడారు. ‘లోక్‌నేత గోపీనాథ్ ముండే’ పేరుతో తండ్రి జీవిత చరిత్ర రాశారు. తండ్రి ఘనంగా నిర్వహించిన ‘దసరా మేళావ’ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. పర్లీలో గోపీనాథ్ ముండే స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు. ‘గోపీనాథ్ గడ్’ ప్రతిష్ఠాన్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అందరినీ కలుపుకొని వెళ్తా..


మరాఠ్వాడా ప్రాంతంలోని లోక్‌సభ అభ్యర్థులందరికీ ఎదురువుతున్న ప్రధాన సమస్య మరాఠా రిజర్వేషన్లు. ఈ విషయంలో షిండే సారథ్యంలోని మహాయుతి సంకీర్ణ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకత చవిచూస్తోంది. ఓబీసీ సామాజికవర్గానికి చెందిన నేతగా పంకజకూ ఆ సెగ తగులుతోంది. విపరీతమైన ట్రోలింగ్‌కూ గురయ్యారు. అయినా, “అన్ని వర్గాల ప్రజలూ నావాళ్లే. మైనారిటీలను, ముఖ్యంగా ముస్లింలను కలుపుకొని వెళ్తా. నా సాయం కోసం వచ్చిన వారి కులం ఎన్నడూ చూడలేదు. నియోజకవర్గ సమస్యలన్నింటినీ పరిష్కరించడానికే నా తొలి ప్రాధాన్యం” అంటున్నారు పంకజ.

అది విజనరీ కాదు..
'విష'నరీ

బాబు వదిలేస్తే.. జగన్ పొత్తిళ్లలో పెట్టుకున్నారు
పెదలబుడును దత్తత తీసుకుంటానని వదిలేసిన చంద్రబాబు
నేడు రూపురేఖలు మార్చిన సీఎం జగన్

సాక్షి, విశాఖపట్నం/అనంతగిరి: 'అరకు నియోజకవర్గంలో పెదలబుడు పంచాయతీని దత్తత తీసుకుంటున్నా. స్మార్ట్ విలేజ్‌గా మార్చేస్తా. ప్రతి ఇంటికీ నిరంతరం నీటిని అందిస్తాను' అని సీఎం హోదాలో చంద్రబాబు 2015 జనవరిలో బీరాలు పలికారు. ఏడాదిన్నర గడిచినా ఆ ఊరి వైపు కన్నెత్తి చూడలేదు. చివరికి ప్రజలు రోడ్డెక్కడంతో 2016 మేలో ఆగమేఘాలపై అక్కడకు వచ్చి మంచినీటి కుళాయిల కోసం రూ.5 కోట్లు, సిమెంట్ రోడ్లకు రూ.9 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ నిధులూ వచ్చింది లేదు.. పనులు జరిగిందీ లేదు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక బాబు దత్తత తీసుకున్న ఈ గ్రామంలో సామాజిక, ఆర్థిక స్థితిగతులు మారిపోయాయి. ప్రతి ఇల్లు అభివృద్ధి పథంలో నడుస్తోంది. గిరి గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఆయా గ్రామాలు నేడు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. పెదలబుడు మేజర్ పంచాయతీలో ఓవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చించారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ అందుబాటులోకి వచ్చాయి. మూడు సచివాలయాల పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలు రూ.37 కోట్ల లబ్ధి పొందారు.

గ్రామానికి వెళ్లే రహదారి



పెదలబుడులోని ఆర్బీకే



బాబొస్తే ఆరోగ్యశ్రీ గో..విందా



బీమా పేరుతో ఈ పథకాన్ని అటకెక్కించే కుట్ర

అదే జరిగితే పేదలకు ఉచిత వైద్యం మాయం

టీడీపీ మేనిఫెస్టో సాక్షిగా బట్టబయలు

ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా అంటూ బురిడీ

- టీడీపీ మేనిఫెస్టోలో లేని ఆరోగ్యశ్రీ, ఉచిత చికిత్సల ప్రస్తావన
- తొలి నుంచి ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసేలా చంద్రబాబు చర్యలు
- ఈ పెద్దమనిషి జమానాలో ప్రభుత్వ వైద్య రంగానికి సుస్తీ
- ఎలుకలు కొరికి చిన్నారులు మృతి చెందే దుస్థితిలో ప్రభుత్వాస్పత్రులు
- 2014-19 మధ్య ప్రొసీజర్‌లు పెంచకుండా ఆరోగ్యశ్రీ నిర్వీర్యం
- సీఎం జగన్ హయాంలో ఆరోగ్యశ్రీ బలోపేతం.. ప్రజారోగ్యానికి అండ
- విప్లవాత్మక సంస్కరణలతో ప్రభుత్వ వైద్య రంగంలో సువర్ణాధ్యాయం
- 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- ఫ్యామిలీ డాక్టర్‌తో పల్లె చెంతకే వైద్యం.. విలేజ్ క్లినిక్‌తో భరోసా

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం రాష్ట్రంలోని 1.40 కోట్లకుపైగా కుటుంబాలకు ఆపద్బాంధవి. దురదృష్టవశాత్తు ఏదైనా జబ్బు చేస్తే ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకుని కార్పొరేట్ ఆస్పత్రులకు వెళితే చేతి నుంచి రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా చికిత్స అందుతోంది. ఏదైనా శస్త్ర చికిత్స జరిగినా డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లాక విశ్రాంత సమయంలో సైతం ప్రభుత్వం ఆరోగ్య ఆసరా ద్వారా భృతి కూడా ఇస్తోంది. వెరసి పేద, మధ్య తరగతి కుటుంబాలకు కష్టకాలంలో ఈ పథకం కొండంత అండగా నిలుస్తోంది.

ఇంతటి గొప్ప పథకంపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శీతకన్ను వేశారు. నాడు వైఎస్సార్‌కు, నేడు సీఎం జగన్‌కు ఎంతో మంచి పేరు తెచ్చిన ఈ పథకాన్ని ఏదోరకంగా కనుమరుగు చేయాలని కంకణం కట్టుకున్నారు. ఈ క్రమంలో 2014-19 మధ్య ఈ పథకానికి పూర్తిగా ప్రాధాన్యం తగ్గించారు. ప్రొసీజర్‌లు, నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్యను పెంచకుండా అధికారం లోంచి దిగిపోయేనాటికి అంపశయ్య పైకి ఎక్కించారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ ఈ పథకానికి ఊపిరిలూదారు. దీంతో బాబుకు మింగుడు పడలేదు. ఇలా అయితే లాభం లేదనుకుని పెద్ద స్కెచ్చే వేశారు. బీమా పేరుతో మాయ చేసి, మేనిఫెస్టోలో ఆరోగ్యశ్రీ ప్రస్తావనే లేకుండా చేశారు.

2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటీవల టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేశాయి. వైద్యం, ఆరోగ్యం అంటూ నాలుగు అంశాలను పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని మెరుగ్గా అమలు పరుస్తామని గానీ, పేద ప్రజలకు ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు (క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్), రోగ నిర్ధారణ పరీక్షల సౌకర్యం కల్పిస్తామని ఎక్కడా ప్రస్తావించలేదు. దీన్నిబట్టి బాబు వస్తే ఆరోగ్యశ్రీ పథకం కనుమరుగవుతుందనడానికి టీడీపీ మేనిఫెస్టో ఒక సంకేతం అని రాజకీయ విశ్లేషకులు, వైద్య రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతం డాక్టర్ వైఎస్సార్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వమే ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తోంది. ట్రస్ట్‌లో ఎంప్యానెల్ట్ అయిన ఆస్పత్రుల్లో పేదలు, మధ్యతరగతి కుటుంబాల వారు చేతి నుంచి నగదు చెల్లించకుండానే పూర్తి స్థాయిలో చికిత్సలు పొందుతున్నారు. కాగా, టీడీపీ తాజా హామీని గమనించినట్లయితే వాళ్లు అధికారంలోకి వస్తే.. ట్రస్ట్ స్థానంలో థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఏజెన్సీలను ప్రవేశపెట్టనున్నారని ఇట్టే తెలుస్తోంది. ఇప్పటి వరకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వమే నేరుగా పథకాన్ని అమలు చేయడంతో ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. అదే ఇన్సూరెన్స్ ఏజెన్సీల చేతుల్లోకి వెళితే వారి లాభాపేక్ష వల్ల ప్రజలకు వైద్య సేవల కల్పన ప్రశ్నార్థకంగా మారుతుందనడంలో సందేహమే లేదు.

ట్రస్ట్ అయితే అందులో ఎంప్యానెల్డ్ అయిన ఆస్పత్రులు ఏ ప్రొసీజర్స్‌కు అయినా నిర్దేశించిన రేట్స్ ప్రకారమే వైద్య సేవలు అందిస్తాయి. అంతకు మించి ప్రజల నుంచి డబ్బు వసూళ్లకు పాల్పడ్డానికి వీలుండదు. అలా వసూళ్లకు పాల్పడితే జిల్లా స్థాయిలో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ట్రస్ట్ సీఈవో ఆధ్వర్యంలో ఆస్పత్రులపై చర్యలు తీసుకునే ఒక వ్యవస్థ ఉంటుంది. అదే ప్రైవేట్ ఇన్సూరెన్స్ ఏజెన్సీలు వస్తే ఆస్పత్రులపై ప్రభుత్వ నియంత్రణ పోతుంది. ఇష్టారాజ్యంగా బిల్లులు వేసి ప్రజల నుంచి అదనపు వసూళ్లు చేస్తాయి. లేదంటే ఆస్పత్రి నుంచి బయటకు పంపించేస్తాయి.

ఆరోగ్యశ్రీ ప్రస్తావనే లేని 2024 టీడీపీ మేనిఫెస్టో

- రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకూ ఆరోగ్య బీమా
- ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ కార్డు
- అన్ని మండలాల్లో జనరిక్ ఔషధ కేంద్రాలు
- బీపీ, షుగర్ వంటి నాన్ కమ్యూనికబుల్ వ్యాధులకు జనరిక్ మందులు



2024 వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో

- రాష్ట్రంలో ప్రారంభించిన ఐదు వైద్య కళాశాలలతో పాటు, మరో 12 కళాశాలల నిర్మాణం పూర్తి చేసి ఐదేళ్లలో అందుబాటులోకి తేవడం.తద్వారా 2,550 ఎంబీబీఎస్, 2,737 పీజీ మెడికల్ సీట్లు సమకూర్చడం.
- కొత్తగా 17 నర్సింగ్ కాలేజీలు తేవడం ద్వారా అందుబాటులోకి 1,020 నర్సింగ్ సీట్లు.
- హృద్రోగ బాధితుల కోసం విశాఖ, గుంటూరు, కర్నూలులో మూడు వైద్య హబ్‌ల ఏర్పాటు.
- క్యాన్సర్ వైద్యాన్ని మరింత బలోపేతం చేసేలా గుంటూరు, కర్నూలు, విశాఖ, కడప, కాకినాడ, అనంతపురంలో క్యాన్సర్ కేర్ సెంటర్‌లు.
- గడచిన ఐదేళ్లలో మాదిరిగానే వచ్చే ఐదేళ్లలోనూ ప్రజారోగ్య రంగానికి ఏ మాత్రం ప్రాధాన్యం తగ్గకుండా చర్యలు. వైద్య రంగ అభివృద్ధిని కొనసాగిస్తాం.

పై రెండు మేనిఫెస్టోలు గమనిస్తే ప్రజారోగ్యం పట్ల ఏ నాయకుడికి ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టంగా అర్థం అవుతుంది. మూడు సార్లు సీఎంగా పనిచేశా.. విజనరీనని చెప్పుకునే నాయకుడు ప్రజారోగ్యం పట్ల ఉజ్జాయింపుగా నాలుగంటే నాలుగే హామీలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. సీఎం జగన్ మాత్రం ప్రజారోగ్యం విషయంలో గడచిన ఐదేళ్లలో దేశంలో ఏ రాష్ట్రంలో లేనట్టుగా ప్రజారోగ్యం విషయంలో రాజీ పడకుండా చర్యలు తీసుకున్నారు. ఎన్నో సంస్కరణలు తీసుకుని వచ్చి దేశానికి ఆదర్శంగా నిలిచారు. ఆ ఒరవడిని అదే విధంగా కొనసాగిస్తూ వచ్చే ఐదేళ్లలోను ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తానని తన మేనిఫెస్టోలో ప్రకటించారు.

సాక్షి, అమరావతి: వైద్య, విద్యా రంగాలను ప్రైవేట్ పరం చేయాలన్నది చంద్రబాబు లక్ష్యం. ఇందులో భాగంగానే తొలి నుంచి ఆయన ప్రభుత్వ వైద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తూ వచ్చారు. 2014 ఎన్నికల సమయంలో 'ఆరోగ్యశ్రీలో వ్యాధులన్నింటినీ చేర్చి, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత పరీక్షలు, చికిత్స, ఆపరేషన్ సౌకర్యం కల్పిస్తాం' అని టీడీపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక తూతూ మంత్రంగా ప్రొసీజర్‌లను పెంచి చేతులు దులుపుకున్నారు. 2007లో వైఎస్సార్ హయాంలో 942 వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చి ప్రారంభిస్తే, చంద్రబాబు ప్రభుత్వం పథకాన్ని ఎన్టీఆర్ వైద్య సేవగా పేరు మార్చి, కేవలం 117 వ్యాధులను మాత్రమే పెంచింది. అయినా వాటికి ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స సరిగా అందని దుస్థితి. వివిధ అనారోగ్య బాధితులకు చికిత్సలు అందించడానికి ఆస్పత్రుల నుంచి ట్రస్టుకు అభ్యర్థనలు వచ్చినా వాటిని రోజుల తరబడి పెండింగ్‌లో ఉంచేవారు. దీంతో చేసేదేమీ లేక చికిత్సలు చేయించుకోవడానికి ప్రజలు అప్పులపాలైన దుస్థితి. ఈ ఐదేళ్ల పాలనలో ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేసి, విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి సీఎం జగన్ ప్రజలకు అండగా నిలిచారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.5 లక్షల్లోపు వార్షికాదాయ కుటుంబాలను పథకం పరిధిలోకి తెచ్చి, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యానికి రక్షగా నిలిచారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.25 లక్షల వరకు వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. 1,059గా ఉన్న ప్రొసీజర్‌లను ఏకంగా 3,257కు పెంచారు. తద్వారా ఐదేళ్లలో 45.10 లక్షల మందికి ఉచిత చికిత్సల కోసం రూ.13,421 కోట్లు వెచ్చించారు. ఆరోగ్య ఆసరా కింద రూ.1,465 కోట్ల మేర శస్త్ర చికిత్సలు చేయించుకున్న 24.59 లక్షల మందికి సాయం చేశారు.

జగన్, బాబు పాలన మధ్య ఎంతో తేడా!



అంశం: కొత్త వైద్య కళాశాలలు

జగన్ పాలన: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనట్టుగా 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు. ఇందుకోసం ఏకంగా రూ.8,480 కోట్లు వెచ్చిస్తున్నారు. అన్ని ప్రాంతాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు చేరువ చేస్తున్నారు. ఇప్పటికే విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలను ప్రారంభించి ఒకే ఏడాది 750 ఎంబీబీఎస్ సీట్లలో అడ్మిషన్లు కల్పించారు. ఈ విద్యా సంవత్సరం మరో ఐదు, వచ్చే విద్యా సంవత్సరం మిగిలిన ఏడు కళాశాలలు ప్రారంభించేలా ప్రణాళికలు రచించారు.

బాబు పాలన: టీడీపీ అధికారంలో ఉండగా ఏ రోజు ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాలల ఏర్పాటుకు పాటుపడింది లేదు. వైద్య విద్యను వ్యాపారం చేసి తన వాళ్ల జేబులు నింపడానికే పాటుపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 16 ప్రైవేట్ వైద్య కళాశాలలకు బాబు పాలనలో అనుమతులు ఇవ్వడమే ఇందుకు నిదర్శనం.

అంశం : గ్రామీణ ప్రజల ఆరోగ్యం



జగన్ పాలన: పీహెచ్‌సీ వైద్యులనే గ్రామాలకు పంపి ప్రజలకు వైద్య సేవలు అందించారు. మంచానికే పరిమితం అయిన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి, వారి ఆరోగ్యాలపై వాకబు చేశారు. 2,500 జనాభాకు ఒకటి చొప్పున 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. వీటిల్లో బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో)లను నియమించారు. తద్వారా 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలతో పాటు, 105 రకాల మందులను అందుబాటులో ఉంచి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. వీటికి తోడు విలేజ్ క్లినిక్స్‌లో టెలీ మెడిసిన్ సౌకర్యం ఉండటంతో స్పెషలిస్ట్ వైద్యుల కన్సల్టేషన్ సైతం ఇక్కడే లభిస్తుండటంతో పట్టణాలు, నగరాల్లోని పెద్దాస్పత్రులకు ప్రజలు వెళ్లాల్సిన అవసరం ఉండటం లేదు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వమే ఇళ్ల వద్దకు మందుల డోర్ డెలివరీ ప్రారంభించింది.

బాబు పాలన: పల్లె ప్రజలకు సుస్తీ చేస్తే పట్టణాలు, నగరాలకు పరుగులు తీయాల్సిందే. ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమం ఉండేది కాదు. విలేజ్ క్లినిక్ వ్యవస్థ ఊసే లేదు. పీహెచ్‌సీలకు వెళితే అక్కడ డాక్టర్‌లు ఉంటారో లేదో తెలియని దుస్థితి. దీంతో చిన్న అనారోగ్య సమస్య వచ్చినా, వ్యయప్రయాసలకోర్చి పరుగు తీయాల్సిన పరిస్థితి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందుల పంపిణీ, క్రమం తప్పకుండా వారి ఆరోగ్యంపై వాకబు చేసే వ్యవస్థ లేక, ప్రజలు జబ్బు ముదిరి అప్పులపాలయ్యేవారు.

అంశం : ఇంటింటా ఆరోగ్య సర్వే

జగన్ పాలన: అందరి ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్షను ప్రవేశపెట్టింది. ప్రతి ఇంటిని జల్లెడ పట్టి, వైద్య పరీక్షలు నిర్వహించి వివిధ అనారోగ్య బాధితులను గుర్తించారు. వారికి పట్టణాలు, గ్రామాల్లో ఎక్కడికక్కడ సురక్ష శిబిరాలు నిర్వహించి స్పెషలిస్టు వైద్యులతో ఉచితంగా వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం అవసరం ఉన్న వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు తరలించి, ఉచితంగా చికిత్స చేయించారు.

బాబు పాలన: ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమం నిర్వహించిందే లేదు. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్యాన్ని వాకబు చేసి, వాటి పరిష్కారానికి కనీసం ఆలోచించిన పాపాన పోలేదు.

రాష్ట్రానికి 'చంద్ర'గ్రహణం వద్దు అదొస్తే పేదల భవిష్యత్తు చిత్తు



అంశం: ఆస్పత్రుల్లో నాడు-నేడు

జగన్ పాలన: వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించగానే నాడు-నేడు కార్యక్రమంల ద్వారా ఆస్పత్రుల రూపురేఖలు మార్చేశారు. రూ.16,880 కోట్లతో ఆస్పత్రుల భవనాలకు మరమ్మతులు, పాతవాటి స్థానంలో కొత్తవాటి నిర్మాణం, 17 కొత్త వైద్య కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం చేపట్టారు. జాతీయ ప్రమాణాలతో ఆస్పత్రుల్లో వనరులను సమకూర్చారు. దీంతో 640 ఆస్పత్రులకు నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ (ఎన్‌క్వాష్), 42 ఆస్పత్రులకు ముస్కాన్, 2022-23లో 3,161 ఆస్పత్రులకు కాయకల్ప గుర్తింపుతో దేశంలోనే మొదటి స్థానంలో ఏపీ నిలిచింది. కేరళ సైతం ఈ అంశాల్లో ఏపీ కన్నా ఎంతో వెనుకబడి ఉంది. ఆస్పత్రుల్లో ఏ ఒక్క వైద్య, సిబ్బంది పోస్టు ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా ఐదేళ్లలో 54 వేల మేర పోస్టులు భర్తీ చేసి రికార్డు సృష్టించారు. 108 వ్యవస్థకు ఊపిరిలూదుతూ రూ.136 కోట్లతో 768 అంబులెన్స్‌లు సమకూర్చి సేవలు విస్తరించారు. ఫ్యామిలీ డాక్టర్ అమలు కోసం రూ.166 కోట్లతో 104 వాహనాలు సమకూర్చారు. మొత్తం 936 వాహనాలు సేవలందిస్తున్నాయి.

బాబు పాలన: రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేసేలా టీడీపీ జమానాలో ఏ ఒక్క కార్యక్రమం చేపట్టలేదు. ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది, మందులు, సర్జికల్స్, ఇతర వనరులకు తీవ్ర కొరత ఉన్నప్పటికీ నిమ్మకు నీరెత్తినట్టుగానే బాబు వ్యవహరించారు. 2014-19 మధ్య గుంటూరు జీజీహెచ్‌లో ఎలుకలు కొరికి శిశువు మృతి చెందడం బాబు పాలనలో దిగజారిన ప్రభుత్వ వైద్య రంగ దుస్థితికి నిదర్శనం. ఈ ఘటన అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటన అనంతరం గుణపాఠంతో ఆస్పత్రులను బలోపేతం చేసేలా అడుగులు వేయలేదు. ఐదేళ్ల బాబు పాలనలో కేవలం 4 వేల మేర పోస్టులను మాత్రమే వైద్య శాఖలో భర్తీ చేశారు. బాబు పాలనలో 108, 104 వ్యవస్థలు కూనరిల్లాయి.









బాబు హయాంలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలుకలు కొరికి మృతిచెందిన పసికందు

ఎవరు కావాలో ఆలోచించండి

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య రంగాన్ని ఇంతగా నిర్వీర్యం చేసిన నేత ఒక్క చంద్రబాబు తప్ప దేశంలో మరొకరుండరు. సింగపూర్, యూకే ప్రపంచ స్థాయి రాజధాని అంటూ బాబు బాకాలు ఊదిన అమరావతికి కూతవేటు దూరంలోని గుంటూరు జీజీహెచ్‌లోనే అప్పట్లో శిశువును ఎలుకలు కొరికి చంపేశాయి. 2019లో అధికారంలోకి రాగానే వైఎస్ జగన్ ప్రభుత్వాస్పత్రులను సంస్కరించారు. వైద్య రంగానికి ఊపిరిలూదారు. పెద్దాస్పత్రులను ఐదేళ్లలో అవయవాలు మార్పిడి చేసే స్థాయికి తీసుకెళ్లారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష, విలేజ్ క్లినిక్స్ వంటి వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే సర్కార్ వైద్యాన్ని తీసుకెళ్లారు. ఈ క్రమంలో ప్రభుత్వ వైద్య రంగాన్ని దిగజార్చిన బాబు, ఆ వైద్య రంగానికి ఊపిరిలూదిన వైఎస్ జగన్.. ఈ ఇద్దరిలో ఎవరు కావాలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సముచిత నిర్ణయం తీసుకోకపోతే వైద్యానికి డబ్బు కోసం ఆస్తులు తాకట్టుపెట్టాలి. ఆస్తులు లేని వారు తల తాకట్టు పెట్టే పరిస్థితులు వస్తాయని గుర్తుంచుకోవాలి.

ఇంటర్వ్యూ

'వైఎస్సార్ సీపీ నవరత్నాలు అమలు సాధ్యమేనా అన్న నోళ్లు మూతపడేలా అమలు చేసి చూపించారు సీఎం జగన్. ఒక విధంగా చెప్పాలంటే ఆయన ప్రతి ఒక్కరికీ ఓ లెసన్. 'జగన్ గెలుపు అంటే జనం గెలుపు' అన్నది ఈ ఎన్నికల్లో స్పష్టం కానుంది' అని సినీనటి, ప్రముఖ బుల్లితెర యాంకర్ శ్యామల అన్నారు. కొంత కాలంగా వైఎస్ జగన్‌కు మద్దతుదారుగా ఉన్న ఆమె ఈ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరఫున చురుకుగా ప్రచారం కూడా చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో మాట్లాడారు.

జగన్ ఓ లెసన్

ఇచ్చిన హామీలు అమలు చేయడం ఆయనకే చెల్లు

జగన్‌లోని పట్టుదల ఎందరికో స్ఫూర్తిదాయకం

సాక్షి ఇంటర్వ్యూలో సినీనటి, యాంకర్ శ్యామల



వైఎస్ అంటే ఇష్టం.. జగన్‌పై అభిమానం...

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పట్టణం సమీపంలోని ఇంద్రపాలెం మాది. బ్రాహ్మణ కుటుంబానికి చెందిన నాకు రాజకీయ నేపథ్యం ఏమీ లేదు. ఎదుగుతున్న సమయంలో లీడర్స్ చేపట్టే పనులు మన మీద చాలా ప్రభావం చూపుతాయి కదా. అలా తూర్పుగోదావరి జిల్లాలో పాదయాత్ర చేసినప్పటి నుంచీ వైఎస్ అంటే నాకు చాలా ఇష్టం. కట్టుబొట్టు నుంచి ఆయన ఆహార్యం దాకా అన్నీ గమనిస్తుండేదాన్ని. ఆయన హుందాతనం, మందహాసం బాగా నచ్చేవి. కెరీర్ కోసం హైదరాబాద్ వచ్చేసిన తర్వాత.. వైఎస్సార్ మరణించిన సమయంలో ఉప్పల్‌లో ఓ ప్రైవేట్ చానల్‌లో పనిచేస్తున్నాను. ఎంతగానో బాధనిపించినా... ఆ సమయంలో ఎటూ కదలడానికి వీలు కాలేదు. వైఎస్ మరణం తర్వాత జగన్‌ను బాగా గమనిస్తూ ఉండేదాన్ని, ఆయన చేసిన పోరాటం, అడ్డంకులు ఎదుర్కొంటూ ఆయన వేసిన అడుగులు చూశాక ఆయనపైనా కొండంత అభిమానం కలిగింది.

హామీల అమల్లో ఆయనకు ఆయనే సాటి

ఇచ్చిన హామీలు ఎలా అమలు చేయాలి? ప్రజలకు ఆపద వస్తే ఎలా స్పందించాలి? ఇలాంటివన్నీ జగన్‌ను చూసి నేర్చుకోవాలి. అందుకే భవిష్యత్తు రాజకీయ నేతలకు ఆయన పాలన ఒక పాఠం అంటాను నేను. ఆయన ప్రవేశపెట్టిన నవరత్నాల గురించి మొదట్లో విని... ఇన్ని పథకాలా? ఎలా ఇస్తారో అని భయపడిన మాట నిజం. కాని అవి పక్కాగా అందించడానికి గ్రామ వలంటీర్ పేరిట ఓ వ్యవస్థను ఏర్పాటు చేయడం, ఎవరికన్నా ఏదైనా ఇబ్బంది కలిగిందీ అంటే ఫిర్యాదు చేసిన 10-20 రోజుల్లోనే సమస్య పరిష్కారం అయిపోయేలా పక్కాగా నిర్వహించడం అద్భుతం అనిపించింది.

అవకాశాలు పోతాయని వారించినా...

అయితే నేనుఇంకా సినీ-టీవీ కెరీర్ ప్రారంభంలోనే ఉండడంతో పార్టీ మనిషిగా ముద్ర వేసుకోవడం మంచిది కాదంటూ చాలా మంది హెచ్చరించారు. నిజానికి ఇప్పటికీ చాలా మంది అలాగే చెబుతుంటారు. అయితే ఏదో రాజకీయ పార్టీలో ఉన్నానని ఒక క్యారెక్టర్‌కి నేను సరిపోతానని తెలిసినా పిలవకుండా ఉంటారా? అలా జరగదని నా నమ్మకం. ఇప్పటివరకూ అలాంటి అనుభవాలు కూడా ఎదురవ్వలేదు. నేను కేవలం టీవీ యాంకర్‌గానే కాకుండా మాచర్ల నియోజకవర్గం, బెంగాల్ టైగర్... తదితర సినిమాల్లో మంచి పాత్రల్లో చేశాను.

జగన్ గురించి తెలుసుకున్న కొద్దీ సంతోషం

మా సొంత ఊరితో పాటు మా అత్తగారి ఊరు చీరాలకు రాకపోకలు సాగించినప్పుడు, షూటింగ్ కోసం గ్రామాలకు వెళ్లినప్పుడు... అక్కడి స్థితిగతుల గురించి కనుక్కునేదాన్ని. వీలైనంతమందితో మాట్లాడేదాన్ని. వాళ్లందరి స్పందన తెలుసుకుంటున్న కొద్దీ జగన్ మీద ఇష్టం పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన నాడు నేడు కార్యక్రమం నా ఆల్ టైమ్ ఫేవరెట్. నేను కాకినాడ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. ఆ స్కూల్లో 7వ తరగతి వరకూ అసలు ఇంగ్లిష్ మీడియం ఉండేది కాదు. ఇప్పుడు ఏకంగా డిజిటల్ బోధన, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్, స్కూల్ బ్యాగ్స్, షూస్, సాక్స్... ఇవన్నీ ఇవ్వడం మామూలు విషయం కాదు. ఇటీవల ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని జగన్ ముందు అద్భుతమైన ఇంగ్లిష్‌లో మాట్లాడితే షాక్ అయిపోయా. ఆ భాషా పరిజ్ఞానం నాకు కూడా లేదు. కేవలం రాజకీయాల కోసం ఓ పాపను దారుణంగా ట్రోల్ చేయడం దారుణం.

కోవిడ్ సవాల్‌నూ సమర్థంగా ఎదుర్కొని...

ప్రపంచమే బిత్తరపోయిన సంక్షోభం కోవిడ్. మహామహులే ఆ సమయంలో చేతులెత్తేశారు. అలాంటిది ఒక కొత్త సీఎం, అధికారంలోకి వచ్చి ఏడాది కూడా కాలేదు. ఇలాంటి తరుణంలో అనూహ్యమైన ఈ చాలెంజ్ ఎదురైనా.. జగన్ అద్భుతంగా హ్యాండిల్ చేశారు. అందుకే నేను ఫిదా అయ్యా. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లోని ప్రజల్ని కలిసినప్పుడు వారు చెబుతున్నదీ అదే. 'కోవిడ్ టైమ్‌లో సొంత వారు కూడా మా మొహం చూడలేదమ్మా.. అలాంటిది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతీదీ మా చేతికి అందించింది' అని.

-సత్యార్థ్


ఇందు గుర్జర్

ప్రపంచంలో చాలామంది ఒకే తరహా పనిని ఏళ్లుగా చేస్తూ తమ జీవనాన్ని కొనసాగిస్తుంటారు. కొందరు మాత్రం ఏకకాలంలో ఎన్నో పనులు చేస్తూ సమాజంలో తమకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరుచుకోవాలని ఎప్పుడూ ప్రయత్నిస్తుంటారు. అలాంటి వారిలో ఒకరు ఇందు గుర్జర్. జైపూర్‌వాసి అయిన 32 ఏళ్ల ఇందు గుర్జర్ సింగిల్ పేరెంట్‌గా తన తొమ్మిదేళ్ల కూతురును చూసుకుంటూ, బ్యాంకు ఉద్యోగం చేస్తూ, అంతర్జాతీయ క్రీడాకారిణిగా, మౌంటెనీర్ బైకర్‌గా గుర్తింపు తెచ్చుకుంటోంది. సవాళ్లను అధిగమిస్తూ ఇందు చేస్తున్న ప్రయత్నం ఒడిదొడుకులను ఎదుర్కొనేవారికి స్ఫూర్తిగా నిలుస్తుంది.

ఉండాల్సింది ధైర్యం మాత్రమే!

‘‘సమస్యలు వచ్చేదే మనలోని శక్తిని గుర్తించడానికి. ధైర్యం తెచ్చుకొని ప్రయత్నిస్తే తిరిగి మనకో కొత్త జీవితం ఏర్పడుతుంది. నా చిన్నతనంలో మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. మా నాన్నకు టీ కొట్టు ఉండేది. కానీ, దాని నుంచే ఆయన తన కొడుకులలో ఒకరిని డాక్టర్‌ని చేసి, మా అందరికీ ఉత్తమవిద్యను అందించడానికి ప్రయత్నించాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. చిన్ననాటి నుంచి క్రీడలంటే చాలా ఆసక్తి. రాష్ట్రస్థాయిలో బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ ఆడాను. కాలేజీలో స్పోర్ట్స్ ఆప్షన్ లేకపోవడంతో నా ఇష్టాన్ని అక్కడితో వదిలేయాల్సి వచ్చింది.

■ గృహహింస

మా కమ్యూనిటీలో అమ్మాయిలకు పెళ్ళిళ్లు త్వరగా చేస్తారు. కానీ, నా తల్లిదండ్రుల సహకారంతో గ్రాడ్యుయేషన్ వరకు చదువుకున్నాను. ఆ వెంటనే పెళ్లి చేశారు. పెళ్లి నా జీవితాన్ని విచ్ఛిన్నం చేసింది. బిడ్డను కనాలని, వరకట్నం తేవాలని... ప్రతిరోజూ ఏదో ఒక విషయం మీద నరకం చూసేదాన్ని. అత్తింటివాళ్లు నా తల్లిదండ్రులకు నా మీద ఏవేవో చాడీలు చెప్పేవారు. పాప పుట్టిన తర్వాత పుట్టింటి నుండి తిరిగి అత్తవారింటికి వెళ్లడానికి భయపడ్డాను. కానీ, పెద్దవారిని కూర్చోబెట్టి, ఒప్పించి తిరిగి తీసుకెళ్లారు. కానీ, అక్కడి పరిస్థితుల్లో ఏ మాత్రం మార్పు లేదు. నెల రోజుల వ్యవధిలోనే మా అత్తింటిని వదిలి, తిరిగి పుట్టింటికి వచ్చేశాను. ఏడాది కాలం పుట్టింట్లోనే ఉన్నాను. పరిస్థితుల్లో మార్పు రాదని గ్రహించి, విడాకులకు కోర్టులో కేసు వేశాను. ఒంటరిగా బిడ్డను పెంచడం నాకు అంత తేలికైన పనికాదు. ఇంటి నిర్వహణకు, నా ఇష్టాలను నెరవేర్చుకోవడానికి ఇంధనం అవసరం. ఆ మనోవర్తి రూపంలో ఆ ఇంధనం రాబట్టుకోవడం కోసం ఏడేళ్లపాటు విడాకుల కేసుపై పోరాడుతూనే ఉన్నాను. కానీ, న్యాయం జరగలేదు.



■ డిప్రెషన్ నుంచి కోలుకొని...

ఆటుపోట్లతో ఉన్న జీవితాన్ని చూసి చాలా బాధపడేదాన్ని. ఒక వ్యక్తి జీవితంలో చెడుకాలం వచ్చినప్పుడు పరిస్థితుల ముందు లొంగిపోతాడు. కానీ, నాకు నేనుగా ఏదైనా లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలనుకున్నాను. బ్యాంకు ఉద్యోగం సంపాదించుకొని, నాకు నేనుగా జీవించడం మొదలుపెట్టాను.



■ ఫిట్‌గా ఉండేందుకు..

ఉద్యోగం చేయడం మొదలుపెట్టిన కొన్ని రోజులకే కోవిడ్ వచ్చింది. మొదటి వేవ్‌లో కరోనా బాధితురాలిని అయ్యాను. వాడిన మందుల వల్లనేమో కోవిడ్ తర్వాత బరువు పెరగడం మొదలైంది. దీంతో ఫిట్‌గా ఉండేందుకు రోజూ రెండు–మూడు కిలోమీటర్లు సైక్లింగ్ చేసేదాన్ని. ఆ తర్వాత స్టేడియంకు వెళ్లడం మొదలుపెట్టాను. అక్కడ సైక్లిస్టుల బృందాన్ని కలిశాను. ఆ క్రీడలో పాల్గొనడానికి వయోపరిమితి ఏమీ లేదని తెలిసింది. దాంతో నాలో చిన్న ఆశ కలిగింది. బహుశా విధి నాకు అలాంటి అవకాశం ఇచ్చింది అనుకున్నాను. మొదట్లో రెండు–మూడు కిలోమీటర్లు సైక్లింగ్ చేసే నేను ఈ రోజు 50– 100 కిలోమీటర్లు తిరుగుతున్నాను. యూసీఐ (ఇంటర్నేషనల్ సైకిలిస్ట్ యూనియన్) ఎలిమినేటర్ ప్రపంచకప్‌లో పాల్గొన్నాను. ఎన్నో పెద్ద పెద్ద ఈవెంట్లలో పాల్గొని, అంతర్జాతీయ సైక్లిస్టులను కలిశాను.

■ పర్వత బైకర్‌గా...

వృత్తిరీత్యా బ్యాంకర్‌గానే కాకుండా మూడేళ్లుగా మౌంటెన్ బైకర్‌గా కూడా ఉన్నాను. పర్వతాల్లో చేసే సాహసోపేతమైన పోటీల్లో విజేతగా నిలుస్తుండేదాన్ని. ఆ పోటీలు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చేవి. రెండేళ్ల క్రితం లదాఖ్‌లోని లేహ్‌లో జరిగిన యుసిఐ ఎలిమినేటర్ ప్రపంచ కప్‌లో ఎలైట్ మహిళల విభాగంలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా అనిపించింది.

■ శక్తిని గుర్తించాలి..

నా కూతురికి ఇప్పుడు తొమ్మిదేళ్లు. ఆమె కూడా క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని కోరుకుంటున్నాను. అందుకు ట్రెనింగ్ కూడా ఇప్పిస్తున్నాను. చదువుతోపాటు టాలెంట్‌ను కూడా గుర్తించి, దానిని మెరుగుపరుచుకునే ప్రయత్నం చేయాలని అమ్మాయిలకు చెబుతుంటాను. ఈ నెల పదిన జరిగే రేస్‌లో పాల్గొంటున్నాను. గెలుపు – ఓటమి, విజయం – అపజయం అని చింతించకుండా 100 శాతం శక్తినీ, సామర్థ్యాన్నీ వినియోగించి లక్ష్యాన్ని సాధించి, ఫలితాన్ని భగవంతునికే వదిలేయాలి. ఇంకో విషయం.. ఏదైనా కొత్తగా చేయడానికి వయసుతో సంబంధం లేదు. ఏ వయసులోనైనా విజయం సాధించవచ్చు. మీకుండాల్సింది ధైర్యం మాత్రమే’’ అంటుంది ఇందు.

స్ఫూర్తి

పరీక్షల సీజన్ వస్తే రమా పద్మనాభన్ ఇంటి వ్యవహారాలను పెద్దగా పట్టించుకోదు. పెళ్లిళ్లు, ప్రయాణాలు అసలే ఉండవు. ఆమె తనకు వచ్చే కాల్స్‌ను అటెండ్ చేసే పనిలో ఉంటుంది. ‘అక్కా.. ఈ ఎగ్జామ్ రాయాలి’ ‘ఆంటీ... ఈ డేట్‌న ఎంట్రన్స్ ఉంది’ ఇలా దివ్యాంగులు ఆమెకు కాల్స్ చేస్తుంటారు. వారి కోసం ఆమె పరీక్ష హాల్‌కు వెళ్లి వారి ఆన్సర్స్‌ను రాసి పెడుతుంటుంది. ‘ఇది గొప్ప తృప్తినిచ్చే సేవ’ అంటోందామె.


ఓ దివ్యాంగుడికి పరీక్ష రాసిపెడుతున్న రమా పద్మనాభన్

పరీక్షా కాలంలో పలికే చేయి

చదువుకునే రోజుల్లో ఎవరైనా పరీక్షలు రాయవచ్చు. చదువు అయిపోయాక ఏవైనా కోర్సులు సరదాగా చదివితే పరీక్షలు రాయవచ్చు. కాని రమా పద్మనాభన్ అలా కాదు. ఆమె ప్రతి ఆరు నెలలకు విద్యార్థులకు సెమిస్టర్ ఎగ్జామ్స్ జరిగినప్పుడల్లా 50 పరీక్షలు రాస్తుంది. అంటే రాసి పెడుతుంది. గత పదకొండేళ్లుగా ఆమె అలా చేస్తూనే ఉంది. దివ్యాంగులకు పరీక్షలు రాసి పెట్టే స్క్రయిబ్‌గా ఆమెకు కోయంబత్తూరులో ఉండే పేరు అలాంటిది.

గృహిణిగా ఉంటూ...

కోయంబత్తూరుకు చెందిన రమా పద్మనాభన్ సైకాలజీలో డిగ్రీ చేసింది. ఆ తర్వాత ‘గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్’లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కూడా చదివింది. భర్త ఫైనాన్షియల్ సెక్టార్‌లో పని చేస్తాడు. ఆమెకు ఇద్దరు అబ్బాయిలు. గృహిణిగా పిల్లలను చూసుకుంటూ కాలం గడుపుతున్న రమా పద్మనాభన్ జీవితం 2013లో మారింది. ‘ఆ రోజు నేను యోగా క్లాసుకు బయలుదేరాను. నా స్నేహితురాలి నుంచి ‘ఒక అంధ విద్యార్థికి పరీక్ష రాసి పెడతావా?’ అనే విన్నపం వచ్చింది. అలా రాయగలనా అనుకున్నాను. పరీక్ష కేంద్రం దగ్గరే కనుక ట్రై చేద్దామనిపించింది. వెళ్లి రాసి పెట్టాను. పరీక్ష ముగిశాక ఆ అంధ విద్యార్థి ముఖంలో కనిపించిన కృతజ్ఞత నాకు ఎంతో మనశ్శాంతిని ఇచ్చింది. ఆ తర్వాత నాకు కాల్స్ రావడం మొదలైంది. కోయంబత్తూరులో లూయిస్ బ్రెయిలీ అకాడెమీ ఉంది. వాళ్లు కాల్ చేస్తూనే ఉంటారు. వీరు కాకుండా దివ్యాంగులు, ఆటిజమ్ విద్యార్థులు... వీరు పెన్ పట్టి పరీక్ష రాయడం కష్టం. వారికి పరీక్షలు రాసి పెడుతుంటాను’ అని తెలిపింది రమా పద్మనాభన్.



అంతా ఉచితమే

దివ్యాంగులకు, అంధులకు పరీక్షలు రాసేందుకు రమ ఎటువంటి రుసుమూ తీసుకోదు. పరీక్షా కేంద్రానికి కూడా సొంత ఖర్చులతోనే వెళ్లి వస్తుంది. ‘అయితే అందుకు నా భర్తను అభినందించాలి. నీ డబ్బులు ఖర్చు పెట్టి వేరొకరి పరీక్షలు ఎందుకు రాస్తున్నావు అని ఎప్పుడూ అడగలేదు’ అంటుంది రమ. ‘అంధ విద్యార్థులు తమకు పరీక్షలు రాసి పెట్టే వారు లేరని తెలిస్తే చాలా టెన్షన్ పడతారు. ఆబ్సెంట్ అయితే పరీక్ష పోతుంది. అందుకే వారికి స్క్రయిబ్‌లు కావాలి. వారు చెబుతుంటే జవాబులు సరిగ్గా రాయగలగాలి. నేను ఆటిజమ్ విద్యార్థులకు రాసి పెట్టేటప్పుడు మరింత శ్రద్ధగా ఉంటాను. వారు సమాధానాలు కంటిన్యూస్‌గా చెప్పడంలో ఇబ్బంది పడతారు. ప్రోత్సహిస్తూ రాబట్టాలి. అదే కాదు హైస్కూల్ పాఠాల దగ్గరి నుంచి ఇంజినీరింగ్ పాఠాల వరకూ అవగాహన ఉండాలి. అందుకే ఆ పాఠాలు కూడా తెలుసుకుంటూ ఉంటాను. స్క్రయిబ్‌గా నేను మారేటప్పటికి నా పిల్లలు చిన్నవాళ్లు. నా చిన్నకొడుకుకైతే ఐదారేళ్లవాడు. ఇంటిదగ్గర వాణ్ణి ఒక్కణ్ణే వదిలి తాళం వేసుకుని పరీక్ష రాసి పెట్టిన సందర్భాలున్నాయి’ అని తెలిపిందామె.

కొనసాగే అనుబంధం

‘నేను రాసిన పరీక్షలతో కోర్సులు పాసై ఉద్యోగాలు పొందిన దివ్యాంగులు చాలా మంది ఉన్నారు. వాళ్లంతా నా కాంటాక్ట్‌లో ఉంటారు. తమ జీవితంలో సాధిస్తున్న ప్రగతిని తెలియజేస్తుంటారు. అదంతా వింటుంటే ఎంతో సంతృప్తిగా అనిపిస్తుంది. జీవితానికి ఒక అర్థం దొరికినట్టు ఉంటుంది. నా పెద్దకొడుకు సీనియర్ ఇంటర్‌కు వచ్చాడు. వాణ్ణి వీలున్నప్పుడల్లా స్క్రయిబ్‌గా పని చేయడానికి పంపుతున్నా. వాడు ఆ పని చేస్తున్నందుకు ఎంత సంతోషపడుతున్నాడో చెప్పలేను’ అని ముగించింది రమా పద్మనాభన్.

విద్యాప్రమాణాలు మెరుగుపడడం, కొత్త రంగాలు ఉనికిలోకి రావడం వల్ల ‘ఉద్యోగమే సర్వస్వం’ ‘ఉద్యోగం దొరికితే చాలు’ అనుకోవడం లేదు యువతరంలో చాలామంది. దీనికి కారణం...ప్రత్యామ్నాయ అవకాశాలు. ‘ఉద్యోగం ఎందుకు చేయాలి?’ నుంచి ‘చేస్తే ఎలాంటి ఉద్యోగం చేయాలి’ వరకు కెరీర్ బాట పట్టడానికి ముందు రకరకాల కోణాలలో ఆలోచిస్తున్నారు. మంచి వేతనం కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

యూత్ పల్స్

నవతరం... ఉద్యోగ పర్వం



44 దేశాల్లో మిలీనియల్స్, జెన్ జెడ్‌పై సర్వే చేసింది డెలాయిట్. దీని ప్రకారం ప్రైమరీ జాబ్‌తోపాటు మరో జాబ్ చేస్తున్న యువ ఉద్యోగుల సంఖ్య తక్కువేమీ కాదు. బెంగళూరులో ఒక ప్రైవేట్ కాలేజీలో పని చేస్తున్న పరిమళ ఆన్‌లైన్‌లో వ్యాపారం కూడా చేస్తుంటుంది.

‘డబ్బు కోసం కాదు. అదొక ప్యాషన్’ అంటుంది తన ఆన్‌లైన్ వ్యాపారం గురించి.

లింక్డ్ ఇన్ సర్వే ప్రకారం 2023లో మన దేశంలో 88 శాతం మంది జెన్ జెడ్ ఉద్యోగులు ‘ఉద్యోగ మార్పు’నకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. జెన్ జెడ్ ఉద్యోగులపై ఆర్పీజీ గ్రూప్ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం పదిమందిలో ఆరుగురు మంచి వేతనం కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారు.

‘పని ఒత్తిడి చచ్చినట్లు భరించాల్సిందే’ అని రాజీ పడడం కంటే ‘జీతం తక్కువ అయినా సరే నాకు నచ్చిన ఉద్యోగం చేస్తాను’ అని ఆలోచిస్తున్న వారి సంఖ్య యువతరంలో ఎక్కువగానే ఉంది.

ముంబైలోని ఒక మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం చేసిన అనన్యకు పనిభారంతో ఊపిరాడేది కాదు. ఒక ఫైన్ మార్నింగ్ ‘ఇది కాదు జీవితం’ అనిపించింది. తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఒక స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తోంది. ‘నేను పని చేస్తున్న కంపెనీతో పోల్చితే ఇది చాలా చిన్న ఉద్యోగం కావచ్చు. కాని ఎంతో సంతోషంగా ఉంది’ అంటుంది అనన్య.

ఒక మార్కెటింగ్ సంస్థలో ఉద్యోగం చేసిన ఇరవై సంవత్సరాల సారా బోహ్రా ఆ ఉద్యోగం మానేసి సొంతంగా మార్కెటింగ్ ఫర్మ్ మొదలుపెట్టింది. వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. ‘ఇప్పుడు చాలా సౌకర్యంగా ఫీలవుతున్నాను. పని ప్రకారం కాదు గంటల ఆధారంగా ప్రొడక్టివిటీని కంపెనీలు అంచనా వేస్తున్నాయి’ అంటుంది సారా.

తీయటి పాఠాలు

రాజస్థాన్‌లోని వనస్థలి యూనివవర్శిటీలో బీబీఏ డిగ్రీ పూర్తి చేసిన అనువ కక్కర్ ఉద్యోగం కంటే సొంత స్టార్టప్‌కే ప్రాధాన్యత ఇచ్చింది. అయితే కస్టమైజ్డ్ పోస్టర్ కార్డ్‌లకు సంబంధించి ఆన్‌లైన్ బిజినెస్‌లో ఫెయిల్ అయింది. అయితే ఈ ఫెయిల్యూర్ నుంచి పాఠాలు నేర్చుకున్న అనువ ‘టిగెల్’ చాకోలెట్ బ్రాండ్‌తో సక్సెస్ అయింది. హాట్ చాక్లెట్+వింటర్= హ్యాపీనెస్ నినాదంతో చిన్న బడ్జెట్‌లో కంపెనీ మొదలు పెట్టింది. కస్టమర్ చాయిస్‌లను అర్థం చేసుకోవడంలో పట్టు సాధించింది. ‘టిగెల్’ స్టార్ట్ చేసినప్పుడు అనువ వయసు 21 సంవత్సరాలు. ‘చిన్న వయసులో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానం మొదలు పెట్టడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది’ అంటుంది అనువ కక్కర్.



బెస్ట్ ప్లాన్ బెడిసి కొడితే?

‘ఈ రంగంలో మాత్రమే పనిచేస్తాను అని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఏ రంగంలో పని చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను. యాంత్రిక జీవితం కంటే ఉల్లాసకరమైన మార్పు చాలామంచిది’ అంటుంది చెన్నైకి చెందిన శ్రీతేజ.

కోల్‌కత్తాకు చెందిన 23 సంవత్సరాల మనీష తన ఉద్యోగానికి సంబంధించి ఇప్పటికీ మూడు రంగాలు మారింది. అలా అని ఆమెలో పశ్చాత్తాపం ఏమీ లేదు.

‘ఏ రంగంలో అయినా పనిచేయగలను అనే నమ్మకం వచ్చింది’ అంటుంది మనీష.

వర్క్ నుంచి గ్యాప్ తీసుకోవాలనుకునే యువతరం కోసం ఈమధ్య కాలంలో ఎన్నో ‘గ్యాప్ ఇయర్ కమ్యూనిటీస్’ వచ్చాయి. ‘గ్యాప్ ఎక్స్’ పేరుతో హరియాణాలోని అశోకా యూనివర్శిటీలో 40 మంది స్టూడెంట్స్‌తో కూడిన గ్రూప్ ఉంది.

‘యువతలో చాలామంది కెరీర్ మార్గాన్ని నిర్ణయించుకునే ముందు వివిధ అవకాశాల గురించి అన్వేషిస్తున్నారు. ఆలోచిస్తున్నారు’ అంటున్నాడు దిల్లీ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ దినేష్ సింగ్.

చేస్తున్న ఉద్యోగాన్ని మానేసి నచ్చిన ఉద్యోగం చేయడం, సొంతంగా కంపెనీ మొదలుపెట్టడం, ఉద్యోగ విరామం తీసుకొని ఆన్‌లైన్ కోర్సులలో చేరడం వరకు తమదైన దారిలో ప్రయాణం చేస్తోంది నవతరం.

రంగుల ప్రపంచానికి ఆవల...

• సోషల్ యాక్టివిస్ట్ • ఫ్యాషన్ డిజైనర్ • రైటర్ • మోటివేషనల్ స్పీకర్

అదర్ సైడ్

కరీనా కపూర్ అనగానే రంగుల ప్రపంచం కళ్ల ముందు ఆవిష్కారం అవుతుంది. అయితే ఈ అందాల నటికి మరో ప్రపంచం కూడా తెలుసు. స్త్రీ సాధికారత నుంచి మెన్‌స్ట్రువల్ హైజీన్ వరకు ఎన్నో అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు వెళుతోంది. పేదింటి బిడ్డలతో మాట్లాడుతోంది. తాజాగా యూనిసెఫ్ ఇండియా నేషనల్ అంబాసిడర్‌గా నియామకం అయిన కరీనా కపూర్‌లో ఫ్యాషన్ డిజైనర్, రైటర్, మోటివేషనల్ స్పీకర్, సోషల్ యాక్టివిస్ట్ ఉన్నారు...


కరీనా కపూర్

ఉత్తమనటిగా సుపరిచితమైన కరీనా కపూర్ సృజనాత్మకమైన డిజైనర్ కూడా. క్లాతింగ్ రిటైలర్ ‘గ్లోబస్’తో కలిసి పనిచేసింది. న్యూట్రిషనిస్ట్ రుజుత దివాకర్‌తో కలిసి తీసుకు వచ్చిన ‘డోంట్ లూజ్ యువర్ మైండ్, లూజ్ యువర్ వెయిట్’ పుస్తకం అమ్మకాల్లో రికార్డ్ సృష్టించింది. కరీనా కపూర్ వాయిస్‌తో ఈ పుస్తకం ఆడియో బుక్‌గా రావడం మరో విశేషం. ‘ది స్టైల్ డైరీ ఆఫ్ బాలీవుడ్ దివా’ పేరుతో తన జ్ఞాపకాల పుస్తకాన్ని తీసుకువచ్చింది. అదితి షా బీమ్జానీతో కలసి ప్రెగ్నెన్సీపై రాసిన పుస్తకం కమర్షియల్‌గా సక్సెస్ అయింది. రుజుత దివాకర్‌తో కలిసి న్యూట్రిషన్‌కు సంబంధించి ‘ది ఇండియన్ ఫుడ్ విజ్‌డమ్ అండ్ ది ఆర్ట్ ఆఫ్ ఈటింగ్ రైట్’ డాక్యుమెంటరీపై పనిచేసింది.

ఉమెన్ ఎంపవర్‌మెంట్‌పై వచ్చిన ‘గర్ల్ రైజింగ్’ అనే డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్‌కు వాయిస్–వోవర్ ఇచ్చింది.

ఒకవైపు సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ... పిల్లల విద్య, మహిళల భద్రతకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటోంది. మహిళలపై హింసను నిరోధించడానికి ఎన్‌డీ టీవి ప్రారంభించిన శక్తి క్యాంపెయిన్‌కు అంబాసిడర్‌గా పనిచేసింది. 2014 నుంచి బాలికల విద్యకు సంబంధించి యూనిసెఫ్‌తో కలిసి పనిచేయడం మొదలుపెట్టింది. రాజస్థాన్, మహారాష్ట్రలోని పాఠశాలలకు వెళ్లి అక్కడి విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకునేది. జాల్నా జిల్లాలో కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం నిర్వహించిన నిధుల సేకరణ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంది.

నిరుపేద పిల్లల చదువు కోసం షర్మిలా ఠాగుర్‌తో కలిసి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది. చైల్డ్–ఫ్రెండ్లీ స్కూల్ అండ్ సిస్టమ్స్ (సీఎఫ్ఎస్ఎస్) ప్యాకేజీని లాంచ్ చేసింది. ఛత్తీస్‌ఘడ్‌లో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ వీక్ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బాగా చదివే పిల్లలు, పాఠాలు బాగా చెప్పే టీచర్‌లకు పురస్కారాలు అందజేసింది.

మెన్‌స్ట్రువల్ హైజీన్‌పై యూనిసెఫ్ లక్నోలో నిర్వహించిన సమావేశంలో ప్రసంగించింది. ‘నవజాత శిశువులను కాపాడుకుందాం’ పేరుతో కరీనా రాసిన వ్యాసానికి మంచి స్పందన వచ్చింది. నవజాత శిశువులు, తల్లుల క్వాలిటీ హెల్త్ కేర్‌కు సంబంధించి ‘ఎవ్రీ చైల్డ్ అలైవ్’ అనే క్యాంపెయిన్‌ను నిర్వహించింది. మదర్స్ డే సందర్భంగా యూనిసెఫ్ దిల్లీలో నిర్వహించిన సమావేశంలో కరీనా ప్రధాన వక్త.

ప్రకృతి వైపరీత్య బాధితుల కోసం, ఎన్నో స్వచ్ఛంద సేవా సంస్థల కోసం నిధుల సేకరణ కార్యక్రమాల్లో పాల్గొంది కరీన. పిల్లల రోగనిరోధక శక్తి పెరుగుదలకు సంబంధించిన అంశాలపై పనిచేసే స్వస్థ్ ఇమ్యునైజేషన్ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసింది.

తాజా విషయానికి వస్తే...‘నేషనల్ అంబాసిడర్‌గా యూనిసెఫ్‌తో నా అనుబంధం కొనసాగడం గౌరవంగా భావిస్తున్నాను. పిల్లల చదువు, హక్కుల కోసం నా గొంతు వినిపిస్తాను’ అంటుంది కరీనా కపూర్.

‘కరీనా కపూర్ ఎక్స్‌లెంట్ కమ్యూనికేటర్’ అని కితాబు ఇచ్చింది యూనిసెఫ్.

చిన్న విజయం చాలు... పెద్ద సంతోషానికి



సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ‘నేను ఎలా సాధించానంటే’లాంటి స్టోరీలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రేస్ మొదలైంది. ఆ రేస్‌లో భాగంగా యువతరం ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ రేసులో మెంటల్ హెల్త్ అనేది వెనక్కి వెళ్లిపోయింది. రేస్ అనేది శాంతి, సంతోషాల కోసం ఉండాలి. విద్యార్థులు తమ మానసిక శాంతిపై ఎక్కువ దృష్టి పెట్టాలి. చిన్న విజయాన్ని కూడా పెద్ద విజయంగా భావించుకోవాలి. ‘ఇదీ ఒక విజయమేనా!’ అనుకున్నప్పుడు అసంతృప్తి ఉంటుంది. అసంతృప్తి నుంచి అశాంతి జనిస్తుంది.

– కరీనా కపూర్



వేలంలో మారడోనా గోల్డెన్ బాల్ ట్రోఫీ

అర్జెంటీనా దివంగత దిగ్గజ ఫుట్‌బాలర్ డీగో మారడోనా 1986లో గెల్చుకున్న 'గోల్డెన్ బాల్' ట్రోఫీ వేలానికి రానుంది. జూన్ 6వ తేదీన పారిస్‌లోని అగుటెస్ ఆక్షన్ హౌజ్‌లో మారడోనా గోల్డెన్ బాల్ ట్రోఫీ వేలం జరుగుతుందని, దీనికి కనీస ధరను ఇంకా నిర్ణయించలేదని వేలం నిర్వాహకులు తెలిపారు. మెక్సికో ఆతిథ్యమిచ్చిన 1986 ప్రపంచకప్ లో మారడోనా సారథ్యంలో అర్జెంటీనా విశ్వవిజేతగా నిలిచింది. ఈ టోర్నీలో మారడోనా ఐదు గోల్స్ చేయడంతోపాటు ఉత్తమ ప్లేయర్‌కు అందించే గోల్డెన్ బాల్ ట్రోఫీని సాధించాడు.

బంగ్లాదేశ్‌దే టి20 సిరీస్

జింబాబ్వేతో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే బంగ్లాదేశ్ జట్టు 3-0తో సొంతం చేసుకుంది. చట్టోగ్రామ్‌లో మంగళవారం జరిగిన మూడో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ తొమ్మిది పరుగుల తేడాతో నెగ్గింది. మొదట బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 165 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ తౌహిద్‌హృదయ్ (38 బంతుల్లో 57 : 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), జాకిర్ అలీ (34 బంతుల్లో 44 : 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం జింబాబ్వే 20 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసి ఓడిపోయింది.



భారత బాక్సర్ల పసిడి పంచ్


ప్రీతి

అస్తానా (కజకిస్తాన్): ఆసియా అండర్-22 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు ఏడు స్వర్ణ పతకాలు సాధించారు. మహిళల విభాగంలో ప్రీతి (54 కేజీలు), పూనమ్ పూనియా (57 కేజీలు), ప్రాచి (63 కేజీలు), ముస్కాన్ (75 కేజీలు)... విశ్వనాథ్ సురేశ్ (48 కేజీలు), నిఖిల్ (57 కేజీలు), ఆకాశ్ గోర్ఖా (60 కేజీలు) పసిడి పతకాలను సొంతం చేసుకున్నారు. ఫైనల్స్‌లో ప్రీతి 3-0తో బజరోవా ఎలీనా (కజకిస్తాన్)పై, పూనమ్ 4-1తో సకిష్ అనెల్ (కజకిస్తాన్)పై, ప్రాచి 4-1తో అనర్ తుసిన్‌బెక్ (కజకిస్తాన్)పై, ముస్కాన్ 3-2తో జకిరోవా అజీజియా (ఉజ్బెకిస్తాన్)పై గెలిచారు. విశ్వనాథ్ సురేశ్ 5-0తో కరాప్ యెర్నుర్ (కజకిస్తాన్)పై, సబీర్ యెర్బోలత్ (కజకిస్తాన్)పై నిఖిల్, ఆకాశ్ 4-1తో రుస్లాన్ (కజకిస్తాన్)పై విజయం సాధించారు. ఓవరాల్‌గా ఆసియా అండర్-22, యూత్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు 12 స్వర్ణాలు, 14 రజతాలు, 17 కాంస్యాలతో కలిపి మొత్తం 43 పతకాలు సంపాదించారు.

హర్మీత్-యశస్విని జోడీ పరాజయం



జిద్దా: సౌదీ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) డబుల్స్ విభాగాల్లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో హర్మీత్ దేశాయ్-యశస్విని ద్వయం క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించగా... మహిళల డబుల్స్‌లో ఐహిక ముఖర్జీ-సుతీర్థ ముఖర్జీ జోడీ...పురుషుల డబుల్స్‌లో మానవ్-మనుష్ జంట ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయాయి. హర్మీత్-యశస్విని 19 నిమిషాల్లో 6-11, 10-12, 4-11తో వాంగ్ చుకిన్-సన్‌యింగ్‌షా (చైనా) చేతిలో ఓటమి పాలయ్యారు. ఐహిక-సుతీర్థ 11-6, 9-11, 12-10, 6-11, 8-11తో మియు నాగసాకి (జపాన్)-కిమ్ నయోంగ్ (కొరియా) చేతిలో... మానవ్-మనుష్ 20-18, 4-11, 6-11, 11-9, 7-11తో లుబోమిర్ పిస్టెజ్ (స్లొవేకియా)-చాన్ బాల్డ్‌విన్ (హాంకాంగ్) చేతిలో పరాజయం పాలయ్యారు. హర్మీత్-యశస్వినిలకు 3,500 డాలర్ల (రూ. 2 లక్షల 92 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 350 పాయింట్లు లభించాయి. ఐహిక-సుతీర్థలకు 2,000 డాలర్లు (రూ. 1 లక్ష 66 వేలు), 175 పాయింట్లు... మానవ్-మనుష్‌లకు 2,000 డాలర్లు (రూ. 1 లక్ష 66 వేలు), 175 పాయింట్లు దక్కాయి.


లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మంగళవారం జరిగిన మూడో దశ పోలింగ్‌లో తన భార్య, శాసన సభ్యురాలు రివాబాతో కలిసి గుజరాత్‌లోని జామ్ నగర్‌లో ఓటు వేసిన భారత స్టార్ క్రికెటర్ రవీంద్ర జడేజా

రోహిత్ తెలివైన కెప్టెన్: యువీ



న్యూఢిల్లీ: వచ్చే నెలలో అమెరికా-వెస్టిండీస్‌లలో జరిగే టి20 ప్రపంచకప్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ టీమిండియాను సమర్థంగా నడిపిస్తాడని భారత మాజీ స్టార్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ తెలిపాడు. 'అనుభవజ్ఞుడైన రోహిత్ తెలివైన కెప్టెన్. ఎంత ఒత్తిడిలో ఉన్నా సరైన నిర్ణయాలు తీసుకోవడంలో దిట్ట. మంచి మనసున్న వ్యక్తిత్వం అతనిది. ఎంతగా ఎదిగినా ఒదిగిఉండే మనస్తత్వమే రోహిత్‌ను గొప్ప నాయకుడిగా మలిచింది. అందుకే నేను అతని చేతుల్లో ప్రపంచకప్‌ను, మెడలో స్వర్ణ పతకాన్ని చూడాలని గట్టిగా కోరుకుంటున్నాను' అని టి20 ప్రపంచకప్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న యువరాజ్ వ్యాఖ్యానించాడు.

ఢిల్లీ రేసులోకొచ్చింది!

20 పరుగుల తేడాతో రాజస్తాన్‌పై విజయం
- చెలరేగిన ఫ్రేజర్, పోరెల్
- సామ్సన్ పోరాటం వృథా


పోరెల్, ఫ్రేజర్

న్యూఢిల్లీ: జోరుమీదున్న రాజస్తాన్ రాయల్స్‌పై కీలకమైన విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ రేసులో పడింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ పోరులో ఢిల్లీ 20 పరుగుల తేడాతో గెలిచింది. ఆరో విజయంతో పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. ముందుగా ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. ఓపెనర్లు జేక్ ఫ్రేజర్ మెగర్క్ (20 బంతుల్లో 50; 7 ఫోర్లు; 3 సిక్స్‌లు), అభిషేక్ పోరెల్ (36 బంతుల్లో 65; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) దంచేశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన రాజస్తాన్ రాయల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసి ఓడింది. కెప్టెన్ సంజూ సామ్సన్ (46 బంతుల్లో 86; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. ఖలీల్, ముకేశ్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుల్దీప్ తలా 2 వికెట్లు తీశారు.

4,4,4,6,4,6...

ఓపెనర్లు ఫ్రేజర్, పోరెల్ ఒకరి తర్వాత ఒకరు రాయల్స్ బౌలర్లను చితగ్గొట్టారు. ముందుగా ఫ్రేజర్... బౌల్ట్ వేసిన మూడో ఓవర్లో ఒక సిక్స్, 2 బౌండరీలతో 15 పరుగులు రాబట్టాడు. అవేశ్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో 4, 4, 4, 6, 4, 6లతో 28 పరుగులు పిండుకోవడంతో ఫ్రేజర్ ఫిఫ్టీ 19 బంతుల్లోనే పూర్తయ్యింది. అతని దూకుడును అశ్విన్ తన తొలి ఓవర్లోనే అడ్డుకున్నాడు. అనంతరం అక్షర్ పటేల్ అండతో పోరెల్ బాదడం మొదలుపెట్టాడు. 9వ ఓవర్లో జట్టు స్కోరు వందకు చేరింది. మరుసటి ఓవర్లోనే అక్షర్ (15)ను అశ్విన్ బోల్తా కొట్టించగా, పోరెల్ సిక్సర్‌తో 28 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. వరుస ఓవర్లలో పోరెల్‌ను అశ్విన్... రిషభ్ పంత్ (15)ను చహల్ పెవిలియన్ పంపారు. మిడిలార్డర్‌లో స్టబ్స్ (20 బంతుల్లో 41; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో ఢిల్లీ 200 పైచిలుకు స్కోరు చేసింది.

కెప్టెన్ పోరాడినా...

క్లిష్టమైన లక్ష్యం ముందరుంటే ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (4), బట్లర్ (19) గట్టి పునాది వేయలేకపోయారు. ఈ దశలో కెప్టెన్ సామ్సన్, రియాన్ పరాగ్ (22 బంతుల్లో 27; 1 ఫోర్, 3 సిక్స్‌లు) అండతో రాయల్స్‌ను నడిపించాడు. 11వ ఓవర్లో జట్టు స్కోరు 100 పరుగులు దాటాక అదే ఓవర్ ఆఖరి బంతికి పరాగ్‌ను రసిఖ్ బౌల్డ్ చేశాడు. అయితే శుభమ్ దూబే వచ్చాక సామ్సన్ 28 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. సెంచరీ దిశగా దూసుకెళ్తున్న సామ్సన్‌ను ముకేశ్ అవుట్ చేయడం రాజస్తాన్‌ను కుదిపేసింది. శుభమ్‌తో నాలుగో వికెట్‌కు 59 పరుగులు జోడించాక భారీ షాట్‌కు ప్రయత్నించి సామ్సన్ నిష్క్రమించగా... తర్వాత ఓవర్‌కు ఒకటి, రెండు చొప్పున వికెట్లను కోల్పోయిన రాయల్స్ ఓటమి పాలైంది.


సామ్సన్

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: ఫ్రేజర్ (సి) ఫెరీరా (బి) అశ్విన్ 50; పోరెల్ (సి) సందీప్ (బి) అశ్విన్ 65; షై హోప్ (రనౌట్) 1; అక్షర్ (సి) పరాగ్ (బి) అశ్విన్ 15; పంత్ (సి) బౌల్ట్ (బి) చహల్ 15; స్టబ్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సందీప్ 41; గుల్బదిన్ (సి) అశ్విన్ (బి) బౌల్ట్ 19; రసిఖ్ (రనౌట్) 9; కుల్దీప్ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు 1; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 221. వికెట్ల పతనం:** 1-60, 2-68, 3-110, 4-144, 5-150, 6-195, 7-215, 8-221. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-48-1, సందీప్ శర్మ 4-0-42-1, అవేశ్ 2-0-42-0, అశ్విన్ 4-0-24-3, పరాగ్ 2-0-17-0, చహల్ 4-0-48-1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) అక్షర్ (బి) ఖలీల్ 4; బట్లర్ (బి) అక్షర్ 19; సామ్సన్ (సి) హోప్ (బి) ముకేశ్ 86; పరాగ్ (బి) రసిఖ్ 27; శుభమ్ (సి) స్టబ్స్ (బి) ఖలీల్ 25; పావెల్ (బి) ముకేశ్ 13; ఫెరీరా (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 1; అశ్విన్ (సి) హోప్ (బి) కుల్దీప్ 2; బౌల్ట్ (నాటౌట్) 2; అవేశ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1-4, 2-67, 3-103, 4-162, 5-180, 6-181, 7-185, 8-194. **బౌలింగ్:** ఖలీల్ 4-0-47-2, ఇషాంత్ 3-0-34-0, ముకేశ్ 3-0-30-2, అక్షర్ 3-0-25-1, కుల్దీప్ 4-0-25-2, రసిఖ్ 3-0-36-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	11	8	3	16	1.453
రాజస్తాన్	11	8	3	16	0.476
చెన్నై	11	6	5	12	0.700
హైదరాబాద్	11	6	5	12	-0.065
ఢిల్లీ	12	6	6	12	-0.316
లక్నో	11	6	5	12	-0.371
బెంగళూరు	11	4	7	8	-0.049
పంజాబ్	11	4	7	8	-0.187
ముంబై	12	4	8	8	-0.212
గుజరాత్	11	4	7	8	-1.320

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ × లక్నో
వేదిక: హైదరాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

విమానం దారి మళ్లింపు... వారణాసిలో కోల్‌కతా జట్టు

న్యూఢిల్లీ: కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆటగాళ్లకు సోమవారం రాత్రి కునుకు లేకుండా గడిచింది. క్రికెటర్లు ప్రయాణించిన విమానం లక్నో నుంచి కోల్‌కతాకు బయలుదేరాల్సి ఉండగా... ప్రతికూల వాతావరణంతో పలుమార్లు దారి మళ్లించారు. వారి చార్టర్ ఫ్లయిట్‌ను తొలుత గువాహటికి మళ్లించారు. అక్కడి నుంచి కోల్‌కతాకు క్లియరెన్స్ రావడంతో టేకాఫ్ అయిన విమానానికి మళ్లీ వాతావరణం ఏమాత్రం అనుకూలించలేదు. దీంతో ఉన్నపళంగా ఫ్లయిట్‌ను వారణాసి ఎయిర్‌పోర్ట్‌కు మళ్లించాల్సి వచ్చింది. అలా తీవ్రమైన ప్రయాణ బడలిక, క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల మధ్య ఆటగాళ్లు సోమవారమంతా వారణాసిలోని హోటల్‌లో గడపాల్సి వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం తర్వాత తమ విమాన ప్రయాణం ఉండటంతో ఈలోపు కోల్‌కతా జట్టు క్రికెటర్లు వారణాసిలో కాశీ విశ్వనాథ్ ఆలయాన్ని సందర్శించుకున్నారు. ఎట్టకేలకు మంగళవారం సాయంత్రం తర్వాత నైట్‌రైడర్స్ జట్టు కోల్‌కతాకు చేరుకోగలిగింది. ఈ నెల 11న సొంతగడ్డపై కోల్‌కతా నైట్‌రైడర్స్ తమ తదుపరి లీగ్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో తలపడుతుంది.


భరత్, రూథర్‌ఫర్డ్, మనీశ్ పాండే

రష్మిక ఓటమి



ఫ్లోరిడా: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ-75 మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక మెయిన్ 'డ్రా'కు చేరుకోలేకపోయింది. క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్ మ్యాచ్‌లో రష్మిక 3-6, 0-6తో అకాషా ఉర్హోబో (అమెరికా) చేతిలో ఓడిపోయింది. 63 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయింది.

సుమిత్ నగాల్ ర్యాంక్ 93...

అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ (ఏటీపీ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ ర్యాంక్ దిగజారింది. తాజా ర్యాంకింగ్స్‌లో సుమిత్ 11 స్థానాలు పడిపోయి 93వ ర్యాంక్‌లో నిలిచాడు. డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న రెండు స్థానాలు పడిపోయి నాలుగో ర్యాంక్‌లో ఉన్నాడు. భారత్‌కే చెందిన యూకీ బాంబ్రీ 55వ ర్యాంక్‌లో, శ్రీరామ్ బాలాజీ 83వ ర్యాంక్‌లో, విజయ్ సుందర్ ప్రశాంత్ 98వ ర్యాంక్‌లో ఉన్నారు.

సినిమా


అల్లు అర్జున్, 'దిల్' రాజు, సుకుమార్, దేవి శ్రీ ప్రసాద్

ఆర్య కథ వినగానే ఇది నా ఇడియట్ అనిపించింది

– అల్లు అర్జున్

''హీరో తరుణ్ నాకు మంచి ఫ్రెండ్. 'దిల్' సినిమా ప్రీమియర్‌కి తను పిలవడంతో వెళ్లాను. అక్కడ నన్ను చూసిన సుకుమార్‌గారు మరుసటి రోజు వచ్చి 'ఆర్య' కథ చెప్పారు.. మైండ్ బ్లోయింగ్‌గా నచ్చింది. 'ఇడియట్' మూవీ చూసి ఇలాంటి యూత్ సినిమా నాకు పడితే ఎలా ఉంటుంది? అనే కోరిక మనసులో ఉండేది. 'ఆర్య' కథని సుకుమార్‌గారు చెబుతున్నప్పుడు ఇది నా 'ఇడియట్' మూవీ కథ అనిపించింది'' అని హీరో అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా, అనూ మెహతా జంటగా తెరకెక్కిన చిత్రం 'ఆర్య'. ఈ మూవీ ద్వారా సుకుమార్ దర్శకునిగా పరిచయమయ్యారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు నిర్మించిన ఈ సినిమా 2004 మే 7న విడుదలైంది. ఈ చిత్రం విడుదలై 20 ఏళ్లు అయిన సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో 'ఆర్య 20 ఇయర్స్ సెలబ్రేషన్స్' నిర్వహించారు. ఈ వేడుకలో అల్లు అర్జున్ మాట్లాడుతూ–''ఆర్య' ఒక సినిమా మాత్రమే కాదు.. మా అందరి జీవితాలను మార్చింది. ఈ మూవీ 20ఏళ్ల వేడుకని నిర్వహించిన రాజుగారికి థ్యాంక్స్. నా జీవితాన్ని పూర్తిగా మార్చిన సినిమా 'ఆర్య'. నా తొలి మూవీ 'గంగోత్రి' హిట్ అయింది. అయితే చూడ్డానికి నేనంత గొప్పగా లేనని ఆ తర్వాత మంచి సినిమాలేవీ రాలేదు. ఏడాది పాటు ఖాళీగా కూర్చున్నా. కానీ, రోజుకి మూడు కథలు వినేవాణ్ని.. కానీ నచ్చేవి కాదు. 'ఆర్య' కథ బాగా నచ్చింది.. కానీ, సుకుమార్‌గారు సరిగ్గా తీయగలరా? లేదా? అనే చిన్న అనుమానం. వీవీ వినాయక్‌గారు ఇంటికొచ్చి.. నాన్నగారు(అల్లు అరవింద్), నాతో మాట్లాడి.. సుకుమార్ తీయగలడు.. అతన్ని నమ్మండి అన్నారు. ఆయన మాట నాకు కొండంత ధైర్యం ఇచ్చింది. ఆ తర్వాత వారం రోజులు ట్రైల్ షూట్ చేస్తే అద్భుతంగా తీశారు సుకుమార్‌గారు. ఆ తర్వాత ధైర్యంగా ముందుకెళ్లాం.. సినిమా అద్భుతంగా వచ్చింది.. బ్లాక్ బస్టర్ అయింది. ఇందుకు సుకుమార్‌గారికి థ్యాంక్స్'' అన్నారు.

'దిల్' రాజు మాట్లాడుతూ–''ఆర్య' వచ్చి 20 ఏళ్లు అయింది. ఆ సినిమా కోసం పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణుల కళ్లల్లో ఇప్పటికీ ఓ ఆనందం కనిపిస్తోంది. అది చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉంది. 'ఆర్య' కి పనిచేసిన బన్నీ, నేను, సుకుమార్, దేవిశ్రీ, రత్నవేలు.. ఇలా అందరూ ఈరోజు సక్సెస్‌ఫుల్‌గా టాప్ పొజిషన్‌లో ఉన్నాం. ఒక సినిమాతో ఇంత మ్యాజిక్ జరగడం అనేది తెలుగు ఇండస్ట్రీనే కాదు ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలోనే 'ఆర్య' ప్రత్యేకమైన సినిమా. 20 ఏళ్ల తర్వాత కూడా అందరూ ఇలా సక్సెస్‌ఫుల్‌గా ఉండటం అనేది గ్రేట్ మూమెంట్.. దీనికి కారణం సుకుమార్. 'ఆర్య' ప్రయాణాన్ని మాత్రం ఎప్పటికీ మరచిపోలేను'' అన్నారు.

సుకుమార్ మాట్లాడుతూ–''ఆర్య' నా తొలి చిత్రం కాబట్టి ప్రతి మూమెంట్ నాకు గుర్తుంది. ప్రస్తుతం కొత్త డైరెక్టర్స్‌కి అవకాశాలు చాలా బాగున్నాయి. కానీ, అప్పట్లో లేవు. కొత్త డైరెక్టర్‌తో ఓ సినిమా చేయాలంటే ధైర్యం కావాలి. ధైర్యం చేసి నాకు అవకాశం ఇచ్చిన రాజుగారికి జీవితాంతం రుణపడి ఉంటాను. ఈరోజు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి పునాది బన్నీనే.. దాన్ని ఎప్పుడూ మరచిపోలేను'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత అల్లు అరవింద్, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్, కెమెరామేన్ రత్నవేలు, నటీనటులు అభినయశ్రీ, మధుమిత, శివ బాలాజీ, 'చిత్రం' శ్రీను, సుబ్బరాజు, బబ్లు, దేవి చరణ్, 'ఆదిత్య' మ్యాజిక్ నిరంజన్ పాల్గొన్నారు.



పల్లె పిలిచింది

పల్లెటూరి కథలకు ఎప్పుడూ క్రేజ్ ఉంటుంది. ఎక్కువగా సిటీ చుట్టూ తిరిగే కథలే చూస్తుంటారు కాబట్టి పల్లె కథలు వచ్చినప్పుడు ప్రేక్షకులు చూడాలని అనుకుంటారు. పైగా ఆ కథల్లో స్టార్ హీరోలు నటిస్తే క్రేజ్ రెండింతలు ఉంటుంది. అలా 'పల్లె పిలిచింది' అంటూ కొందరు హీరోలు రూరల్ స్టోరీలతో చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

పల్లెటూరి ఆట

రామ్‌చరణ్ రూరల్ బ్యాక్‌డ్రాప్ సినిమా అంటే ప్రేక్షకులకు 'రంగస్థలం' (2018) సినిమా గుర్తుకు వస్తుంది. ఈ సినిమా తర్వాత మరో రూరల్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు రామ్‌చరణ్. కాగా తనకు 'రంగస్థలం' వంటి హిట్ ఫిల్మ్‌ను అందించిన సుకుమార్‌తో మరో సినిమాకు రామ్‌చరణ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇది 'రంగస్థలం'కు సీక్వెల్ అనే ప్రచారం జరుగుతోంది. అలాగే ఇది వార్ డ్రామా మూవీ అనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ సినిమా బ్యాక్‌డ్రాప్‌పై స్పష్టత రావాల్సి ఉంది. అయితే 'ఉప్పెన' ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబుతో రామ్ చరణ్ హీరోగా చేయనున్న సినిమా మాత్రం పక్కా రూరల్ బ్యాక్‌డ్రాప్ సినిమాయే. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాలో అన్నదమ్ముల పాత్రలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేయనున్నారట. ఈ పల్లె కథలో జాన్వీ కపూర్ హీరోయిన్.

రాజు కథ

విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 24 మంది మత్స్యకారులు 2018లో జీవనోపాధికి గుజరాత్ సముద్ర తీరానికి వెళ్లి, పాకిస్తాన్ కోస్ట్ గార్డులకు బందీలుగా చిక్కుతారు. ఈ ఘటనలో ఉన్న ఓ మత్స్యకారుడి జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'తండేల్'. ప్రధానంగా గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో నాగచైతన్య, సాయి పల్లవి హీరో, హీరోయిన్. చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. రాజు పాత్రలో నాగచైతన్య, సత్య పాత్రలో సాయిపల్లవి కనిపిస్తారు. రాజు పాత్ర కోసం నాగచైతన్య పూర్తిగా మేకోవర్ అయ్యారు. అలాగే శ్రీకాకుళం యాస కూడా నేర్చుకున్నారు. 'తండేల్'ను డిసెంబరు 20న విడుదల చేయాలనుకుంటున్నారు.

దసరా కాంబో రిపీట్

'దసరా' వంటి రూరల్ బ్యాక్‌డ్రాప్ మూవీతో మంచి హిట్ అందుకున్నారు హీరో నాని. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. హీరో నాని– దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో మళ్లీ ఓ సినిమా రానుంది. ఈ సినిమా కథాంశం కూడా గ్రామీణ నేపథ్యంలో ఉంటుందని సమాచారం. అలాగే 'బలగం' దర్శకుడు వేణు ఎల్దండి గ్రామీణ నేపథ్యంలో నాని హీరోగా ఓ సినిమా చేయనున్నారట. ఈ చిత్రం షూటింగ్ ఈ ఏడాది చివర్లో ప్రారంభం కానుందని సమాచారం.

మాస్ కుర్రాడు

సిల్వర్ స్క్రీన్‌పై విజయ్ దేవరకొండ ఎక్కువగా సిటీ అబ్బాయిలానే కనిపించారు. ఫస్ట్ టైమ్ పూర్తి స్థాయిలో ఓ రూరల్ బ్యాక్‌డ్రాప్ మూవీలో హీరోగా నటించేందుకు రెడీ అవుతున్నారు. 'రాజావారు రాణిగారు' వంటి పల్లె ప్రేమకథను తీసిన దర్శకుడు రవి కిరణ్ కోలా ఈ సినిమాను తెరకెక్కిస్తారు. ఈ సినిమా గురించిన పూర్తి వివరాలు ఈ నెల 9న... విజయ్ దేవరకొండ బర్త్ డే సందర్భంగా వెల్లడి కానున్నాయి.

లంకల రత్న


విశ్వక్ సేన్ హీరోగా నటించిన చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. గోదావరి పరిసర ప్రాంతాల్లోని గ్రామాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. చీకటి సామ్రాజ్యంలో లంకల రత్న అనే సాధారణ వ్యక్తి అసాధారణ స్థాయికి ఎలా చేరుకుంటాడు? అన్నదే 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' కథ అని యూనిట్ పేర్కొంది. లంకల రత్న పాత్రలో విశ్వక్ సేన్ కనిపిస్తారు. కృష్ణచైతన్య దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 17న రిలీజ్ కానుంది.

అలాగే హీరోలు రక్షిత్ అట్లూరి 'శశివదనే', నార్నే నితిన్ 'ఆయ్..' సినిమాలు గోదావరి నేపథ్యంలో సాగే కథలే. ఇంకా గ్రామీణ నేపథ్యంలో పలు చిత్రాలు ఉన్నాయి.

బాహుబలి విజయాన్ని కొనసాగించాలని...

– డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి

''బాహుబలి' కోసం ప్రీ స్టోరీ, పోస్ట్ స్టోరీ రాసినప్పుడు ఈ యూనివర్స్‌లో ప్రేక్షకులకు చెప్పడానికి ఇంకా కథ ఉందనిపించింది'' అని డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. ప్రభాస్, రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ, సత్యరాజ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'బాహుబలి'. శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మించిన ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదలైంది. కాగా 'బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్' యానిమేషన్ సిరీస్‌ని డిస్నీ+హాట్‌స్టార్ ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది. జీవన్ జె. కాంగ్, నవీన్ జాన్ దర్శకత్వం వహించారు. గ్రాఫిక్ ఇండియా, ఆర్కా మీడియా వర్క్స్, రాజమౌళి, శరద్ దేవరాజన్–శోభు యార్లగడ్డ నిర్మించిన 'బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్' సిరీస్ ఈ నెల 17 నుంచి డిస్నీ+హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ– ''వెస్ట్రన్ కంట్రీస్‌లో ఒక సినిమా విజయవంతమైతే ఆ బ్రాండ్ అనేక మీడియమ్స్‌లో ముందుకెళ్తుంది. అయితే మన వద్ద అలా జరగడం లేదు. సినిమా హిట్ అయితే అక్కడితో అయిపోతుంది. మేము 'బాహుబలి' విజయాన్ని కొనసాగించాలని తీసిన 'బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్' సిరీస్ ప్రేక్షకులని అద్భుతంగా అలరిస్తుంది'' అన్నారు. డిస్నీ+హాట్‌స్టార్, హెచ్ఎస్ఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ హెడ్ గౌరవ్ బెనర్జీ, కో క్రియేటర్, రచయిత, మేకర్ శరద్ దేవరాజన్, బాహుబలి పాత్రకి వాయిస్ ఓవర్ ఇచ్చిన శరద్ కేల్కర్ మాట్లాడారు.


శోభు, గౌరవ్, రాజమౌళి, శరద్ దేవరాజన్, శరద్ కేల్కర్

వంద కోట్ల చుట్టూ...


విరాట్ చక్రవర్తి, సాయి కార్తీక్, చేతన్

రాహుల్, చేతన్, యమీ, సాక్షి చౌదరి, లహరి, అన్నపూర్ణమ్మ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం '100 క్రోర్స్'. విరాట్ చక్రవర్తి దర్శకత్వంలో దివిజా కార్తీక్, సాయి కార్తీక్ నిర్మించారు. డీమానిటైజేషన్ నేపథ్యంలో వంద కోట్ల చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందిన ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు మేకర్స్. దర్శకులు వీరశంకర్, మల్లిక్ రామ్, నిర్మాతలు దామోదర ప్రసాద్, హర్షిత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, '100 క్రోర్స్' ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసి, సినిమా హిట్ అవ్వాలని ఆకాంక్షించారు. సాయి కార్తీక్ మాట్లాడుతూ– ''2016లో జరిగిన వాస్తవ ఘటనలను ఆధారంగా చేసుకుని, వినోదభరితంగా '100 క్రోర్స్' చిత్రాన్ని నిర్మించాం. ఈ మూవీ చాలా బాగా వచ్చింది.. పెద్ద విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది'' అన్నారు. ''ఈ మూవీలో నటించే చాన్స్ ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు చేతన్.

సామాన్యుడి పోరాటం

ఓ సూపర్ విలన్‌తో ఓ సామాన్యుడు చేసే పోరాటం నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'మాయవన్'. ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ మూవీలో సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. సీవీ కుమార్ దర్శకుడు. కాగా సందీప్ కిషన్, సీవీ కుమార్ కాంబినేషన్‌లోనే రూపొందిన 'ప్రాజెక్ట్ జెడ్' సినిమాకు సీక్వెల్‌గా 'మాయవన్' తెరకెక్కుతోంది. మంగళవారం సందీప్‌కిషన్ బర్త్ డే (మే 7). ఈ సందర్భంగా 'మాయవన్'లోని సందీప్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. అత్యున్నత సాంకేతిక విలువలు, భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను అడ్వెంచర్స్ ఇంటర్‌నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఆకాంక్ష రంజన్ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో నీల్ నితిన్ ముఖేష్, క్యాథరిన్ డేవిసన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంగీతం: సంతోష్ నారాయణన్.


సందీప్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	384	73,512
నిఫ్టీ ▽	140	22,303

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,350	△ 11
డోజోన్స్	38,882	△ 30
ఎఫ్‌టీఎస్ఈ 100	8,314	△ 100
డాక్స్	18,430	△ 255
షాంఘై	3,148	△ 8
నికాయ్	38,835	▽ 599

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారెట్)	70,590
బంగారం (22 క్యారెట్)	67,230
వెండి (కేజీ)	88,500

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.08	84.10
£	బ్రిటన్ పౌండ్		103.59	106.79
€	యూరో		88.83	91.19
¥	జపాన్ ఎన్ (100)		53.51	54.69
AUS$	ఆస్ట్రేలియా డాలర్		54.40	56.36
S$	సింగపూర్ డాలర్		59.59	63.09
SAR	సౌదీ రియాల్		21.38	22.94
UAE D	యూఏఈ దిర్హామ్		21.85	23.65
¥	చైనా యువాన్		10.44	12.45

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ. 1,307 కోట్లు

క్యూ4లో 36% అప్ • డివిడెండ్ రూ. 40

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కీలకమైన అమెరికా మార్కెట్లో అమ్మకాల దన్నుతో గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ రూ. 1,307 కోట్ల లాభం ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో నమోదైన రూ. 959 కోట్లతో పోలిస్తే 36 శాతం వృద్ధి సాధించింది. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 6,297 కోట్ల నుంచి రూ. 7,083 కోట్లకు పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను లాభం రూ. 4,507 కోట్ల నుంచి రూ. 5,568 కోట్లకు, ఆదాయం రూ. 24,588 కోట్ల నుంచి రూ. 27,916 కోట్లకు పెరిగింది. 2023-24కి గాను రూ. 5 ముఖ విలువ గల షేరు ఒక్కింటిపై కంపెనీ రూ. 40 డివిడెండు ప్రకటించింది. అమెరికా మార్కెట్లో అమ్మకాలు పటిష్టంగా ఉండటం లాభాల వృద్ధికి తోడ్పడిందని విలేకరుల సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్న సంస్థ సహ–చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ తెలిపారు. కంపెనీ ఏర్పాటై 40 ఏళ్లయిందని, రాబోయే దశాబ్ద కాలంలో నవకల్పనలు, డిజిటల్ థెరప్యూటిక్స్ వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి పెట్టడం ద్వారా అధిక వృద్ధి సాధనకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

మరిన్ని విశేషాలు..

- క్యూ4లో గ్లోబల్ జనరిక్స్ ఆదాయం 13 శాతం వృద్ధితో రూ. 6,119 కోట్లకు చేరింది.
- యూరప్ మార్కెట్లో ఆదాయం 5 శాతం వృద్ధితో రూ. 521 కోట్లుగా నమోదైంది. మరోవైపు, భారత్ మార్కెట్లో ఆదాయం 12 శాతం క్షీణించి రూ. 1,126 కోట్లకు పరిమితమైంది.
- అటు వర్ధమాన మార్కెట్లలో ఆదాయం 9 % వృద్ధి చెంది రూ. 1,209 కోట్లుగా ఉంది.
- ఫార్మా సర్వీసులు, యాక్టివ్ ఇంగ్రీడియంట్స్ (పీఎస్ఏఐ) విభాగం ఆదాయం 6 శాతం వృద్ధితో రూ. 779 కోట్ల నుంచి రూ. 822 కోట్లకు చేరింది.

మంగళవారం బీఎస్ఈలో ఈ షేరు ధర స్వల్పంగా క్షీణించి రూ. 6,259 వద్ద ముగిసింది.



ఎఫ్ఎంసీజీ వినియోగం పెరిగింది

- మార్చి త్రైమాసికంలో 6.5% వృద్ధి
- నీల్సన్‌ఐక్యూ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: ఫాస్ట్ మూవింగ్ కంజ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) వినియోగం దేశవ్యాప్తంగా మార్చి త్రైమాసికంలో 6.5 శాతం పెరిగింది. కొనుగోళ్ల విలువ 6.6 శాతం దూసుకెళ్లింది. 2023 జనవరి–మార్చిలో పరిమాణం 3.1 శాతం వృద్ధి సాధించింది. కంజ్యూమర్ ఇంటెలిజెన్స్ కంపెనీ నీల్సన్‌ఐక్యూ నివేదిక ప్రకారం.. ఆహార, ఆహారేతర ఉత్పత్తులు రెండూ 2024 జనవరి–మార్చి కాలంలో వృద్ధికి కారణం అయ్యాయి. ఆహార ఉత్పత్తులతో పోలిస్తే ఆహారేతర ఉత్పత్తుల వృద్ధి దాదాపు రెండింతలు పెరిగింది. పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఎఫ్ఎంసీజీ వినియోగం అధికం అయింది. గడిచిన అయిదు త్రైమాసికాల్లో గ్రామీణ భారత్ తొలి స్థానానికి రావడం ఇదే మొదటిసారి. గృహ, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల విభాగాలు ఆహారోత్పత్తులను మించి అమ్మకాలు సాధించాయి. పట్టణ, ఆధునిక వాణిజ్యంలో వినియోగం మందగమనం ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-5-2024 ఫామ్ ధర...

విశాఖ	475-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	465-00
విజయవాడ	465-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	485-00
వరంగల్	487-00
రిటైల్ ధర	5.46

బ్లూచిప్స్‌కు అమ్మకాల షాక్

నిఫ్టీకి మూడో రోజూ నష్టాలు • సెన్సెక్స్ 384 పాయింట్ల పతనం



ముంబై: అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(1%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (1.25%) ఐసీఐసీఐ బ్యాంక్(1.50%) షేర్ల పతనంతో స్టాక్ సూచీలు మంగళవారం అరశాతం నష్టపోయాయి. సెన్సెక్స్ 384 పాయింట్లు పతనమై 73,512 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 140 పాయింట్లు క్షీణించి 22,303 పాయింట్ల వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. అయితే దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలలో తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతుండటం, మార్కెట్లలో ప్రీమియం వాల్యుయేషన్ల ఆందోళనలతో ఇన్వెస్టర్లు లాభాల పలు కీలక రంగాల రంగాల్లో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఒక దశలో సెన్సెక్స్ 636 పాయింట్లు క్షీణించి 73,259, నిఫ్టీ 211 పాయింట్లు పతనమై 22,232 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 2%, 1.65% చొప్పున నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ, ఐటీ షేర్లు రాణించాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాలతో ట్రేడవుతున్నాయి.

- సూచీల వారీగా రియల్టీ 3.50%, యుటిలిటీస్ 3%, కమోడిటీస్, వినిమయ, టెలికం, ప్రభుత్వరంగ బ్యాంకులు 2.50% క్షీణించాయి. ప్రైవేట్ బ్యాంకులు, ఆటో, మెటల్, ఇంధన ఇండెక్సులు రెండుశాతం చొప్పున నష్టపోయాయి.

శనివారం (మే18న) ప్రత్యేక ట్రేడింగ్ సెషన్

ప్రాథమిక సైట్‌లో ఏమైనా లోపాలు లేదా అంతరాయాలు తలెత్తితే ఎదుర్కొనే సన్నద్ధతను పరీక్షించేందుకు శనివారం(మే 18న) ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ విభాగాల్లో ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలు తెలిపాయి. ఉదయం 9.15 గంటల నుంచి 10 గంటల వరకు తొలి సెషన్ ప్రధాన ప్రాథమిక సైట్‌లో.., ఉదయం 11.30 నుంచి 12.30 మధ్య మరో సెషన్ డిజార్డర్ రికవరీ సైట్‌లో ట్రేడింగ్ జరగనుంది. అన్ని సెక్యూరిటీస్, డెరివేటివ్ ఉత్పత్తులను ట్రేడింగ్‌కు అందుబాటులో ఉంటాయి. గరిష్ఠ పరిమితిని 5 శాతంగా నిర్ణయించాయి. ఎక్స్ఛేంజీలు ఈ తరహా ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను ఈ మార్చి 2న నిర్వహించాయి.

ట్రేడింగ్ వేళల పెంపునకు నో

ఎన్ఎస్ఈ ప్రతిపాదనకు సెబీ చెక్

ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో ట్రేడింగ్ వేళల పెంపు ప్రతిపాదనను క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తిరస్కరించింది. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ చేసిన ప్రతిపాదనకు సెబీ తాజాగా నో చెప్పింది. ఈ అంశంపై స్టాక్ బ్రోకర్ల నుంచి ఎలాంటి స్పందన లభించకపోవడంతో సెబీ తాజా నిర్ణయం తీసుకున్నట్లు ఎన్ఎస్ఈ ఎండీ, సీఈవో ఆశిష్‌కుమార్ చౌహాన్ పేర్కొన్నారు. దశలవారీగా ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో లావాదేవీలు చేపట్టే వేళలను పెంచమంటూ ఎన్ఎస్ఈ.. సెబీకి దరఖాస్తు చేసింది. అయితే ఇందుకు స్టాక్ బ్రోకర్ల అభిప్రాయాలను కోరినప్పటికీ స్పందన లభించకపోవడంతో సెబీ దరఖాస్తును తిప్పిపంపినట్లు ఎన్ఎస్ఈ వెల్లడించింది. వెరసి ప్రస్తుతానికి ట్రేడింగ్ వేళల పెంపు ప్రతిపాదన వీగిపోయినట్లేనని తెలియజేసింది. ప్రపంచ మార్కెట్ల నిరంతర సమాచారం కారణంగా తలెత్తే ఓవర్‌నైట్ రిస్కులను తగ్గించుకునేందుకు వీలుగా ఎన్ఎస్ఈ ట్రేడింగ్ వేళల పెంపు ప్రతిపాదనకు తెరతీసింది. రోజువారీ(ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 3.30వరకూ) సెషన్ ముగిశాక కమోడిటీ డెరివేటివ్స్ తీరులో సాయంత్రం 6–9 మధ్య ట్రేడింగ్‌కు గతేడాది సెప్టెంబర్‌లో ప్రతిపాదించినట్లు ఎన్ఎస్ఈ బిజినెస్ డెవలప్‌మెంట్ చీఫ్ శ్రీరామ్ కృష్ణన్ పేర్కొన్నారు. తదుపరి స్టాక్ బ్రోకర్ల స్పందనునుబట్టి క్రమంగా రాత్రి 11.55 వరకూ పొడిగించేందుకు యోచించినట్లు తెలియజేశారు.

వోల్టాస్ డివిడెండ్ రూ. 5

క్యూ4 లాభం రూ. 111 కోట్లు



న్యూఢిల్లీ: ఏసీలు, ఇంజినీరింగ్ సర్వీసుల దిగ్గజం వోల్టాస్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 23 శాతం క్షీణించి రూ. 111 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 143 కోట్లకుపైగా ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 2,957 కోట్ల నుంచి రూ. 4,203 కోట్లకు జంప్‌చేసింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 2,761 కోట్ల నుంచి రూ. 4,045 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు షేరుకి రూ. 5 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా.. పూర్తి ఏడాదికి వోల్టాస్ నికర లాభం రూ. 136 కోట్ల నుంచి రూ. 248 కోట్లకు దూసుకెళ్లింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,499 కోట్ల నుంచి రూ. 12,481 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో ఏసీల అమ్మకాలలో 20 లక్షల మార్క్‌ను అందుకున్నట్లు కంపెనీ వెల్లడించింది.

కంపెనీ షేరు 4.5% పతనమై రూ. 1,383 వద్ద ముగిసింది.

హ్యాపియెస్ట్ మైండ్స్.. హ్యాపీ

లాభం 25 % అప్ • షేరుకి రూ. 3.25 డివిడెండ్



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ హ్యాపియెస్ట్ మైండ్స్ చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4) లో కన్సాలిడేటెడ్ నికర లాభం 25 శాతం జంప్‌చేసి రూ. 72 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం సైతం రూ. 378 కోట్ల నుంచి రూ. 417 కోట్లకు బలపడింది. ఇది 10 శాతం వృద్ధి. వాటాదారులకు షేరుకి రూ. 3.25 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. పూర్తి ఏడాదికి హ్యాపియెస్ట్ మైండ్స్ నికర లాభం 7.5 శాతం పుంజుకుని రూ. 248 కోట్లను అధిగమించింది. 2022–23లో రూ. 231 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం ఎగసి రూ. 1,625 కోట్లకు చేరింది.

ఎన్ఎస్ఈలో షేరు 2.5% లాభంతో రూ. 825 వద్ద ముగిసింది.

మూడేళ్లలో రూ. 9 లక్షల కోట్లు తగ్గిన పొదుపు..

2022–23లో రూ. 14.16 లక్షల కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: కుటుంబ పొదుపు గత మూడేళ్లలో నికరంగా రూ.9 లక్షల కోట్లు తగ్గింది. 2022–23లో రూ. 14.16 లక్షల కోట్లకు పడిపోయింది. కేంద్ర గణాంకాల శాఖ నేషనల్ అకౌంట్ స్టాటిస్టిక్స్ 2024 నివేదిక ప్రకారం 2020–21లో కుటుంబాల పొదుపు మొత్తం రూ. 23.29 లక్షల కోట్లకు ఎగిసింది. ఆ తర్వాత నుంచి క్రమంగా తగ్గుతూ వస్తోంది. 2021–22లో రూ. 17.12 లక్షల కోట్లకు, ఆ తర్వాత 2022–23లో అయిదేళ్ల కనిష్టమైన రూ. 14.16 లక్షల కోట్లకు క్షీణించింది. చివరిసారిగా ఇంత తక్కువ స్థాయిలో 2017–18లో రూ. 13.06 లక్షల కోట్లుగా ఇది నమోదైంది. ఆ తర్వాత 2018–19లో రూ. 14.92 లక్షల కోట్లకు, 2019–20లో రూ. 15.49 లక్షల కోట్లకు చేరింది.

జేపీ అసోసియేట్స్ రూ. 4,616 కోట్ల రుణాల డిఫాల్ట్

న్యూఢిల్లీ: సంక్షోభంలో చిక్కుకున్న జైప్రకాశ్ అసోసియేట్స్ తాజాగా రూ. 4,616 కోట్ల రుణాల చెల్లింపులో డిఫాల్ట్ అయ్యింది. రూ. 1,751 కోట్ల అసలు, రూ. 2,865 కోట్ల వడ్డీ చెల్లించడంలో విఫలమైనట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ వెల్లడించింది. సంస్థ మొత్తం రుణ భారం (వడ్డీతో సహా) రూ. 29,805 కోట్లుగా ఉండగా, ఇందులో రూ. 4,616 కోట్లు మాత్రమే ఏప్రిల్ 30 నాటికి బాకీ ఉన్నట్లు వివరించింది.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

యూపీఎస్సీలో 17 పోస్టులు

దేశవ్యాప్తంగా కేంద్ర విభాగాలు/శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అసిస్టెంట్ డైరెక్టర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 17
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ డైరెక్టర్–01, డిప్యూటీ కమిషనర్–02, డిప్యూటీ డైరెక్టర్–01, అసిస్టెంట్ కంట్రోలర్–02, ట్రైనింగ్ ఆఫీసర్–04, అసిస్టెంట్ ప్రొఫెసర్–05, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్–02.
» అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:16.05.2024
» వెబ్‌సైట్: https://upsc.gov.in

నావల్ డాక్‌యార్డ్‌లో 301 అప్రెంటిస్‌లు

ముంబైలోని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్(నేవీ), నేవల్ డాక్‌యార్డ్ .. అప్రెంటిస్ స్కూల్ వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 301
» ఖాళీల వివరాలు: ఏడాది అప్రెంటిస్‌షిప్ ట్రెనింగ్–288, రెండేళ్ల అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్–13.
» ట్రేడులు: ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రోప్లేటర్, ఫిట్టర్, ఫౌండ్రీ మ్యాన్, మెకానిక్(డీజిల్), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్, ఎంఎంటీఎం, పెయింటర్(జి), ప్యాటర్న్ మేకర్, పైప్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ, షీట్ మెటల్ వర్కర్, షిప్ రైట్(ఉడ్), టైలర్(జి), వెల్డర్(జి అండ్ ఇ), మేసన్(బీసీ), ఐ అండ్ సీటీఎస్ఎం, షిప్ రైట్(స్టీల్), రిగ్గర్, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్.
» అర్హత: ఎనిమిది, పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: కనిష్ట వయసు 14 ఏళ్లు, గరిష్ట వయోపరిమితి లేదు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ/స్కిల్ టెస్ట్‌లో వచ్చిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 23.04.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 10.05.2024
» వెబ్‌సైట్: https://indiannavy.nic.in

ఇండియన్ నేవీలో అగ్నివీర్ (ఎస్ఎస్ఆర్) పోస్టులు

అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా భారత నౌకాదళంలో అగ్నివీర్(ఎస్ఎస్ఆర్)–02/2024 బ్యాచ్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మ్యాథ్స్, ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్మీడియట్ (10+2)/రెండేళ్ల ఒకేషనల్ కోర్సు లేదా ఇంజనీరింగ్ డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రికల్/ఆటోమొబైల్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: అభ్యర్థి 01.11.2003 నుంచి 30.04.2007 మధ్యలో జన్మించి ఉండాలి.
» కనిష్ట ఎత్తు ప్రమాణాలు: పురుషులు, మహిళలు కనీసం 157 సెం.మీ. ఎత్తు ఉండాలి.
» వేతనం: ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది రూ.30,000, రెండో ఏడాది రూ.33,000, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40,000.
» ఎంపిక విధానం: దరఖాస్తు షార్ట్‌లిస్టింగ్, స్టేజ్–1(ఇండియన్ నేవీ ఎంట్రన్స్ టెస్ట్), స్టేజ్–2(రాతపరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష–పీఎఫ్‌టీ), వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» పరీక్ష విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో హిందీ /ఇంగ్లిష్ భాషల్లో మొత్తం 100 ప్రశ్నలు ఉంటాయి. నాలుగు విభాగాలు ఇంగ్లిష్, సైన్స్, మ్యాథమేటిక్స్, జనరల్ అవేర్‌నెస్‌లో ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి ఒక గంట. నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. నాలుగు తప్పు సమాధానాలకు ఒక మార్కు తగ్గిస్తారు.
» శిక్షణ: అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్ఎస్ చిల్కాలో నవంబర్ నెలలో కోర్సు శిక్షణ ప్రారంభమవుతుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
» దరఖాస్తు విధానం: అభ్యర్థులు నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లింపు ప్రారంభతేది: 13.05.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లింపు చివరితేది: 27.05.2024.
» శిక్షణ ప్రారంభం: 2024 నవంబర్ నెలలో.
» వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

సాయుధ బలగాల్లో.. అసిస్టెంట్ కమాండెంట్

యూనిఫామ్ సర్వీసులో చేరాలనే లక్ష్యంతో పోలీస్ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు చక్కటి అవకాశం.. సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్! యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. తాజాగా సీఏపీఎఫ్(ఏసీ) ఎగ్జామినేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా డిగ్రీతోనే కేంద్ర సాయుధ బలగాల్లో.. గెజిటెడ్ ర్యాంకుతో యూనిఫామ్ సర్వీసును సొంతం చేసుకోవచ్చు. తద్వారా దేశ అంతర్గత భద్రతలో కీలకమైన సాయుధ దళాల్లో పనిచేసే అవకాశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. సీఏపీఎఫ్ ఏసీ- 2024 నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక విధానం, రాత పరీక్ష, ప్రిపరేషన్ తదితర వివరాలు..



సీఏపీఎఫ్ (ఏసీ) 2024

» 506 పోస్టుల భర్తీకి సీఏపీఎఫ్ (ఏసీ) నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ
» ప్రారంభ వేతన శ్రేణి రూ.56,100–రూ.1,77,500

అయిదు దళాల్లో.. 506 పోస్టులు

సీఏపీఎఫ్–ఏసీ(అసిస్టెంట్ కమాండెంట్)–2024 నోటిఫికేషన్ ద్వారా అయిదు దళాల్లో మొత్తం 506 పోస్టులను భర్తీ చేయనున్నట్లు యూపీఎస్సీ ప్రకటించింది. వీటిల్లో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)–186 పోస్టులు; సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్)–120 పోస్టులు; సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)–100 పోస్టులు ; ఇండో టిబెటిన్ బోర్డర్ పోలీస్–58 పోస్టులు; సశస్త్ర సీమాబల్‌లో–42 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయసు: ఆగస్ట్ 1, 2024 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది. వీటితో పాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.

మూడంచెల ఎంపిక ప్రక్రియ

యూపీఎస్సీ చేపట్టే సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎంపిక ప్రక్రియ మొత్తం మూడు దశల్లో జరుగుతుంది. అవి.. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, పర్సనాలిటీ టెస్ట్/పర్సనల్ ఇంటర్వ్యూ.

తొలి దశలో రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియ మొదటి దశలో రాత పరీక్ష నిర్వహిస్తారు. ఈ రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్–1 జనరల్ ఎబిలిటీ అండ్ ఇంటెలిజెన్స్–250 మార్కులకు; పేపర్–2 జనరల్ స్టడీస్, ఎస్సే, కాంప్రహెన్షన్–200 మార్కులకు నిర్వహిస్తారు. మొత్తం 450 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పేపర్–1కు రెండు గంటలు, పేపర్–2కు మూడు గంటల సమయం కేటాయించారు. పరీక్ష పెన్ పేపర్ విధానంలో ఉంటుంది. ఆబ్జెక్టివ్ తరహాలో జరిగే పేపర్–1లో నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమలవుతుంది. ప్రతి తప్పు సమాధానానికి మూడో వంతు మార్కును తగ్గిస్తారు.

పేపర్–1

ఈ పేపర్‌లో జనరల్ ఎబిలిటీ అండ్ ఇంటెలిజెన్స్ అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. ఇందులో సమకాలీన పరిణామాలపై అవగాహన, జనరల్ నాలెడ్జ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. భారత చరిత్ర, రాజ్యాంగం, ఎకానమీ, జాగ్రఫీ, సైన్స్, మ్యాథ్స్, రీజనింగ్, పర్యావరణం–జీవ వైవిధ్యం, కరెంట్ అఫైర్స్ తదితర అంశాలను ప్రిపేర్ అవ్వాలి.

పేపర్–2 డిస్క్రిప్టివ్ విధానం

పేపర్–2ను డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో పార్ట్–ఎ(జనరల్ స్టడీస్), పార్ట్–బి(ఎస్సే అండ్ కాంప్రహెన్షన్) రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్–ఎలో ఎస్సే కొశ్చన్స్ అడుగుతారు. ఎస్సే రైటింగ్ విభాగంలో నిర్దేశిత అంశాలపై మూడు వందల పదాలకు మించకుండా వ్యాసాలు రాయాల్సి ఉంటుంది. పార్ట్–ఎకు 80 మార్కులు కేటాయించారు. పార్ట్–బి.. 120 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ప్రెసిస్ రైటింగ్, రిపోర్ట్ రైటింగ్, రీడింగ్ కాంప్రహెన్షన్‌లపై ప్రశ్నలు ఉంటాయి.

రెండో దశ పీఈటీ

తొలిదశ రాత పరీక్షలో పేపర్–1, 2లలో నిర్దేశిత కటాఫ్ సొంతం చేసుకున్న అభ్యర్థులకు రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(పీఈటీ) నిర్వహిస్తారు. ఇది నాలుగు విభాగాల్లో(వంద మీటర్ల పరుగు పందెం, 800 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్) ఉంటుంది. వీటిని నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలి. ఇందులో పురుషులు, మహిళలకు వేర్వేరు సమయాలు ఉంటాయి. లాంగ్ జంప్ విభాగంలో గరిష్ఠంగా మూడుసార్లు పోటీ పడే అవకాశం ఉంటుంది. షాట్‌పుట్ నుంచి మహిళలకు మినహాయింపు ఉంది.

పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్‌లలో చూపిన ప్రతిభ ఆధారంగా.. నిర్దేశిత కటాఫ్ సాధించిన వారితో మెరిట్ జాబితా రూపొందిస్తారు. వీరికి చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూకు 150 మార్కులు కేటాయించారు.

గ్రూప్–ఎ గెజిటెడ్ కొలువు

మూడు దశల ఎంపిక ప్రక్రియలో ప్రతిభ చూపి తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు.. సాధించిన ర్యాంకు, సర్వీస్ ప్రిఫరెన్స్ ఆధారంగా శాఖను కేటాయిస్తారు. ఆ తర్వాత ఏడాది వ్యవధిలో ఆయా దళాల్లో శిక్షణ ఉంటుంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి గ్రూప్–ఎ గెజిటెడ్ హోదాలో అసిస్టెంట్ కమాండెంట్ కొలువు సొంతమవుతుంది.

పదోన్నతులతో డీజీ స్థాయికి

అసిస్టెంట్ కమాండెంట్‌గా కొలువులో చేరి ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకుంటే.. డిప్యూటీ కమాండెంట్‌గా పదోన్నతి లభిస్తుంది. ఆరు నుంచి 12 ఏళ్ల సర్వీసుతో రెండో ఇంచార్జ్ కమాండెంట్‌గా; 16 నుంచి 20 ఏళ్ల సర్వీసుతో కమాండెంట్ హోదా; 20 నుంచి 23 ఏళ్ల సర్వీసుతో డీఐజీ, 23 నుంచి 26 ఏళ్ల సర్వీసుతో ఐజీ హోదాకు చేరుకునే అవకాశం ఉంది. కెరీర్‌లో అత్యంత ప్రతిభా పాటవాలు చూపితే అడిషనల్ డైరెక్టర్ జనరల్ హోదాను కూడా సొంతం చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మే 14
- దరఖాస్తులో సవరణ అవకాశం: 2024, మే 15- మే 21
- సీఏపీఎఫ్ రాత పరీక్ష తేదీ: 2024, ఆగస్ట్ 4
- తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం
- వెబ్‌సైట్: https://www.upsc.gov.in

ఎంపిక ప్రక్రియలో విజయం సాధించేలా

- పేపర్–1లో రాణించేందుకు ఆరు నుంచి 12వ తరగతి వరకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అధ్యయనం చేయాలి. దీనివల్ల అన్ని అంశాల బేసిక్స్, ఫార్ములాలపై అవగాహన ఏర్పడుతుంది.
- కరెంట్ అఫైర్స్ కోసం ఆర్థిక–రాజకీయ పరిణామాలపై దృష్టి సారించాలి. దీంతోపాటు చరిత్రలో ప్రధానంగా స్వాతంత్య్ర పోరాటం, ముఖ్య ఘట్టాలు –వ్యక్తులపై అవగాహన పెంచుకోవాలి.
- ఇటీవల కాలంలో దేశ రక్షణ, భద్రత విభాగాల్లో చోటు చేసుకున్న తాజా పరిణామాలు, కొత్త క్షిపణుల ప్రయోగాలు, దేశ రక్షణ–భద్రతకు సంబంధించి పలు దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాల గురించి తెలుసుకోవాలి.
- పేపర్–2లో రాణించాలంటే.. అభ్యర్థులకు బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టుతోపాటు, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు అవసరం. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర వ్యాసాలు చదివి.. అందులోని ముఖ్యాంశాలతో సొంత శైలిలో పరీక్షలో నిర్దేశించిన విధంగా 300 పదాల్లో సారాంశాలను క్రోడీకరించడం ప్రాక్టీస్ చేయాలి.
- ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో సక్సెస్ కోసం మొదట్నుంచే ప్రతి రోజు కనీసం రెండు గంటలు ప్రాక్టీస్ చేయాలి. ఫిజికల్ ప్రాక్టీస్ ఉదయం వేళల్లో చేస్తే శారీరక అలసటకు దూరంగా ఉండొచ్చు.

60 శాతం మార్కులు సాధించేలా

సీఏపీఎఫ్–అసిస్టెంట్ కమాండెంట్ గత మూడేళ్ల ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే.. మొత్తం ఆరు వందల మార్కులకు (రాత పరీక్షకు 450 మార్కులు, ఇంటర్వ్యూకు 150 మార్కులు) 50 శాతం మార్కులు సాధించిన వారు విజేతలుగా నిలుస్తున్నారు. కాబట్టి అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులు సాధించేలా కృషి చేస్తే విజయానికి చేరువలో ఉంటారు.


తిరుమల శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేందర్, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేష సాయి మంగళవారం దర్శించుకున్నారు.

17 నుంచి తిరుమలలో పద్మావతీ పరిణయోత్సవాలు

తిరుమల: తిరుమలలో శ్రీపద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో తొలిరోజు శ్రీమలయప్పస్వామి గజ వాహనం, రెండవ రోజు అశ్వ వాహనం, చివరి రోజు గరుడ వాహనంపై వేంచేపు చేస్తారు. మరోపక్క ఉభయనాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి వస్తారు. ఆ తర్వాత కల్యాణమహోత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తారు. కాగా, శ్రీపద్మావతి పరిణయోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

సీఎంఆర్ అక్షయ తృతీయ బంగారు వేడుకలు



సాక్షి, హైదరాబాద్: అక్షయ తృతీయ సందర్భంగా సీఎంఆర్ సంస్థ మే 1 నుంచి మే 12 వరకు కొనుగోలు దారులకు అద్భుత ఆఫర్లను ప్రకటించింది. ప్లెయిన్ జ్యూయలరీపై తరుగు 3 శాతం నుంచి 9 శాతం మాత్రమేనని (ఇంతకుమించి తరుగు లేదు), యాంటిక్ - స్టోన్ - రోజ్‌గోల్డ్ - విక్టోరియన్ జ్యూయలరీపై ఫ్లాట్ 14 శాతం మాత్రమేనని (ఇంతకుమించి తరుగు లేదు), సాదా వెండి వస్తువులపై తరుగు, మజూరి లేదని, డైమండ్ ఆభరణాలు రూ.49,900 మాత్రమేనని సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. అక్షయ తృతీయ అడ్వాన్స్ బుకింగ్ ద్వారా నచ్చిన బంగారు ఆభరణాలను ముందుగా బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. బుక్ చేసిన రోజు ధర లేదా డెలివరీ తీసుకునే రోజు ధరలో.. ఏది తక్కువుంటే ఆ ధరకు ఆభరణాలను కొనుగోలు చేసుకోవచ్చని వెల్లడించింది.

నేడు వేములవాడకు మోదీ!

రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్న ప్రధాని

- అనంతరం వేములవాడ, వరంగల్‌లలో ఎన్నికల ప్రచార సభలు
- ప్రధాని పర్యటనతో భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు..
- నేడు రాత్రి హైదరాబాద్‌కు అమిత్‌షా.. రేపు భువనగిరిలో సభకు హాజరు
- రేపు వరంగల్, జహీరాబాద్‌లలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రచారం


రాజ్‌భవన్‌లో ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుటుంబ సభ్యులు

సాక్షి, హైదరాబాద్/ వేములవాడ/ సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం మరోసారి రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. వేములవాడ రాజన్నను దర్శించుకోవడంతోపాటు వేములవాడ, వరంగల్‌లలో నిర్వహించే బహిరంగ సభలలో ప్రసంగించనున్నారు. బుధవారం ఉదయమే హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. సుమారు 8 గంటల సమయంలో వేములవాడకు చేరుకుంటారు. అక్కడి రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. తర్వాత వేములవాడలోని బాలానగర్‌లో బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా నిర్వహిస్తున్న బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం ఉదయం 10 గంటల సమయంలో వరంగల్‌కు చేరుకుంటారు. అక్కడ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేశ్‌కు మద్దతుగా ఎన్నికల బహిరంగ సభలో పాల్గొంటారు.

పకడ్బందీగా ఏర్పాట్లు..

వేములవాడలో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలను ఎస్పీజీ తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆలయ సమీపంలోని ఎత్తయిన భవనాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు. ఇక ఎంపీ బండి సంజయ్ ఆధ్వర్యంలో ప్రధాని సభ కోసం బాలానగర్ ప్రాంతంలో భారీగా ఏర్పాట్లు చేశారు. అయితే మంగళవారం కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులతో టెంట్లు, కుర్చీలు చెల్లాచెదురయ్యాయి. వాటిని సరిచేస్తున్నారు. వానలు కొనసాగుతాయన్న వాతావరణశాఖ ప్రకటన నేపథ్యంలో.. బుధవారం సభ నిర్వహణ ఎలాగన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వేములవాడ ఆలయానికి వస్తున్న తొలి ప్రధాని మోదీయే కావడం గమనార్హం.

అమిత్ షా, రాజ్‌నాథ్‌ల ప్రచారం కూడా..

బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి రానున్నారు. బుధవారం రాత్రే హైదరాబాద్‌కు చేరుకోనున్న అమిత్ షా.. గురువారం ఉదయం 9 గంటలకు హెలికాప్టర్‌లో భువనగిరికి చేరుకుని, బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. ఇక రాజ్‌నాథ్ సింగ్ గురువారం ఉదయం 9 గంటలకు వరంగల్‌లో, 11 గంటలకు జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి బీబీ పాటిల్‌కు మద్దతుగా బాన్సువాడలో నిర్వహించే బహిరంగ సభలలో పాల్గొంటారు. బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఈ వివరాలను వెల్లడించారు.

పీవీ కుటుంబ సభ్యులతో మోదీ డిన్నర్

రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిమిత్తం ప్రధాని మోదీ మంగళవారం రాత్రే హైదరాబాద్‌కు చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి వచ్చిన ఆయనకు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం మోదీ నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి బస చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమారుడు ప్రభాకర్‌రావు, కుమార్తెలు ఎమ్మెల్సీ వాణీదేవి, శారదాంబ, ఇతర కుటుంబ సభ్యులు రాజ్‌భవన్‌కు వచ్చి ప్రధాని మోదీని కలిశారు. మోదీ వారితో కాసేపు మాట్లాడారు, కలిసి డిన్నర్ చేశారు. అనంతరం పీవీ మనవడు ఎన్వీ సుభాష్ మాట్లాడారు. ప్రధానిని కలిసి, అరగంటకుపైగా గడపడం.. సైన్స్, టెక్నాలజీ, ఇతర అంశాలపై మాట్లాడటం ఎంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పారు.

గాలాపై మెరిసె...

మెట్ గాలా 2024లో భారతీయ బిలియనీర్ సుధారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక మెట్ గాలా 2024లో భారతీయ బిలియనీర్ సుధారెడ్డి అత్యంత విలువైన 'అమోర్ ఎటర్నో' డైమండ్ నెక్లెస్ ధరించి తళుక్కుమన్నారు. భారతీయ వ్యాపారవేత్త, మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) గ్రూప్ డైరెక్టర్ సుధారెడ్డి మెట్ గాలా 2024లో రెడ్‌కార్పెట్‌ను అలంకరించారు. ఈ వేదికగా భారతీయ సంస్కృతి ప్రతిబింబించేలా అద్భుతమైన దుస్తులతోపాటు 180 క్యారెట్ల డైమండ్ నెక్లెస్‌తో పాల్గొని అందరి చూపులను తన వైపు తిప్పుకున్నారు. సుధారెడ్డి మాట్లాడుతూ రెడ్‌కార్పెట్‌పై నడిచి మన నగరానికి, దేశానికి గుర్తింపు తీసుకురావడం గర్వంగా ఉందని తెలిపారు.

చర్ల కేసులో ఎన్ఐఏ అనుబంధ చార్జిషీట్ దాఖలు

- ముగ్గురిని నిందితులుగా చేర్చిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో ఎన్ఐఏ(జాతీయ దర్యాప్తు సంస్థ) అధికారులు మంగళవారం అనుబంధ చార్జిషీట్‌ను నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానంలో దాఖలు చేశారు. తాజాగా దాఖలు చేసిన చార్జిషీట్‌లో ముగ్గురు నిందితుల పేర్లు చేర్చారు. వీరిలో ఇద్దరు పరారీలో ఉన్నట్టు ఎన్ఐఏ అధికారులు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అందులో తెలిపిన ప్రకారం వివరాలు..గూఢచర్యం, భద్రతా బలగాలపై దాడి చేసేందుకు వివిధ ఆయుధాలు, సామగ్రిని కొనుగోలు చేసేందుకు మావోయిస్టు పార్టీకి నిధులు సమకూర్చిన ఆరోపణలపై తొలుత చర్ల పోలీసులు 2023 జూన 5న కేసు నమోదు చేశారు. తర్వాత కేసును ఆగస్టు 3న ఎన్ఐఏకు బదిలీ చేశారు. దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ అధికారులు ఎనిమిది మంది నిందితులపై తొలుత చార్జిషీట్ దాఖలు చేశారు. మావోయిస్టు పార్టీ కార్యకర్తల నుంచి డ్రోన్లు, పేలుడు పదార్థాలతో మరికొన్ని యంత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు అందులో పేర్కొన్నారు. ఉగ్రవాద నిరోధక సంస్థకు చెందిన కమల, మావోయిస్టు కేడర్‌తోపాటు పరారీలో ఉన్న అండర్‌గ్రౌండ్ కేడర్‌కు చెందిన హిద్మా, బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌లపై పలు సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. కేసు దర్యాప్తులో వెలుగులోకి వస్తున్న అంశాల ఆధారంగా ఎన్ఐఏ అధికారులు అనుబంధ చార్జిషీట్లు నమోదు చేస్తున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

నకిలీ క్లినిక్... అనుమతి లేని మందులు

- కోదాడలో దాడులు చేపట్టిన డీసీఏ
- రూ.1.5 లక్షల విలువైన మందులు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: ఎలాంటి అనుమతి లేకుండానే క్లినిక్‌ను నిర్వహించడంతో పాటు మందులు విక్రయిస్తున్న ఓ నకిలీ క్లినిక్‌పై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు సోదాలు నిర్వహించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో డీసీఏ అధికారులు జరిపిన సోదాల్లో తోట ప్రసాద్ బాబు అనే వ్యక్తి ఆర్ఎంపీగా చెలామణి అవుతూ నకిలీ క్లినిక్ నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. సాయి రామ్ పాలీక్లినిక్ పేరిట నిర్వహిస్తున్న ఈ క్లినిక్‌లో మొత్తం 87 రకాల రూ.1.5 లక్షల విలువైన మందులు స్వాధీనం చేసుకున్నట్టు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నల్లగొండ అసిస్టెంట్ డైరెక్టర్ కే దాసు పర్యవేక్షణలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జీ సురేందర్ ఈ తనిఖీలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మందులు నిల్వ ఉంచినా, విక్రయించినా డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ కింద ఐదేళ్ల వరకు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

నకిలీ క్లినిక్‌లపై ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి

లైసెన్స్‌లు లేకుండా మందులు విక్రయిస్తున్న మందుల దుకాణాలు, నకిలీ క్లినిక్‌లకు సంబంధించిన సమాచారాన్ని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ టోల్ ఫ్రీ నంబర్ 1800-599-6969కి అందించాలని డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి కోరారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10-30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ఇడ్లీ చట్నీలో బల్లి

- కేయూ కామన్‌మెస్‌లో ఘటన
- గేటుకు తాళం వేసి విద్యార్థుల ఆందోళన


ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కామన్‌మెస్‌లో మంగళవారం ఉదయం విద్యార్థులకు అల్పాహారంగా వడ్డించిన ఇడ్లీ చట్నీలో బల్లి కనిపించడం ఆందోళనకు దారితీసింది. ఓ విద్యార్థి బల్లిని గుర్తించి ఫొటో తీసి స్టూడెంట్ గ్రూప్‌లో పెట్టడం హాస్టళ్ల డైరెక్టర్ శ్రీనివాస్‌రావు దృష్టికి వెళ్లింది. విషయం తెలిసిన పలువురు విద్యార్థులు కామన్‌మెస్ గేటుకు తాళం వేసి ఆందోళన దిగడంతో డైరెక్టర్ అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయనతో వాగ్వాదానికి దిగారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్య తీసుకుంటామని ఆయన నచ్చజెప్పి గేటుకు తాళం తీయించారు. అనంతరం మధ్యాహ్నం యథావిధిగా విద్యార్థులు మెస్‌లో భోజనం చేశారు. చట్నీలో బల్లి పడటంపై డైరెక్టర్ శ్రీనివాస్‌రావును వివరణ కోరగా.. విద్యార్థులు అల్పాహారం చేశాక.. వర్కర్లు మిగిలిపోయిన చట్నీ బోళ్ల పక్కన పెడతారని చెప్పారు. అది మృతి చెందిన బల్లిగా గుర్తించామని, చట్నీలోకి అదెలా వచ్చిందో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పేర్కొన్నారు. చట్నీ చేస్తున్నప్పుడే బల్లి పడితే అందులో నలిగిపోయి ఉండాలని, అలాకాకుండా చనిపోయిన బల్లి కనిపిస్తోందని స్పష్టం చేశారు. ఈ సంఘటనపై విచారణ చేపడతామని డైరెక్టర్ శ్రీనివాస్ వెల్లడించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.